

వారణాసి వద్ద గంగానదిలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తో సోమవారం జలవిహారం చేస్తున్న ప్రధాని నరేంద్రమోడీ

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!


సంపుటి: 62 • సంచిక: 62 • మంగళవారం 13 మార్చి 2018 • విజయవాడ * పేజీలు: 16 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బహుళ ఏకాదశి మ. 1.15 వరకు, అనంతరం ద్వాదశి; నక్షత్రం: ఉత్తరాషాఢ మ. 12.15 వరకు, అనంతరం శ్రవణం; అమృతకాలం: శే.ఉ. 7.00 వరకు; వర్జ్యం: సా. 4.40 నుండి 6.26 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 19.12 వరకు, తదుపరి రా. 10.48 నుండి 11.36 వరకు; రాహుకాలం: మ. 3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ. 9.00 నుండి 10.30 వరకు;

సొమ్ము మాది... సోకు మీదా?!

- దక్షిణాది రాష్ట్రాల ఆదాయంతో ఉత్తరాది అభివృద్ధి
- ప్రజల మనోభావాలతో చెలగాటం తగదు
- సెంటిమెంట్ పేరుతోనే తెలంగాణ ఇచ్చారు
- మా సెంటిమెంట్‌ను గౌరవించి నిధులివ్వరే?
- వెంకన్న సాక్షిగా ప్రధాని మోడీ హామీ ఇచ్చారు
- నమ్మకం సడలినందుకే పోరాటానికి దిగాం
- హామీలు నెరవేర్చమంటే వ్యక్తిగత విమర్శలా?
- జైట్లీ ప్రకటనతోనే కేబినెట్ నుంచి వైదొలిగాం
- ఐదు కోట్ల ఆంధ్రులే మాకు హైకమాండ్
- శాసన మండలిలో సీఎం చంద్రబాబునాయుడు



అమరావతి, ఆంధ్రప్రభ: దక్షిణాది రాష్ట్రాల ఆదాయంతో ఉత్తరాది రాష్ట్రాలను అభివృద్ధి చేసుకోవడం జాతీయ పార్టీలకు చెందిన కేంద్ర పాలకులకు పరిపాటిగా మారిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. సోమవారం రాష్ట్ర శాసనమండలిలో ఛైర్మన్ ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో గవర్నర్ ప్రసంగంపై సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ జాతీయపార్టీలు జాతీయ ప్రయోజనాలకై కృషి చేయాలిగానీ ప్రజల మనోభావాలతో ఆడుకుంటూ రాష్ట్రాల పట్ల వివక్ష చూపకూడదన్నారు. 2014 ఎన్నికల సమయంలో తిరుపతి వెంకన్న సాక్షిగా నరేంద్ర మోడీ ఏపీకి ప్రత్యేక హోదా అమలు చేస్తామని, విభజన హామీలన్నింటినీ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. నాలుగు సంవత్సరాలు ➪ 2వ పేజీలో...

పెద్దల సభకు అభ్యర్థులు ఏకగ్రీవం

- టీడీపీ నుంచి రమేష్, రవీంద్ర
- వైకాపా నుంచి వేమిరెడ్డి

3



రైల్వేజోన్ లేనట్టే!

- అన్నీ ప్రతికూల నివేదికలే
- రాజకీయ నిర్ణయంతోనే సాధ్యం
- కేంద్ర హోంశాఖ అధికారుల ప్రస్తావన

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ప్రత్యేక హోదాకు పట్టిన గతే రైల్వే జోన్‌కు పట్టనుందా? కనీసం జోన్ కూడా ఏర్పాటు చేసే అవకాశం లేదా? ప్రస్తుతం కేంద్ర హోంశాఖ అధికారుల వ్యాఖ్యలు చూస్తుంటే ఇవే అనుమానాలు కల్గుతున్నాయి. అవి కేవలం తమ వ్యక్తిగత వ్యాఖ్యలే అయినప్పటికీ, ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం రాష్ట్రవ్యాప్తంగా సామాన్యుడి నుంచి చట్ట సభల సభ్యుల వరకు ఉద్యమిస్తున్న సమయంలో ➪ 11వ పేజీలో...

విశాఖ షిప్‌యార్డ్‌పైనా అదే మౌనం

11



పార్లమెంట్‌ను సాగనివ్వం

- నిరసన వాడి, వేడి పెంచిన టీడీపీ
- రెండోవారమూ ఆగని ఆందోళనలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రత్యేక హోదా మీద రాజకీయ పార్టీలు చేపట్టిన ఆందోళన వేడి రెండో వారం కూడా తగ్గలేదు. గత వారం మాదిరిగానే సోమవారమూ టీడీపీ ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఇటీవల కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన అశోక్ గజపతిరాజు కూడా టీడీపీ ఎంపీలకు తోడుగా ఆందోళనలో పాల్గొన్నారు. ప్రత్యే క హోదా ఆంధ్రుల హక్కు అంటూ వారు బిగ్గరగా నినాదాలు చేశారు. రోజుకో గెటప్‌తో అందరినీ ఆకర్షిస్తున్న చిత్తూరు ఎంపీ శివప్రసాద్ సోమవారం వాయిద్య కారుడి గెటప్‌తో ➪ 11వ పేజీలో...

సస్పెండ్ చేసినా వెనుకడుగు వేయొద్దు

- పోరాటాన్ని మరింత ఉధృతం చేయండి
- ఎంపీల టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

11

కార్యాచరణ రేపు ప్రకటిస్తా!

- భావితరాలకు దిశానిర్దేశం చేస్తా
- పటిష్టంగా జనసేనను నిర్మిస్తున్నా
- అన్ని ప్రశ్నలకూ ఆ రోజు క్లారిటీ ఇస్తా
- పార్టీకి ఉడుకు రక్తం ఎక్కిస్తున్నా
- మా నాన్న ముఖ్యమంత్రి కాదు... నేనెవరి సొమ్మూ దోచుకోలేదు
- నాకు ఎవరితోనూ శత్రుత్వం లేదు
- ప్రధాని మోడీ దర్శకత్వంలో వైకాపా పనిచేస్తోందా?
- మీడియాతో జనసేనాని పవన్



శాస్త్రోక్తంగా సొంతింటికి శంకుస్థాపన

- పరిమిత ఆహ్వానితులకే ప్రవేశం

3లో

అమరావతి, ఆంధ్రప్రభ : భవిష్యత్ భావితరాలకు దిశానిర్దేశం చేసేలా జనసేన పార్టీని ప్రత్యేక కార్యాచరణతో మరింత పటిష్టం చేస్తున్నామని ఆ పార్టీ అధినేత, ప్రముఖ సినీ హీరో పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి రూరల్ మండలం కాజా వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న సాహితీ వెంచర్‌లోని రెండెకరాల విశాల విస్తీర్ణంలో సొంతింటి నిర్మాణానికి ఆయన తన భార్య, కుమార్తెతో కలిసి సోమవారం ఉదయం భూమి పూజ చేశారు. భవిష్యత్‌లో దీనిని పార్టీ కార్యాలయంగా కూడా వాడుకునే అవకాశం ఉందంటున్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. ఈనెల 14న జరిగే పార్టీ ఆవిర్భావ సభ వేదిక సాక్షిగా పార్టీ భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని చెప్పారు. ఆరోజు పార్టీ వైఖర్ని తేటతెల్లం చేస్తామని అన్నారు. అంతా ఆతృతతో ఎదురుచూస్తున్న అనేక ప్రశ్నలకు ఆ రోజు పూర్తి క్లారిటీ దొరుకుతుందన్నారు. పార్టీకి ఉడుకు రక్తం ఎంత అవసరమో అంతేరీతిలో అనుభవజ్ఞులైన రాజకీయ నేతలూ ➪ 3వ పేజీలో...



11వ పీఆర్సీకి సీఎం ఓకే

- వేతన సవరణ బకాయిల చెల్లింపునకూ అంగీకారం

అమరావతి, ఆంధ్రప్రభ: గత కొంత కాలంగా పెండింగ్‌లో పడుతూ వస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్‌సీకి సంబంధించి సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. 11వ పే రివిజన్ కమిషన్ వేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలు మంగళవారానికి వాయిదా పడిన అనంతరం ఎపీఎన్జీవో ప్రతినిధుల బృందం అధ్యక్షుడు అశోక్‌బాబు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో భేటీ కావడం జరిగింది. ఉద్యోగుల డిమాండ్లపై చర్చించగా, సీ.ఎం సానుకూలంగా స్పందించారు.అదే విధంగా 10 వ పే కమిషన్ బకాయిలు కూడా చెల్లించేందుకు ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఆర్థిక శాఖపై చర్చించి సత్వరమే ఒక నిర్ణయం ➪ 3వ పేజీలో...

ఎంతకాలం బాబూ హోదా డ్రామా?!

- ముఖ్యమంత్రివి ఊసరవెల్లి రాజకీయాలు
- 21న వైకాపా అవిశ్వాస తీర్మానం
- కలిసివస్తే కేంద్రం దిగివస్తుంది
- బాపట్ల సభలో విపక్షనేత వైఎస్. జగన్
- స్టువర్టుపురంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



గుంటూరు, ప్రభన్యూస్ బ్యూరో : ప్రత్యేక హోదాపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇంకా డ్రామాలు ఆడుతున్నారని ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిప్పులు చెరిగారు. సోమవారం గుంటూరు జిల్లాలోని బాపట్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికలకు ముందు ప్రత్యేక హోదాపై మాటిచ్చిన చంద్రబాబు అధికారం చేపట్టాక దానిని విస్మరించారని విమర్శించారు. ప్రత్యేక హోదాకు 14వ ఆర్థిక సంఘానికి సంబంధం ఏమిటని, కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ రెండు సంవత్సరాల క్రితం అర్ధరాత్రి హోదా రాదని, ప్యాకేజ్ ఇస్తామని చెప్పినపుడు ఎలా స్వాగతించారని విమర్శించారు. అంతకుముందు స్టువర్టుపురంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఎగురవేసిన జగన్ కేక్ కట్ చేశారు. ఆ తర్వాత బాపట్లకు చేరుకొని బహిరంగ సభలో మాట్లాడారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు విలువలు, విశ్వసనీయత అవసరమని, చంద్రబాబుకు ఇవి లేవని ఆరోపించారు. ఈ నెల 21వ తేదీన వైసీపీ పెడుతున్న అవిశ్వాస తీర్మానానికి మద్దతు కోరుతుంటే ఇంకా బీజేపీతో కలసి ఉన్నామనే ధోరణితో టీడీపీ వ్యవహరించడం ఊసరవెల్లి రాజకీయాలని మండిపడ్డారు. రాష్ట్రం తరపున ఉన్న 25 మంది ఎంపీలు ఏకతాటిపైకి వచ్చి అవిశ్వాస తీర్మానం పెడితే దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతుందని, అప్పటికి ➪ 3వ పేజీలో...

ఔరా..!



కోల్ స్కామ్ కథ కంచికి..?

- సాక్ష్యాలు సమర్పించలేకపోతున్న దర్యాప్తు సంస్థలు
- నిన్న 2జీ... నేడు బొగ్గు కుంభకోణం
- వేల కోట్ల స్కాముల్లో దోషులకు శిక్షేది?
- ప్రారంభంలో సమన్లు.. అరెస్టులతో హడావుడి
- విచారణ దశలో నీరుగారుతున్న కేసులు



న్యూఢిల్లీ: దేశాన్ని ఓ కుదుపు కుదిపేస్తున్న వేల కోట్ల కుంభకోణాల కేసుల ఆరంభ హడావుడి.. విచారణాంతానికి నీరుగారిపోతోంది. ప్రముఖుల ప్రమేయమో.. రాజకీయ పెద్దల ఒత్తిళ్లో తెలియవుగానీ కీలక కేసుల్లో ప్రారంభంలో సమన్లు, అరెస్టులు.. కస్టడీలు.. స్టేట్ మెంట్ రికార్డులు ఎన్ని జరిగినా విచారణ పూర్తయ్యే నాటికి దోషులు నిర్దోషులుగా మారిపోతున్నారు. 2జీ స్పెక్ట్రమ్ కేసునే పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమైపోతుంది. 2011 నాటి ఈ కేసు దర్యాప్తు దాదాపు 6 ఏళ్లపాటుసాగినా దర్యాప్తు సంస్థలు దోషులుగా పేర్కొన్న వారందరూ.. నిర్దోషులుగా తేలిపోయారు. మాజీ మంత్రి రాజా, డీఎంకే ఎంపీ కనిమొళి సహా ➪ 7వ పేజీలో...



ఖాట్మండ్‌లో ఘోర విమాన ప్రమాదం

- ల్యాండింగ్ సమయంలో చెలరేగిన మంటలు
- 50 మంది సజీవ దహనం

7లో



సొమ్ము మాది... సోకు మీదా?!

(మొదటిపేజీ తరువాయి)

గడుస్తున్నా ఆ హామీల ఊసే ఎత్తడం లేదని, పార్లమెంటు సాక్షిగా చేసిన చట్టాలు, ఇచ్చిన హామీలపై ప్రధాని మోడీ దేశ ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర పాలకులను తామేమి గొంతెమ్మ కోర్కెలను కోరడం లేదని, బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఏపీకి ఇచ్చిన హామీల అమలుకై అడుగుతుంటే వ్యక్తిగత విమర్శలతో బీజేపీ నేతలు ఎదురుదాడి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కేంద్ర బీజేపీ పాలకులు విభజన కష్టనష్టాలతో ఏర్పడిన నవ్యాంధ్రకు ప్రత్యేకంగా చేసింది ఏమీ లేదని, అన్ని రాష్ట్రాలతోపాటుగా ఏపీకి సహాయం చేశారని వివరించారు.

నాడు కాంగ్రెస్ మోసం, నేడు బీజేపీ కూడా...

విభజనను ఆంధ్రుల కోరుకోలేదని, అయిప్పటికీ సెంటిమెంట్ పేరుతో తెలుగు రాష్ట్రాన్ని ఎటువంటి హేతుబద్ధత లేకుండా నాడు కాంగ్రెస్ పాలకులు విడగొట్టి ఆంధ్రులను మోసం చేశారని చంద్రబాబు విమర్శించారు. ఆర్థిక లోటు, అనేక విభజన కష్టనష్టాలతో ఏర్పటిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పార్లమెంటు సాక్షిగా చేసిన విభజన చట్టంలోని 18 అంశాలను, ఇచ్చిన హోదా హామీలను అమలు చేయకుండా నేడు బీజేపీ పాలకులు కూడా ఆంధ్రుల పట్ల నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని తెలిపారు.

అలాగే షెడ్యూల్ 9,10లోని సమస్యలు కూడా ఇంతవరకు పరిష్కారం కాలేదని, దీనిపై సభలో మాట్లాడితే కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ ప్రెస్‌మీట్ పెట్టి సెంటిమెంట్‌కు నిధులను ఇవ్వమని ప్రకటణ చేయడం బాధను కలిగించిందన్నారు. ప్రత్యేక హోదాను ఆంధ్రులు బలంగా కోరుకుంటున్నారని, అందుకే రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా బీజేపీతో మిత్రబంధాన్ని వదులుకున్నామన్నారు. సెంటిమెంట్‌తో విభజన చేసినప్పుడు అదే సెంటిమెంట్‌కు నిధులను ఎందుకు కేటాయించరని ప్రశ్నించారు. పదవుల కోసం, పనుల కోసం, పైరవీల కోసం టీడీపీ తాపత్రయపడదని, వాజ్‌పేయి ప్రధాని అయిన సమయంలో 29 మంది ఎంపీలు ఉన్న తమకు 6 కేంద్ర మంత్రి పదవులను ఆశచూపినా సున్నితంగా తిరస్కరించి మద్దతు కొనసాగించామని గుర్తు చేశారు.



ద్వంద్వ వైఖరితో వైఎస్ఆర్ కాంగ్రెస్

వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలకు పెద్దపీటవేస్తూ ప్రతిపక్ష వైసీపీ కేంద్రం పట్ల ద్వంద వైఖరితో వ్యవహరిస్తోందని చంద్రబాబు విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ పాలన భేష్ అంటూనే పార్లమెంటులో మాత్రం అవిశ్వాసం పెడతామని ప్రకటనలు చేయడం వైసీపీ ఎంపీలకే చెల్లిందన్నారు. కానీ టీడీపీ ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో రాష్ట్రప్రయోజనాల కోసం పోరాటం చేస్తోందని, అవసరమైనప్పుడు సరైన నిర్ణయాలను తీసుకుంటూ కేంద్రంపై దశల వారీగా ఒత్తిడి పెంచుతుందన్నారు. 60 ఏళ్ల కష్టఫలాన్ని కాంగ్రెస్ కుటిల రాజకీయాలతో నాడు పోగొట్టుకుని, అప్పులు, కట్టుబట్టలతో బయటకు వస్తే నేడు బీజేపీ న్యాయం చేయకపోగా వాయిదాలు, సాకులు, విమర్శలు, ఎక్కిరింపులతో ఆంధ్రులను అవమానం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగ్, గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం ఏపీ అభివృద్ధిపై కేంద్రం అడిగిన నివేదికలను ఎప్పటికప్పుడు అందించామని, కానీ ఆ లెక్కలను తోసిపుచ్చి, చివరకు అకౌంట్‌లో వేసిన నిధులను కూడా వెనక్కు తీసుకుంటూ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారన్నారు. శ్రమ, కష్టపడేతత్వం ఆంధ్రుల్లో సహజసిద్ధంగా ఉంటుందని, మద్రాసు నుంచి విడిపోయినపుడు ఎంతో కష్టపడి హైదరాబాద్‌ను నిర్మించుకుని ప్రపంచంలోనే ఆర్థికనగరంగా, నాలెడ్జ్ హబ్‌గా తాను తీర్చిదిద్దానని, అదే స్ఫూర్తితో నవ్యాంధ్రను అంతకు మించి అభివృద్ధి చేస్తానని, అమరావతిని 2022నాటికి దేశంలోనే టాప్ త్రీగా, 2029 నాటికి దేశంలోనే నెంబర్ వన్‌గా, 2050నాటికి ప్రపంచలోని ఉత్తమమైన ఐదు నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దుతానని వాగ్దానం చేశారు.

రూ.16,072 కోట్ల ఆర్థిక లోటులో కూడా అద్భుతమైన సంక్షేమ పాలనను టీడీపీ ప్రభుత్వం అందిస్తోందని, అలాగే కులాల వారీగా సమాన అభివృద్ధికై తాజా బడ్జెట్ కేటాయింపు చేయడం జరిగిందన్నారు. ఏప్రిల్ 15 నాటికి ఏపీని ఓడిఎఫ్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని, 50 వేల కోట్లతో ప్రారంభించిన 50 నీటి ప్రాజెక్టుల్లో జూన్ నెల చివరకు 29 ప్రాజెక్టులు పూర్తి చేసి జాతీయం చేస్తామని చెప్పారు. తన ఎవరూ హైకమాండ్ లేరని, ఐదు కోట్ల ఆంధ్రులే టీడీపీ హైకమాండ్ అంటూ రాష్ట్ర ప్రయోనాలే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు అని, కేంద్రం తక్షణం హోదాను అమలు చేయాల్సిందే అని డిమాండ్ చేస్తూ హోదా సాధనకు, విభజన చట్టంలోని 18 హామీల అమలుకు రాజీలేని పోరాటం చేస్తామని చెప్పారు. ఒకవైపు రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూనే మరోవైపు జపాన్ తరహా పోరాటం కేంద్రంపై చేస్తామని, ఆంధ్రులను అన్యాయం చేసిన వారు బాధపడేలా నవ్యాంధ్ర అభివృద్ధిని సాధిద్దామని, అందుకు ప్రజలు కూడా సంపూర్ణ మద్దతు తెలపాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

రైతుల త్యాగ ఫలంతో అద్భుతమైన రాజధాని


తాను ఇచ్చిన పిలుపుమేరకు రైతులు స్వచ్ఛందంగా నాలుగు వేల కోట్ల రూపాయల విలువైన 33 వేల ఎకరాల భూములను ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి ఇచ్చారని చంద్రబాబు గుర్తు చేశారు. రైతుల త్యాగ ఫలితంగానే అద్భుతమైన రాజధానిని నిర్మించుకోగలుగుతున్నామని, లక్షల కోట్ల వ్యయమైన రాజధాని నిర్మాణానికి కేవలం రూ.1,500 కోట్లు ఇవ్వడం కేంద్ర పాలకులకు ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్ర సహకారం అరకొరగా ఉన్నప్పటికీ తన శ్రమకు, చేపడుతున్న సంస్కరణలకు రైతుల త్యాగం, అధికారులు, ప్రజల సహకారం కూడా తోడవడంతో రెండెంకల వృద్ధి రేటును సాధించామని తెలిపారు.

సంక్షేమానికి వేల కోట్లు ఖర్చుపెడుతున్నాం

- 10 రోజులలోపే రూ.2 లక్షల చంద్రన్న బీమా ఇస్తున్నాం
- శాసనసభలో ప్రజాపంపిణీ వ్యవస్థపై స్పందించిన సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో సంక్షేమానికి కొన్ని వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం శాసనసభలో ప్రజాపంపిణీ వ్యవస్థపై స్పందించిన ముఖ్యమంత్రి, ప్రతి ఒక్కరికీ రేషన్ ఇవ్వాల్సిన బాధ్యత డీలర్స్‌దేనన్నారు. బయోమెట్రిక్, ఐరిష్, ఫేసియల్ తదితర పద్ధతుల్లో రేషన్ ఏమాత్రం దుర్వినియోగం కాకుండా ఇస్తున్నామన్నారు. చంద్రన్న మాల్స్, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు 50లక్షలకు పైగా ఇస్తున్నామని, ఎలాంటి అవకతవకలు లేకుండా పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. అదేవిధంగా 50సంవత్సరాలలోపు వయస్సు వారు మృతిచెందితే 10రోజుల లోపు రూ.2లక్షల చంద్రన్న బీమా ద్వారా ఇస్తున్నామని తెలిపారు. ఇదివరకు వేలిముద్రలు లేకుండా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చేవారని, ఇప్పుడు అక్రమాలకు తావులేకుండా ఆన్‌లైన్ చేసి నేరుగా విద్యార్థి ఖాతాలో వేస్తున్నామన్నారు.

గత ప్రభుత్వంలో దెయ్యాలు కూడా పెన్షన్లు తీసుకున్నాయని ఎద్దేవా చేశారు. ఇప్పుడు పెన్షన్ల విషయంలో



జీపీఎస్ పెట్టి ఒక వ్యక్తి ఎప్పుడు, ఏ సమయంలో తీసుకున్నారో అనే విషయాన్ని కూడా నమోదు చేయాలని చెప్పామన్నారు. శాసనసభ్యుల కూడా వారి నియోజవర్గాల్లో తిరుగుతూ సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించాలన్నారు. సంక్షేమ పథకాలు 100శాతం పేదవాడికి ఇవ్వాలని, పేదవారందరికీ సంక్షేమ పథకాలు అందాలని ఆకాంక్షించారు.

బడి ఎగ్గొడితే ఫెయిల్ అవుతారు

- ఎంపీ జేసీపై సీఎం చంద్రబాబు సెటైర్

అమరావతి, ఆంధ్రప్రభ : పార్లమెంటు సమావేశాలకు హాజరుకాకుండా తనను కలవడానికి వచ్చిన ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డిని ఉద్దేశించి సీఎం చంద్రబాబు సెటైర్‌వేశారు. బడి ఎగ్గొడితే ఫెయిల్ అవుతారని వ్యాఖ్యానించడంతో అసెంబ్లీ లాబీలో నవ్వులు విరిశాయి. అనంతరం ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తాను ఇప్పటివరకు ఫెయిల్ అయిన సందర్భం లేదన్నారు. బడి ఎగ్గొట్టి, బ్యాక్ బెంచ్‌లో కూర్చున్నవారు అనేక మంది ఉన్నత స్థానానికి ఎదిగారన్నారు. తనకు రాజ్యసభకు వెళ్లే ఆలోచనే లేదని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు దివాకర్ రెడ్డి బదులిచ్చారు.

జూన్‌లో సాగునీటి సంఘాల ఎన్నికలు

- శాసనమండలిలో మంత్రి దేవినేని ఉమా ప్రకటన

అమరావతి, ఆంధ్రప్రభ: ఈ ఏడాది జూన్‌లో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆయకట్టు సంఘాల ఏర్పాటు, ఎన్నికల ప్రక్రియపై అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ రాష్ట్రంలో 6,138 నీటి సంఘాల ఉన్నాయని తెలిపారు. అదే విధంగా 245 డిస్ట్రిబ్యూటర్ సంఘాలు, 49 ప్రాజెక్టు కమిటీలు పనిచేస్తున్నాయని చెప్పారు. వీటన్నింటిని ఒకే గొడుగు కిందకి తీసుకువచ్చి ఈ ఏడాది జూన్‌లో ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న వాహనాల్లో 1/3వ వంతు రోడ్డు పన్ను చెల్లించడం లేదన్న విషయం వాస్తవమేనా..? ఈ బకాయిల వసూళ్ళకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించాలని ఎమ్మెల్సీ వి.వి.చౌదరి దీనిపై రవాణా శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు బదులిస్తూ 2017 నాటికి 139.23 కోట్ల త్రైమాసిక పన్ను వసూలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 125.99 కోట్లు వసూలు అయ్యిందని తెలిపారు. మరో 13.24 కోట్లు వసూలు చేయాల్సి ఉందని సభ దృష్టికి తీసుకు వచ్చారు. ఈ అంశంపై గాలి శ్రీనివాసులునాయుడు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ 2016 జూన్ నుంచి ఏపీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ బిజినెస్‌ను నిర్వహిస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 140 కౌంటర్లను ఏర్పాటు చేశామని వీటి ద్వారా పార్శిల్ బుకింగ్ లోడింగ్, అన్‌లోడింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీని నష్టాల ఊబిలో నుంచి బయటపడేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టిందని సభ్యులకు వివరించారు. రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు సంబంధించి 555 మదరశాలలు ఉన్నాయని వీటిలో 56,635 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నట్లుగా విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. సభ్యులు



బొడ్డు నాగేశ్వరరావు, రామసుబ్బారావు, విటపు బాలసుబ్రహ్మణ్యం తదితరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ 255 మదరశాలలో ఉర్దూతో పాటు ఆంగ్లం, గణితం, పర్యావరణ శాస్త్రాలను బోధించేందుకు 631 మంది విద్యా వాలెంటీర్లను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి రాష్ట్రంలో మరిన్ని మదరశాలలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మదర్సాల అంశంపై మండలి చైర్మన్ ఎన్ఎండీ.ఫరూఖ్ మాట్లాడుతూ కేరళ, ఉత్తరప్రదేశ్, బీహార్ లలో ఏ విధంగా నిర్వహణ జరుగుతుందో అధ్యయ నం చేసేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రి గంటా శ్రీనివాసరావుకు సూచిం చారు. దీనిపై స్పందించిన మంత్రి గతంలో వేసిన కమిటీ ఇప్పటికే అధ్యయనం చేసిందని అయితే సభ్యుల సూచన మేరకు మరో కమిటీని ఏర్పాటు చేస్తామని మంత్రి ప్రకటిం చారు.అలాగే,ఎమ్మెల్సీలు షరీఫ్, ఎం.సత్యనారాయణరాజు, ఎంఎ షరీఫ్, డొక్కా మాణిక్య వరప్రసాద్, కె.సత్య నారాయణరాజు, పివిఎన్ మాధవ్, వి.బాలసుబ్రహ్మణ్యం, రామకృష్ణ, రామసుబ్బారెడ్డి తదితరులు లేవనెత్తిన ప్రజా సమస్యలపై సంబంధితశాఖల మంత్రులు వివరణలు ఇచ్చారు.

గవర్నర్ ప్రసంగంపై ప్రశంసల జల్లు

అమరావతి, ఆంధ్రప్రభ: 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను వేసవి కాల బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈనెల 5వ తేదీన గవర్నర్ నరసింహన్ ప్రజా రాజధాని అమరావతిలోని వెలగపూడిలో గల అసెంబ్లీలోని ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగంపై మండలి సభ్యులు ప్రశంసల జల్లు కురిపించారు. సోమవారం రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అధ్యక్షత జరిగిన కౌన్సిల్ సమావేశంలో పలువురు సభ్యులు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపారు. తొలుత బీజేపీ ఎమ్మెల్సీ కన్నేటి సత్య నారాయణ రాజు మాట్లాడుతూ గవర్నర్‌ప్రసంగంలో అభివృద్ధి కొట్టొచ్చినట్లు కనపడిందని, దానిని అదే విధంగా అమలు చేస్తే బాగుంటుందన్నారు. అనంతరం మరో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అవసరమైన అవసరాలను బిల్లులో పొందు పరిచారని, దాని అమలుకు 2022 వరకు సమయం ఉందన్నారు. కేంద్ర పథకాలన్నింటినీ రాష్ట్రప్రభుత్వం సమర్థవంతంగా వినియోగించుకున్నట్లు గవర్నర్ ప్రసంగంలో స్పష్టమైందన్నారు.

సైంధవుల్లా వ్యవహరిస్తున్న రాష్ట్ర బీజేపీ నేతలు

ఇచ్చిన హామీలను నెరవేర్చక ఆంధ్రులను నయవంచనకు గురిచేస్తూ బీజేపీ ఎన్ని తప్పులు చేసినా మిత్ర బంధంతో వెనకేసుకొచ్చామని, కానీ వాటినే ఎత్తిచూపుతూ తమపై వ్యక్తిగత విమర్శలకు దిగడం ఆంధ్ర బీజేపీ నేతలకు తగదని మండలి ప్రభుత్వ విప్ బుద్దా వెంకన్న సూచించారు. టీడీపీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్ర బీజేపీ నేతలు ఆంధ్రులవైపా లేదా ఢిల్లీ పాలకుల వైపా తేల్చుకోవాలన్నారు. రాష్ట్రాభివృద్ధిలో విభీషణ పాత్ర ఉండాలని తాము కోరుకుంటుంటే సైంధవుల పాత్రను పోషిస్తున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ ఎమ్మెల్సీ రాజ నర్సింహులు తదితరులు ప్రసంగించారు.

దుమారంలేపిన సోము వీర్రాజు వ్యాఖ్యలు

గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలను తెలిపేందుకు సోమవారం మండలిలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారంలేపాయి. బీజేపీ, టీడీపీ మిత్రబంధం శత్రుబంధంగా మారిన క్రమాన్ని వివరించే క్రమంలో సోము వీర్రాజు నీచకులమైన, గాండ్ల కులానికి చెందిన, గానగ నుంచి నూనె తీసుకునే జాతివాడైన ప్రధాని నరేంద్ర మోడీని విశాఖలో వంగనబెట్టి కొడుతున్నట్లు అవమానించే ఫ్లెక్సీలు, వ్యాఖ్యలు టీడీపీ నేతలు చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ఆయన ఆరోపణలను ఖండిస్తూ మంత్రులు నారాయణ, పితాని సత్యనారాయణ, ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్సీలు రాజనర్సింహులు, రామకృష్ణ తదితరులు గాండ్ల కులాన్ని నీచకులంగా అన్‌పార్లమెంటరీ పదజాలం సోము వీర్రాజు వినియోగించడం తీవ్ర ఆక్షేపణీయమని ఆయన ప్రసంగానికి అడ్డుతగిలారు. అప్పటి వరకు ఆవేశపూరితంగా మాట్లాడిన వీర్రాజు తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుంటున్నానని, రికార్డుల నుంచి ఆ పదాలను తొలగించాలని డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యంకు విజ్ఞప్తి చేశారు. అనంతరం డొక్కా మాట్లాడుతూ కేంద్రం తలచుకుంటే ఎప్పుడో హోదా ఇచ్చి ఉండేదని, కానీ దగా పడిన ఆంధ్రులకు న్యాయం చేయాలన్న మనసు వారికి లేకపోయిందన్నారు. రాష్ట్రాభివృద్ధికై గాంధీజీ స్ఫూర్తితో కేంద్రంపై ఒత్తిడికై ముందుకు సాగుతున్న తమకు రాష్ట్ర బీజేపీ నేతలు రాజకీయ కౌంటర్ అటాక్‌లను మానుకొని సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వ్యక్తిగత వాదులాటకు కౌన్సిల్ వేదిక కాదు

వ్యక్తిగత వాదులాటకు కౌన్సిల్ వేదికకాదని, గవర్నర్ ప్రసంగంపై చర్చించక పార్టీల ప్రయోజనాల కోసం మీకు మీరే వాదించుకుంటూ దూషించుకుంటుంటే మధ్యలో ఈ చైర్‌లో నేనెందుకంటూ మండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం బీజేపీ, టీడీపీ సభ్యుల పట్ల అసహనం వ్యక్తం చేశారు. సోము వీర్రాజు మాట్లాడే సమయంలో టీడీపీ సభ్యులు, రాజేంద్ర ప్రసాద్, డొక్కా మాట్లాడే సమయంలో బీజేపీ సభ్యులు అభ్యంతరాలు తెలపడంపై డిప్యూటీ చైర్మన్‌పై వ్యాఖ్యలు చేస్తూ సమయ స్ఫూర్తితో చర్చలు పక్కదోవ పట్టకుండా కౌన్సిల్‌ను ముందుకు నడిపారు. దీనిపై పలువురు ఎమ్మెల్సీలు రెడ్డి సుబ్రహ్మణ్యం పార్టీలకు అతీతంగా వ్యవహరించిన తీరుపై హర్షం వ్యక్తం చేశారు. సీఎం ప్రసంగం ముగిసిన తరువాత మంగళవారానికి మండలిని వాయిదా వేశారు.

26న ప్రజా ప్రతినిధులకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రజాప్రతినిధులకు మార్చి26న క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శాసనసభాపతి కోడెల శివప్రసాద్ రావు ప్రకటించారు. సోమవారం అసెంబ్లీలో మాట్లాడుతూ గతంలో ప్రజా ప్రతినిధుల క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవాళ్లమని, ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సాహంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సింగన్నదొరకు శాసనసభ సంతాపం

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ మాజీ శాసన సభ్యుడు పి. సిగన్న దొర మృతికి సోమవారం శాసన సభ సంతాపం ప్రకటించింది. సంతాప తీర్మానం ప్రవేశ పెట్టిన శాసన సభాపతి కోడెల శివప్రసాద రావు సింగన్న దొర మృతిపట్ల ఈసభ తీవ్ర సంతాపాన్నివ్యక్తం చేస్తూ వారి కుటంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపతున్నట్లు ప్రకటించారు. అనంతరం సభ రెండు నిమిషాలు పాటు మౌనం పాటించింది.

ఇందిరమ్మ ఇళ్లతో అమాయకులను ముంచారు

- చర్యలు తీసుకోలేమన్న మంత్రి కాల్వ



అమరావతి, ఆంధ్రప్రభ: ఇందిరమ్మ గృహాల అవకతవకలకు భాద్యులపై చర్యలు తీసుకోవాల్సి వస్తే అమాయకులే బలి అవుతారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు చెప్పారు. అమాయకులను శిక్షించడం ప్రభుత్వానికి ఇష్టం లేక కొందరు అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. చంద్రగిరి నియోజక వర్గంలో ఇందిరమ్మ గృహాల నిర్మాణంపై వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి వేసిన ప్రశ్న సందర్భంగా జరిగిన చర్చకు మంత్రి సమాధానం ఇచ్చారు. గృహ నిర్మాణ శాఖలో 272 మందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోగా, 65మందిని విధుల నుంచి తొలగించామన్నారు. రాష్ట్రంలో నిర్మాణం మధ్యలో ఆగిన గృహాలకు అదనపు నిధులు ఇస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఇందు కోసం ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించిందని చెపుతూ రాష్ట్రవ్యాప్తంగా 2.67లక్షల గృహాలు నిర్మాణం మధ్యలో నిలిచాయన్నారు. ఆగిన ప్రతి ఇంటికి రూ.25వేలు అదనంగా ఇవ్వాలని నిర్ణయించామన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ నేతలు కాంట్రాక్టర్ల అవతారమెత్తి రూ.4600 కోట్లు స్వాహా చేసినట్లు మంత్రి తెలిపారు. ఇదే అంశంపై ప్రభుత్వ చీఫ్‌విప్ పల్లె రఘునాథ రెడ్డి, ఎమ్మెల్యే అప్పలనాయుడు తదితర ఎమ్మెల్యేలు గత కాంగ్రెస్ హయాంలో జరిగిన అవకతవకలను సభ దృష్టికి తీసుకురావడంతో పాటు అమాయకులైన లబ్ధిదారులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

వైద్య పరికరాల మరమ్మతులకు రూ.450 కోట్లు

రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య పరికరాల మరమ్మతులకు రూ.450 కోట్లు కేటాయించినట్లు ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ బాధ్యతలు చూస్తున్న యనమల రామకృష్ణుడు చెప్పారు. టీసీఎస్ సంస్థ ద్వారా ఆయా పరికరాల మరమ్మతులు నిర్వహిస్తున్నామన్నారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరికరాలు అనే అంశంపై ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ పరికరాలు చెడిపోయిన వెంటనే మరమ్మతులు చేసేందుకు వీలుగా వీరికి అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి, వెంకటేశ్వరరావు, బీజేపీ పక్షనేత పి.విష్ణుకుమార్ రాజు, సత్యనారాయణ, బి.వి.మోహనరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు ప్రభుత్వాసుపత్రుల్లో పరికరాల దుస్థితి, మరమ్మతుల విషయంలో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వంటి అంశాలను సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

జీఎస్టీ విధానంపై వ్యాపారుల్లో అవగాహనకు అధికారులకు ఆదేశాలు ఇచ్చామని ఆర్థిక శాఖ మంత్రి యనమల చెప్పారు. రాష్ట్రంలో జీరో వ్యాపారాన్ని అరికట్టడంపై ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, బొండా ఉమా మహేశ్వరరావు అడిగిన ప్రశ్నకు ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన సమాధానమిస్తూ జీఎస్టీ వలన రూ.20లక్షల లోపు టర్నోవర్ ఉన్న వారికి నష్టం లేదన్నారు.

స్థలాల క్రమబద్ధీకరణ త్వరలో

వీలైనంత తొందరలోనే ప్రభుత్వ స్థలాల ఆక్రమణదారులకు క్రమబద్ధీకరణపై తగిన చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి, రెవిన్యూ మంత్రి కె.ఇ.కృష్ణమూర్తి చెప్పారు. శాసనసభలో ఎమ్మెల్యేలు బొండా, గొట్టిపాటి రవికుమార్, పోతుల రామారావు బి.ఫారం పట్టాలపై అడిగిన స్వల్ప వ్యవధి ప్రశ్నకు మంత్రి కె.ఇ.కృష్ణమూర్తి సమాధానం ఇచ్చారు. విజయవాడలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన స్థలాల్లో 40,358 మంది ఆక్రమితదారులు ఉన్నట్లు చెప్పారు. వీరికి సంబంధించి కలెక్టర్ పంపిన ప్రతిపాదనలపై గ్రూప్ ఆఫ్ మినిస్టర్లు పరిశీలన చేస్తున్నారన్నారు. అసైన్డ్ భూముల కొనుగోలు విషయంలో కూడా సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నామన్నారు.

హోదా అంశంపై తెదేపాను తప్పుపడతారా?: ఆలపాటి



ఆనాడు కాంగ్రెస్, బీజేపీలు ఒకరు మీద ఒకరు పోటీపడి ఆంధ్రప్రదేశ్‌కు 10సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇవ్వాలని చెప్పాయని తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్ర ప్రసాదు అన్నారు. సోమవారం శాసనసభలో బడ్జెట్‌పై ప్రసంగించిన రాజేంద్రప్రసాదు కేంద్రం రాష్ట్రం మొదళ్లను నరికి చిగుళ్లకు నీరు పోస్తున్నదన్న భావన కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో 7 మిషన్లు, 5 గ్రిడ్‌లతో సంక్షేమ రంగానికి పెద్దపీట వేశారని తెలిపారు. గత 10సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో చాలా పరిశ్రమలు మూసివేశారని, కాని చంద్రబాబు పరిశ్రమలు స్థాపించడానికి తీవ్రంగా కృషిచేస్తున్నారని చెప్పారు. దీనిలో భాగంగానే 365రోజులను 700 రోజులుగా చంద్రబాబు మార్చుకున్నారని, పాలేకర్ లాంటి వ్యవసాయ నిపుణులను రప్పించి వ్యవసాయాభివృద్ధికి దోహదపడుతున్నారి తెలిపారు. ఈనేపధ్యంలోనే మినుములు, పెసలు, పసుపు, మిర్చి, కందులు, సెనగ తదితర పంటలకు మద్దతు ధర కల్పిస్తున్నారని, రైతురథం కింద ట్రాక్టర్లు ఇస్తున్నారని చెప్పారు. ప్రతిపక్షనేత జగన్ తండ్రి చనిపోయిన దగ్గర నుంచి కేవలం సీఎం కావాలనే ఉద్దేశ్యంతో ఉన్నారని, రాష్ట్ర విభజన జరుగుతున్న సమయంలో పార్లమెంట్ మన ఎంపీలు దెబ్బలు తింటుంటే జగన్ ఎక్కడున్నారని ప్రశ్నించారు.

పొగాకు మద్దతు ధర రూ.175 ఇవ్వాలి: ఎమ్మెల్యే గొట్టిపాటి

అమరావతి, ఆంధ్రప్రభ: పొగాకు మద్దతు ధర రూ.175 ఇవ్వాలని, ప్రతికూల వాతావరణంతో రైతుకు రూ.10వేలు ఖర్చు పెరిగిందని అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం శాసనసభలో జీరో అవర్లో మాట్లాడుతూ 1.35 మిలియన్ టన్నుల పొగాకు ఉత్పత్తికి బోర్డు అనుమతించిందని, దాని కంటే 10వేల టన్నుల పంట తక్కువగా వచ్చినప్పటికీ మద్దతు ధర రూ.160 ప్రకటించడంపై ప్రజాసంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయన్నారు. మద్దతు ధర మరో 10శాతం పెంచాలని కోరుతున్నాయని చెప్పారు.

ఏనుగులను కట్టడిచేయండి: ఎమ్మెల్యే వెంకటరమణ

ఒడిశా ఏనుగుల వల్ల శ్రీకాకుళం జిల్లాలో ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని, వాటిని కట్టడి చేయడంలో విఫలమవుతున్నామని పాతపట్నం శాసనసభ్యుడు కె.వెంటకరమణ ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం శాసనసభ జీరో అవర్లో మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో ఒరిస్సా ఏనుగులు పొలాల్లోకి వచ్చి బీభత్సం సృష్టిస్తున్నాయని, ఇప్పటివరకు 9మంది మృతిచెందారని, భారీగా ఆస్తినష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే ఏనుగులను కట్టడి చేసే ప్రయత్నం చేయాలని, అదేవిధంగా జరిగిన ఆస్తి, ప్రాణ నష్టానికి పరిహారం అందించాలన్నారు.

గ్రేడింగ్ వల్ల ఉద్యోగావకాశాలు కోల్పోతున్నారు: వాసుపల్లి

రాష్ట్రం ప్రభుత్వం 2017-18 నుండి ప్రాథమిక విద్యావిధానంలో గ్రేడింగ్ ప్రవేశ పెట్టిందని, దీంతో విద్యార్థుల మీద ఒత్తిడి తగ్గినప్పటికీ, విద్యార్థులు చాలా ఉద్యోగావకాశాలు కొల్పోతున్నారని చెప్పారు. ఆన్‌లైన్ సిస్టంలో 75శాతం మార్కులు చూపించకపోతే పలు ఉద్యోగాల పరీక్షలకు అర్హత ఉండదని, ఉద్యోగాలకు మార్కుల పర్సెంటేజీ అడుగుతున్నారని, గ్రేడ్‌లు అడగటంలేదన్నారు. దీంతో విద్యార్థులు ఆన్‌లైన్ పరీక్షలన్నీ కోల్పోతున్నారని, దాదాపు 30రకాల ఉద్యోగాలకు అర్హత ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం ఆలోచించి ఒక నిర్ణయం తీసుకోవాలన్నారు.

చంద్రన్న బీమా ఇవ్వండి: విష్ణుకుమార్ రాజు



తమ నియోజక వర్గంలో 19మంది చంద్రన్న భీమా ప్రాసెస్ ఫీజు కట్టారని, దురదృష్టవశాత్తు వారు మృతి చెందారని, ఇప్పుడు క్లెయిమ్ కోసం వెళితే ఆన్ లైన్‌లో కనపడటం లేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయాన్ని గతంలో మంత్రి దృష్టికి తీసుకెళ్లానని, ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ తీసుకొని దీని మీద నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా స్పీకర్ స్థానంలో మిమ్మల్ని చూసి ఆనందంగా ఉందని ప్రోటెం స్పీకర్ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని ఉద్దేశించి చమత్కరించారు.

ప్రత్యేక ఆర్థిక మండళ్లు: కనిగిరి ఎమ్మెల్యే కదిరి బాబురావు

కనిగిరి ప్రాంతంలో మంజూరు చేసిన ప్రత్యేక మండళ్ల(ఎస్ఈజెడ్)లను త్వరగా ప్రారంభించాలన్నారు. వర్షాభావ ప్రభావం వలన పంటలు లేక తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, ఆ ప్రాంత ప్రజలు పొట్టచేతపట్టు కొని వలసపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం మొదటి బడ్జెట్ లో కనిగిరి ప్రాంతానికి ప్రత్యేక ఆర్థిక మండళ్ల కేటాయిం చారని, కానీ ఇప్పటివరకు ప్రారంభించలేదన్నారు. ఈ సంవత్సరం లోనైనా ప్రారంభిస్తారో లేదో మంత్రి తెలపాలని కోరారు.

నష్టపరిహారం ఇవ్వండి: చీఫ్ విప్ పల్లె రఘునాథ్ రెడ్డి



అధిక వర్షాభావం వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలన్నారు. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం ప్రాంతాల్లో అధిక వర్షాభావం వల్ల దాదాపు 15వేల హెక్టార్లలో వేరుశెనగ, కంది, మామిడి తదితర పంటల నష్టం జరిగిందన్నారు. ఈప్రాంతాలలో మంత్రి కూడా పర్యటించి పరిస్థితిని సమీక్షించారని, కాని ఇప్పటివరకు రైతులకు పరిహారం అందలేదన్నారు. దాదాపు రూ.23.83కోట్ల నష్టపరిహారం అందాలని, వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే పీతల సుజాత చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ సంబంధించి అక్కడి రైతులకు ఎకరాకు రూ.12.50 లక్షల నష్టపరిహారం అందించారని, కాని ఆప్రాంతంలో ఎకరా ధర రూ.20-30 లక్షల ధర పలుకుతుండటంతో రైతులు పరిహారం పెంచాలని కోరుతున్నారని చెప్పారు. దీనిపై స్పందించిన మంత్రి సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం జరుగుతుందన్నారు.

ఏపీ మండలి భవనాలను స్వాధీనం చేసుకున్న తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్‌లోని ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసనమండలి భవనాలను తెలంగాణ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసన మండలి సమావేశాలు అమరావతిలో జరుగుతున్నందున ఇక్కడి అవసరాల మేరకు ఆ రాష్ట్ర భవనాలను కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ విజ్ఞప్తిపైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల శాసనమండలి చైర్మన్లు, ప్రభుత్వ పెద్దలు చర్చలు జరిపి భవనాల అప్పగింతకు సంబంధించి అంగీకారం కుదుర్చుకున్నారు. అప్పగింతల ప్రక్రియ పూర్తి కావడంతో ఏపీకు కేటాయించిన అసెంబ్లీ, మండలి భవనాల మరమ్మత్తులను తెలంగాణ ప్రభుత్వ అధికారులు చేపట్టారు. సమావేశ మందిరం, గదులకు తెలంగాణ అవసరాల మేరకు మెరుగులు దిద్దుతున్నారు. ఏపీ బోర్డులను తొలగించి తెలంగాణ బోర్డులను ఏర్పాటు చేశారు. మండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్, ముఖ్యమంత్రి ఛాంబర్లకు మరమ్మత్తులు కొనసాగుతున్నాయి. ఏపీ శాసన మండలి సమావేశ మందిరాన్ని తెలంగాణ శాసనమండలి సమావేశాలకు వినియోగించు కుంటే, జూబ్లీ హాల్‌ను తిరిగి పాత తనహాలోనే అధికారిక సమావేశాలకు, సదస్సులకు వినియోగించుకొనే వెసులుబాటు కలుగుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

కేంద్రప్రభుత్వంపై దూకుడు పెంచిన బాబు



- హీటెక్కిస్తున్న సీఎం ట్వీట్‌లు
- దక్షిణాది పన్నులతో ఉత్తరాది అభివృద్ధి అంటూ ధ్వజం
- ఇక పూర్తిస్థాయిలో తెగతెంపులకు సంకేతాలు

అమరావతి, ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు మరోసారి కేంద్రంపై తీవ్రస్థాయిలో విరుచుపడ్డారు. రాష్ట్రంపై వివక్షను ప్రదర్శిస్తోందని ధ్వజమెత్తిన ముఖ్యమంత్రి మరోసారి ట్విట్టర్ వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శాసనమండలిలో ఆయన ప్రసంగించారు. ఆ సందర్భంగా ఘాటుగా చేసిన వ్యాఖ్యలలో కొన్నింటిని ముఖ్యమంత్రి ట్విట్టర్‌లో పేర్కొనడం విశేషం. ఏ.పి కి హోదా విషయంలో చట్టబద్దంగా తాము కోరుతున్న వాటిని కూడా నిర్ద్వందంగా కేంద్రం తోసిపుచ్చుతోందనే అర్థం వచ్చే రీతిలో ముఖ్యమంత్రి ఘాటుగా స్పందించడం భవిష్యత్‌లో అనుసరించబోయే కార్యాచరణకు అద్దం పడుతోందని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. ఒకవైపు చంద్రబాబునాయుడు తాజా ట్వీట్‌లు ఆసక్తి రేపుతుండగా, మరోవైపు రాజకీయవర్గాలలో చర్చనీయాంశంగా మారాయి. కేంద్రం నుంచి బయటకు వచ్చిన తరువాత కూడా ఏ మాత్రం చలనం రాకపోవడంతో, మిత్రపక్షంగా వుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ట్వీట్‌లు మాధ్యమాల్లో చర్చనీయాంశంగా పరిణమించాయి. నేరుగానే చంద్రబాబు బిజెపికి ప్రశ్నలు సంధించడంతో, త్వరలోనే ఎన్డీయే నుంచి కూడా తప్పుకుంటారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని రాజకీయవర్గాలు అంటున్నాయి. ప్రతిపక్షపార్టీ నేత అయిన జగన్‌మోహన్ రెడ్డి ఎక్కడా కేంద్రాన్ని విమర్శించకపోవడాన్ని కూడా సి.ఎం ప్రస్తావించారు. సెంటిమెంట్‌కు డబ్బులు రావంటూ కేంద్రమంత్రి ఒకరు ప్రస్తావించడాన్ని చంద్రబాబు తప్పుబట్టారు. సెంటిమెంట్ లేదని భావించినప్పుడు మరి అదే సెంటిమెంట్‌తో రాష్ట్రాన్ని ఎందుకు విభజించారని చంద్రబాబు మరో ప్రశ్న సంధించారు. రాష్ట్రం కోసం రాత్రింబవళ్ళు కష్టపడతామని, ఏ.పి ని పునర్నిర్మిస్తామని, ఆ అనుభవం తనకు వుందని పేర్కొన్నారు. కష్టపడే తత్వం రాష్ట్ర ప్రజలకు వుందని పేర్కొన్న ముఖ్యమంత్రిఏపి హక్కులకు సంబంధించి బీజేపీ అప్పుడు ఒక మాట, ఇప్పుడొక మాట మాట్లాడుతోందని వ్యాఖ్యానించారు. న్యాయం చేయాల్సింది పోయి ఎదురుదాడి చేయడం ఎంతవరకు న్యాయమో ఆలోచించుకోవాలని సి.ఎం పేర్కొనడం విశేషం. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సమాధానమిస్తూ మరోవైపు కేంద్రం అనుసరిస్తున్న ఎండగట్టారు. రాష్ట్ర విభజనలో బిజెపి భాగస్వామి అని, విభజన చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత కూడా ఆ పార్టీదేనన్నారు. విభజన సెంటిమెంట్‌ను గౌరవించిన బిజెపి, ప్రత్యేక హోదాను ఎందుకు పరిగణనలోకితీసుకోవడం లేదని సూటిగా ప్రశ్నించారు. మీ డబ్బు, మా డబ్బు అంటూ వుండదని, అంతా ప్రజలదేనని చెప్పారు. దేశానికి దక్షిణాది నుంచి పన్నుల రూపేణా అధిక ఆదాయం వస్తోందని, ఆ డబ్బుతో ఉత్తరాది రాష్ట్రాలను అభివృద్ధి చేస్తున్నారని ఆరోపించడంకూడా ప్రాధాన్యతను సంతరించుకుంది. కాగా ఇంతకాలం పార్టీ శ్రేణులు బిజెపిని, కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రస్థాయిలో విమర్శించగా, తాజాగా ముఖ్యమంత్రి అసెంబ్లీ వేదికగా నేరుగా విమర్శనాస్త్రాలు సంధించడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఎంతకాలం బాబూ హోదా డ్రామా?!

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రం దిగి రాకపోతే ఏప్రిల్ 6వ తేదీన మూకుమ్మడి రాజీనామాలను లోక్‌సభ స్పీకర్‌కు అందజేస్తే కేంద్రం తప్పకుండా దిగి వస్తుందన్నారు. తాజా బడ్జెట్‌లో మిగులు బడ్జెట్‌ను రూ.5,000 కోట్లు చూపిస్తుంటే రాష్ట్ర సహకారానికి కేంద్రం ఎలా ముందుకు వస్తుందని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ఆర్థిక వృద్ధి రేటును చంద్రబాబు చూపిస్తున్నారని దుయ్యబట్టారు. గడిచిన నాలుగేళ్లుగా రైతులు గిట్టుబాటు ధరలులేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, కృష్ణా డెల్టా ప్రాంతాల్లో రైతులకు నీళ్ళందక కరువుతో అప్పుల ఊబిలోకి వెళ్ళారన్నారు.



ఖర్చులు ఉచితంగా అందిస్తామని వాగ్దానం చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రతి నెలకు రూ.10 వేలు ఫించన్ తమ ప్రభుత్వం రాగానే అందిస్తుందన్నారు. బాపట్లలో రైతుల నుండి ఎన్నో ఫిర్యాదులు వచ్చాయని, ఆక్వా రైతులు మత్స్యకారులు, ఉద్యాన రైతులు గిట్టుబాటు ధరలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా చంద్రబాబు ప్రభుత్వం ఆదుకోవట్లేదని విమర్శించారు. చంద్రబాబు బెల్టు షాపులు ఎత్తివేస్తానని ఎన్నికల ముందు చెప్పారని, కానీ ఇప్పుడు ఎక్కడ చూసినా బెల్టు షాపులే కనిపిస్తున్నాయంటూ ఫోను కొడితే మంచి నీరు రాదుగానీ అదే ఫోను కొడితే మందుబాటిల్ వస్తుందని ప్రభుత్వాన్ని విమర్శించారు. నాలుగేళ్ల ముందు కరెంట్ బిల్లులు ఎలా ఉన్నాయి, ఇప్పుడు ఎలా ఉన్నాయంటూ ప్రజలను ప్రశ్నించారు. గతంలో చౌకదుకాణాల ద్వారా బియ్యం దగ్గర నుండి పప్పు, ఉప్పు, పంచదార, గోదుమపిండి, కిరోసిన్ రూ.185లకు ఇచ్చారని, ఇప్పుడు రేషన్ తప్ప ఇంకేమి దొరకట్లేదని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో విశ్వసనీయత, నిజాయితీ, విలువలు ఉన్న పార్టీకి ఓటు వేసి గెలిపించాలని జగన్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, గుంటూరు జిల్లా ఎం.ఎల్.సి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, బాపట్ల పార్లమెంటరీ అధ్యక్షుడు, రేపల్లె సమన్వయ కర్త, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, గుంటూరు పార్లమెంటరీ అధ్యక్షులు రావి వెంకటరమణ, మాజీ ఎం.ఎల్.ఏ చీరాల గోవర్ధన రెడ్డి, పార్టీ నాయకులు మోదుగుల బసవ పున్నారెడ్డి, కళ్ళెం హరినాథ్ రెడ్డి, నరాలశెట్టి ప్రకాష్, కోకి రాఘవరెడ్డి, భారీ సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతను మభ్యపెడుతున్న చంద్రబాబు..

విశాఖలో పారిశ్రామిక సదస్సులను ఏర్పాటు చేస్తూ రాష్ట్రానికి లక్షలాది కోట్ల పెట్టుబడులు, వేలాది కంపెనీలు వస్తున్నాయని, వీటి ద్వారా 40లక్షల ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులను మభ్యపెట్టే ప్రయత్నం చేయడం చంద్రబాబుకే చెల్లిందని జగన్ ఎద్దేవా చేశారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదవాడి ఆరోగ్యానికి భరోసానిస్తూ ప్రారంభించిన ఆరోగ్యశ్రీ కార్డు మీద గతంలో హైదరాబాదులో కూడా మెరుగైన వైద్యం అందేదని, కానీ చంద్రబాబు పుణ్యమా అని ఇప్పుడు పేద ప్రజలకు దక్కకుండా పోయిందని విమర్శించారు. పేరొందిన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎలుకలు తిరుగుతూ పసి పిల్లల ప్రాణాతో చెలగాటం ఆడుతున్న విషయం ప్రజందరికీ తెలిసిందే అని, ఇక్కడే ఇలా ఉంటే ఇక మారుమూల గ్రామాల్లో మెరుగైన వైద్యం పేదవాడికి ఎక్కడ దొరుకుతుందని ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ప్రజల ఆశీర్వాదంతో తాము అధికారంలోకి వస్తే రూ.1000 పైగా అయ్యే వైద్య

శాస్త్రోక్తంగా సొంతింటికి శంకుస్థాపన

పరిమిత ఆహ్వానితులకే ప్రవేశం



అమరావతి, ఆంధ్రప్రభ : అత్యంత వైభవంగా జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సొంతింటి నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం సోమవారం జరిగింది. వేద మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పవన్‌కల్యాణ్ భార్య అన్నా పవన్‌కల్యాణ్‌తోపాటు తనయుడు కూడా పాల్గొన్నారు. కుటుంబ సమేతంగా ఆయన ఆదివారం రాత్రినే విజయవాడ చేరుకున్న సంగతి తెలిసిందే. సోమవారం ఉదయాన్నే ముహూర్తం సమయానికి స్థలం వద్దకు చేరుకుని ప్రత్యేకించి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దాదాపు రెండు గంటలకుపైగానే పూజ తంతు జరిగింది. మంగళగిరి రూరల్ మండలం కాజా టోల్ గేట్ సమీపంలోని సాహితీ వెంచర్‌లోని రెండెకరాల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి కేవలం అతి ముఖ్యులకు మాత్రమే ఆహ్వానం పంపారు. దీంతో ఆహ్వానం అందినవారు మాత్రమే కార్యక్రమానికి హాజరయ్యారు. దీంతో పార్టీ రాష్ట్రనాయకులు రాఘవయ్య, గంగాధరం, స్థానికనాయకులు జి.తిరుపతిరావు, చిల్లంపల్లి శ్రీనివాసరావుతో పాటు పార్టీ మీడియా హెడ్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఇక బయట వ్యక్తులెవరూ లోనికి రాకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పవన్‌కల్యాణ్ కుటుంబ సభ్యులు వస్తున్నారన్న వార్త తెలుసుకున్న కార్యకర్తలు, అభిమానులు ,స్థానికులు పెద్ద ఎత్తున వెంచర్ వద్దకు చేరుకున్నారు. వీరిని అదుపు చేయడం పోలీసులకు మరింత ఇబ్బందికరంగా పరిణమించింది. అనంతరం ఆయన అక్కడ నుంచి నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా ఉన్న మైదానంలో జరుగుతున్న బహిరంగ సభా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు ఆయన పలు సూచనలు చేశారు.

యువత త్యాగాలను స్మరిస్తూ జనసేన గీతం

స్వాతంత్ర్య పోరాట కాలం నుంచి యువత చేస్తున్న త్యాగాలను, బలిదానాలను స్పరించుకుంటూ వారికి నివాళులు అర్పిస్తూ జనసేన పార్టీ ప్రత్యేక గీతాన్ని రూపొందించింది. సోమవారం సాయంత్రం ఈ గీతాన్ని పార్టీ సోషల్ మీడియా ద్వారా ఇక్కడ విడుదల చేసినట్లు జనసేన పార్టీ మీడియా అధినేత హరిప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ''ఇంకెన్ని.. అంటూ .. గీతం సాగుతుందని తెలిపారు. తెల్లవారితో పోరాడి స్వాతంత్ర్యాన్ని సాధించడంలో యువ శక్తి పాత్ర అనిర్వచనీయమైందన్నారు. పోరాడి తెచ్చుకున్న ప్రజాస్వామ్యంలో విలువలు క్షీణిస్తున్నాయని, విధానాలు లోప భూయిష్టంగా తయారయ్యాయని పేర్కొన్నారు. రెండు తెలుగు ప్రాంతాల వాళ్లు రాష్ట్రాలు కావాలని జై తెలంగాణ, జై ఆంధ్ర ఉద్యమాలు చేస్తే కలిపి ఉంచారని, పాలకవర్గాలు చేసిన తప్పులకి నేడు ప్రజలు శిక్ష అనుభవించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఉద్యమాలు,పోరాటాల్లో యువత బలైపోతోందని, వారి ప్రాణ త్యాగాలకు ఇస్తున్న విలువ ఏమిటీ? వారు అర్పించిన ప్రాణాలే కాదు..వారిపై ఆధారపడ్డ బతుకుల్నీ గుర్తు చేసుకుంటున్నామా? అవకాశవాద రాజకీయాలకి బలైపోతూ మోసపోతున్న యువతని స్మరించుకుంటూ వారి త్యాగాలకు ఈ గీతం ద్వారా జనసేన నివాలులు అర్పిస్తుందన్నారు. ఈ గీతానికి ప్రత్యేకంగా వీడియో కూడా రూపొందించామన్నారు.

కార్యాచరణ రేపు ప్రకటిస్తా!

(మొదటిపేజీ తరువాయి)

అవసరమేనని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జనసేనలోకి కొత్తవాళ్లు వచ్చినా పాత వాళ్లకు ప్రాధాన్యం తగ్గదని స్పష్టం చేశారు.

మా నాన్న సీఎం కాదు..

దోచుకుని సంపాదించలేదు

మానాన్నేమీ ముఖ్యమంత్రి కాదు..ఎక్కడా ఏ విధం గాను ఎవర్నీ దోచుకోలేదు.. తనకేదీ అప్పనంగా రాలేదని, రేయింబవళ్లు కష్టించి, సంపాదించాను.. రమా రమి రెండు దశాబ్దాలు సినిమా రంగంలో కష్టించి, సంపాదించుకున్నానని పవన్‌కల్యాణ్ ఒక ప్రశ్నకు గట్టిగా సమాధానం చెప్పారు. మీడియా ప్రతినిధులు ఆస్తుల ప్రకటన గురించి ప్రస్తావించగా ఆయన ఘాటుగా స్పందించారు. చంద్రబాబు లాంటి కొంతమంది ఎన్నికల ముందే తమ ఆస్తులను ప్రకటించారు..మీరు కూడా మీ ఆస్తుల్ని బహిరంగంగా వెల్లడిస్తారా? అని విలేకరులు ప్రశ్నించగా '' నా ఆస్తులకు అన్ని లెక్కలున్నాయి..ఆ విషయం ఆదాయపు పన్ను శాఖాధికారులకు కూడా తెలుసు..నా ఆస్తులు ఒక్క రోజులో వచ్చినవికావు..ప్రజలు ప్రేమతో ఇచ్చినవని'' అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సమయం వచ్చినప్పుడు ఆస్తుల గురించి కూడా చెబుతానని అన్నారు.

ఈ సందర్భంగా ఆయన అస్సాం గణపరిషత్ ఉద్యమాన్ని ఉదహరించారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున సదస్సులు నిర్వహించి, 40వేల మందిని పార్టీలో పనిచేసేందుకు ఎంపిక చేశామని, అందులో మొదటి విడతగా 12 మందిని అధికార ప్రతినిధులుగా నియమించబోతున్నామని ప్రకటించారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు, ఇతర అంశాల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై 14న జరిగే పార్టీ ఆవిర్భావ సభలోనే పూర్తి క్లారిటీ ఇస్తానని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు ఎటువంటి న్యాయం చేయాలో, పార్టీని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో



తనకు పూర్తి స్పష్టత ఉందని, అయితే ఇప్పుడే ఆ విషయాన్ని వెల్లడించలేనని, అది ప్రజాసభా వేదిక సాక్షిగా ప్రజల సమక్షంలోనే వెల్లడిస్తే గౌరవంగా ఉంటుందని, అందుకే మీడియా ప్రతినిధులు అడిగిన ఏ ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోతున్నానని వివరణ ఇచ్చారు. ఉగాది నుంచి పార్టీ కార్యకలాపాలు మరింతగా ఊపందుకుంటాయని స్పష్టం చేశారు. ప్రతి విషయంలోను చాలా జాగ్రత్తగా ముందుకెళుతున్నానని అన్నారు. పార్టీ సిద్ధాంతం కోసం కట్టుబడి ఉండే వాళ్ల కోసం ఇంతకాలం వేచిచూస్తూ ముందుకు సాగుతున్నామని అన్నారు. తాను 2007 నుంచి రాజకీయాల్లో ఉన్నానని, ఈ క్రమంలో మనుషులు ఎలా రూపాంతరం చెందారో చూశానని, కనుక ఆ పరిస్థితి తలెత్తకుండా పార్టీని ఎంతో పటిష్టంగా కట్టుదిట్టం చేస్తూ,యువతకు పెద్దపీట వేస్తున్నామని పవన్ పేర్కొన్నారు. మా నాన్న మంగళగిరిలో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేశారు. ఆయన తిరిగి,పనిచేసిన ఈ ప్రదేశంలో సొంతింటిని కట్టుకోవాలని గతం నుంచే అనుకుంటున్నాను..ఇంతకాలానికి ఆ కోరిక తీరిందని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ప్రజలు అంత దూరం నుంచి హైదరాబాద్ వచ్చి, సమస్యలు చెప్పుకోవడానికి వచ్చి, ఎన్నో వ్యయ ప్రయాసాలకు గురవుతున్నారని, ఆ పరిస్థితిని గుర్తించి, వారికి దగ్గరగా ఉండాలని భావించి, అమరావతిలో సొంతింటిని నిర్మించుకుంటున్నానని చెప్పారు. రానున్న రోజుల్లో ఏపీ రాజకీయాలు క్రియాశీలక పాత్ర పోషించనున్నాయని, అందుకే అమరావతిలో ఉండాలనుకుంటున్నానని అన్నారు. ఇక నుంచి ఇక్కడి నుంచే రాజకీయాలు చేస్తానని ప్రకటించారు. అభిమానులు ఎంతో అభిమానంతో ఇచ్చిన స్థలంలో ఇంటిని నిర్మించుకుంటున్నానని చెప్పారు. ఇంటికి దగ్గరలోనే పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని కూడా నిర్మించనున్నామని చెప్పారు. త్వరలోనే ఆ కార్యక్రమం కూడా జరుగుతుందన్నారు. అమరావతిలో ఉండి పని చేస్తానని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఎలా ప్రశ్నిస్తారో తన రాజకీయ జీవితంలో కూడా ఏమైనా తప్పులుంటే తన దృష్టికి తీసుకొస్తే సరిదిద్దుకుంటానని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

నరేంద్రమోడీ డైరెక్షన్‌లో వైసీపీ పనిచేస్తోందా?

''మీరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పూర్తి దర్శకత్వంలో పనిచేస్తున్నారని వైసీపీ లాంటి పార్టీలు విమర్శిస్తున్నాయి కదా? ఇందులో వాస్తవమెంతుంది ? అని విలేకరులు ప్రశ్నించగా పవన్‌కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. ఆహా ! అయితే వైసీపీ నరేంద్రమోడీ డైరెక్షన్‌లో పనిచేస్తోందా? అని పవన్‌కల్యాణ్ ఎదురు ప్రశ్నించారు. అయితే టీడీపీనే అలా ఎందుకనుకోవాలి? బీజేపీ కూడా ఉందని అనుకోవచ్చు కదా? అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు పట్టించుకోనని తేల్చిపారేశారు. ప్రజాజీవితంలోకి వచ్చానని, సమయం..సందర్భం బట్టి అన్ని విషయాలకు బదులు చెబుతానని పవన్ స్పష్టం చేశారు. తనకు స్పష్టమైన పొలిటికల్ స్ట్రటజీ ఉందన్నారు. ఇటువంటి ఎన్ని శల్య ప్రశ్నలు వేసినా తట్టుకునే శక్తి, బలం, ఓపిక, సాహసం తనకు ఉందన్నారు. అందరి ఆశీస్సులతో పార్టీని భవిష్యత్‌లో మరింత ముందుకు తీసుకుపోతానని పవన్‌కల్యాణ్ తెలియజేశారు.

11వ పీఆర్సీకి సీఎం ఓకే

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంటామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఉద్యోగుల పట్ల తమకు ఎప్పుడూ సానుకూల దృక్పథమే వుందని చెప్పారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేయాలని, పెండింగ్‌లో వున్న ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని కూడా ఏపీ ఎన్జీవో సంఘం ప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరారు.

కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగులప్రధానమైన డిమాండ్‌గా వున్న సిపీఎస్‌పై కూడా సంబంధిత శాఖ అధికారులతో చర్చించి ఒక నిర్ణయంతీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

నాణ్యతతో పాటు కాలుష్య నివారణ

- ఆక్వా ఉత్పత్తిదారులకు సీఎం పిలుపు



అమరావతి, ఆంధ్రప్రభ : నవ్యాంధ్ర సముద్రతీర ప్రాంతం ఆక్వా హబ్‌గా రూపొందించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. చేపలు, రొయ్యల ఉత్పత్తిలో దేశంలోనే రెండో స్థానంలో నిలిచిన ఏపీ ఆక్వా రంగంలో డబుల్ డిజిట్ వృద్ధి రేటు సాధించే దిశగా సాగుతోందన్నారు. విశాఖపట్నం జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కవాని పాలెం బంగారమ్మపేటలో వన్నామి రొయ్యల బ్రూడ్ స్టాక్ మల్టిప్లికేషన్‌సెంటర్, అక్వాటిక్ క్వారంటైస్ ఫెసిలిటి కేంద్రాలకు ఆయన వీడియోలింక్ ద్వారా సచివాలయం నుంచి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే చేపలు, రొయ్యలు ఉత్పత్తిలో ఏపీ 70 శాతం వాటాతో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. రొయ్యల ఉత్పత్తిలో ప్రపంచంలోనే మూడో స్థానంలో నిలిచిందన్నారు. 2016-17లో ఇండియా నుంచి రూ.37 వేల కోట్ల మత్స్య ఉత్పత్తులు ఎగుమతి జరిగితే వాటిలో ఏపీ వాటా రూ.17 వేల కోట్లను సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు. 2016-17లో 27.66 లక్షలటన్నుల మత్స్య ఉత్పత్తి రాష్ట్రంలో జరగ్గా, 2019-20 నాటికి రూ.42 లక్షల టన్నులను లక్ష్యంగా పెట్టుకున్నారు. దీని ద్వారా స్థూల విలువ జోడింపు రూ.80 వేల కోట్లు సాధించే దిశగా ప్రణాళికలు రూపొందించుకున్నామన్నారు.

రాష్ట్రంలో మత్స్యకార రైతులు.. నాణ్యత కలిగి, వ్యాధుల్లేని రొయ్య పిల్లలను ఇంత వరకు చెన్నై నుంచి దిగుమతి చేసుకునేవారన్నారు. ఏపీలోని సముద్ర తీరం ఆక్వా హబ్‌గా రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో బ్రూడ్ స్టాక్ మల్టిప్లికేషన్ సెంటర్, అక్వాటిక్ క్వారంటైన్ ఫెసిలిటి స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. వాటి ద్వారా రైతులకు వ్యాధుల్లేని, నాణ్యత కలిగిన రొయ్య పిల్లను పంపిణీ చేయడానికి వీలు కలుగుతుందన్నారు. దీని వల్ల మత్స్యకార రైతుల ఆదాయం పెరగడమే కాకుండా రాష్ట్రంలో ఆక్వా సాగు విస్తరణకు అవకాశం కలుగుతుందన్నారు. హేచరీస్ నిర్వాహకులు ఆదాయ పెంపుదలతోనే సరిపెట్టకుండా కాలుష్య నివారణకు గట్టిగా కృషి చేయాలన్నారు. ఆక్వా ఉత్పత్తులు ప్రాసెసింగ్ సమయంలో కాలుష్య నివారణకు పెద్దపీట వేయాలన్నారు. లేకుంటే చర్యలు తీసుకోవడానికి వెనుకాడేది లేదని సీఎం చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. నాణ్యమైన ఆక్వా ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతులు చేయాలన్నారు. లాంభాల కోసం హేచరీ యజమానులు నాణ్యతలేని ఆక్వా ఉత్పత్తులను ఎగుమతి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబునా యుడు హెచ్చరించారు. బ్రూడ్ స్టాక్ మల్టిప్లికేషన్ సెంటర్‌ను 30 ఎకరాల్లో రూ.48 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. ఆక్వాటిక్ క్వారంటైన్ ఫెసిలిటిని రూ.20.38 కోట్లతో నిర్మాణం చేపట్టామన్నారు.

50 ఏళ్లు దాటిన మత్స్యకారులకు పెన్షన్లు

మత్స్యకారుల సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు. 50 ఏళ్లు దాటిన మత్స్యకారులకు పెన్షన్లు అందజేయనున్నారు. సముద్రంలోని సుదూర ప్రాంతాల్లో చేపలు వేటాడేలా రాష్ట్రంలో సముద్రతీరంపై ఆధారపడి మత్స్యకారులకు యంత్రసాయంతో నడిచే బోట్లు ఇవ్వనున్నట్లు సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యకారక శాఖ మంత్రి సిహెచ్.ఆదినారాయణ రెడ్డి , రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ గోపాలకృష్ణద్వివేదీ తదితరులు పాల్గొన్నారు.

పెద్దల సభకు అభ్యర్థులు ఏకగ్రీవం

- టీడీపీ నుంచి రమేష్, రవీంద్ర
- వైకాపా నుంచి వేమిరెడ్డి



అమరావతి, ఆంధ్రప్రభ: రాజ్యసభకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఏకగ్రీవంగా అభ్యర్థులు ఎంపిక కావడంతో ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్రం నుంచి మూడు సీట్లకు టీడీపీ నుంచి సీఎం రమేష్, కనకమేడల రవీంద్రకుమార్, వైకాపా నుంచి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డమ్మీగా ఆయన సతీమణి ప్రశాంత్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయడంతో అభ్యర్థుల ఏకగ్రీవ ఎంపిక లాంఛనం కానుంది. నామినేషన్ల ఘట్టం చివరిరోజు సోమవారం టీడీపీ అభ్యర్థులుగా సీఎం రమేష్, కనకమేడల రవీంద్రకుమార్ నామినేషన్ దాఖలు చేశారు. మంత్రులు, శాసనసభ్యులు, కుటుంబసభ్యులు, సన్నిహితులతో కలిసి మధ్యాహ్నం 12 గంటలకు అసెంబ్లీలోని రిటర్నింగ్ అధికారి సత్యనారాయణకు నామినేషన్ పత్రాలు అందజేశారు. అంతకుముందు వీరుభయులూ సీఎం చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పార్టీని బలోపేతం చేయడంతోపాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన సీఎం రమేష్, కె.రవీంద్రకుమార్‌లు మీడియాకు తెలిపారు.

వైకాపా అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గతంలోనే నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. ఆయనకు డమ్మీగా సతీమణి ప్రశాంత్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ తరపున ఇద్దరు అభ్యర్థులు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో వైకాపా నుంచి డమ్మీగా నామినేషన్ దాఖలు చేసిన ప్రశాంత్‌రెడ్డి నామినేషన్ ఉపసంహరించుకుంటే ప్రభాకర్‌రెడ్డితోపాటు మిగిలిన టీడీపీ అభ్యర్థుల ఎంపిక కూడా ఏకగ్రీవం కానుంది. కాగా ప్రభాకర్‌రెడ్డి సుమారు 18 కోట్ల స్థిర, చరాస్థులతోపాటు అప్పుల వివరాలను అఫిడవిట్లో వెల్లడించారు. నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల్లో టీడీపీ అభ్యర్థి సీఎం రమేష్ అత్యధికంగా తన ఆస్థిని సుమారు 218 కోట్లుగా చూపించారు. సతీమణి శ్రీదేవితోపాటు కుమారులు రుత్విక్, రుత్విన్‌ల పేర్లతో ఉన్న స్థిర, చరాస్థులు, భవనాలు, నగదు, రుణాలు తదితర వివరాలను అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే మరో అభ్యర్థి కనకమేడల రవీంద్రకుమార్ సుమారు 40 లక్షల ఆస్థులతోపాటు స్థలాలు, భూమి, భవనాలు తదితరాలున్నట్లు పేర్కొన్నారు. వీరి నామినేషన్లకు మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర తదితర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు అభినందించారు. రాజ్యసభ నామినేషన్ల తుదిఘట్టం రోజున అసెంబ్లీ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.

రాజ్యసభకు న్యాయవాదిని పంపాలనుకున్నాం

- సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ : పార్లమెంటులో అన్ని రాజకీయ పార్టీలకు అడ్వకేట్లు ఉన్నారు.. టీడీపీకి మాత్రమే ఇంతవరకు న్యాయవాదులు లేరు.. అందుకే రాజ్యసభకు కనకమేడల రవీంద్రకుమార్ పేరును ఖరారు చేసామని సీఎం చంద్రబాబు వివరణ ఇచ్చారు. గడచిన 20 ఏళ్లుగా ఆయన పార్టీలో కొనసాగుతున్నారు. టీడీపీకి సంబంధించిన అన్ని కేసులు ఆయనే వాదిస్తున్నారు. గతంలోనే ఆయనకు ఎమ్మెల్సీగా ఇద్దామనుకున్నాం. కానీ అనివార్య కారణాల వల్ల కుదరలేదు. చేసిన సేవలను దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు టిక్కెట్ ఇచ్చామని చంద్రబాబు వివరించారు. విభజన హామీలపై న్యాయ పోరాటం చేసేందుకు రవీంద్ర పనికొస్తారని వ్యాఖ్యానించారు. పార్టీకి విధేయత, ఆయన చేసిన సేవల కారణంగా



రాజ్యసభకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. సీఎం రమేష్ కూడా పార్టీకి విధేయతగా ఉండటంతో రెండోసారి అవకాశమిచ్చామన్నారు. తెలంగాణాలో శాసనమండలి ఛైర్మన్‌పై దాడి చేయడంతో కన్ను పోయిందని మీడియా సీఎం దృష్టికి తీసుకొచ్చారు. సీఎం స్పందిస్తూ కంటికి దెబ్బ మాత్రమే తగిలిందని, మీరు ఎక్కువ చేసి చూపిస్తున్నారు.. నారధులు ఎక్కడో లేరు.. ఇక్కడే ఉన్నారంటూ సెటైర్ విసిరారు.

అభ్యర్థులను అభినందించిన మంత్రి లోకేష్

తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థులుగా సీఎం రమేష్, కనకమేడల రవీంద్రకుమార్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం మంత్రి లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా లోకేష్‌సీఎం రమేష్, రవీంద్రకుమార్‌లను అభినందించారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

మంగళవారం 13 మార్చి 2018

చైనాలో ఏకవ్యక్తి స్వామ్యం!

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇప్పుడు సర్వోన్నతుడు. చైనాకు ఆయన జీవిత కాల అధ్యక్షుడు.మావోతర్వాత చైనాలో అంతటి శక్తిమంతుడు.మావో ఆలోచనా విధానాన్ని చైనీయులు ఆమోదించి అమలు జేసినట్టే, ఇకపైన జిన్‌పింగ్ ఆలోచనా విధానాన్ని అమోదించనున్నారు. మావో తర్వాత చైనాని సంస్కరణల పథంలో నడిపించిన డెంగ్ పాలనా రంగంలో వేసిన ముద్రను చెరిపివేయడానికి జిన్‌పింగ్ కొంతకాలంగా సాగిస్తున్న యత్నాలు ఫలించాయి. 2017 అక్టోబర్‌లో జరిగిన పార్టీ కాంగ్రెస్‌లోనే జిన్‌పింగ్ చైనాకు జీవిత కాల అధ్యక్షుడు అయ్యేందుకు తగిన ప్రాతిపదికను ఏర్పాటు చేసుకున్నారు.

అలనాడు మావోకి లభించినంత ప్రాధాన్యత ఇప్పుడు జిన్ పింగ్‌కి లభిస్తోంది. జిన్ పింగ్ ఆలోచనా విధానాన్ని రాజ్యాంగంలో చేర్చాలన్న ప్రతిపాదనను కొద్ది రోజుల క్రితం ఆమోదించిన చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ఇప్పుడు జిన్ పింగ్‌ని జీవిత కాల అధ్యక్షునిగా ఆమోదించింది. ఈ ప్రతిపాదనకు పార్లమెంటు ఆమోద ముద్ర కూడా లభించింది. ఇక పైన ఆయన ఏ కార్యక్రమం చేపట్టినా దానికి ఎదురు చెప్పేవారు ఉండరు. జిన్ పింగ్ ఆలోచనా విధానం చైనాని ప్రపంచంలో అజేయమైనశక్తిగా నిలబెట్టేందుకు అనుకూలమైనదిగా కమ్యూనిస్టు పార్టీ భావిస్తోంది. ఆయన హయాంలో కొత్త శకం ఆరంభం కాగలదని పార్టీ విశ్వసిస్తోంది. మావో వల్ల చైనాకు మేలు చేకూరిందని ఇప్పటికీ అంగీకరిస్తున్నవారున్నట్టే, డెంగ్ ప్రవేశపెట్టిన సంస్కరణల వల్ల చైనా అగ్రరాజ్యంతో పోటీ పడే స్థాయికి ఎదిగిందని నమ్మేవారు ఉన్నారు. సంస్కరణలు అమలులోకి వచ్చిన తర్వాత అవినీతి పెరిగిపోయిందన్న ఆరోపణలు వచ్చాయి. చైనా మొదటి రాజ్యాంగం 1954లో అమలులోకి వచ్చింది. ప్రస్తుత రాజ్యాంగం 1982 నుంచి అమలులో ఉంది. ఇప్పటికి నాలుగుసార్లు సవరణలు చేశారు. చైనాలో ఇంతవరకూ సమష్టి నాయకత్వం కొనసాగింది. ఇక మీదట జిన్ పింగ్ చెప్పిందే వేదం. రెండుసార్లు మించి అధ్యక్ష పదవిలో ఏ వ్యక్తీ కొనసాగరాదన్న నిబంధనను రాజ్యాంగం నుంచి తొలగించడం వల్ల ఇప్పుడు ఆయన తిరుగులేని నాయకుడయ్యారు. చైనాను ఆర్థికంగా ప్రపంచంలో నెంబర్‌వన్‌గా చేయాలన్న ఆయన తపన అర్థంచేసుకోదగిందే. ఆయన వేస్తున్న అడుగులు మాత్రం విమర్శలకు గురవుతున్నాయి. వన్ బెల్ట్ వన్ రోడ్డు (ఒబిఒఆర్) పథకం వల్ల యూరప్‌తో వాణిజ్య సంబంధాలు పెంచుకోవచ్చనీ, తద్వారా ఆర్థికంగా చైనా అజేయమైన శక్తిగా రూపుదిద్దుకోగలదని ఆయన ఆకాంక్షిస్తున్నారు. మహామార్గం పేరిట అమలు చేయదలచిన ఈ ప్రాజెక్టుకు ఎన్ని లక్షల కోట్లు వ్యయం అవుతుందో ఇంకా అంతుచిక్కని విషయమే. నిధులను సేకరించడం ఒక ఎత్తయితే, పొరుగు దేశాల భూభాగాల మీదుగా నిర్మించే ఈ మహామార్గం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇప్పటికే వాటి సంకేతాలు బయటపడ్డాయి. సిక్కిం సరిహద్దుల్లో డోక్లామ్ వద్ద ఉద్రిక్తత కొనసాగడానికి కారణం ఇదే. భూటాన్ భూభాగంలోకి చొచ్చుకుని పోయే రీతిలో ఈ మార్గాన్ని నిర్మించేందుకు తలపెట్టిన పనుల పట్ల భూటాన్ నిరసన తెలిపింది. ఇటు మన సిక్కింలోకి కూడా చొచ్చుకుని వచ్చే ప్రమాదం ఉండటంతో సరిహద్దుల్లో మన దేశం సైన్యాన్ని మోహరించింది. డోక్లామ్ ఉద్రిక్తతకు ప్రధాన కారణం ఇదే. నేపాల్, శ్రీలంక తదితర దేశాల భూభాగాలను తాకుతూ వెళ్ళేందుకు ఈ ప్రాజెక్టును రూపకల్పన చేశారు. మన దేశానికి సంబంధించి చైనా అనుసరిస్తున్న విధానంలో స్పష్టత లేదన్న విషయం ఇప్పటికి చాలా సార్లు రుజువైంది. ముఖ్యంగా, పాకిస్తాన్‌ని,ఆ దేశంలో ఆశ్రయం పొందుతున్న ఉగ్రవాదులను చైనా బహిరంగంగా సమర్థిస్తోంది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సమావేశాల్లో అనుకూలంగా ఓటు వేసింది. జిన్ పింగ్ వైఖరి వల్లే చైనా ఇలాంటి పోకడలకు పోతోంది. జిన్ పింగ్ మన ప్రధానమంత్రి నరేంద్రమోడీని కలిసినప్పుడు ఎంతో సుహృద్భావ పూర్వకంగా మాట్లాడతారు. ఆయన స్వదేశం వెళ్ళగానే భారత్‌కి వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుంటారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ఐదు ప్రాంతాలను చైనా భూభాగాలని ప్రకటించడం, చైనా మ్యాప్ లో అరుణాచల్‌ని మాయం చేయడం వంటివన్నీ జిన్ పింగ్‌కి తెలియకుండా జరిగాయని ఎవరూ అనుకోరు. భారత్ అమెరికాకు దగ్గరవుతోందన్నది జిన్ పింగ్ అనుమానం. అమెరికాపై కోపాన్ని మన దేశం మీద ప్రదర్శిస్తున్నారన్న విశ్లేషణలు ఇప్పటికే వెలువడ్డాయి. జిన్ పింగ్ సర్వోన్నతుడైతే మన దేశం విషయంలో మరింత దూకుడుగా వ్యవహరించే ప్రమాదం ఉంది. పాకిస్తాన్ ఉగ్రవాద చర్యలను మరింత ఎక్కువగా సమర్థించే అవకాశమూ ఉంది. పార్టీలో, ప్రభుత్వంలోఇప్పటికే తనకు ఎదురు లేకుండా చేసుకున్న జిన్ పింగ్ పోకడలు నియంతృత్వానికి దారితీసే ప్రమాదం ఉంది. హక్కుల ఉద్యమకారులను తొక్కి పట్టి ఉంచడం వల్ల భవిష్యత్‌లో చైనాలో అశాంతి చెలరేగే ప్రమాదం ఉంది. ఏకవ్యక్తి నియంతృత్వంలో చైనా కి జరిగే మేలు కన్నా, కీడు ఎక్కువ. చైనాని అంతర్జాతీయంగా అగ్రగామిగా చేస్తానన్న జిన్‌పింగ్ హామీలు ఆవిరి కావడానికి కొంత కాలం పట్టవచ్చు.

మంచి మాట

బలహీనుడు నిర్ణయం తీసుకోకముందే,
దాని గురించి సందేహిస్తాడు.
బలవంతుడు తీసుకున్నాక సందేహిస్తాడు.

-కార్ల్ క్రాస్

సిరియా! ఎందుకిలా!!

సందర్భం

గత కొద్ది రోజులుగా సిరియాలో పరిస్థితిపై సోషల్ మీడియాలో పోస్టులు భారీ సంఖ్యలో వెల్లువెత్తుతున్నాయి. సిరియాలో కొనసాగుతున్న తాజా పరిణామాలను ప్రపంచం పట్టించుకోవటం లేదంటూ ప్రజలు ఫొటోలు, వీడియోలతో కూడిన పోస్ట్‌లను సోషల్ మీడియాలో షేర్ చేసుకుంటున్నారు. 'రెబల్స్' (ప్రభుత్వం చెబుతున్న ఉగ్రవాదులు) నుండి తూర్పు ఘౌటా నగరాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సిరియా ప్రభుత్వ సేనలు ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో సోషల్ మీడియా దీనిపై తీవ్రంగా స్పందిస్తోంది. సిరియా రాజధాని డెమాస్కస్ నగరానికి 15 కి.మీ దూరంలో వున్న తూర్పు ఘౌటా ప్రాంతం గత కొద్దికాలంగా రెబల్స్ ఆధీనంలో ఉంది. వీరంతా టెర్రరిస్టు గ్రూప్ అల్‌ఖైదా, తదితర గ్రూప్‌లకు అనుబంధంగా గత కొద్దికాలంగా తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. తూర్పు ఘౌటాను రెబల్స్ నుండి స్వాధీనం చేసుకునే ప్రభుత్వ సేనల ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు డెమాస్కస్ నగరంపై రెబల్స్ కాల్పులు, దాడులు ప్రారంభించారు. గత నవంబర్ 16 నుండి కొనసాగుతున్న ఈదాడులు, ప్రతి దాడులలో ఇప్పటి వరకూ 18 మంది చిన్నారులు, 14 మంది మహిళలు సహా మొత్తం 116 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని రెబల్స్ అనుకూల వర్గాలు చెబుతున్నాయి.

ఇప్పుడు ఈ ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సిరియా ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేయటంతో ప్రస్తుతం మనం చూస్తున్న మీడియా ప్రచారం ఊపందుకుంది. ప్రస్తుతం ఫేస్‌బుక్, వాట్సప్ తదితర సోషల్ మీడియా వేదికల్లో షేర్ అవుతున్న ప్రచారానికి మూలం న్యూయార్క్‌టైమ్స్, ది గార్డియన్ వంటి పశ్చిమ దేశాల మీడియా సంస్థలతో పాటు అల్‌జజీరా, అల్‌జజీరా ప్లస్ అల్ అరేబియా వంటి మీడియా సంస్థలు అందిస్తున్న సమాచారమే. సిరియాలో బషర్ అల్ అసద్ సర్కారును గద్దెదించేందుకు గత ఐదేళ్లుగా జరుగుతున్న తిరుగుబాటులో అమెరికా సైన్యం నేరుగా జోక్యం చేసుకుంటోంది. సిరియా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఈ పోరులో కొంతమంది మతఛాందసవాదులు, ఉగ్రవాదులు రెబల్స్‌కు నేతృత్వం వహిస్తున్నారు. ఈ ఉగ్రవాదులకు అమెరికా, దాని నాటో మిత్ర దేశాల మద్దతు కూడా లభిస్తోంది. దీనితో పాటు సౌదీ అరేబియా వంటి నిరంకుశ రాజరిక వ్యవస్థలు సైతం వారిని గట్టిగా సమర్థిస్తున్నాయి.

అమెరికా ఎందుకు సమర్థిస్తోంది?

గత కొన్నేళ్లుగా సిరియా, లిబియాలలో ఏమవుతోందన్న అంశాన్ని గమనించిన వారెవరికైనా 'చమురు సంపద'పై దృష్టే దీనికి కారణమని స్పష్టమౌతుంది. చమురు సంపద పుష్కలంగా వున్న సౌదీ అరేబియా, ఇతర గల్ఫ్ దేశాలు అమెరికా మిత్ర దేశాలుగా కొనసాగుతుండగా సిరియా మాత్రం సర్వ స్వతంత్ర దేశంగా కొనసాగుతోంది. ఈ దేశం అనుసరిస్తున్న విధానాలేవీ అమెరికా కంపెనీలకు ఏ మాత్రం ప్రయోజనకరంగా లేవు. ఇంతకు ముందు చెప్పుకున్నట్టుగా అరబ్ జాతీయవాదానికి ఈ ప్రాంతంలో ఇప్పుడు మిగిలిన ఏకైక ప్రతినిధి సిరియా మాత్రమే. ఈ ప్రాంతంలో సామ్రాజ్యవాద వ్యతిరేక, యూదు వ్యతిరేక వైఖరిని అనుసరిస్తున్న అరబ్ జాతీయవాద, సోషలిస్టు శక్తులతో పోరాడేందుకు అమెరికా దీర్ఘకాలంగా ప్రతీఘాత ఇస్లామిక్ శక్తులను, వాటి ప్రభుత్వాలను సమర్థిస్తోంది. మరోవైపు సిరియా రష్యా, చైనాలతో సన్నిహితంగా మెలుగుతూ వాటితో మైత్రిని కొనసాగిస్తోంది. ఇటీవలి కాలంలో అమెరికా తనకు ముప్పుగా భావిస్తున్న మరో దేశం ఇరాన్‌తో కూడా సాన్నిహిత్యం పెంచుకుంది. చారిత్రకంగా చూసుకుంటే ఇజ్రాయిల్‌ను గట్టిగా వ్యతిరేకిస్తున్న దేశం సిరియా. ఈ రెండు దేశాల మధ్య వున్న సరిహద్దులోని గోలన్ హైట్స్ ప్రాంతం సిరియా భూభాగంలో వుంది. పాలస్తీనా ప్రజలతో సన్నిహిత మైత్రిని కొనసాగిస్తున్న సిరియా పాలస్తీనా ఏర్పాటు విషయంలోనూ అదే నిబద్ధతను కొనసాగిస్తోంది. గత 18 ఏళ్లుగా ఇజ్రాయిల్‌తో పోరాడుతున్న హిజ్బుల్లాతో సిరియాకు సత్సంబంధాలే వున్నాయి. సిరియా ప్రభుత్వం పడిపోతే అరబ్ ప్రాంతంలో ఇజ్రాయిల్‌కు ఎదురు నిలిచే అరబ్ దేశమే వుండదు. అన్నిచోట్లా ఓటమిని ఎదుర్కొంటున్న అరబ్ జాతీయవాద శక్తులకు ఇప్పుడు పట్టున్న ఏకైక ప్రాంతం సిరియా మాత్రమే. అందువల్లే సిరియా ప్రభుత్వ పతనాన్ని అమెరికా కోరుకుంటోంది. అందుకే అక్కడి ప్రభుత్వాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ఈ ప్రాంతంలో ఆర్థికంగా, ఆయుధాలు, సైనిక మద్దతు సమకూర్చి ఇస్లామిస్ట్ ప్రభుత్వాలు



పెంచి పోషిస్తున్న ఉగ్రవాదులను సమర్థించేందుకు కూడా అమెరికా వెనుకాడటం లేదు. ప్రపంచ వ్యాప్తంగా వున్న ఇస్లామిస్ట్ శక్తులలో అధికశాతాన్ని అమెరికా, దాని మిత్ర దేశాలు గట్టిగా సమర్థిస్తున్నాయి. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్లుగా రూపాంతరం చెందిన ముజాహిదీన్‌లను అమెరికా సమర్థిస్తుండటాన్ని ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అమెరికా, దాని మిత్ర దేశాలు ఇరాక్‌లో కొనసాగించిన విధ్వంసం ఫలితమే ఇస్లామిక్ స్టేట్ ఆవిర్భావం.

ఎవరీ 'రెబల్స్'

తిరుగుబాటుకు నేతృత్వం వహిస్తున్న జభాత్ అల్ నస్రా (అల్ నస్రా ఫ్రంట్), ఇతర గ్రూపుల విలీనం అనంతరం జభాత్ ఫతే అల్ షామ్ అని, తరువాత తహ్రీర్ అల్ షామ్ అని పేర్లు మార్చుకుంది. వాస్తవానికి ఇది అల్‌ఖైదాకు చెందిన సిరియా విభాగం అని చెప్పవచ్చు. ఈ రెబల్ గ్రూపుల్లో వున్న వారంతా అమానుష హత్యలకు సైతం వెనుదీయని కరుడు గట్టిన ఉగ్రవాదులే. వీరిలో మరికొంతమందున్నారు.

ఇందులో సౌదీ అరేబియాకు చెందిన జయేష్ అల్ ఇస్లామ్ (దీనికి సౌదీ, కువైట్‌కు చెందిన వహబిస్టులు ఆర్థిక అండదండలు సమకూరుస్తున్నారు), టర్కీకి చెందిన అహ్రార్ అల్ షామ్ అనే ప్రచ్ఛన్న సైనిక ముఠాలు ప్రధానమైనవి. వీరితో పాటు హర్కత్ నూర్ అల్ దీన్ అల్ జెంకీ మరో ఉగ్రవాద సంస్థ కూడా క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. గూఢచర్యం చేస్తున్నాడన్న అనుమానంతో పాలస్తీనాకు చెందిన12 ఏళ్ల బాలుడి తల నరికిన ఈ ఉగ్రవాదులు ఆ వీడియోను ఆన్‌లైన్‌లో కూడా ప్రసారం చేశారు. ఇరాక్ మినహా పర్షియన్ గల్ఫ్‌లోని ఇతర అరబ్ దేశాలన్నీ రాజకుటుంబాల పాలనలోనే కొనసాగుతున్నాయి. వీటికి సౌదీ అరేబియా నాయకత్వం వహిస్తోంది. ప్రపంచంలో వివిధ దేశాలలో కొనసాగుతున్న మత ఛాందసవాద, ఉగ్రవాద కార్యకలాపాలకు ఇక్కడి నుండే ఆర్థిక సాయమందుతోందన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లౌకిక విధానాన్ని అనుసరిస్తున్న సిరియా వీరికి సమస్యగా మారింది. పూర్తి స్థాయి రిపబ్లిక్ అయిన సిరియా చెబుతున్న అరబ్ జాతీయ వాదాన్ని ఈ ప్రాంతంలోని రాజకుటుంబాలు తమకు ముప్పుగా పరిగణిస్తున్నాయి. వీరితో పాటు ఈ ప్రాంతంలో మరో శక్తిగా ఎదుగుతున్న టర్కీలోని ఇస్లామిస్ట్ ప్రభుత్వం కూడా సిరియా ప్రభుత్వాన్ని గద్దె దించేందుకే ప్రయత్నిస్తోంది.

సేవ్ ఘౌటా?

ప్రస్తుతం తూర్పు ఘౌటా ప్రాంతాన్ని జయేష్ అల్ ఇస్లామ్, అల్‌నస్రా ఫ్రంట్, దాని మిత్ర పక్షం ఫేలాక్ అల్ రెహ్మాన్ గ్రూపు అనే మూడు సంస్థలు నియంత్రిస్తున్నాయి. 2015లో తెరపైకి వచ్చిన జయేష్ అల్ ఇస్లామ్ గ్రూప్ బాంబుదాడుల నుండి తమను తాము రక్షించుకునేందుకు మహిళలతో సహా సామాన్య పౌరులను రక్షణ కవచాలుగా వాడుకుంది. ఇటువంటి టెర్రరిస్టుల చెర నుండి ఘౌటాను విముక్తి చేయటాన్ని వ్యతిరేకిస్తూ గతంలో 'సేవల్ అలెప్పో' తరహాలోనే సేవ్ ఘౌటా ప్రచారం ప్రారంభమైంది. అల్‌ఖైదా, ఐఎస్‌ఐఎస్ వంటి ఉగ్రవాద సంస్థల చెరలో వున్న తమ భూభాగాన్ని రష్యా సాయంతో విడిపించుకునేందుకు సిరియా సైనికదళాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రారంభమైన సేవ్‌ఘౌటా ప్రచారం అక్కడి ప్రజలను రక్షించేందుకు కాక, సిరియాను ఆక్రమించుకునేందుకు ఉగ్రవాదులతో చేతులు కలిపిన అమెరికన్ సామ్రాజ్యవాద శక్తులు ప్రయత్నాలకు అంతర్జాతీయ కూడగట్టటమే లక్ష్యంగా కన్పిస్తోంది. సిరియా నుండి తమ సైన్యాలను ఉపసంహరించుకునేందుకు అమెరికా, దాని మిత్రపక్షా లపై అంతర్జాతీయంగా వత్తిడి పెరగాల్సిన అవసరం వుంది. తూర్పు ఘౌటా లేదా సిరియాలోని మరే ఇతర ప్రాంతాన్నయినా ఆక్రమించుకున్న ఉగ్రవా దులు ప్రభుత్వానికి లొంగకపోతే వారి మెడలు వంచేందుకు అంతర్జాతీయ మద్దతును సమీక రించే హక్కు సిరియా ప్రభుత్వానికి వుంది. అయితే ఈ ప్రయత్నంలో పౌరులకు వీలయినంత కనిష్టస్థాయిలో నష్టం జరిగే విధంగా చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలి. అంతిమంగా ఐఎస్ ఐఎస్, అల్‌ఖైదా వంటి ఉగ్రవాద సంస్థలతో శాంతి చర్చలకు తావులేదన్న విషయాన్ని పై అంశాలన్నీ స్పష్టం చేస్తున్నాయి. ఈ శక్తులను ఓడించాల్సిందేనన్న విషయంలో సంశయానికి ఏ మాత్రం తావులేదన్నదిసుస్పష్టం.



వాసుదేవ రావు,
గల్ఫ్ జర్నలిస్ట్, బ్రహెయిన్

హోం గార్డుల నిరీక్షణ ఫలించేనా!

పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న హోం గార్డులు తమ జీతాలు పెరిగే సమయం వచ్చేసిందని ఆశగా ఎదురు చూస్తున్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రం తెలంగాణ కూడా దేశ అత్యున్నత న్యాయ స్థానం ఆదేశాలను అమలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వానికి కూడా తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. పోలీసులతో సమానంగా బందోబస్తులో పాల్గొంటున్నా వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సదుపాయాలు లేవు. ఉద్యోగ భద్రతలేదు ఆరోగ్యబీమా లేదు. కనీస వేతనాలు అందడంలేదు. వారికి పని చేస్తారన్న గుర్తింపు మాత్రం ఉంది. ఆ గుర్తింపుతోనే తమకు మంచి జరుగుతుందని భావిస్తున్నారు. పోలీసులకు సహాయపడేందుకు 1993లో హోం గార్డ్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి వీరు కూడా పోలీసులతో సమానంగా ఎండనక, వాననక రోడ్లపై బందోబస్తు, కార్యాలయాల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, రాత్రి వేళల్లో గస్తీ వంటి అన్ని పనులను చేస్తూనే ఉన్నారు. ఎస్పీ, డీఎస్పీ, సర్కిల్ పోలీస్ కార్యాలయాల్లో సేవలందిస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొంటారు. విధుల నిర్వహణలో పోలీసుల పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉంటుంది. వారికి జీతం, ఇతర అలవెన్సులు, సౌకర్యాలు ఉంటాయి. హోం గార్డులకు ఏ రకమైన అలవెన్సులు, సౌకర్యాలు లేవు. బందోబస్తు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినా బస్ ఛార్జీలు కూడా ఇవ్వరు.

దేశంలో హోంగార్డుల పరిస్థితిని తెలుసుకున్న సుప్రీం కోర్టు 2015 మార్చి 11న, ఆ తరువాత 2016 మేలో ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం జీతం బేసిక్ రూ.16,400, డియర్ నెస్ అలవెన్స్(డీఏ) రూ.2950, ఇంటి అద్దె అలవెన్స్(హెచ్ఆర్ఏ) రూ.2000, వాషింగ్ అలవెన్స్ రూ.100 మొత్తం 21,450 చెల్లించాలని ఆదేశించింది. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల ప్రకారం హోం గార్డులకు జీతాలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ హోంగార్డ్ డీజీ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు గత ఏడాది లేఖలు రాశారు. కొన్ని రాష్ట్రాలలో వేతనాలు పెంచారు. పోలీసులకు మాదిరిగా ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం హోం గార్డులకు జీతాలు పెంచాలని గత ఏడాది నవంబర్‌లో ఒడిషాలో హోం గార్డ్ కమాండెంట్ జనరల్ ప్రభుత్వానికి లేఖ రాశారు. హోం గార్డులకు డెయిలీ డ్యూటీ అలవెన్స్ రూ.675 గా నెలకు జీతం 20,250కి పెంచుతూ జనవరి 31న తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి సంవత్సరం వెయ్యి రూపాయల జీతం పెంపు, ట్రాఫిక్ విధులు నిర్వహించేవారికి కాలుష్య ప్రమాద అలవెన్స్ కింద పోలీస్ కానిస్టేబుల్స్ కు ఇచ్చే మాదిరిగా 30 గౌరవవేతనం ఇస్తారు. మహిళా హోం గార్డులకు మహిళా పోలీసులకు మాదిరిగా ఇద్దరు పిల్లల వరకు ఆరు నెలల ప్రసూతి సెలవులు, పురుష హోం గార్డులకు పోలీసులకు మాదిరిగా 15 రోజులు పిత త్వపు సెలవులు ఇస్తారు. అంతేకాకుండా హోంగార్డులకు రెండు పడక గదుల ఇళ్లు నిర్మాణం, ఆరోగ్యబీమా సదుపాయం కల్పిస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏపీలో దాదాపు 15,363 మంది హోం గార్డులు ఉన్నారు. వారిలో 12,163 మంది శాంతిభద్రతల విభాగంలో, 3,200 మంది విజిలెన్స్, అగ్నిమాపక విభాగం, ఆర్టీసీ, పురావస్తు, దేవాలయాలు తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి వీరు అరకొర కూలీతోనే పనిచేస్తూ అనేక ఇబ్బందులు పడుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. 2013 డిసెంబర్ వరకు వీరికి రోజుకు రూ.200 ఇచ్చేవారు. 2014 జనవరి నుంచి దానిని రూ.300కు పెంచారు. 2016 ఏప్రిల్ 1 నుంచి రూ.400లకు పెంచారు. వాషింగ్ అలవెన్స్ ని రూ.1000 నుంచి రూ.1500లకు పెంచారు. ప్రస్తుతం నెలకు రూ.12 వేలతో విధులు నిర్వహిస్తున్నారు. ఆరోగ్యం బాగోక గానీ, అత్యవసర పని ఉండి ఒక్క రోజు రాకపోయినా జీతం కట్ చేస్తారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం వేతనం, పోలీసులుగా గుర్తింపు, ఉద్యోగ భద్రత, కుటుంబం మొత్తానికి ఆరోగ్యబీమా, పోలీస్ కానిస్టేబుల్ తో సమానంగా యూనిఫాం అలవెన్స్, బందోబస్తు సమయంలో వేతనంతోపాటు కరువుభత్యం, టీఏ, డీఏ, మరణానంతరం అంత్యక్రియల ఖర్చు రూ.15 వేలు, పోలీస్ కానిస్టేబుల్ ఎంపికలో హోం గార్డులకు 25 శాతం రిజర్వేషన్, వేతనంతో కూడిన సెలవులు, మహిళా హోం గార్డులకు ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరిగా ప్రసూతి సెలవులు, పిల్లల చదువులకు ఫీజు మాఫీ, పక్కా గృహాలు, పదవీ విరమణ చేసిన హోం గార్డుకు రూ.5 లక్షలు, చనిపోయిన హోంగార్డు కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తింపు, 5 ఏళ్లు సర్వీస్ పూర్తి చేసిన హోం గార్డుని కానిస్టేబుల్ శిక్షణకు పంపడం వంటివి వారు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో దేశంలోని పలు ఇతర రాష్ట్రాలతోపాటు తెలంగాణలో కూడా హోంగార్డుల వేతనం పెంచడంతో ఏపీ ప్రభుత్వం కూడా ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. హోంగార్డుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని గతంలో కూడా వారి జీతాల పెంపు అంశం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులతో చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం జీఓ జారీ చేయడంతో ఇక్కడి హోం గార్డులు తమకు సానుకూలంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. వారి ఆశలు ఫలించాలని ఆశిద్దాం.

-శిరందాసు నాగార్జున,
సీనియర్ జర్నలిస్ట్- 9440222914

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలి

ఉమ్మడి రాష్ట్రం నుండి విడిపోయిన తరువాత రాయలసీమ పరిస్థితి అగమ్యగోచరంగా తయారయింది. మద్రాస్ నుండి రాయలసీమ విడిపోయి కోస్తాతో కలిసి విశాలాంధ్రగా ఏర్పడినపుడు శ్రీబాగ్ ఒడంబడికపేరుతో కుదిరిన ఒప్పందం ప్రకారం రాయలసీమకు కృష్ణా జలాలు, ఇతర రంగాలు దక్కకుండా పోయాయి. సీమలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే కృష్ణా పెన్నార్ ప్రాజెక్టు కూడా కోస్తా నాయకుల కుట్రలకు బలైపోయిందన్న విషయాన్ని ఓ కరపత్రంలో పేర్కొన్నారు. సంవత్సరానికి మూడు పంటలు పండించుకొనేలా కోస్తా వారికి అన్నిరకాలుగా నీటి ప్రాజెక్టులను నిర్మిస్తున్నారు. మాకు ఒక పంటకైనా నీరివ్వండి బాబు అని మనం మన పాలకులను ప్రాధేయపడుతున్నా చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లు ఉంది. నీరు ఎక్కడ అందుబాటులో ఉంటుందో అక్కడ నాగరికత పెరిగి అభివృద్ధి జరుగుతుందనేది చరిత్ర. రాయలసీమకు న్యాయంగా దక్కాల్సిన కృష్ణా జలాలు, దక్కకపోవడంతో సీమ ఎడారిగా మారే పరిస్థితి వస్తోంది. ఉమ్మడి రాష్ట్రం నుండి మనం విడిపోయిన తరువాత కూడా గతంలో మాదిరిగా అన్యాయం జరుగుతోంది. రాజధాని రాయలసీమలో ఏర్పాటు చేయకపోగా హైకోర్టును కూడా అమరావతిలోనే ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. కోస్తాలోని అమరావతిలోనే అన్ని వ్యవస్థలను కేంద్రీకృతం చేస్తున్న విషయం రాయలసీమ ముద్దుబిడ్డలకు, నాయకులకు బాగా తెలుసు.

రాయలసీమలోని ఎర్రచందనం ద్వారా వచ్చే ఆదాయంతో సహా మనం చెల్లించే అన్నిరకాల పన్నుల సొమ్ము ఇతర దేశాల నుండి తెచ్చే అప్పుతో కలిపి అమరావతిలోనే కుమ్మరిస్తున్నారు. సీమ ప్రజలు కోస్తాతో పోటీపడలేరన్నది సత్యం. అన్నిరకాల ఆదాయాన్ని ఉద్యోగాలను సమకూర్చే రంగాన్ని అమరావతిలో స్థిరపడిన తరువాత రాయలసీమ నుండి తాము వేరుపడతామని కోస్తావారు అంటే అప్పుడు సీమ ప్రజలు కట్టుబట్టలతో రోడ్డుమీద నిలబడాల్సిన పరిస్థితి వస్తుందని సీమ ప్రజల గుండెల్లో దడ పుట్టింది. ఇలాంటి పరిస్థితి ముందు ఊహించిన శివరామకృష్ణన్ కమిటీ కూడా అన్ని ఒకేచోట వద్దు అని స్పష్టంగా తన నివేదికలో చెప్పింది. మొదటి నుండి కూడా సీమ నుండే ముఖ్యమంత్రులు అవుతున్నా వారి పదవుల భద్రతకోసం సీమకు జరిగే అన్యాయం గురించి ఎవరూ నోరు మెదపలేదు ఇది కడు శోచనీయం. ఈ పరిస్థితిలో రాజధాని ఎలాగు అమరావతిలో ఖాయం అయిపోయింది. రాజధాని తరువాత రెండవ ప్రాధాన్యత ఉన్న హైకోర్టు నైనా రాయలసీమలో ఏర్పాటు చేయాలని అది మానవ హక్కుగా డిమాండ్ చేయాలి. ఆర్థికంగా చితికిపోయి నిత్యం కరవుతో అల్లాడుతున్న

సీమ ప్రజలకు సుదూర ప్రాంతమైన అమరావతికెళ్ళి తమ కేసులను నడుపుకోవడం చాలా కష్టం. తరతరాలుగా అన్ని రంగాలలో వివక్షకు గురవుతున్న సీమ ప్రజలకు హైకోర్టు అందుబాటులో ఉండటం చాలా అవసరమని అందరూ తెలుసుకోవాలి. హైకోర్టు ఏర్పాటు ఉంది. న్యాయవాదులకు సంబంధించిందిగా భావించకూడదు. ఇది ప్రజల సమస్య కావునా ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, న్యాయవాదులు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, కుల సంఘాలు, కళా సంఘాలు, రాజకీయ పార్టీలు ఏకమై రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు కోసం ఐక్య ఉద్యమాన్ని చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

-ఎస్.అభినయ్, 7036970116

ప్రజల డిపాజిట్లపైనే కన్ను



సురవరం సుధాకర రెడ్డి
భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి

లక్ష రూపాయల లోపు రుణాలు తీసుకున్న వారిలో చెల్లించలేకపోయినవారు 7 శాతం ఉండగా, కోట్ల రూపాయల అప్పులు తీసుకొని ఎగగొట్టిన వారు 93శాతం ఉన్నారు. ఇప్పుడు వారి ప్రతినిధులే బ్యాంకుల ప్రైవేటీకరణ డిమాండ్ చేయటం విచిత్రం. ఈ బ్యాంకుల కుంభకోణాలన్నీ డిపాజిటర్ల, పన్ను చెల్లింపుదారుల ప్రయోజనాలను పణంగా పెట్టినవే. ఈ ఆర్థిక నేరాలన్నీ బ్యాంకుల అత్యున్నత అధికారులు రుణాల ఎగవేతదారులతో చేతులు కలుపడంవల్ల జరిగినవే

నోట్ల రద్దు కుంభకోణాన్ని భారత ప్రజలు ఇంకా మరచిపోలేదు. ప్రజల జ్ఞాపకశక్తిని తక్కువ అంచనా వేయడానికి వీలులేదు. బీజేపీ నాయకులు మాత్రం ఆ చర్యను నల్లధనంపై ఆకస్మిక దాడిగా అభివర్ణించారు. ఈ వ్యవహారాన్ని చాలా రహస్యంగా ఉంచినట్లు, మంత్రులకు సైతం తెలియదన్నట్లు ఒక విధమైన అభిప్రాయాన్ని కలిగించారు. సామాన్య ప్రజలు నోట్లు మార్చుకోవడానికి చేంతాడు లాంటి క్యూలలో నిలబడాల్సి వచ్చింది. అనేకమంది క్యూలలోనే కన్నుమూశారు.

కొంతమంది బ్యాంకుల ఖాతాదారులు ఏటీయంల ద్వారా గాని, చెక్కుల ద్వారా గాని తాము దాచుకున్న ధనాన్ని పొందలేకపోతున్నారు. దీని ప్రభావం ఇంకా సగటు జీవిని పీడిస్తూనే ఉన్నది. మొన్న హర్షద్ మెహతా, మద్యం చక్రవర్తి విజయ్ మాల్యా కేవలం ఒకే ఒక్క భారతీయ స్టేట్ బ్యాంక్‌కు రూ. 7,000 కోట్లు ఎగగొడితే, ఈరోజు పంజాబ్ నేషనల్ బ్యాక్ నుంచి నీరవ్ మోదీ, గణం రూ. 14,000 కోట్లు ఎగగొట్టారు. బ్యాంకులో అవకతవకలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి.

కార్పొరేట్ దిగ్గజాలు, ప్రభుత్వం, ఆర్థిక శాఖ ఈ కుంభకోణాలకు సామాన్య గుమాస్తాలను (చిరుద్యోగులను) బాధ్యులను చేయాలని చూస్తున్నారు. పరిశ్రమాధిపతుల సంఘం సైతం కుంభకోణాల ఆరోపణలను గుమాస్తాల మీదకు గురిపెడుతున్నారు. రిజర్వ్ బ్యాంక్ ప్రతి బ్యాంక్ నిర్వహణ, నిర్వాకాలను తనిఖీ చేయాలి. ఇన్ని సంవత్సరాలుగా ఈ తనిఖీ చేయలేదనేది స్పష్టంగా తెలుస్తూనే ఉంది. అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం, అధికారుల సంఘాలు ఒక పుస్తకాన్ని ప్రచురించాయి. ఎంతమంది కార్పొరేట్ దిగ్గజాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు ఏ బ్యాంకు నుండి ఎన్ని కోట్ల రూపాయలు రుణాలుగా తీసుకొన్నారు? వారు ఎన్ని సంవత్సరాల నుండి ఎంత చెల్లించాల్సి ఉంది వంటి వివరాలు అందులో వెల్లడించారు.

ఈ పాత బాకీలు దాదాపు రూ. 15 లక్షల కోట్లకు చేరుకొన్నాయి. వీటన్నిటినీ నిరర్థక ఆస్తులుగా ప్రకటించే అవకాశముంది. కార్పొరేట్ దిగ్గజాలు ఏటా 6లక్షల కోట్ల రూపాయల రాయితీలు పొందుతున్నాయి.

ఈ కార్పొరేట్ సంస్థలే కుంభకోణాలకు చిరుద్యోగులను బాధ్యులుగా చిత్రీకరిస్తూ, ఈ సమస్యకు ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణే శరణ్యమని వాదిస్తున్నారు. రుణాల ఎగవేతదారుల పట్ల కఠినవైఖరి అవలంబించని వారంతా ఈనాడు ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరణ చేయాలని గగ్గోలు పెడుతున్నారు. బ్యాంకులకు రుణాల ఎగవేతదారుల పట్ల సౌమ్యంగా వ్యవహరించే అధికారులే ఈనాడు బ్యాంకులకు నష్టాలు తేవడానికి బాధ్యులు.

దిగ్భ్రాంతి కలిగించే విషయమేమిటంటే ఒక్క బ్యాంకుకే రూ. 7,000 కోట్లు ఎగవేసిన మద్యం వ్యాపారి విజయ్ మాల్యాకు బీజేపీ రాజ్యసభ సీటు కేటాయించడం. నీరవ్ మోదీ అయితే, 'మీకు చేతనైంది చేసుకోండి' అని ప్రభుత్వానికి సవాలు విసరడం మరొక ఆశ్చర్యకరమైన విషయం.

2016 లోనే బెంగళూరుకు చెందిన హరిప్రసాద్ అనే వ్యక్తి నీరవ్ మోదీ బ్యాంకులకు రుణాలు ఎగగొట్టాడని, అతన్ని అరెస్టు చేయాలని, పాస్‌పోర్ట్ రద్దు చేయాలని ప్రధానమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేసినా ఫలి తం లేకపోయింది. నీరవ్ ఈ జనవరిలోనే దేశం వదిలి పారిపోవడంతోపాటు, అదే నెల 23-26 తేదీలలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశంలో నరేంద్ర మోదీతో గ్రూపు ఫొటోకు పోజు ఇవ్వడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతల నుండి తప్పుకోవడానికి చిరుద్యోగులే ఈ కుంభకోణానికి కారణమని, అందుకే ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలని గోలపెడుతోంది. అదే నిజమైతే బ్యాంకుల జాతీయీకరణకంటే ముందు 200 ప్రైవేటు బ్యాంకులు ఎందుకు మూతపడ్డాయి? అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్ గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్‌తో సహా అనేక కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులు మూత పడ్డాయి. అమెరికాలోసైతం, లేమాన్ బ్రదర్స్, మెర్రిల్ లించ్, ఏఐడి, ఫ్రెడ్డి, మాక్ ఫాన్నీమాక్, హెచ్‌బీఓఎస్, రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్‌లాండ్ మూత పడ్డాయి.

ఇవన్నీ ప్రైవేట్ బ్యాంకులే. అందువల్ల అమెరికా బ్యాంకింగ్ వ్యవస్థ కుదుటపడటానికి ఫెడరల్ గవర్నమెంట్ 236 బిలియన్ల (1 బిలియన్=100 కోట్లు) డాలర్లను వెచ్చించింది. ఈ అర్ధ శతాబ్ద కాలంలో ప్రభుత్వరంగ బ్యాంకులు అత్యద్భుతంగా అభివృద్ధి చెందాయి. దేశంలోని మారుమూల గ్రామాలకు సైతం శాఖలు విస్తరించాయి. ఈ బ్యాంకులు సన్నకారు రైతాంగానికి, చిరువ్యాపారులకు రుణాలిచ్చి ఆదుకుంటే కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వం ఉమ్మడిగా వీటిపై దుమ్మెత్తి పోస్తున్నాయి. పబ్లిక్ రంగ బ్యాంకులు, రాజకీయ జోక్యంతో, రుణమేళాలు పెట్టి బ్యాంకులను దివాలా తీయించారని ఆరోపిస్తున్నారు.

లక్ష రూపాయల లోపు రుణాలు తీసుకున్న వారిలో చెల్లించలేకపోయినవారు 7శాతం ఉండగా, కోట్ల రూపాయల అప్పులు తీసుకొని ఎగగొట్టిన వారు 93శాతం ఉన్నారు. ఇప్పుడు వారి ప్రతినిధులే బ్యాంకుల ప్రైవేటీకరణ డిమాండ్ చేయటం విచిత్రం. ఈ బ్యాంకుల కుంభకోణాలన్నీ డిపాజిటర్ల, పన్ను చెల్లింపుదారుల ప్రయోజనాలను పణంగా పెట్టి జరుగుతున్నవే. ఈ ఆర్థిక నేరాలన్నీ బ్యాంకుల అత్యున్నత అధికారులు రుణాల ఎగవేతదారులతో చేతులు కలుపడంవల్ల జరిగినవే. ప్రభుత్వరంగ బ్యాంకులలో అప్పులు తీసుకునే వారికి 90 రోజుల గడువుతోనే అవగాహనా పత్రాలను అందజేస్తారు. బ్యాంక్ నియమావళికి విరుద్ధంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ యాజ మాన్యం 365 రోజులకు ఈ అవగాహనా పత్రాన్ని అందజేసింది. ఈ బ్యాంకులో ఈ తతంగం అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్నది. నిర్ధారిత కాలంలో అప్పుతీసుకొన్న వ్యక్తి డబ్బు చెల్లించకపోతే విదేశాలలోని బ్యాంక్ శాఖలు తిరిగి అప్పు ఇచ్చి ఉండాల్సిందికాదు. రుణం తీసుకొన్న వారి ఆస్తుల విలువ మొత్తం రుణం మొత్తం కంటే ఎక్కువ ఉందా లేదా అనేది సాధారణమైన పరిజ్ఞానంతో అంచనా కడతారు. దానివల్ల బ్యాంకుకు ఏమైనా నష్టం వస్తుందా అనే అంశంపై అంచనా వేస్తారు. ఆస్తుల రహస్యమేమిటంటే బ్యాంక్‌లో జరిగే ఆర్థిక నేరాన్ని అరికడితే మేనేజర్‌కు వచ్చే ప్రోత్సాహకాలు లేవు. కాబట్టి మేనేజర్ అప్పు తీసుకొన్నవారితో చేతులు కలిపితే అతనికి ముడుపులు ముట్టడం ఖాయం.

ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం ఫైనాన్షియల్ రిజల్యూషన్ డిపాజిట్ ఇన్సూరెన్స్ బిల్లును ముందుకు తీసుకొస్తోంది. ఇదొక మోసపూరిత నల్లచట్టం. పార్లమెంట్‌లో చెవులు, కళ్లు మూసుకొని మందబలంతో ఒకసారి ఈ బిల్లును ఆమోదిస్తే పట్టపగలు డిపాజిటర్ల సొమ్మును ప్రభుత్వం లాగేసుకొని డిపాజిటర్లను వీధిన పడేస్తుంది. డిపాజిటర్ల సొమ్ము నుండి కార్పొరేట్లకు రుణాలను అందజేస్తే వీరు విదేశాలకు వెళ్లి తందనాలాడుతుంటే తద్వారా బ్యాంక్‌లకు నష్టం వాటిల్లితే, ఆ బ్యాంక్ డిపాజిటర్ల సొమ్ముతో, పన్ను చెల్లింపుదార్ల సొమ్ముతో ఆదుకోవడం ఈ బిల్లు లక్ష్యం. వీటినే 'బేల్ ఇన్' అని అంటారు. ఇలాంటి బ్యాంకులను ప్రభుత్వ ఖజానా నుండి గాని డిపాజిటర్ల సొమ్ము నుండి గాని ఆదుకోవడానికి ఈ బిల్లు అధికారాన్ని ఇస్తుంది. ప్రభుత్వమే చెల్లిస్తే 'బేల్ అవుట్' అంటారు. ఈ వార్త బయటికి పొక్కగానే బ్యాంకుల నుండి డిపాజిట్లు ఉపసంహరించుకోవటం చకచకా జరిగిపోయింది. ఈ ప్రక్రియ జరుగుతూనే ఉంది. ఏటీఎం ద్వారా డబ్బులు తీసుకొనే యంత్రాలలో డబ్బులు లేని పరిస్థితి దాపురించింది. ఈ ఆర్థిక సంక్షోభానికి ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ కానీ, ఫైనాన్షియల్ బిల్లు కానీ జవాబు కానేరదు.

ఇలాంటి రుణ ఎగవేతదారుల పాస్‌పోర్టులను రద్దు చేయడం, వాళ్ల ఆస్తులను జప్తు చేయడం జరగాల్సిందే. రుణ ఎగవేతదారులందరిని వెంటనే అరెస్టు చేయాలి. వారిని జైళ్లకు పంపి కఠినంగా శిక్షించాలి. విదేశాలకు పారిపోయిన వీరిని వెంటనే ఇంటర్‌పోల్ సహకారంతో వెనక్కి రప్పించాలి. వారికి సహకరించిన బ్యాంకు ఉన్నతాధికారులను, బాధ్యతలను విస్మరించిన వారందరిని కఠినంగా శిక్షించాల్సిందే. ప్రభుత్వరంగ బ్యాంకులను పరిరక్షించాలి. ప్రైవేటీకరణ డిమాండ్‌ను నిరాకరించాలి.

శ్రీయుత పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు, ఏలూరు వారి ఉత్తర్వులు

రి.క.నెం. 1023310/2017 తేది : 10-03-2018

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

ఫారం నెం.VII

(2013వ సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ 25, సబ్ రూల్ (1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూల్‌లో నిర్దిష్టపరచిన భూములకు మరియు వాటి విస్తీర్ణంలను ప్రజా ప్రయోజనమునకై అనగా కోటిపల్లి- నరసాపురం మధ్య ఏర్పాటు చేయదలిచిన క్రొత్త బ్రాడ్ గేజ్ రైల్వే లైన్ నిర్మాణంకు సంబంధించి యలమంచిలి మండలము, కలగంపూడి గ్రామములోని రి.స.నెం. 15,16,17,18,19,23,44,45,46,47,48,49,59,64,65,70,71,77 మరియు 78 లలో య.36.13 సెంట్లు భూమి కావలయునని శ్రీయుత జిల్లా కలెక్టర్, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు వారు భావించినందున, 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంను అనుసరించి సంబంధిత వ్యక్తుల నుండి అభ్యంతరములు కోరగా, వచ్చిన అభ్యంతరములు సెక్షన్ 15, చట్టం 30/2013 ననుసరించి విచారణ జరపడమైనది. దరిమిలా శ్రీయుత జిల్లా కలెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు వారు ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనముల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు. అందుపై ఈ క్రింద రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగము అనుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

శ్రీయుత జిల్లా కలెక్టర్ పశ్చిమగోదావరి, ఏలూరు వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1)వ విభాగమును అనుసరించి ఈ దిగువన ఉదహరించిన షెడ్యూల్ దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణములను ప్రజా ప్రయోజనమునకై కోటిపల్లి - నరసాపురం మధ్య ఏర్పాటు చేయదలిచిన క్రొత్త బ్రాడ్ గేజ్ రైల్వే లైన్ నిర్మాణంకు అవసరమైనదని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూల్

మండలం : యలమంచిలి — గ్రామము : కలగంపూడి

వ. సం.	సర్వే నెం.	వర్గీకరణ	మొత్తం విస్తీర్ణం (య. సెం.)	భూసేకరణ నిమిత్తం తీసుకున్న భూమి సుమారు విస్తీర్ణం (య. సెం.)	ప్రస్తుత అనుభవదారు	సరిహద్దులు: ఉత్తరం	తూర్పు	దక్షిణం	పడమర	చెట్లు, కట్టడములు వగైరాల వివరములు: కట్టడములు	చెట్లు
1	15-10B	G.W	0.71	0.10	శ్రీ భూపతిరాజు శ్రీనివాసరాజు తండ్రి/- రామరాజు	15-10A	17-1	గొంది గ్రామం	గొంది గ్రామం	పాక 1	6 కొబ్బరి చెట్లు
2	15-10C	G.W	0.71	0.11	శ్రీ భూపతిరాజు శ్రీనివాసరాజు తండ్రి/- రామరాజు	15-10A	17-1	గొంది గ్రామం	గొంది గ్రామం		
3	16-3D2	G.W	0.90	0.06	శ్రీ భూపతిరాజు పెద సూర్యనారాయణరాజు తండ్రి/- బంగార్రాజు	16-3D1	16-3E2	17-2	16-3D1		
4	16-3E2	G.W	0.84	0.26	శ్రీ భూపతిరాజు పెద సూర్యనారాయణరాజు తండ్రి/- బంగార్రాజు	16-3E1	18-2B	17-2	16-3D1		
5	16-3E2	G.W	0.84	0.12	శ్రీ జీను దుర్గా ప్రసాద్ అంజనేయ కుమార్ తండ్రి/- వెంకటసత్యనారాయణ	16-3E1	18-2B	17-2	16-3D1		
6	17-1	G.W	1.68	1.68	శ్రీ పొత్తూరి రామకృష్ణంరాజు తండ్రి/- వెంకట సుబ్బరాజు	17-1A	17-2	గొంది గ్రామం	15-10B,10C	చిన్న పాక-1	4 కొబ్బరి చెట్లు
7	17-2	G.W	1.58	1.58	శ్రీ రుద్రరాజు శ్రీహరి రాజు తండ్రి/- వెంకట నరసింహరాజు	16-3D2,3E2	17-3	గొంది గ్రామం	17-1	పెద్దు-1, బోరు-1	47 కొబ్బరి చెట్లు 2 నిమ్మ
8	17-3	G.W	1.45	1.45	శ్రీమతి పొత్తూరి వరలక్ష్మి భర్త/- అచ్యుత రామరాజు	18-2B,8B,9B	17-4	గొంది గ్రామం	17-2	పాక-1, బోరు-1	28 కొబ్బరి చెట్లు, 5 చిన్న కొబ్బరి చెట్లు, 5 వేప, 13 తాడిచెట్లు, 1 చింత, 8 కల్లు గీత ఈత చెట్లు
9	18-2B	G.W	1.13	0.38	శ్రీ జీను దుర్గా ప్రసాద్ అంజనేయ కుమార్ తండ్రి/- వెంకటసత్యనారాయణ	18-2A	18-8B	17-3	16-3E2	చిన్న పాక 1	1 వేప
10	18-2B	G.W	1.13	0.01	శ్రీ జీను గేగుల శివ నాగేంద్ర తండ్రి/- వెంకటసత్యనారాయణ	18-2A	18-8B	17-3	16-3E2		
11	18-8B	G.W	0.96	0.52	శ్రీ తోటకూర భాస్కరరాజు తండ్రి/- సత్యనారాయణరాజు	18-8A	18-9B	17-3	18-2B		1 వేప
12	18-9B	G.W	0.41	0.18	శ్రీ తోటకూర భాస్కరరాజు తండ్రి/- సత్యనారాయణరాజు	18-9A	19-11	17-3	18-8B		9 కొబ్బరి చెట్లు 6 తాడిచెట్లు
13	19-2B	G.W	1.04	0.21	శ్రీ పొత్తూరి వెంకట సుబ్బరాజు తండ్రి/- అప్పలరాజు	19-2A	19-3B	ఏనుగువాని లంక గ్రామం	19-11		30 కొబ్బరి చెట్లు తాడి చెట్లు1 2మామిడి
14	19-2B	G.W	1.04	0.50	శ్రీ పొత్తూరి సీతారామరాజు తండ్రి/- అప్పలరాజు	19-2A	19-3B	ఏనుగువాని లంక గ్రామం	19-11		87కొబ్బరి చెట్లు నిద్ర గన్నేరు 1 2 చింత 2 కుంకుడు 1 దూది తాడి చెట్లు 7
15	19-2B	G.W	1.04	0.02	శ్రీ పొత్తూరి రామలింగరాజు తండ్రి/- చంద్రరాజు	19-2A	19-3B	ఏనుగువాని లంక గ్రామం	19-11		8 కొబ్బరి చెట్లు 1 తాడిచెట్లు
16	19-2B	G.W	1.04	0.02	శ్రీ పొత్తూరి బంగార్రాజు తండ్రి/- రామరాజు	19-2A	19-3B	ఏనుగువాని లంక గ్రామం	19-11		9 కొబ్బరి చెట్లు
17	19-3B	G.W	1.16	0.91	శ్రీ పొత్తూరి రామకృష్ణంరాజు తండ్రి/- వెంకట సుబ్బరాజు	19-3A	19-4A2	ఏనుగువాని లంక గ్రామం	19-2B		67 కొబ్బరి చెట్లు 1 చింత 2 వేప 1 టేకు 6 తాడిచెట్లు
18	19-4A2	G.W	0.99	0.79	శ్రీ పొత్తూరి రామలింగరాజు తండ్రి/- చంద్రరాజు	19-4A1	19-4B	ఏనుగువాని లంక గ్రామం	19-3B		78 కొబ్బరి చెట్లు 20 చిన్న కొబ్బరి చెట్లు 1సపోట 30 అరటి 1 వెదురుగుంపు 7 తాడిచెట్లు 1 నిమ్మ 1 మామిడి
19	19-4B	G.W	0.97	0.97	శ్రీమతి ముదునూరి సత్యవతి భర్త/- సుబ్బరాజు	19-5B,6B	19-10	ఏనుగువాని లంక గ్రామం	19-4A2	బోరు 1	67 కొబ్బరి చెట్లు 6 తాడిచెట్లు మామిడి 2
20	19-5B	G.W	0.10	0.0025	శ్రీ పొత్తూరి నరసింహరాజు తండ్రి/- గోపాలరాజు	19-5A	19-6B	19-4B	19-4A1	20*20 బిల్డింగు లో ఒక మీటరు	1 కొబ్బరి చెట్లు 3 సీతాఫలం చెట్లు 1 పనస చెట్లు 1నారింజ చెట్లు
21	19-5B	G.W	0.10	0.0025	శ్రీ పొత్తూరి వెంకట సత్యనారాయణరాజు తండ్రి/- గోపాలరాజు	19-5A	19-6B	19-4B	19-4A1	పెకుటిల్లు లో ¼ భాగం	2 కొబ్బరి చెట్లు
22	19-5B	G.W	0.10	0.0050	శ్రీ పొత్తూరి శ్రీకర రాజు గోపాల వర్మ తండ్రి/- రఘు వర్మ	19-5A	19-6B	19-4B	19-4A1	బిల్డింగ్ 1/2 భాగం,	
23	19-6B	G.W	0.11	0.0175	శ్రీ పొత్తూరి గాంధీరాజు తండ్రి/- గోపిరాజు	19-6A	19-7B	19-4B	19-5B	పెంకుటిల్లు ఒక మీటరు భాగం	8 కొబ్బరి చెట్లు 1సపోట 2 మామిడి 2 అరటి
24	19-6B	G.W	0.11	0.0125	శ్రీ పొత్తూరి సుబ్బరాజు తండ్రి/- వెంకటరాజు	19-6A	19-7B	19-4B	19-5B		2 కొబ్బరి చెట్లు 10 అరటి 1 సపోట 2 సీతాఫలం ములగ 2
25	19-7B	G.W	0.20	0.02	శ్రీ పొత్తూరి సీతారామరాజు తండ్రి/- అప్పలరాజు	19-7A	19-9B	19-10	19-6B	1 బిల్డింగు, 1 కిచెను బిల్డింగ్	సీతాఫలం1, మామిడి 1, జామ 1
26	19-7B	G.W	0.20	0.02	శ్రీ పొత్తూరి వెంకట సుబ్బరాజు తండ్రి/- అప్పలరాజు	19-7A	19-9B	19-10	19-6B	1 బిల్డింగు, 1 కిచెను బిల్డింగ్	
27	19-7B	G.W	0.20	0.04	శ్రీ పొత్తూరి రామలింగరాజు తండ్రి/- చంద్రరాజు	19-7A	19-9B	19-10	19-6B	1 బిల్డింగు	3 కొబ్బరి చెట్లు జామ 1,బొప్పాయి 1, పంపర పనస-2
28	19-9B	G.W	0.24	0.0425	శ్రీ ఇందుకూరి రామలింగరాజు తండ్రి/- సత్యనారాయణరాజు	19-9A	23-16B	19-10	19-7B,10	20*20 ఆర్.సి.సి. బిల్డింగు ¾ భాగం, వంట పెద్దు 1	7 కొబ్బరి చెట్లు
29	19-9B	G.W	0.24	0.0325	శ్రీ పొత్తూరి పాండురంగ రామకృష్ణంరాజు తండ్రి/- సూర్యనారాయణరాజు	19-9A	23-16B	19-10	19-7B,10		6 కొబ్బరి చెట్లు 1 సపోట 1 మామిడి 1 అరటి 1 నిమ్మ
30	19-9B	G.W	0.24	0.0650	శ్రీ పొత్తూరి వెంకట శ్రీనివాసరాజు తండ్రి/- సూర్యనారాయణరాజు	19-9A	23-16B	19-10	19-7B,10		6 కొబ్బరి చెట్లు 1 మామిడి 4 అరటి 1 మునగచెట్లు
31	19-9B	G.W	0.24	0.04	శ్రీ పొత్తూరి సీతారామరాజు తండ్రి/- అప్పలరాజు	19-9A	23-16B	19-10	19-7B,10	బాత్ రూమ్ 1	7 కొబ్బరి చెట్లు 2 తాడిచెట్లు 1 చింత
32	19-10	G.W	1.24	0.6250	శ్రీ పొత్తూరి పాండురంగ రామకృష్ణంరాజు తండ్రి/- సూర్యనారాయణరాజు	19-7B,9B	23-16B,17, 18,19	ఏనుగువాని లంక గ్రామం	19-4B		72 కొబ్బరి చెట్లు 6 తాడిచెట్లు 15 మామిడి 6 అరటి
33	19-10	G.W	1.24	0.6150	శ్రీ రుద్రరాజు పవన్ కుమార్ వర్మ తండ్రి/- సుబ్బరాజు	19-7B,9B	23-16B,17, 18,19	ఏనుగువాని లంక గ్రామం	19-4B		42 కొబ్బరి చెట్లు 1 సపోట 1నారింజ చెట్లు 4 మామిడి 2 మునగ చెట్లు, 1 పనస
34	23-4B	G.D	0.17	0.02	శ్రీ గుబ్బల తాతారావు తండ్రి/- రామన్న	23-4A	23-10	23-14,15	23-16B	1 దూళ్ళ పాక	5 కొబ్బరి చెట్లు
35	23-4B	G.D	0.17	0.01	శ్రీ గుబ్బల సత్యనారాయణ తండ్రి/- వెంకన్న	23-4A	23-10	23-14,15	23-16B	1 రేకులపెద్దు (దూళ్ళ)	1 కొబ్బరి చెట్లు
36	23-9B	G.D	0.05	0.01	శ్రీ గుబ్బల లక్ష్మణుడు తండ్రి/- నారాయుడు	23-9A	23-11B	23-10	23-4B		1 కొబ్బరి చెట్లు 1 మామిడి 1 సపోట 1 తాడిచెట్లు
37	23-10	G.D	0.05	0.05	శ్రీ గుబ్బల మంగయ్య తండ్రి/- రామన్న	23-9B	23-11B	23-13,14	23-4B	తాటాకు ఇల్లు-1	2 కొబ్బరి చెట్లు
38	23-11B	G.D	0.41	0.02	శ్రీ కడలి సోమేశ్వరరావు తండ్రి /- సత్యనారాయణ	23-11A,12B	23-12B, 44-9	23-22	23-9B,10,13	1 –రేకుల పెద్దు (దూళ్ళ)	5 కొబ్బరి చెట్లు 1 తాడిచెట్లు 3 మునగచెట్లు
39	23-11B	G.D	0.41	0.1150	శ్రీ పొత్తూరి వెంకట సుబ్బరాజు తండ్రి/- అప్పలరాజు	23-11A,12B	23-12B, 44-9	23-22	23-9B,10,13		11 కొబ్బరి చెట్లు 3 తాడిచెట్లు
40	23-11B	G.D	0.41	0.1150	శ్రీ పొత్తూరి సీతారామరాజు తండ్రి/- అప్పలరాజు	23-11A,12B	23-12B, 44-9	23-22	23-9B,10,13		12 కొబ్బరి చెట్లు 4 తాడిచెట్లు
41	23-11B	G.D	0.41	0.03	షేక్ మెహబూబ్ మున్నీషా భర్త/- మీరావలి	23-11A,12B	23-12B, 44-9	23-22	23-9B,10,13		1 తాడిచెట్లు 24 సీతాఫలం
42	23-11B	G.D	0.41	0.03	శ్రీ పొత్తూరి వెంకట సత్యనారాయణరాజు తండ్రి/- గోపాలరాజు	23-11A,12B	23-12B, 44-9	23-22	23-9B,10,13		24 సీతాఫలం 1 ఉసిరి 1 మామిడి
43	23-12B	G.D	0.28	0.13	శ్రీమతి. పొత్తూరి పార్వతి భర్త/- గాంధీరాజు	23-12A	44-1B2,9	23-11B	23-11B		15 కొబ్బరి చెట్లు 2 తాడిచెట్లు 1 బొప్పాయి చెట్లు కొబ్బరి నూర మొక్కలు 106
44	23-13	G.D	0.17	0.17	శ్రీ పొత్తూరి వెంకట శ్రీనివాస రాజు తండ్రి/- సూర్యనారాయణరాజు	23-10	23-11B	23-21,22	23-14		13 కొబ్బరి చెట్లు 2 తాడిచెట్లు
45	23-14	G.D	0.19	0.19	శ్రీమతి ముదునూరి సత్యవతి భర్త/- సుబ్బరాజు	23-4B,10	23-13	23-20,21	23-15,16B		23 కొబ్బరి చెట్లు చింత 1
46	23-15	G.W	0.10	0.10	శ్రీమతి పొత్తూరి నరసమ్మ భర్త/- వెంకట్రాజు	23-4B	23-14	23-16B	23-16B		12 కొబ్బరి చెట్లు 1 వేప 1 జామ చెట్లు, 1 నిమ్మ, 6 సీతాఫలం, 1 చింత
47	23-16B	G.D	1.16	0.27	శ్రీ గుబ్బల నాగరాజు తండ్రి/- లక్ష్మణుడు	23-16A	23-14,15	23-17,20	19-9B,10	20*27 రెండు అంతస్తుల బిల్డింగు	20 కొబ్బరి చెట్లు
48	23-16B	G.D	1.16	0.28	శ్రీ గుబ్బల రాంబాబు తండ్రి/- లక్ష్మణుడు	23-16A	23-14,15	23-17,20	19-9B,10		20 కొబ్బరి చెట్లు 1 సపోట 2 మామిడి 2 చింత చెట్లు 2 పనస చెట్లు 4 పెద్ద ఉసిరి 1 చిన్న ఉసిరి 2 నిమ్మ 1 ములగ
49	23-16B	G.D	1.16	0.18	శ్రీమతి పేరిచర్ల అనసూయ భర్త/- నరసింహరాజు	23-16A	23-14,15	23-17,20	19-9B,10		14 కొబ్బరి చెట్లు
50	23-16B	G.D	1.16	0.22	శ్రీమతి నడింపల్లి సావిత్రి భర్త/- కృష్ణంరాజు	23-16A	23-14,15	23-17,20	19-9B,10		14 కొబ్బరి చెట్లు 2 తాడిచెట్లు
51	23-17	G.W	0.13	0.13	శ్రీ పొత్తూరి వెంకట శ్రీనివాస రాజు తండ్రి/- సూర్యనారాయణరాజు	23-16B	23-20	23-18	19-10		17 కొబ్బరి చెట్లు 4 తాడిచెట్లు 9 మామిడిచెట్లు
52	23-18	G.W	0.14	0.02	శ్రీ పొత్తూరి రామలింగరాజు తండ్రి/- చంద్రరాజు	23-17	23-20	23-19	19-10		
53	23-18	G.W	0.14	0.02	శ్రీ పొత్తూరి నరసింహరాజు తండ్రి/- గోపాలరాజు	23-17	23-20	23-19	19-10		
54	23-18	G.W	0.14	0.10	శ్రీ పొత్తూరి వెంకట శ్రీనివాస రాజు తండ్రి/- సూర్యనారాయణరాజు	23-17	23-20	23-19	19-10		2 చింత చెట్లు
55	23-19	G.W	0.11	0.0350	శ్రీ పొత్తూరి సత్యనారాయణరాజు తండ్రి/- నరసింహరాజు	23-18	23-20	23-23	19-10		1 మామిడిచెట్లు 40 అరటిచెట్లు 1 చింత చెట్లు
											4 కొబ్బరి చెట్లు 4 చిన్న కొబ్బరి

(మిగతా 6వ పేజీలో)

(5వ పేజీ తరువాయి

56	23-19	G.W	0.11	0.0350	శ్రీ పొత్తూరి వెంకట రామరాజు తండ్రి/- నరసింహరాజు	23-18	23-20	23-23	19-10		చెట్లు 2 మామిడిచెట్లు వేప చెట్టు 1
57	23-19	G.W	0.11	0.04	శ్రీ పొత్తూరి సుబ్బరాజు తండ్రి/- నరసింహరాజు	23-18	23-20	23-23	19-10		8 కొబ్బరి చెట్లు 1 తాడిచెట్టు 1 మామిడిచెట్టు
58	23-20	G.W	0.54	0.29	శ్రీ పొత్తూరి రామలింగరాజు తండ్రి/- చంద్రరాజు	23-16B,14	23-21	23-23	23-17,18,19		35 కొబ్బరి చెట్లు 3 తాడిచెట్లు 3 మామిడిచెట్లు
59	23-20	G.W	0.54	0.1250	శ్రీమతి. ముదునూరి సత్యవతి భర్త/- సుబ్బరాజు	23-16B,14	23-21	23-23	23-17,18,19		11 కొబ్బరి చెట్లు 1 తాడిచెట్టు
60	23-20	G.W	0.54	0.0625	శ్రీ పొత్తూరి వెంకట సుబ్బరాజు తండ్రి/- అప్పలరాజు	23-16B,14	23-21	23-23	23-17,18,19		8 కొబ్బరి చెట్లు 2 తాడిచెట్లు
61	23-20	G.W	0.54	0.0625	శ్రీ పొత్తూరి సీతారామరాజు తండ్రి/- అప్పలరాజు	23-16B,14	23-21	23-23	23-17,18,19		10 కొబ్బరి చెట్లు 2 తాడిచెట్లు 1 చింత చెట్టు
62	23-21	G.W	0.22	0.22	శ్రీ పొత్తూరి వెంకట శ్రీనివాస రాజు తండ్రి/- సూర్యనారాయణరాజు	23-13,14	23-22	23-23	23-20		22 కొబ్బరి చెట్లు 1 నేరేడు చెట్టు 11 మామిడి 1 చింత చెట్టు
63	23-22	G.W	0.26	0.12	శ్రీ పొత్తూరి నరసింహరాజు తండ్రి/- గోపాలరాజు	23-11B,13	44-9,10	23-23	23-21		14 కొబ్బరి చెట్లు 1 మామిడి 1 చింత చెట్టు
64	23-22	G.W	0.26	0.14	శ్రీ పొత్తూరి వెంకట సత్యనారాయణరాజు తండ్రి/- గోపాలరాజు	23-11B,13	44-9,10	23-23	23-21		17 కొబ్బరి చెట్లు 1 నారింజ చెట్టు 11 మామిడి 4 కుంకుడు చెట్లు 4 మునగచెట్లు
65	44-1B2	G.W	0.29	0.16	శ్రీ మాసపల్లి నాగేశ్వరరావు తండ్రి/- తాతయ్య	44-1B1	44-7B	44-9	23-12B		26 కొబ్బరి చెట్లు 2 చింత చెట్లు, తాడి చెట్లు2
66	44-3B	G.W	0.84	0.05	శ్రీమతి పెన్మత్స అనుష భర్త /- కృష్ణ వర్మ	44-3A	44-4B	44-4B	44-4B		6 కొబ్బరిచెట్లు, తాడి చెట్టు 1
67	44-4B	G.W	1.94	0.40	శ్రీమతి పొత్తూరి జ్యోతి భర్త/- నరసింహరాజు	44-3B,4A	45-2B	44-10	44-5B,6,8		40 కొబ్బరి చెట్లు 25 అరటి 1 చింత చెట్టు 8 మామిడి,సీతా ఫలం 10, తాడి చెట్టు 1
68	44-4B	G.W	1.94	1.10	శ్రీ పొత్తూరి నరసింహరాజు తండ్రి/- గోపాలరాజు	44-3B,4A	45-2B	44-10	44-5B,6,8		90 కొబ్బరి చెట్లు 175 అరటి 1 చింత చెట్టు 12 మామిడి 3 బత్తాయి చెట్లు 4 జామచెట్లు తాడి చెట్లు 5, సీతా ఫలం 49
69	44-5B	G.W	0.10	0.05	శెట్టిబలిజ సంఘం	44-5A	44-4B	44-6	44-7B		3 చింత చెట్లు 2 గన్నేరు చెట్లు 1 తాడిచెట్టు 1 వేప చెట్టు
70	44-6	G.W	0.05	0.05	శెట్టిబలిజ సంఘం	44-5B	44-4B	44-8	44-7B		5 కొబ్బరి చెట్లు
71	44-7B	G.D	0.15	0.09	శ్రీ పొత్తూరి నరసింహరాజు తండ్రి/- గోపాలరాజు	44-7A	44-5B,6	44-8	44-1B2		11 కొబ్బరి చెట్లు 2 తాడి చెట్లు
72	44-8	G.W	0.49	0.49	శ్రీ పొత్తూరి నరసింహరాజు తండ్రి/- గోపాలరాజు	44-6,7B	44-4B	44-10	44-9		40 కొబ్బరి చెట్లు
73	44-9	G.W	0.80	0.80	శ్రీమతి దంతులూరి కళ్యాణి భర్త/- శ్రీనివాస వర్మ	44-1B2	44-8	44-10	23-11B,22		64 కొబ్బరి చెట్లు 2 తాడిచెట్లు
74	45-2B	G.W	1.02	0.54	శ్రీమతి కమ్మిలి భవాని భర్త/- వెంకట దుర్గా ప్రసాదరాజు	45-2A	45-6B	45-7	44-4B	బోరు-1	31 కొబ్బరి చెట్లు 1 మామిడి చెట్టు
75	45-5B	G.W	1.64	1.20	శ్రీ ఇందుకూరి బాలరాజు తండ్రి/- నరసింహరాజు	45-5A	45-8,46-1B	45-7	45-6B	షెడ్డు-1 బోరు-1	49 కొబ్బరి చెట్లు 2 వేప చెట్లు మునగ 2
76	45-6B	G.W	0.90	0.61	శ్రీ పొత్తూరి పెద్దిరాజు తండ్రి/- మార్తాజు	45-6A	45-5B	45-7	45-2B	పాక-1, ట్రాన్స్ ఫార్మర్1	30 కొబ్బరి చెట్లు
77	46-1B	G.W	3.19	0.14	శ్రీ పొత్తూరి రామకృష్ణంరాజు తండ్రి/- మార్తాజు	46-1A	47-10	45-8, 46-2	45-5B		14 కొబ్బరి చెట్లు
78	46-1B	G.W	3.19	0.20	శ్రీమతి గాదిరాజు వెంకట నరసమ్మ భర్త/- రంగరాజు	46-1A	47-10	45-8, 46-2	45-5B		5 కొబ్బరి చెట్లు
79	46-1B	G.W	3.19	0.19	శ్రీ పొత్తూరి మార్తాజు తండ్రి/- రామరాజు	46-1A	47-10	45-8, 46-2	45-5B		25 కొబ్బరి చెట్లు
80	46-1B	G.W	3.19	1.00	శ్రీమతి పొత్తూరి దుర్గమ్మ భర్త/- పెద్దిరాజు	46-1A	47-10	45-8, 46-2	45-5B	1 షెడ్డు, కరెంటు మీటరు 1	48 కొబ్బరి చెట్లు 3 తాడిచెట్లు
81	46-2	G.W	1.30	1.30	శ్రీ పొత్తూరి సుబ్బరాజు తండ్రి/- పెద్దిరాజు	46-1B	47-10	46-3,47-11	45-7,8	బోరు-1, షెడ్డు 1	40 కొబ్బరి చెట్లు 4 మునగచెట్లు 7 వేప చెట్లు
82	47-2B	G.W	1.88	1.24	శ్రీమతి రుద్రరాజు సుజాత భర్త/-శ్రీహరిరాజు	47-2A	47-12	47-3,5	47-10	బోరు-1, కరెంటు మీటరు 1, షెడ్డు దిమ్మ 1	35 కొబ్బరి చెట్లు 8 తాడిచెట్లు వేప 1
83	47-2B	G.W	1.88	0.04	శ్రీమతి పొత్తూరి పార్వతి భర్త/- రామలింగరాజు	47-2A	47-12	47-3,5	47-10		
84	47-2B	G.W	1.88	0.04	శ్రీ పొత్తూరి సత్యనారాయణరాజు తండ్రి/- నారాయణరాజు	47-2A	47-12	47-3,5	47-10		
85	47-2B	G.W	1.88	0.14	శ్రీమతి పొత్తూరి పద్మ భర్త/- రామకృష్ణంరాజు	47-2A	47-12	47-3,5	47-10		
86	47-3	G.D	0.17	0.05	శ్రీమతి పొత్తూరి పార్వతి భర్త/- రామలింగరాజు	47-2B	47-12	47-4	47-2B		9 కొబ్బరి చెట్లు
87	47-3	G.D	0.17	0.05	శ్రీ పొత్తూరి సత్యనారాయణరాజు తండ్రి/- నారాయణరాజు	47-2B	47-12	47-4	47-2B		15 కొబ్బరి చెట్లు 4 తాడిచెట్లు 3 వేప చెట్లు 1 సపోట చెట్టు
88	47-3	G.D	0.17	0.05	శ్రీమతి పొత్తూరి పద్మ భర్త/- రామకృష్ణంరాజు	47-2B	47-12	47-4	47-2B		
89	47-3	G.D	0.17	0.02	శ్రీమతి రుద్రరాజు సుజాత భర్త/-శ్రీహరిరాజు	47-2B	47-12	47-4	47-2B	పాక 1	
90	47-4	G.W	0.14	0.14	శ్రీమతి పొత్తూరి పద్మ భర్త/- రామకృష్ణంరాజు	47-3	47-12,8A	47-7A,8A	47-5		
91	47-5	G.W	0.34	0.34	శ్రీమతి పొత్తూరి పద్మ భర్త/- రామకృష్ణంరాజు	47-2B	47-4,7A	47-6A	47-11		62 కొబ్బరి చెట్లు 5తాడిచెట్లు 7 వేప చెట్లు
92	47-6A	G.W	0.16	0.04	శ్రీమతి పొత్తూరి పద్మ భర్త/- రామకృష్ణంరాజు	47-5	47-7A	47-6B	47-10		
93	47-7A	G.W	0.24	0.01	శ్రీమతి పొత్తూరి పద్మ భర్త/- రామకృష్ణంరాజు	47-4,5	47-8A	47-7B	47-5		
94	47-8A	G.D	0.29	0.02	శ్రీమతి పొత్తూరి పద్మ భర్త/- రామకృష్ణంరాజు	47-4	47-12	47-8B	47-4		
95	48-1A	G.D	0.12	0.12	శ్రీమతి రుద్రరాజు సుజాత భర్త/-శ్రీహరిరాజు	47-12	48-2	48-1B1	78-5		
96	48-1B1	G.D	0.20	0.19	శ్రీమతి పొత్తూరి సుబ్బలక్ష్మి భర్త/- శ్రీనివాస రాజు	48-1A	48-2	48-3A,78-8A	78-5		25కొబ్బరి చెట్లు 9 తాడి చెట్లు
97	48-2	G.D	0.12	0.12	శ్రీ పొత్తూరి సత్యనారాయణరాజు తండ్రి/- నారాయణరాజు	47-12	48-5A2	48-3A	48-1A,1B1		25 కొబ్బరి చెట్లు
98	48-3A	G.D	0.40	0.04	శ్రీమతి పొత్తూరి సుబ్బలక్ష్మి భర్త/- శ్రీనివాస రాజు	48-1B1	48-3B	78-8A	78-8A		కొబ్బరి చెట్లు 15, తాడి చెట్టు 1
99	48-3C	G.D	0.40	0.02	శ్రీ పొత్తూరి సత్యనారాయణరాజు తండ్రి/- నారాయణరాజు	48-2,5	48-5A2	48-3B	48-2		కొబ్బరి చెట్లు 2, తాడి చెట్లు 6
100	48-4B1	G.D	0.03	0.01	శ్రీ పొత్తూరి సత్యనారాయణరాజు తండ్రి/- నారాయణరాజు	48-5B2,8	48-8B	48-4B2	48-5B2		
101	48-5A2	G.D	0.25	0.21	శ్రీ పొత్తూరి సత్యనారాయణరాజు తండ్రి/- నారాయణరాజు	47-12,5A1	48-5B2	48-5A3	48-2,3C		కొబ్బరి చెట్లు 35, తాడి చెట్లు 4
102	48-5B2	G.D	0.23	0.18	శ్రీ పొత్తూరి సత్యనారాయణరాజు తండ్రి/- నారాయణరాజు	48-5B1	48-7B,8B	48-4B1	48-5A2	పాక-1	
103	48-7B	G.W	0.55	0.19	శ్రీ పొత్తూరి సత్యనారాయణరాజు తండ్రి/- నారాయణరాజు	48-7A	48-7A	48-8B	48-5B2		17 కొబ్బరి చెట్లు అరటి 15 2 తాడిచెట్లు 1 టేకు చెట్టు
104	48-8B	G.W	1.16	0.42	శ్రీ దాట్ల కృష్ణంరాజు తండ్రి/- అప్పలరాజు	48-7B,8C	49-6	48-8A, 77-4B	48-7B,5B2,4B1		9 కొబ్బరి చెట్లు
105	48-8B	G.W	1.16	0.49	శ్రీ పొత్తూరి సత్యనారాయణరాజు తండ్రి/- సూరపరాజు	48-7B,8C	49-6	48-8A, 77-4B	48-7B,5B2,4B1	బోరు-1	2 వేప చెట్లు 15 కొబ్బరి చెట్లు 8 తాడిచెట్లు చింత 1
106	49-4A2	G.D	0.91	0.37	శ్రీ రామలింగేశ్వరస్వామి వారి దేవస్థానం, కలగంపూడి	49-4A1	49-4B1	49-5B	49-6		30 కొబ్బరి చెట్లు 2 తాడిచెట్లు జామ 1
107	49-4B1	G.D	0.15	0.06	శ్రీమతి మేడిది లక్ష్మి నరసమ్మ భర్త/- సుబ్బారావు	49-4A2	49-5B	49-4B2	49-6		4 కొబ్బరి చెట్లు 3 వేప చెట్లు
108	49-4B1	G.D	0.15	0.06	శ్రీ మేడిది ఆనందరావు తండ్రి/- వెంకన్న	49-4A2	49-5B	49-4B2	49-6		3కొబ్బరి చెట్లు 3ఉక్కీస చెట్లు
109	49-5B	G.W	0.66	0.39	శ్రీమతి రుద్రరాజు సుబ్బాయమ్మ భర్త/- కృష్ణంరాజు	49-5A	59-5B,6A	49-5C	49-4A2,4B1		51 కొబ్బరి చెట్లు 4 తాడిచెట్లు 1 మామిడి మునగ 3 బత్తాయి1
110	59-4B	G.W	0.97	0.24	శ్రీ పొత్తూరి వెంకటరాజు తండ్రి/- సీతారామరాజు	59-4A	59-8B	59-7A	59-5B		19 కొబ్బరి చెట్లు
111	59-5B	G.W	0.52	0.33	శ్రీ పొత్తూరి ఈశ్వర వరప్రసాద మూర్తిరాజు తండ్రి/- వెంకట రాజు	59-5A	59-4B	59-6A,7A	49-5B	1 షెడ్ కరెంటు మీటరు1	2 కొబ్బరి చెట్లు
112	59-5B	G.W	0.52	0.01	శ్రీమతి పొత్తూరి అన్నపూర్ణ భర్త/- నరసింహరాజు	59-5A	59-4B	59-6A,7A	49-5B	షెడ్డు 1, బోరు-1	2 కొబ్బరి చెట్లు వేప చెట్లు 2
113	59-6A	G.W	0.13	0.09	శ్రీ పొత్తూరి ఈశ్వర వరప్రసాద మూర్తిరాజు తండ్రి/- వెంకట రాజు	59-5B	59-7A	59-6B	49-5B		13 కొబ్బరి చెట్లు
114	59-7A	G.W	0.45	0.30	శ్రీ పొత్తూరి ఈశ్వర వరప్రసాద మూర్తిరాజు తండ్రి/- వెంకట రాజు	59-4B,5B,8B	71-3A	59-7B	59-6A		వేప1, అరటి 12
115	59-8B	G.W	0.48	0.39	శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం, అంతర్వేది	59-8A	71-2B2,71-3A	59-7A	59-4B		18 కొబ్బరి చెట్లు 1 వేప చెట్టు కొబ్బరి సూధ మొక్కలు 60
116	71-2B2	G.W	0.51	0.11	శ్రీ విప్పర్తి సాయిబాబు తండ్రి/- వెంకన్న	71-2B1	64-2B	71-3A,4A1,4B1,4C1	59-8B		17 కొబ్బరి చెట్లు
117	71-3A	G.W	0.53	0.34	శ్రీ చింత కుటుంబరావు తండ్రి/- నారాయుడు	71-2B2	71-4A1	71-3B	59-7A,8B		18 కొబ్బరి చెట్లు 10 చిన్న కొబ్బరి చెట్లు 30 వేప చెట్లు మునగ 1
118	71-4A1	G.W	0.27	0.22	శ్రీ చింత కుటుంబరావు తండ్రి/- నారాయుడు	71-2B2	71-4B1	71-4A2	71-3A		
119	71-4B1	G.W	0.25	0.22	శ్రీమతి కొప్పినీడి వెంకట లక్ష్మి భర్త/- స్వామి నాయుడు	71-2B2	71-4C1	71-4B2	71-4A1		27 కొబ్బరి చెట్లు 1 తాడిచెట్టు 1 వేప చెట్టు
120	71-4C1	G.W	0.50	0.18	శ్రీమతి మేకా పెద్దింట్లు భర్త/- దశరథుడు	64-2B	64-3B	71-4C2	71-4B1		14 కొబ్బరి చెట్లు 13 చిన్న కొబ్బరి
121	71-4C1	G.W	0.50	0.25	శ్రీమతి అరక్కోణం భవాని భర్త/- వెంకట లక్ష్మినారాయణ	64-2B	64-3B	71-4C2	71-4B1		24 కొబ్బరి చెట్లు 2 చిన్న కొబ్బరి
122	64-2B	G.W	0.40	0.05	శ్రీమతి వీరమళ్ళ కామేశ్వరి భర్త/- వీరరాఘవులు	64-2A	64-3B	71-4C1	71-2B2		6 కొబ్బరి చెట్లు
123	64-3B	G.W	2.10	0.69	శ్రీమతి గాదిరాజు ఉమా పద్మజ భర్త/- నాగ వెంకట సుధాకర వర్మ	64-3A	64-5B	64-3C	71-4C1		57 కొబ్బరి చెట్లు 9 చిన్న కొబ్బరి
124	64-5B	G.W	0.64	0.51	శ్రీమతి రుద్రరాజు బేబీ సరోజినీ భర్త/- నరసింహరాజు	64-4B,5A	64-4B,6A	64-5C	64-3B		92 కొబ్బరి చెట్లు 3 మామిడి మునగ 1 వేప 1
125	64-6B	G.W	0.14	0.1150	శ్రీమతి రుద్రరాజు బేబీ సరోజినీ భర్త/- నరసింహరాజు	64-4B	65-1B	64-6B	64-5B		
126	65-1B	G.W	0.64	0.39	శ్రీమతి రుద్రరాజు బేబీ సరోజినీ భర్త/- నరసింహరాజు	65-1A	65-2B	65-1C	64-6A		
127	65-2B	G.W	1.03	0.61	శ్రీ పేరిచర్ల కృష్ణంరాజు తండ్రి/- వెంకటరాజు	65-2A	65-3B	65-2C	65-1B		8 కొబ్బరి చెట్లు 11 చిన్న కొబ్బరి చెట్లు 1 మునగ చెట్టు వేప 1
128	65-3B	G.W	0.64	0.37	శ్రీమతి రుద్రరాజు వెంకట నరసమ్మ భర్త/- నరసింహరాజు	65-3A	65-4B	65-3C	65-2B		
129	65-4B	G.W	0.60	0.03	శ్రీ పొత్తూరి వెంకటరామరాజు తండ్రి/- నరసింహరాజు	65-4A	65-5B	65-4C	65-3B		
130	65-4B	G.W	0.60	0.30	శ్రీ పొత్తూరి నాగరాజు తండ్రి/- నరసింహరాజు	65-4A	65-5B	65-4C	65-3B	రాతి పాక 1	6 కొబ్బరి చెట్లు 4 చిన్న కొబ్బరి చెట్లు 4 మునగ చెట్లు వేప 1 నిమ్మ1 సపోట1 అరటి

(మిగతా 7వ పేజీలో)

ఖాట్మండ్‌లో ఘోర విమాన ప్రమాదం

• ల్యాండింగ్ సమయంలో చెలరేగిన మంటలు • 50 మంది సజీవ దహనం



ఖాట్మాండ్(నేపాల్) : నేపాల్ రాజధాని ఖాట్మాండ్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో దాదాపు 50 మంది మృతిచెందారు. బంగ్లాదేశ్ నుంచి 67 మంది ప్రయాణికులతో వస్తున్న యూఎస్ బంగ్లాకు చెందిన విమానం ఖాట్మాండ్‌లోని త్రిభువన్ అంతర్జాతీయ విమాశ్రయంలోనే కుప్పకూలింది. విమానం ల్యాండ్ అవుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు ఎయిర్‌పోర్టు అధికార ప్రతినిధి ప్రేమ్‌నాథ్ ఠాకూర్ వెల్లడించారు.

ఢాకా నుంచి బయలుదేరిన ఆ విమానం స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.20 గంటలకు ల్యాండ్ అవ్వాల్సి ఉంది. రన్‌వేపై దిగుతున్న సమయంలో ఒక్కసారిగా కూలిపోయి పక్కనే ఉన్న ఫుట్‌బాల్ మైదానంలో పడిపోయిందని, వెంటనే మంటలు చెలరేగి ప్రమాదానికి కారణమయిందని, మంటల్లో విమానం పూర్తిగా దగ్ధమైందని ఠాకూర్ తెలిపారు. నేపాల్ ఆర్మీ సిబ్బంది ఎయిర్‌పోర్టుకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చి ప్రయాణికులను కాపాడేందుకు సహాయక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. అయితే, అప్పటికే పరిస్థితి చేయిదాటిపోవడంతో 50 మంది సజీవదహనమయ్యారు. విమానంలో మొత్తం 67 మంది ప్రయాణికులు, నలుగురు ఎయిర్‌పోర్టు సిబ్బంది ఉన్నారు. ప్రమాదంలో దాదాపు 50 మంది మృతిచెందగా, తీవ్రంగా గాయపడ్డ 20 మందిని ఖాట్మాండ్ మెడికల్ కాలేజి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరగవచ్చునని ఖాట్మాండు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

అయితే, సాంకేతిక కారణాల వల్లే విమానం కూలిపోయి ఉంటుందని, ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని విమానాశ్రయ అధికారులు పేర్కొన్నారు. ప్రమాద నేపథ్యంలో ఎయిర్‌పోర్టులో విమానాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసి, విమానాశ్రయాన్ని మూసేశారు.

థేని కార్చిచ్చులో 9 మంది మృతి

• 17 మందికి గాయాలు: ఒకరి పరిస్థితి విషమం • నాలుగు ఐఎఎఫ్ హెలీకాప్టర్లతో రెస్క్యూ ఆపరేషన్: నిర్మలా సీతారామన్ • ట్రెక్కింగ్ తాత్కాలికంగా రద్దు: కేరళ సర్కార్





థేని, తమిళనాడు : థేని జిల్లాలోని కురంగణి పర్వతాల్లో ఆదివారం నిర్వహించిన పర్వతారోహణలో 9 మంది అగ్నికి ఆహుతులైనట్టు ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. అందరూ సంతోషంగా ట్రెక్కింగ్ నిర్వహిస్తున్న సమయంలో కార్చిచ్చు కారణంగా ఈ ఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలను రెవెన్యూ పరిపాలనా శాఖ చీఫ్ కమిషనర్ కె.సత్యగోపాల్ వివరించారు. రెస్క్యూ బృందం వెంటనే రంగంలోకి దిగడంతో ప్రాణ నష్టం తగ్గింది. మంటల్లో చిక్కుకున్న 17 మంది విద్యార్థులను గుర్తించి ఆసుపత్రిలో చేర్పించడం జరిగింది. 10 మంది మాత్రం తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. తొమ్మిది మంది విద్యార్థులు మృతి చెందగా, వారిలో ఆరుగురు చెన్నైకి చెందిన వారు కాగా, ముగ్గురు ఏరోడ్ నివాసులుగా గుర్తించారు. విషయం తెలుసుకున్న తమిళనాడు సీఎం పళనిస్వామి ఘటనస్థలాన్ని సందర్శించారు. గాయాలపాలైన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. 36 మంది సభ్యులు ఉన్న బృందంలో 24 మంది చెన్నైకి చెందిన వారు కాగా, 12 మంది తిరుప్పూర్, ఏరోడ్ నివాసులు. ట్రెక్కింగ్ చేయడానికి వీరంతా కురంగణి పర్వత ప్రాంతానికి మార్చి 10వ తేదీన చేరుకున్నారు. బృందంలో 25 మంది మహిళలు ఉండగా, ముగ్గురు చిన్నారులు ఉన్నట్టు థేని జిల్లా కలెక్టర్ మరియం పల్లవి బల్‌దేవ్ వివరించారు. నాలుగు హెలీకాప్టర్లతో 10 మంది కమాండోలు కలిసి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించినట్టు రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ట్విట్టర్ వేదికగా తెలిపారు. కొయంబత్తూర్ సూలూర్ ఏయిర్‌బేస్‌కు చెందిన నాలుగు చాపర్లు కూడా సహాయ చర్యల్లో పాల్గొన్నాయి. అటవీ శాఖ అధికారులు, పోలీసులు, స్థానిక నాయకులు, గిరిజనులు, ఉద్యోగులతో పాటు టీ కొట్టు వాళ్లు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు.



తమిళనాడులో అగ్ని ప్రమాదం సంభవించిన విషయం తెలిసిన వెంటనే అత్యాధునిక లైట్ హెలీకాప్టర్‌లను రంగంలోకి దించాం. అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో చాలా మంది విద్యార్థులు చెల్లాచెదురు అయ్యారు. ప్రాణాలు కాపాడుకోవడానికి తలోదిక్కు వెళ్లడంతో కూడా కొందరు మృతి చెందారు. రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించడానికి కమాండోలు తీవ్రంగా శ్రమ పడాల్సివచ్చింది. అడ్వాన్స్‌డ్ లైట్ హెలీకాప్టర్లు కావడంతో సులువుగా మంటలను అదుపు చేయగలిగాం. ఎక్కడైనా సులువుగా ల్యాండ్ అయ్యే సత్తా ఆ హెలీకాప్టర్లకు ఉంది. ఇండియన్ ఏయిర్ ఫోర్స్ రంగంలోకి దిగగా స్థానిక అటవీశాఖ అధికారుల నుంచి సహాయం లభించింది. ఒక హెలీకాప్టర్ కొండ పైఉన్న వారిని కిందికి దించుతుండగా, మరో హెలీకాప్టర్ విద్యార్థులను తరలించింది.

రంగంలోకి అడ్వాన్స్ లైట్ హెలీకాప్టర్ : రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

తాత్కాలికంగా ట్రెక్కింగ్ రద్దు

తమిళనాడులోని కురంగణి పర్వత ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదం నేపథ్యంలో కేరళ ప్రభుత్వం కొండ ప్రాంతాల్లో ట్రెక్కింగ్‌ను తాత్కాలికంగా రద్దు చేసింది. ట్రెక్కింగ్ అనేది తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు కేరళ విపత్తు నిర్వహణ శాఖ ప్రకటించింది. సీఎం ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు సంబంధిత శాఖ అధికారి వివరించారు. ట్రెక్కింగ్ సమయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర అటవీ శాఖ అధికారులు వివరించారు. పర్వత ప్రాంతంలో అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా ట్రెక్కింగ్ కమిటీ ప్రతీ ఒక్కరికి వివరించాలని కేరళ సీఎం పినరయి విజయన్ తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ కూడా తమిళనాడులో అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే స్పందించి సహాయ చర్యల్లో పాల్గొన్నట్టు పినరయ్ విజయన్ తెలిపారు. కేరళ అగ్నిమాపక, అటవీ శాఖ, పోలీస్ శాఖ కూడా కురంగణి ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

కోల్ స్కామ్ కథ కంచికి...?

(మొదటిపేజీ తరువాయి)

వారికి సహకరించిన వారందరినీ దోషులుగా పేర్కొంటు సీబీఐ కోర్టుకు నివేదించినా చివరకు సరైన సాక్షాదారాలు చూపలేకపోవడంతో అసలు దోషులు అనిఆరోపణలు ఎదుర్కొన్నవారంతా నిర్దోషులుగా తేలిపోయారు. 2జీ స్పెక్ట్రమ్ అక్రమ కేటాయింపుల వల్ల ప్రభుత్వానికి 1.76 లక్షల కోట్లనష్టం వాటిల్లినట్లు కాగ్ నివేదిక సమర్పించడంతో సీబీఐ రెండు కేసులు..ఎన్ ఫోర్స్ మెంట్ ఒక కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించాయి. అయితే ఎన్నో వాయిదాల తర్వాత గతేడాది డిసెంబర్ లో పాటియాల సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారంతా నిర్దోషులని తీర్పునిచ్చింది. ఇందుకు ప్రధాన కారణం సీబీఐ సమర్పించిన సాక్షాలు బలంగా లేకపోవడం వల్లే అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కీలకమైన కేసుల్లో ప్రముఖుల ప్రమేయం ఉండటం వల్లే దర్యాప్తు సంస్థలపై ఒత్తిడి పెరిగి సరైన సాక్షాలను సమర్పించలేకపోతున్నాయన్నది ప్రధాన ఆరోపణ.

సీబీఐకి ప్రత్యేక న్యాయస్థానం మొట్టికాయలు

తాజాగా కోల్ స్కాం కథ కూడా కంచికే అన్న వాదన వినిపిస్తోంది.ఈ కేసులోనూ సీబీఐ ఆరోపణలు మోపిన వారికి సంబంధించిన సాక్షాలను న్యాయస్థానంలో సమర్పించలేకపోయింది. దీంతో ప్రత్యేక న్యాయస్థానం సీబీఐకి మొట్టికాయలు వేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా సరైన సాక్షాధారాలను ఎందుకు కోర్టులో సమర్పించడం లేదని సీబీఐని ధర్మాసనం మందలించింది. మధ్యప్రదేశ్‌లోని ఉర్తాన్ ఉత్తర బొగ్గు గని కేటాయింపుల్లో జరిగిన అక్రమాల కేసులో పారిశ్రామిక వేత్త నవీన్ జిందాల్ లాంటి వారి ప్రమేయం ఉన్నందువల్లే ఇలా జరుగుతుందా అని ప్రశ్నించింది. నవీన్ జిందాల్ సహా ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారందరికి సంబంధించిన సాక్షాధారాలను సమర్పించాలని గతనెల 15న ధర్మాసనం సీబీఐని ఆదేశించింది.

అయితే సోమవారం విచారణ నాటికి కూడా సీబీఐ సరైన పత్రాలను సమర్పించకపోవడంతో ప్రత్యేక న్యాయమూర్తి భగత్ పరాశర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయస్థానం ఆదేశాలను పాటించకపోవడాన్ని తప్పుబడుతూ సీబీఐకి మొట్టికాయలు వేశారు.వచ్చేనెల 10 తేదీ నాటికి సరైన సాక్షాలు సమర్పించాలంటూ ఈ కేసును వాయిదా వేశారు. ఈ కేసులో జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ కంపెనీ మాజీ డైరెక్టర్ సుశీల్ మారూ, మాజీ డిప్యూటీ డైరెక్టర్ ఎంపీ ఆనంద్ గోయల్,సీఈవో విక్రాంత్ గుజ్రాల్‌లతో పాటు మాజీ కేంద్రమంత్రి దివంగత దాసరి నారాయణ రావు, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి మధుకోడా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.బొగ్గు కేటాయింపులకు సంబంధించి 2007 జనవరిలో స్క్రీనింగ్ కమిటీకి సమర్పించిన దరఖాస్తులో అసత్యాలు ప్రస్తావించినట్లు సీబీఐ తన ఛార్జిషీట్ లో పేర్కొంది. 2009 లో బొగ్గు శాఖ కేటాయింపులు చేస్తూ ఉత్తర్వులివ్వగా.. కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయంటూ సీబీఐ 64 మంది పేర్లతో చార్జిషీట్ దాఖలు చేసింది.

రాజ్యసభకు కేంద్రమంత్రుల నామినేషన్



న్యూఢిల్లీ: రాజ్యసభ ఎన్నికల వేడి ఊపందుకుంది. కేంద్ర మంత్రులు సహా..వివిధ పార్టీల కీలక నాయకులు రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేశారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, ధర్మేంద్రప్రదాన్ తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. జైట్లీ ఉత్తర్ ప్రదేశ్ నుంచి రాజ్యసభ బరిలో ఉండగా.. రవిశంకర్ ప్రసాద్ తన సొంత రాష్ట్రం బీహార్ నుంచి, ధర్మేంద్ర ప్రదాన్ మధ్యప్రదేశ్ ముఖ్యంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో కలిసి బోపాల్ రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ దాఖలుకు ముందు రవిశంకర్ ప్రసాద్ తన తల్లి ఆశీర్వాదం తీసుకున్న ఫోటోను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.

తీహార్ జైలుకు కార్తీ చిదంబరం

న్యూఢిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా అవినీతి కేసులో మాజీఆర్థికమంత్రి చిదంబరం కుమారుడు కార్తీ పన్నెండు రోజుల పోలీసు కస్టడీ పూర్తి కావడంతో ఆయనను సోమవారం సిబిఐ ప్రత్యేక కోర్టులో హాజరు పర్చారు. కాగా, ఆయనకు ఈనెల 24వ తేదీవరకూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సునీల్ రాణా జ్యుడీషియల్ కస్టడీ విధించి తీహార్ జైలుకు పంపారు. తీహార్ జైలులో ఆయనకు ప్రత్యేక సెల్ కేటాయించాలనీ, ఇంటి నుంచి ఆహారాన్ని తెప్పించుకోవడానికి అనుమతించాలని కార్తీ తరపు న్యాయవాది దయాన్‌కృష్ణన్ కోరారు.కార్తీ మాజీ కేంద్రమ మంత్రి కుమారుడనీ, సమాజంలో హోదా కలిగిన కుటుంబానికి చెందిన వారని కృష్ణన్ పేర్కొనగా, అంతమాత్రాన ప్రత్యేక సెల్ కేటాయించలేమని న్యాయమూర్తి కరాఖండీగా స్పష్టం చేశారు. చిదంబరం కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు అనేక మంది ఉగ్రవాదులపై విచారణ జరగడం,శిక్షలు విధించడం జరిగిందనీ, ఆయనపై కోపంతో కార్తీపై జైలులో ఉన్న నేరస్థులు దాడి చేసే ప్రమాదం ఉందని కూడాఆయన వాదించారు.అయితే,ఆయన వాదనతో న్యాయమూర్తి ఏకీభవించలేదు. కార్తీకి తగిన భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించారు.కార్తీని ఈనెల24వ తేదీన తిరిగి హాజరు పర్చాల్సిందిగా న్యాయమూర్తి ఆదేశించారు.

అన్నదాతలకు ఫడ్నవిస్ అభయహస్తం

• డిమాండ్ల సాధనకు కమిటీ
• అర్హులకు అటవీ భూములు



ముంబై : న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారతీయ కిసాన్ సభ ఆధ్వర్యంలో మహా యాత్రకు మహారాష్ట్ర సర్కార్ తలొగ్గింది. కమిటీ వేసి సమస్యలు పరిష్కరిస్తామని సీఎం ఫడ్నవిస్ హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. సోమవారం ఉదయం చూడగా మైదానం అంతా ఎర్ర సముద్రాన్ని తలపించింది. రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధర, కరెంట్ బిల్లు మాఫీ, స్వామినాథన్ సిఫార్సులను అమలుతో పాటు తదితర డిమాండ్‌లతో ఈ ర్యాలీ చేపట్టారు. సోమవారం అసెంబ్లీ ముట్టడించడానికి గాను ఈ ఎర్రదండు ముంబైకి తరలివచ్చింది. నాసిక్ నుంచి మొదలై ముంబైకి చేరిన రైతు ఉద్యమం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాశం అయింది. రికార్డు స్థాయిలో వేలాది మంది అన్నదాతలు 180 కి.మీ మేర పాదయాత్ర చేపట్టడం బహుశా ఇదే తొలిసారేమో! సుమారు 30 వేల మంది రైతులు మార్చి 6న నాసిక్ నుంచి ముంబైకి మహాయాత్రగా బయల్దేరారు. థానే, పాల్ఘడ్ తదితర జిల్లాల రైతులు జతకలిశారు. సోమవారం 70వేల మంది రైతులు అసెంబ్లీ ముట్టడికి సిద్ధం అయ్యారు.

ముంబై-అగ్రా జాతీయ రహదారి మీదుగా మార్చ్ కొనసాగింది. పింక్ బాల్ వార్మ్ చీడ పత్తి పంటను దెబ్బతీసింది. ఫిబ్రవరిలో కురిసిన వడగళ్ల వానలకు లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 19 జిల్లాల్లో రబీ పంట తుడిచిపెట్టుకుపోయింది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు చూస్తూ ఉంది. గత ఏడాది మహారాష్ట్ర సర్కార్ రూ. 34 వేల కోట్ల రుణాల మాఫీకి హామీ ఇచ్చినా అది క్షేత్రస్థాయిలో సరిగా అమలు కాలేదు. దీంతో కడుపు మంటతో వారంతా అసెంబ్లీ ముట్టడికి పూనుకున్నారు.



అటవీ భూమిలో వ్యవసాయం: ఫడ్నవిస్

మహారాష్ట్రలో ఉన్న అటవీ భూమిని రైతులకు, గిరిజనులకు అందజేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ప్రకటించారు. విధానభవన్ ఎదుట ఆయన మాట్లాడుతూ...అటవీ భూమిని సాగు భూమిగా మార్చడానికి ఎలాంటి అభ్యంతరం లేదు. దీని కోసం కమిటీ వేస్తాం. అనంతరం అటవీ భూమిని అర్హులైన గిరిజనులు, రైతులకు అందజేస్తాం. విధానసభలో రైతు సంఘం, ఆదివాసీలతో అధికారులు సమావేశం నిర్వహించారు. రైతులు తమ ముందు ఉంచిన అన్నీ డిమాండ్లు నెరవేర్చాం. 2005కు ముందు నుంచి అటవీ భూమి సాగు చేస్తున్నట్టు పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. తమ ప్రభుత్వం రైతు ప్రభుత్వం. ఇది చాలా సున్నితమైన అంశం. ర్యాలీలో పాల్గొన్న వారిలో 90 నుంచి 95 శాతం మంది నిరుపేద గిరిజనులు. వారంతా అటవీ భూమిపై హక్కు కోసం పోరాడుతున్నారు. వారికి భూమి లేకపోవడంతో సాగు చేయలేకపోతున్నారు. అందరికీ న్యాయం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మహా పాదయాత్రనుద్దేశించి అసెంబ్లీలో చర్చిస్తాం అని రైతు సంఘం నాయకులకు హామీ ఇచ్చారు.

తలొగ్గిన మహా ప్రభుత్వం

రైతుల ప్రవాహం చూసిన మహారాష్ట్ర ప్రభుత్వం వారి డిమాండ్లకు దిగి వచ్చింది. రైతు సంఘం నాయకులతో చర్చలు నిర్వహించడానికి సీఎం ఫడ్నవిస్ సిద్ధంగా ఉండటంతో పలువురు వెళ్లి చర్చించారు. తమ డిమాండ్లన్నీ ప్రభుత్వం నెరవేర్చడానికి సిద్ధమైందని రైతు సంఘాల నాయకులు వివరించారు. ప్రభుత్వం నుంచి నిర్ణయాలు ప్రతికూలంగా వస్తే.. అసెంబ్లీ ముట్టడికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించిన నేపథ్యంలో ప్రభుత్వం దిగొచ్చినట్టు కనిపిస్తున్నది. రైతుల తమ ముందు పెట్టిన డిమాండ్లు అన్నీ నెరవేర్చినట్టు రెవెన్యూ శాఖ మంత్రి చంద్రకాంత్ పాటిల్ ప్రకటించారు. ఆజాద్ మైదానికి చేరుకుని రైతులకు సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంఘీభావం తెలిపారు.

గిరిజనులకు భూమి ఇవ్వాలి : అశోక్ ధవలే, సీపీఎం నాయకుడు

సీపీఎం అనుబంధ సంఘమైన ఆలిండియా కిసాన్ సభ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ చేపట్టామని, రుణమాఫీ, అటవీ భూమిని సాగు భూమిగా మార్చి రైతులకు అందజేయాలని, సీపీఎం నాయకుడు అశోక్ ధవలే డిమాండ్ చేశారు. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలన్నారు.

అన్ని డిమాండ్లు నెరవేర్చాలి :రాహుల్ గాంధీ

గిరిజనులు, రైతులు చేపట్టిన పాదయాత్రపై ప్రధాని నరేంద్రమోడీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవిస్ స్పందించాలని రాహుల్‌గాంధీ కోరారు. వారి డిమాండ్లను నెరవేర్చాలన్నారు. గర్వాన్ని పక్కనపెట్టి ప్రజా ప్రతినిధిగా రైతు సమస్యలు పరిష్కరించాలి. ప్రజల శక్తికి చక్కని ఉదాహరణే మహారాష్ట్రలో నిర్వహించిన పాదయాత్రని, కాంగ్రెస్ పార్టీ గిరిజనులు, నిరుపేద రైతుల పక్షాన ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా చేపట్టిన పాదయాత్రకు పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని తెలిపారు.

(6వ పేజీ తరువాయి											10
131	65-5B	G.W	1.06	0.43	శ్రీ పొత్తూరి నాగరాజు తండ్రి/- నరసింహరాజు	65-5A	68-2	65-5C	65-4B		
132	77-4B	G.D	0.31	0.0150	శ్రీ ముదునూరి నాగరాజు వరప్రసాద్ రాజు తండ్రి/- సత్యనారాయణ రాజు	48-8B	49-6	77-4A,5B	77-4A		
133	77-4B	G.D	0.31	0.1550	శ్రీ ముదునూరి నాగరాజు తండ్రి/- వెంకట్రాజు	48-8B	49-6	77-4A,5B	77-4A		38 కొబ్బరి చెట్లు
134	77-5B	G.W	0.78	0.03	శ్రీ గాదిరాజు సూర్య నారాయణరాజు తండ్రి/- వెంకటరామరాజు	77-4B	49-6	77-5A	77-4A,5A		5 కొబ్బరి చెట్లు
135	78-2A	G.D	0.06	0.03	శ్రీమతి పొత్తూరి పార్వతి భర్త/- రామలింగరాజు	47-12	78-3,6A	78-2B	47-12		
136	78-3	G.D	0.28	0.18	శ్రీమతి పొత్తూరి పార్వతి భర్త/- రామలింగరాజు	47-12, 78-14	78-5	78-6A	78-2A		
137	78-3	G.D	0.28	0.05	శ్రీమతి దాట్ల విజయలక్ష్మి భర్త/- గోపాలకృష్ణంరాజు	47-12, 78-14	78-5	78-6A	78-2A		21 టాడిచెట్లు 6 చింత
138	78-3	G.D	0.28	0.05	శ్రీమతి పెన్మెత్స అనుష భర్త/- కృష్ణవర్మ	47-12, 78-14	78-5	78-6A	78-2A		100 గెడబాగులు 22 కొబ్బరి చెట్లు 3 వేప చెట్లు
139	78-4	G.D	0.02	0.01	శ్రీమతి దాట్ల విజయలక్ష్మి భర్త/- గోపాలకృష్ణంరాజు	47-12	78-5	78-3	78-3		
140	78-4	G.D	0.02	0.01	శ్రీమతి పెన్మెత్స అనుష భర్త/- కృష్ణవర్మ	47-12	78-5	78-3	78-3		
141	78-5	G.D	0.12	0.12	శ్రీమతి రుద్రరాజు సుజాత భర్త/- శ్రీహరిరాజు	47-12	48-1A,1B1	78-6A	78-3,4		12 కొబ్బరి చెట్లు 5 టాడిచెట్లు
142	78-6A	G.W	1.46	0.15	శ్రీమతి పొత్తూరి పార్వతి భర్త/- రామలింగరాజు	78-3,5	78-8A	78-6B,7,8B	78-2A	పెద్ద పెంకుటిల్లు సాల 1 సర్వీసు కరెంటు మీటరు 1	43 కొబ్బరి చెట్లు 3 టాడిచెట్లు
143	78-6A	G.W	1.46	0.14	శ్రీమతి దాట్ల విజయలక్ష్మి భర్త/- గోపాలకృష్ణంరాజు	78-3,5	78-8A	78-6B,7,8B	78-2A		6 కొబ్బరి చెట్లు 3 టాడిచెట్లు సపోట 1
144	78-6A	G.W	1.46	0.14	శ్రీమతి పెన్మెత్స అనుష భర్త/- కృష్ణవర్మ	78-3,5	78-8A	78-6B,7,8B	78-2A		
145	78-8A	G.D	0.52	0.06	శ్రీమతి పొత్తూరి సుబ్బలక్ష్మి భర్త/- శ్రీనివాసరాజు	48-1B1	48-3A	78-8B	78-6A		
146	78-8A	G.D	0.52	0.08	శ్రీమతి పెన్మెత్స అనుష భర్త/- కృష్ణవర్మ	48-1B1	48-3A	78-8B	78-6A		గెడబాగులు 296
147	65-6A	G.W	0.96	0.34	టూసి సూర్యారావు తండ్రి/- పెద్ద అబ్బులు	65-4B,5B	68	65-6B	70-4A		18 కొబ్బరి చెట్లు 1 ములగ, 2 వేప
148	65-6A	G.W	0.96	0.16	కొన్నల రవికుమార్ తండ్రి/- విష్ణు మూర్తి	65-4B,5B	68	65-6B	70-4A		
149	70-3A	G.W	1.09	0.0050	రుద్రరాజు నరసింహరాజు తండ్రి/- వెంకటరాజు	65-4B,3B	70-4A	70-3B	70-3B		
150	70-4A	G.W	0.30	0.06	సిరాల సుబ్బారావు తండ్రి/- నర్సింహులు	65-4B,3B	65-6A	70-4B	70-3A		
	Total			36.13							

ఈ భూముల ప్లాను శ్రీయుత కలెక్టర్ పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు మరియు శ్రీయుత సబ్ కలెక్టరు, నరసాపురం వారి కార్యాలయంలో ఉంచటమైనది. దానిని ఈ కార్యాలయపు పని వేళలలో ఏ సమయంలోనైన తనిఖీ చేసుకొనవచ్చును ఈ భూసేకరణ వలన 7 కుటుంబాలు నిర్వాసితులైనవి.

బొగ్గు గనులు ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో అవసరమైన భూ భాగమును మాత్రమే త్రవ్వుట గానితొలగించుట గాని చేయవలెను.

సం/- భాస్కర్ కాటంనేని ఐ.ఎ.ఎస్., జిల్లా కలెక్టరు, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు.

అఖిల భారత స్థాయి పోలీసు డ్యూటీమీట్‌లో
ఏపీ పోలీసుల ప్రతిభ

• అభినందించిన డీజీపీ మాలకొండయ్య



అమరావతి, ఆంధ్రప్రభ: అఖిల భారత స్థాయిర పోలీసు డ్యూటీమీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర డీజీపీ డాక్టర్ ఎం.మాలకొండయ్య అభినందించారు. గత నెల 24 నుంచి 28 వరకు చెన్నైలో 61వ అఖిల భారతస్థాయి పోలీసు డ్యూటీమీట్ జరిగింది. జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాలతో పాటు కేంద్ర ఆర్మడ్ పోలీసు ఫోర్సెస్(సీఏపీఎఫ్) మధ్య నిర్వహించిన పోటీల్లో రాష్ట్ర పోలీసులు రెండు రజత, ఒక కాంస్య పతకంతోపాటు విన్నర్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ సాధించారు. ఈసందర్భంగా సోమవారం మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో వారిని అభినందించడంతో పాటు శాఖాపరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. వీడియోగ్రఫీ విభాగం, ఓవరాల్ విన్నర్స్ ఛాంపియన్ ట్రోఫీ విభాగాల్లో రాజమండ్రి క్లూస్ టీమ్‌కు చెందిన ఎన్.అశోక్ కుమార్(పీసీ 3006)తో పాటు వి.ఆనంద్(పీసీ 269), కృష్ణాజిల్లా క్లూస్‌టీమ్ నుంచి కె.పవన్‌కుమార్(పీసీ 852), శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆక్టోపస్ హెడ్ కానిస్టేబుల్ కె.డి.ఆర్.వి.ప్రసాద్ గెలుచుకున్నారు. వీడియో విభాగానికి కోచ్‌గా ఎస్ఐబి హెచ్‌సి పి.అబ్దుల్ గఫార్ (హెచ్‌సి 1460) వ్యవహరించారు. యాంటీ సెబొటేజ్ చెక్(వెహికల్ సెర్చ్) విభాకంలో ఎన్.రామారావు (హెచ్‌సి 363) రజత పతకం సాధించగా, ఐఎస్‌డబ్ల్యూ పీసీ ఇ.శేషగిరిరావు(పీసీ 1036) కాంస్య పతకం సాధించారు. కోచ్‌గా వివివి సత్యనారాయణ, ఈశ్వరరావులు వ్యవహరించారు. అఖిల భారత పోలీసు డ్యూటీమీట్‌లో ఏపీ ప్రతిష్టను ఇనుమడింప చేసిన సిఐడి డీఎస్పీ కె.రామకృష్ణ, స్పోర్ట్స్ డీఎస్పీ ఎం.అరుణ్ బోస్‌ను డీజీపీ అభినందించారు. సమావేశంలో బెటాలియన్స్ ఐజీ రాజీవ్ కుమార్ మీనా తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా
పోలవరం పనులు



• 54.4 శాతమపనులు పూర్తి
• ఇప్పటివరకు రూ.3,448.29 కోట్లు ఖర్చు
• పోలవరం ప్రాజెక్టు సమీక్షలో సీఎం

అమరావతి, ఆంధ్రప్రభ : పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయడు పేర్కొన్నారు.సోమవారం ఆయన సచివాలయంలో పోలవరం ప్రాజెక్టుతో సహా ఇతర ప్రాధాన్యత ప్రాజెక్టులపై అధికారులతో సమీక్షించారు.గత వారం నుంచి కాంక్రీట్ పనులు మరింత వేగం పుంజుకున్నాయన్నారు. ఇంకా పూర్తి స్థాయి యంత్రసామాగ్రి,కార్మికుల సంఖ్య పెరగాల్సి ఉందన్నారు. మే కల్లా డయాఫ్రమ్ వాల్, జూన్ నాటికి జెట్ గ్రౌంటింగ్ పనులు పూర్తవుతాయని అన్నారు. ఇప్పటివరకు మొత్తం ప్రాజెక్టు మీద 54.4 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. కుడి ప్రధాన కాలువ 91 శాతం, ఎడమ ప్రధాన కాలువ 59.6 శాతం, హెడ్ వర్క్స్ 41.2 శాతం పూర్తయిందన్నారు. 70 శాతం తవ్వకం పనులు పూర్తయ్యాయని చెప్పారు. స్పిల్‌వే,స్పిల్ చానల్ కాంక్రీట్ పనులు 16 శాతం పూర్తయ్యాయని తెలిపారు. డయాఫ్రమ్ వాల్ 72 శాతం, రేడియల్ గేట్ల ఫ్యాబ్రికేషన్ పనులు 58 శాతం పూర్తయ్యాయని చెప్పారు. స్పిల్ వే, ఈసీఆర్ఎఫ్ డ్యామ్, గేట్లకు సంబంధించి మొత్తం 42డిజైన్లకు గాను ఇప్పటివరకు 14 డిజైన్లను సీడబ్ల్యూసీ ఆమోదించిందన్నారు. మరో 16 డిజైన్లను సమర్పించడం జరిగిందన్నారు. లక్షా 26వేల క్యూబిక్ మీటర్ల తవ్వకం పనులు జరిగాయన్నారు. 17వేల క్యూబిక్ మీటర్ల వరకు కాంక్రీట్ పనులు పూర్తయ్యాయని చెప్పారు. వరదనీటి మళ్లింపునకు మొత్తం 9,189.81 కోట్ల వ్యయం అవుతుందని పేర్కొన్నారు. ఇందులో ఇప్పటివరకు రూ. 3,448.29 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఇంకా రూ. 5,741.52కోట్లు అవసరం అన్నారు. గుండ్రేవుల రిజర్వాయర్, తోటపల్లి కుడి,ఎడమ కాలువ అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు సీఎం తెలిపారు. ఇప్పటివరకు 8ప్రాజెక్టులు ప్రారంభించగా, మరో 5 పూర్తయ్యాయని చెప్పారు. మరో 15 ప్రాజెక్టులు జూన్ 15 నాటికి సిద్ధంకానున్నాయని అన్నారు. పోలవరం గ్రౌండ్ ఇంజనీరింగ్ పనులు చేపట్టిన కెల్లర్ సంస్థకు సీఐడీసీ విశ్వకర్మ అవార్డు -2018 దక్కిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కెల్లర్ ఇంజనీరింగ్ సంస్థను అభినంధించారు. జల సంరక్షణ ఉద్యమం చేపట్టి నేటితో నెల రోజులైందన్నారు. రూ. 247 కోట్ల విలువైన పనులు కార్యక్రమంలో చేపట్టామన్నారు.సమావేశంలో పోలవరం ప్రాజెక్టు అధికారులు,ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల ఎండీగా సూర్యకుమారి



• రామ్‌గోపాల్‌పై బదిలీ వేటు

అమరావతి, ఆంధ్రప్రభ: పౌరసర ఫరాలశాఖ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎ. సూర్యకుమారి నియమితులయ్యారు. గతంలో ఎండీగా పనిచేస్తున్న కె.రామ్‌గోపాల్‌పై బదిలీ వేటు పడింది. పౌరసరఫరాలశాఖలో రామ్‌గోపాల్ నిర్వాహకంపై ముఖ్యమంత్రికి ఫిర్యాదులు అందాయి. ఆంధ్రప్రభలో చంద్రన్న కానుక, సబ్సిడీ కందిపప్పుపై దారావాహిక కథనాలు ప్రచురించడం ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆయన వ్యవహారశైలిపై సీరియస్ అయినట్లు సమాచారం. దీంతో రామ్‌గోపాల్‌ను బదిలీ చేస్తూ ఆయనను జీఏడీలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు. ఆయన స్థానంలో ఎండీగా వచ్చిన సూర్యకుమారి గతంలో విజయవాడ శ్రీకనకదుర్గ దేవాలయం కార్యనిర్వహణాధికారిగా పనిచేశారు. రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన కనకదుర్గ గుడిలో జరిగిన అర్ధరాత్రి పూజల నేపథ్యంలో ఆమెను బదిలీ చేయడం జరిగింది. అప్పటి నుంచి జీఏడీలో ఉన్న సూర్యకుమారిని సివిల్ సప్లయ్స్ ఎండీగా నియమిస్తూ సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

జగన్‌ది దొంగల పార్టీ..!

• ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

అమరావతి ఆంధ్రప్రభ: వైకాపా అధినేత జగన్ పార్టీ దొంగల పార్టీ అని, పార్టీ ఆవిర్భావ దినోత్సవం స్టూవర్టుపురంలో జరపడం ఆ నాయకుల వైఖరిని స్పష్టం చేస్తోందని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన విలేకరులతో సోమవారం మాట్లాడారు. వైకాపా నాయకుల రాకతో అక్కడ దొంగలు పరారయ్యారని, స్టూవర్టుపురంలో ఎందరో జనజీవన స్రవంతిలో కలిశారని..అయితే వైకాపా నాయకులు మాత్రం మారడం లేదన్నారు. 43 వేల కోట్ల అవినీతి కేసుల్లో ఏ- వన్ నుంచి ఏ- టెన్ వరకు దొంగలు ఉన్నారని అన్నారు. సోనియాగాంధీతో రాజకీయ పొత్తులో భాగంగా బెయిల్ తెచ్చుకున్న జగన్ ఆస్తులను కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడ్తున్నారని ఆరోపించారు. దొంగ పాదయాత్రలు చేస్తున్న జగన్ ప్రజలను మోసగిస్తూనే ఉన్నారన్నారు.

లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకు వస్తుంటే జగన్ వాటిని అడుగడుగునా అడ్డుకుంటు రాష్ట్రాభివృద్ధికి అడ్డంపడ్తున్నారని విమర్శించారు. రాయలసీమలో సరస్వతి భూములను ఎస్సీ ఎస్టీ రైతుల నుంచి జగన్ వర్గీయులు బలవంతంగా లాక్కుంటున్నారని ఆంజనేయులు ఆరోపించారు. జగన్ గుంటూరు జిల్లాలో అడుగు పెట్టేముందు రైతులకు క్షమాపణలు పెట్టి ప్రవేశించాలని ఆంజనేయులు డిమాండ్ చేశారు.

పోరాటాలతోనే సుస్థిరస్థానం

• వైకాపా నేతుభూమన కరుణాకర్‌రెడ్డి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను సాధించి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపటమే లక్ష్యంగా వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ముందుకు సాగుతోందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భూమన మాట్లాడుతూ పార్టీ ఏడేళ్ల ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లు, కష్టనష్టాలు ఎదుర్కొని ప్రజల ఆదరాభిమానాలతో మహావృక్షంగా ఎదిగిందన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజల పక్షాన వీరోచితంగా పోరాటాలు చేస్తూ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకుందన్నారు. ప్రతిపక్షనేతగా జగన్ ప్రత్యేక హోదాకోసం దీక్షలు ధర్నాలు ఆందోళనలతో నిరంతర పోరాటాలు చేస్తున్నారన్నారు. జగన్ చేస్తున్న పోరాటాలకు భయపడే చంద్రబాబు హోదాపై గొంతు పెగలుసున్నారన్నారు. చంద్రబాబు ఎంత మోసం చేయాలని ప్రయత్నించినా ప్రజలు ఆయన్ను నమ్మే పరిస్థితి లేదన్నారు.

ప్రజల భవిష్యత్‌తో ఆటలాడవద్దు


• పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి



అమరావతి ఆంధ్రప్రభ : ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు విషయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షానే పోరాడుతుందని, బీజేపీతో మెతక వైఖరి అవలంభిస్తున్న పార్టీలు తమ విధానాన్ని మార్చుకోవాలని, ఆ పార్టీలు ప్రజల భవిష్యత్‌తో ఆటలాడు కోవద్దని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి అన్నారు. విజయవాడ పీసీసీ రాష్ట్ర కార్యాలయం ఆంధ్ర రత్నభవన్‌లో ఆయన విలేకరులతో సోమవారం మాట్లాడారు. రాష్ట్ర విభజనకు అందరూ బాధ్యులేనని అయినా కాంగ్రెస్ ద్రోహం చేసిందని బాధ్యత కలిగిన వారు మాట్లాడడం సరైన విధానం కాదన్నారు. గత నాలుగేళ్లుగా నాలుగేళ్ల తర్వాత కూడా ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీల అమలు కోసం కాంగ్రెస్ నిరంతరం పోరాడ్తూనే ఉందన్న విషయం తెలిసి కూడా కాంగ్రెస్ మోసం చేసిందని చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమని, కాంగ్రెస్‌పై ఈ మాదిరి ఆరోపణలు చేస్తే ప్రజలు సరైన రీతిలో బుద్ధి చెప్తారని రఘువీరారెడ్డి హెచ్చరించారు. తమ పోరాటాల ద్వారా బీజేపీని రాష్ట్రంలో ఏకాకిగా చేయగలిగామని, నిజాయితీగా ప్రజల ఎజెండాగానే కాంగ్రెస్ ఇవే అంశాలపై పోరాడ్తూనే ఉందన్నారు. ప్రత్యేక హోదా వద్దని టీడీపీ ఆనాడే చెబితే హోదా కావాలనేలా చేసింది కేవలం కాంగ్రెస్ పార్టీ అన్నది మాత్రం అన్ని పార్టీల బాధ్యులు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీతో మెతక వైఖరి వల్ల పార్టీలకు ఒరిగేది ఏమీ లేదన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా ఢిల్లీకి వెళ్లి మోడీతో తాడోపేడో తేల్చుకోవాలని రఘువీరారెడ్డి అన్నారు. భవిష్యత్ తరాలకు అన్యాయం జరుగుతున్నందున అన్యాయంపై పోరాడేందుకు అందరు ఏకం కావాల్సిన చారిత్రక అవసరం ఏర్పడిందన్నారు. ఏప్రిల్ 5వ తేదీ తర్వాత ఎవరి రాజకీయాలు వారు చేసుకోండన్న రఘువీరా రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా రాజకీయాలకు అతీతంగా 25 రోజులు రాజకీయాలను పక్కనబెట్టి పోరాడదామని అన్నారు.

లాబీయింగ్, పైరవీలతో రాష్ట్రానికి అన్యాయం

• జగన్, విజయసాయిరెడ్డిలపై సోమిరెడ్డి మండిపాటు



అమరావతి, ఆంధ్రప్రభ: ఢిల్లీలో జగన్ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఢిల్లీలో పైరవీలు, లాబీయింగ్‌చేస్తూ రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేస్తున్నా రని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. జగన్‌కు కేసులు, తన కుటుంబం తప్ప ప్రజా సంక్షేమం పట్టదన్నారు. ప్రతిపక్ష పార్టీ రాజకీయాలు నవ్వులపాల్జేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వేర్పాటువాదంతో బీజేపీ మరోసారి నవ్యాంధ్రను విడగొట్టడానికి కుట్రపన్నుతోందని మంత్రి సోమిరెడ్డి ఆరోపించారు. సచివాలయంలోని నాలుగో బ్లాక్ పబ్లిసిటీ సెల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీ తీరుతో రాజకీయం నవ్వుల పాలవ్వుతోందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాభివృద్ధి కోసం తపన పడుతుంటే విపక్షనేత జగన్ కేసులు, ఆస్థులు అంటూ రాజకీయం సాగుతోందన్నారు. ఢిల్లీ పైరవీలు, లాభీయింగ్ చేసే బాధ్యత ఎంపీ విజయసాయిరెడ్డికి జగన్ అప్పగించారని మంత్రి ఎద్దేవా చేశారు. ఓ వైపు ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేదిలేదని కేంద్ర ఆర్థికమంత్రి జైట్లీ స్పష్టం చేశారన్నారు. మరోవైపు ప్రధాని నరేంద్రమోడీపై తమకు నమ్మకం ఉందని ఆయన తప్పకుండా ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తారని చెబుతూ, కేంద్రప్రభుత్వంపై అవిశ్వాస తీర్మాణం పెడతామంటూ విపక్ష వైకాపా చెబుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ భగవద్గీతతో పోలుస్తూ ప్రతిపక్ష నేతలు, వారి మీడియా ఆకాశానికి ఎక్కిస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేక హోదా ఇవ్వలేమని కేంద్ర ప్రభుత్వం ఖరాకండీగా చెబుతుంటే ప్రధాని నరేంద్రమోడీని నిలదీయడం చేతగాని దద్దమ్మలని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును టార్గెట్ చేస్తూ విమర్శలు చేయడాన్ని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక ఓటు రెండు రాష్ట్రాలంటూ బీజేపీ మరోసారి ఏపీని విడగొట్టాలని కుట్ర పన్నుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమ వాదాన్ని వినిపిస్తున్న బీజేపీ, వైకాపాలను నిలదీయాలని పిలుపునిచ్చారు. రెండు పార్టీల నేతలు ఒకరి తప్పులను మరొకరు ఖండించుకోకుండా రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారని మంత్రి సోమిరెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేంద్ర సహకారం లేకున్నా
స్వయంకృషిని నమ్ముకుందాం!

• హక్కుల సాధనలో రాజీ లేదు • కేంద్రంపై పోరాటం కొనసాగిస్తాం • వడగాలులు, అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉవడాలి • కరవు ప్రాంతాల్లో సూక్ష్మసేద్యాన్ని ప్రోత్సహించాలి • అసెంబ్లీ తరువాత జిల్లాలో పర్యటిస్తా • నీరు-ప్రగతి టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ : కేంద్రం నుంచి ఆశించిన సహకారం లేకున్నా రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడడానికి వీలులేదని స్వయం కృషితో సమష్టిగా లక్ష్యాలను సాధిద్దామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. గడిచిన మూడేళ్లుగా అధికార యంత్రాంగం సహకారంతో రెండంకెల వృద్ధి సాధిస్తున్నామని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. అయితే రాష్ట్ర హక్కుల సాధనలో రాజీ లేదని కేంద్రంపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని తన నివాసం నుంచి నీరు-ప్రగతి, వ్యవసాయం పురోగతిపై అధికారయం త్రాంగంతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు రాష్ట్ర హక్కుల కోసం పోరాటం చేస్తూనే, మరోవైపు రాష్ట్రాభివృద్ధి, పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మన కష్టంతోనే మనం ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఎప్పటికైనా మన కష్టమే మనకు అక్కరకు వస్తుందన్నారు. వర్షపాతం లోటు ఉన్నప్పటికీ సమర్థనీటి నిర్వహణ ద్వారా వ్యవసాయం అనుబంధ రంగాలలో దిగుబడులు తగ్గకుండా చేస్తున్న కృషి ఫలించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో ప్రస్తుత నీటి మట్టం 834 అడుగులకు చేరుకుందని, హంద్రీ-నీవా ద్వారా ఈ ఏడాది 170 రోజులు సాగునీటిని ఇవ్వగలగడంపై రాయలసీమ రైతుల్లో హర్షం వ్యకమవుతోందని అన్నారు. ఈ నెలాఖరుకల్లా నరేగా లక్ష్యాలను చేరుకోవాలి. రోజుకు 24 లక్షల పనిదినాల లక్ష్యానికిగాను, 14 లక్షల మేండేట్స్‌కు చేరాం. మిగిలినవి కూడా ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఉపాధి కూలీలకు వేతనాలు సక్రమంగా చెల్లించాలన్నారు. వేతనాల చెల్లింపులో ఏ విధమైన జాప్యం జరుగరాదన్నారు.

వడగాలులు, అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి ..

వేసవిలో వడగాలులు, అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పంట నష్టం, జననష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో రాష్ట్రంలో నీటి సమస్య అనేదే ఉత్పన్నం కాకూడదన్నారు. పంట సంజీవని కార్యక్రమం చురుకుగా చేపట్టాలని, పంటకుంటల తవ్వకం పనులు ముమ్మరంగా నిర్వహించాలని అన్నారు. వర్మికంపోస్టు పిట్ల పనులు వేగవంతం చేయాలన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు చురుకుగా, ఉత్సాహంగా చేపట్టాలన్నారు. వేసవిలో తాగునీరు, విద్యుత్, పశుగ్రాస కొరత లేకుండా చూడాలన్నారు.

కరవు ప్రాంతాల్లో సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహించాలి ..

సూక్ష్మసేద్యం లక్ష్యంలో 70 శాతం మాత్రమే చేరామంటూ, మిగిలిన లక్షా 40 వేల ఎకరాల్లో కూడా పూర్తి చేయాలన్నారు. కరవు మండలాల్లో సూక్ష్మసేద్యాన్ని మరింతగా ప్రోత్సహించాలన్నారు. రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు కోటి ఎ కరాలకు చేరాలన్నదే తన ఆకాంక్షగా పేర్కొన్నారు. హార్టీకల్చర్ రంగం నుంచి రాష్ట్రానికి 25 శాతం ఆదాయం వచ్చే దిశగా కార్యక్రమాలు ముమ్మరం చేయాలన్నారు. జీబా వినియోగంపై రైతులను చైతన్యపరచాలని కోరారు. ఈ ఏడాది ప్రయోగాత్మకంగా అనంతపురం జిల్లాలో 2 లక్షల ఎకరాలలో జీబా వినియోగం ద్వారా కరువును అధిగమించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎకరానికి జీబా వినియోగానికి రూ.2,500 ఖర్చు అవుతుందని, కానీ దాని వల్ల నాలుగైదు రోజుల పాటు నీటి తడులు భూమిలోకి ఇంకకుండా సమర్ధనీటి నిర్వహణకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి గ్రామంలో పోషకాహార ఉద్యానవనాలను(న్యూట్రిటీ గార్డెన్స్) పెంచాలని సూచించారు. తల్లులకు, చిన్నారులకు పోషకాహారం వీటి నుంచే పొందేలా శ్రద్ధ చూపాలన్నారు.

అసెంబ్లీ తరువాత జిల్లాల్లో పర్యటిస్తా ..

అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. అభివృద్ధి పనులు, ప్రాజెక్టుల నిర్మాణాన్ని స్వయంగా పరిశీలిస్తానని టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు తెలిపారు. అన్ని పనులను సత్వరమే పూర్తి చేసేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏడు మిషన్లు, ఐదు గ్రిడ్లు, ఐదు ఉద్యమాల పనులు పకడ్బందీగా నిర్వహించాలని స్పష్టం చేశారు. అభివృద్ధి సంక్షేమం పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తే సహించే ప్రసక్తే లేదని అధికార యంత్రాంగాన్ని హెచ్చరించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి రామాంజనేయులు, వ్యవసాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్, ఆర్‌టీజీ సీఈవో బాబు.ఎ, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఉద్యానశాఖ కార్యదర్శి చిరంజీవి చౌదరి, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్, వివిధ జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో తృణ ధాన్యాల సరఫరా

• ఈ నెల నుంచి రూ.40కే కిలో కందిపప్పు
• ఫోటో గుర్తింపు కార్డుతో నిత్యావసర సరుకులు
• శాసనసభలో మంత్రి పత్తిపాటి పుల్లారావు వెల్లడి



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని రేషన్ దుకాణాల ద్వారా తృణధాన్యాలు పంపిణీ చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు చెప్పారు. ఇప్పటికే ఇస్తున్న రేషన్‌కు అదనంగా జొన్నలు, కొర్రలు, రాగులు అందజేయనున్నామన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో అవాంతరాలు తొలగించేందుకు వేలి ముద్రలు, కనుపాపలు(ఐరిష్) పడని పక్షంలో ఇబ్బందులను అధిగమించేందుకు ఎన్ఐసీ ఆధ్వర్యంలో ఫొటో గుర్తింపునకు ఆలోచన చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అక్రమాలకు తావులేకుండా ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే సరుకులు ప్రతి కార్డుదారునికి చేరాలనేదే ప్రభుత్వ లక్ష్యమని పుల్లారావు స్పష్టం చేశారు. సోమవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో అత్యవసర ప్రజాప్రాముఖ్యం కలిగిన విషయంగా ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ప్రజాపంపిణీ వ్యవస్థలో ఈ-పాస్ యంత్రాల కారణంగా ఎదురవుతున్న సమస్యలపై అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ డిపోల్లో బియ్యం, పంచదార, గోధుమలు ఇస్తుండగా మార్చి నుంచి రూ.40కి కిలో కందిపప్పు అందజేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మినప, పెసర పప్పుతోపాటు ఎండు మిర్చి ఆలోచన కూడా ఉందన్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ-పాస్ విధానం దేశానికే ఆదర్శంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా మన రాష్ట్రం అమలు చేస్తున్న ఈ-పాస్ విధానాన్ని ఆదర్శంగా తీసుకుందని చెప్పారు. నిత్యావసర సరుకులు అవకతవకలకు ఆస్కారం లేకుండా నిజాయితీగా ప్రజలకు చేర్చడం ద్వారా రూ.1500 కోట్ల దుబారాను అరికట్టామన్నారు. ఈ-పాస్ విధానాన్ని రేషన్ డీలర్లు దుర్వినియోగం చేయకుండా బీప్ సిస్టం అమలులోకి తెచ్చామన్నారు. బీప్ శబ్దం వస్తేనే వేలిముద్ర పడినట్లుగా కార్డుదారులు గుర్తుంచుకోవాలన్నారు. వేలిముద్రకు అదనంగా ఐరిష్ విధానం కూడా అమలులో ఉందని చెప్పారు. గ్రామాలతో పాటు వాటికి అనుబంధంగా ఉన్న శివారు గ్రామాల(హామ్‌లెట్)కు కూడా నిర్ధేశించి రోజుల్లో రేషన్ సరుకులు సరఫరాకు డీలర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 42వేల రేషన్ కార్డులు ఉన్నట్లు చెప్పారు. 27లక్షల మంది రేషన్‌కార్డుదారులకు ఎక్కడి నుంచైనా నిత్యావసర సరుకులు తీసుకునే వెసులుబాటు కలిపించామన్నారు. వేలి ముద్రలు పడనప్పటికీ గ్రామ రెవిన్యూ అధికారులు(వీఆర్వో) గుర్తింపుతో రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ-పాస్ యంత్రాలు పని చేయకున్నా రేషన్ సరుకులు అందజేస్తున్నామన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి నెలా ఏదో ఒక తేదీ కాకుండా నిర్ధిష్ట తేదీలను పేర్కొంటూ వేలి ముద్రలు పడనివారికి నిత్యావసర సరుకులు ఇవ్వాలన్నారు. సామాజిక ఫించన్లు వేలిముద్రల ద్వారా 95శాతానికి పైగా ఇస్తుంటే రేషన్ అంతకంటే తక్కువ ఉండటమేంటని ఆయన ప్రశ్నించారు. వీఆర్వోలు పరిమితంగా ఉండటంతో ప్రతి నెలా గుర్తింపు ఇవ్వకపోవడం వలన మూడేసి నెలల వరకు రేషన్ కోసం కార్డుదారుల ఎదురు చూడాల్సి వస్తోందన్నారు. పైగా శివారు గ్రామాల ప్రజలు రేషన్ సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే కొత్తగా వివాహాలు చేసుకున్న వారు, కార్డులో చేర్చాలని కోరిన వారికి సంబంధించి వెంటనే తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. బీజేపీ పక్షనేత పి.విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బొండా ఉమామహేశ్వరరావు ఈ-పాస్ యంత్రాల వలన కార్డుదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, డీలర్ల అక్రమాలు వంటి సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు.

కిరోసిన్ హాకర్లకు న్యాయం

దశాబ్దాలుగా కిరోసిన్ పంపిణీలో ఉన్న హాకర్లకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం అవపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి పుల్లారావు చెప్పారు. కిరోసిన్ హాకర్లకు ఉపాధి కలిపించాలంటూ బీజేపీ పక్షనేత పి.విష్ణుకుమార్ రాజు సభ దృష్టికి తీసుకురాగా మంత్రి సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం కిరోసిన్ సరఫరా నిలిపేయడంతో హాకర్లు తొలగించినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,263మంది హాకర్లకు గాను రేషన్ డిపో డీలర్లుగా ఇచ్చేందుకు అవకాశాలు ఇచ్చామన్నారు. ఇటీవల హెచ్‌పిసీఎల్ సంస్థ తెల్ల కిరోసిన్ డీలర్ల నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేయగా, ఇందులో హాకర్లకు ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మిగిలిన కంపెనీలు కూడా నోటిఫికేషన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోనున్నామన్నారు. కిరోసిన్ హాకర్లు ముందుకు వస్తే చంద్రన్న విలేజ్ మాల్స్‌లో అవకాశం ఇచ్చేందుకు ప్రభుత్వానికి అభ్యంతరం లేదని, అర్హులకు పింఛన్లు కూడా మంజూరు చేస్తున్నామన్నారు. అయితే మత్స్యకారులకు ఇస్తున్నట్లుగా 50ఏళ్ల వయస్సున్న హాకర్లకు పింఛన్లు ఇవ్వాలని విష్ణుకుమార్ రాజు కోరగా, పరిశీలించనున్నట్లు మంత్రి హామీ ఇచ్చారు.

సిమో ఒలింపియాడ్స్‌లో
నార యణ హవా

హైదరాబాద్,ఆంధ్రప్రభ: జాతీయస్థాయిఓ సీమో ఎడ్యుకేషన్ నిర్వహించిన మ్యాథ్స్, సైన్స్ ఒలింయాడ్స్‌లో నారాయణ స్కూల్స్ తమ హవాను చాటుకున్నాయి. సౌతిండియన్ ఫిజిక్స్ ఒలింపియాడ్‌లో జాతీయస్థాయి మొదటి 10 ర్యాంకుల్లో 77 శాతం నారాయణ విద్యార్థులే ఉన్నారని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి సింధూర నారాయణ తెలిపారు. బయాలజీ ఒలింపియాడ్‌లో టాప్ 10 జాతీయ ర్యాంకుల్లో 67 శాతం, సైన్స్ ఒలింపియాడ్‌లో 62 శాతం, కెమిస్ట్రీ ఒలింపియాడ్‌లో 60 శాతం టాప్ 10 ర్యాంకులను, మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో 34 శాతం ర్యాంకులను నారాయణ స్కూల్స్ విద్యార్థులు సొంతం చేసుకున్నారని తెలిపారు.

ప్రాజెక్టుల జాప్యాలపై
నివేదికలివ్వండి

న్యూఢిల్లీ: ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు,పథకాల అమలులో జాప్యంవల్ల వ్యయం బాగా పెరిగిపోతున్న దృష్ట్యా,ఇందుకుగల కారణాలను తెలియజేయాల్సిందిగా అన్ని మంత్రిత్వ శాఖలను ప్రభుత్వం ఆదేశించింది.ఈ మేరకు కేబినెట్ కార్యదర్శి పికె సిన్హా అన్ని శాఖలకూ ఒక సర్క్యులర్ పంపారు.

వాల్మీకులకు ఎస్టీలుగా చట్టబద్ధత కల్పించండి

• పార్లమెంట్ స్ట్రీట్‌లో న్యాయ విజ్ఞాపన దీక్ష



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లోని వాల్మీకి బోయలను ఎస్టీలుగా గుర్తించి పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని ఏపీ వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి (వీఆర్పీఎస్) డిమాండ్ చేసింది. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ఇందుకు సంబంధించిన బిల్లును పాస్ చేయాలంటూ ఆదివారం ఆంధ్రప్రదేశ్ భవన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టిన వీఆర్పీఎస్ సభ్యులు, నాయకులు సోమవారం పార్లమెంట్ స్ట్రీట్‌లో న్యాయ విజ్ఞాపన దీక్ష చేశారు. వాల్మీకులను ఎస్టీల జాబితాలో చేరుస్తూ గతేడాది డిసెంబర్ 2వ తేదీన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని వీఆర్పీఎస్ అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్ గుర్తు చేశారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో తమ రిజర్వేషన్లకు సంబంధించిన పని పూర్తి కాకపోతే ముఖ్యమంత్రి తమ సామాజిక వర్గ ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందన్నారు.

బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని
పథకానికి రూ. కోటి విరాళం



తిరుమల, ప్రభ న్యూస్: బెంగుళూరుకు చెందిన జి.ప్రసాద్‌నారాయణ శ్రీ బాలాజి ఆరోగ్య వరప్రసాదిని పథకానికి కోటి రూపాయలను విరాళంగా అందించారు. ఈ విరాళాన్న తిరుమలలోని జేఈవో క్యాంపు కార్యాలయం లో సోమవా రం తిరుమల జేఈవో శ్రీనివాసరాజుకు చెక్కు రూపంలో అందచేశారు. దాతకు టీటీడీ అధికారులు శ్రీవారి చిత్రపటం, తీర్ధ ప్రసాదాలను అందచేశారు.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

లక్షా 36 వేల ఉద్యోగాలు !



న్యూఢిల్లీ: కీలకమైన ఎనిమిది రంగాల్లో 1.36 లక్షల ఉద్యోగాలు వస్తాయని కార్మిక బ్యూరో ఒక సర్వేలో పేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్ త్రైమాసికం లో తయారీ, ఐటీ, రవాణా లాంటి కీలక రం గాల్లో ఉపాధి కల్పనలో గణనీయమైన వృద్ధి కనిపి స్తుందని తెలిపింది.

రంగాల వారీగా చూ సిన ప్పుడు తయారీ రంగం 89 వేల ఉద్యోగా లు, వి ద్యా రంగం 21 వేలు, రవాణా రంగం 20 వే లు, వాణిజ్యం 14 వే లు, ఆరోగ్యం 11 వే లు,అకా మడేషన్ అండ్ రెస్టారెంట్ 2 వేలు, ఐటీ/బిపిఒ రంగం 1,000 ఉద్యోగాలు జోడిస్తుందని వెల్లడిం చింది.

జీఎస్టీకి దెబ్బ మీద దెబ్బ

• బిల్లులు లేకుండా దిగుమతులు • నల్లబజారులో అమ్మకాలు
• తొమ్మిది నెలల్లోనే భారీగా ఎగవేతలు • పడిపోతున్న జీఎస్టీ వసూళ్లు



న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను(జిఎస్టీ) రంగంలోకి వచ్చి న తొమ్మిది మాసాల్లోపే నల్లబజారు గుండా, దిగు మతులను తక్కువ విలువ కట్టి చూపడం ద్వారా పెద్ద ఎత్తున పన్ను ఎగవే త చోటు చేసు కుంటున్న వైనాన్ని రెవెన్యూ అధికారులు గుర్తిం చారు. దిగుమతి దారులు జిఎస్టీ చెల్లిస్తున్నప్పటికీ బిల్లులు లే కుండా సరకులు సరఫరా చేస్తున్నారని అధికా రుల బిగ్ డేటా ఎనలిటిక్స్ వెల్లడించా యని సంబంధిత వర్గాలు తెలిపాయి.



డేటా అధ్యయనంతో చెక్

డేటా అధ్యయనం మొదలైందంటే దానర్థం ప్రభుత్వం త్వరలో పన్ను ఎగవేతదారులను గుర్తిస్తుందని భావించాలని ఎఎంఆర్‌జి అండ్ అసోసియేట్స్ పార్టనర్ రజత్ మోహన్ తెలిపారు. దిగువ తిదారులు పెద్ద ఎత్తున పాల్ప డుతున్న పన్ను ఎగవేతను అధికారులు వెలుగులోకి తీసుకు రావాలని తాను భావిస్తున్నట్టు చెప్పారు. వారు లగ్జరీ వస్తువులు లేదా మొబైల్ ఫోన్లు లాంటి సరకు లను అత్యం త తక్కువ ధరల వద్ద దిగుమతి చేసుకుంటారు. అనంతరం అలాంటి వస్తువులను ఎలాంటి పన్నులు చెల్లించకుండా నల్ల బజారు లో విక్రయిస్తారని రజత్ మోహన్ తెలిపారు. తక్కువ వసూళ్ళతో కునారిల్లుతున్న ప్రభుత్వం పన్ను ఎగవేతదా రులపై దాడికి డేటా ఎనలిటిక్స్‌ను వినియో గిస్తుందని చెప్పారు.

లోక్‌సభకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమాధానం ప్రకారం

జీ ఎస్టీ వసూ ళ్ళు జు లైలో రూ.93,590 కోట్లు,ఆగస్టులో రూ. 93,029 కోట్లు, సెప్టెంబ ర్‌లో రూ.95,132 కోట్లు, అ క్టోబర్‌లో రూ.85,931 కోట్లుగా ఉన్నాయి.అలాగే న వం బర్‌లో వసూళ్ళు రూ. 83,716 కోట్లు కాగా డిసెం బర్ లో రూ.88,929 కోట్లు, జనవరిలో 88,047 కోట్లుగా ఉన్నాయి.

ఎగవేతదారులపై నజర్

జిఎస్టీ కింద నెలవారి రెవిన్యూలు పడిపోతున్న తరుణంలో 73,000 మందికిపైగా పన్ను చెల్లింపుదారులు దాదాపు రూ.30 వేల కోట్ల వరకు ఐజిఎస్టీ చెల్లిస్తున్నారు కానీ దానికి రిఫండ్ క్లయిమ్ చేసుకోవడం లేదని ప్రాథమిక డేటా అధ్యయనం తేల్చింది. ప్రొప్రయిటర్, పార్టనర్‌షిప్ కంపెనీలపై కన్నేసిన రెవెన్యూ శాఖ ఎగవేతదారులను గుర్తించేందుకు రిస్క్ ఆధారిత పరామితులను వినియోగి స్తున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. రెవెన్యూ అధికారుల దగ్గరున్న డేటా ప్రకా రం రూ.16,965 కోట్ల విలువైన ఐజిఎస్టీ రి ఫండ్ క్లయిమ్‌లు జులై-జనవరి కాల వ్యవ ధికి కస్టమ్స్ సిస్టమ్‌ల వద్ద దఖలు అ య్యా యి. రూ.9,760 కోట్ల విలువైన అర్హమైన క్లయిమ్‌లకు గాను దాదాపు రూ.4,815 కోట్లు రిఫండ్లుగా మంజూరయ్యాయి.

ఐజీఎస్టీ చెల్లింపుతో సరి

దిగుమతిదారులు దేశంలోకి తీసుకువచ్చిన సరకులపై సమీ కృత వస్తు, సేవల పన్ను(ఐజిఎస్టీ) చెల్లిస్తారు. ఈ పన్నును చిట్టచి వరి వినియోగదారు చెల్లించేవాస్తవికజిఎస్టీకి ప్రతిగా చెల్లించ డంలేదా రీఫండ్‌క ు క్లయిమ్ చేసుకోవడం జరగాలి. అధ్యయన ఫలితాల ప్రకారం పెద్ద కంపెనీలు సహా దిగుమతిదారులు దిగుమ తులపై ఐజిఎస్టీ చెల్లిస్తున్నారు. కానీ దానికి జమ చేస్తున్నట్టు క్లయి మ్ చేయడంలేదు. దానర్థం ఎలాంటి బిల్లులు లేకుండానే దేశం లోకి సరకులను దిగుమతి చేస్తున్నారని సంబంధిత వర్గాలు తెలి పాయి. ఇదే పరిస్థితి లగ్జరీ సరకులపై విధించే సుంకానికి ఉంది. కంపెనీలు దిగుమతులు చేసుకునేటప్పుడు చెల్లిస్తున్నాయి కానీ వి నియోగదారులు చిట్టచివరి జిఎస్టీ చెల్లించినప్పుడు దానిని జమ చేస్తున్నట్టు క్లయిమ్ చేయడంలేదు. పన్ను ఎగవేత అంశంపై జిఎస్టీ మండలి శనివారంనాటి సమావేశంలో చర్చించింది.



హైదరాబాద్‌లో ఇసే ఫుడ్స్ ప్లాంట్ !

• పౌల్ట్రీ టెక్నాలజీలో శిక్షణా కేంద్రం
• రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: జపాన్‌కు చెందిన ప్రముఖ ఫుడ్స్ కంపెనీ ఇసే ఫుడ్స్ తెలంగాణలో తన కంపెనీని ప్రారంభించనుంది. ఈ మేరకు ప్రభుత్వ అను మతులు, రాయితీలను ప్రభుత్వం తరపున మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్, మహేందర్‌రెడ్డిలు కంపెనీ సీనియర్ ప్రతినిధి బృందానికి సోమవారం అంద జేశారు. కంపెనీ ప్రతినిధి బృందంతోపాటు జపాన్ ప్రధానమంత్రి ప్రత్యేకసలహాదా రు మిత్సుహిరో మియాకోశి, జపాన్ వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో సమావేశ మయ్యారు. ఇసే ఫుడ్స్ సుమారు 47 బిలియన్ల యెన్ల అమ్మకాలను గత ఏడాది న మోదు చేసింది. కంపెనీకి దేశ, విదేశాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్లు ఉన్నాయి. ఇసే ఫుడ్స్ సిద్దిపేటలోని నంగనూర్ మండలంలోని నర్మెట్టా గ్రామంలో సుమారు 140 ఎకరాల్లో తన పరిశ్రమను ఏర్పాటు చేయనున్నది. ఇక్కడి నుంచి కోడిగుడ్ల ప్రాసెసిం గ్ పరిశ్రమతో పాటు కోళ్ళఫాంలో లభించే వ్యర్థలతో సేంద్రీయ ఎరువులను సైతం తయారు చేయనున్నది. దీంతోపాటు పౌల్ట్రీ టెక్నాలజీలో శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఇక్కడి విద్యార్థులను శిక్షణకోసం జపాన్ తీసుకువెళ్ళేందుకు అవకాశం కల్పిస్తుంది. దీంతో పాటు సుజుకి కంపెనీ భాగస్వామ్యంతో లిథియం అయాన్ బ్యాటరీల ఆర్‌అండ్‌డి కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. ఇదే కేంద్రం నుంచి రెండు, మూడేళ్లలో బ్యాటరీలను సైతం ఉత్పత్తి చేయనుంది. ఇసే ఫుడ్స్ హైదరాబాద్‌లోని నేషనల్ బ్యాడ్మింటన్ అకాడమీ ద్వారా టోక్యో ఒలంపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు ఒక ఎంవోయూను ఈ సందర్భంగా కుదుర్చుకున్నారు.జపాన్‌కు చెందిన ప్రముఖ కంపెనీ తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడంపట్ల మంత్రి కేటీ రామారావు హర్షం వ్యక్తంచేశారు. జపాన్‌లో పెట్టుబడుల కోసం పర్యటన చేసిన సందర్భంగా ఈ కంపెనీతో ఎంవోయూ కుదుర్చుకున్నామని గుర్తుచేశారు. జపాన్ ప్రధాని సలహాదారు, కంపెనీ ఛైర్మన్, ప్రతినిధులతో మంత్రులు సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వ పారిశ్రామిక విధానం, పాలసీలు, ఇక్కడి పెట్టుబడుల అనుకూల వాతావరణాన్ని మంత్రి వివరించారు. జపనీస్‌లో ముద్రించిన తెలంగాణ పారిశ్రామిక పాలసీని మంత్రి అదించారు. తెలంగాణకు జపాన్‌కు మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని, ఇప్పటికే జైకా వంటి ఆర్థిక సంస్థలు తెలంగాణలోని పలు ప్రాజెక్టులకు సహకారం అందిస్తున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడులకు 14 రంగాలకు ప్రాధాన్యత రంగాలుగా పెట్టుకున్నదని, ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో తెలంగాణ ప్రణాళికలను మంత్రి వివరించారు. తెలంగాణ సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా మార్చాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని, ప్రతి నియోజకవర్గానికి ఒక్క ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

• ఆర్థిక మంత్రిగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన
• గోల్డ్ స్కీంకు పచ్చజెండా • 13కంపెనీలకు రూ.4,500 కోట్ల ఆయాచిత లబ్ధి
• చర్యలకు కేంద్రం సన్నాహాలు
• వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రకటన

చిదంబరం మెడకు గోల్డ్ స్కీమ్!



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరంపై చర్యలకు ఉపక్రమించడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నది. యుపిఎ ప్రభుత్వం చివరి రోజుల్లో ప్రయివేట్ ట్రేడింగ్ కంపెనీల కోసం బంగారం దిగుమతిపై నియమ, నిబంధనలను సడలించిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. సడలింపు కారణంగా అలాంటి 13 కంపెనీలకు కేవలం ఆరు మాసాల్లోనే రూ.4,500 కోట్ల లబ్ధి చేకూరిందని పేర్కొంది. రూ.12,700 కోట్ల పిఎన్‌బి కుంభకోణంతో కాంగ్రెస్ నుంచి దాడిని ఎదుర్కొంటున్న పాలక బిజెపి చిదంబరంపై అస్త్ర శస్త్రాలను సంధించింది. 80:20 స్వర్ణ దిగుమతి పథకం ద్వారా పిఎన్‌బి స్కామ్‌లో ప్రధా న నిందితులు మెహుల్ చోక్సీ, నీరవ్ మోడీలకు చిదంబరం సాయం చేశారని ఆరోపిం చింది. సోమవారం నాటి ప్రకటనలో పథకం నుంచి లబ్ధి పొందిన వ్యాపారుల పేర్లను ప్రభుత్వం వెల్లడించలేదు.



ప్రయివేట్ స్వర్ణ దిగుమతిదారుల పట్ల అన్ని రకాల అనుకూలతలకు ముగింపు పలికే నిమిత్తం అధికారంలోకి వచ్చిన కొద్ది మాసాల్లోనే పథకాన్ని రద్దు చేయడం ద్వారా ప్రభుత్వం సాహసోపేతమైన అడుగు వేసిందని తెలిపింది. సదరు పథకం దే శంలోకి బంగారం దిగు మ తులను పెంచిందని, 2012-13 ఆర్థిక సంవత్సరానికి కరెం టు ఖాతా లోటుపై ఒత్తిడి పెట్టిందని వెల్లడించింది. ఫలితంగా కస్టమ్స్ సుంకం పెంపుదల సహా దిగుమతులపై అనేక ఆంక్షలకు దారి తీసింది. ఇది 2013 సంవత్సరం జులై, ఆగస్టు మాసాల్లో చోటు చేసుకుంది. అదే సమయంలో 20:30 పథకం బ్యాంకులు, ఎంఎంటిసి, ఎస్‌టిసి లాంటి ప్రభుత్వ రంగ సంస్థలు బంగారాన్ని దిగుమతి చేసుకోవడానికి అనుమతించింది. అందులో కేవలం ఐదవ వంతు మాత్రమే ఎగుమతి అయ్యింది. అయితే 2014, మే 21వ తేదీన 20: 80 పథ కం కింద బంగా రం దిగుమతికి ప్రీమియర్ ట్రేడింగ్ కంపెనీలు(పిటిహెచ్), స్టార్ ట్రేడింగ్ కంపెనీలను (ఎస్‌టిహెచ్) అను మతించడం జరిగింది అని ప్రభుత్వం సదరు ప్రకటనలో తెలిపింది. పథకం కింద బంగారం దిగుమతి చేసుకోవడానికి కడకు ప్రయివేట్ వ్యాపారులను సైతం అనుమతిస్తూ చిదంబరం తీసుకున్న నిర్ణయాన్ని ప్ర స్తావించింది. అప్పటి ఆర్థిక మంత్రి 2014, మే 13న సవరించిన పథకానికి ఆమోద ముద్ర వేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రకటనతో అదే ఏడాది మార్చి ఐదవ తేదీ నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. అదే ఏడాది మే 16న ఓట్ల లెక్కింపు జరగనుంది. అయినప్పటికీ సవరించిన పథకం ఆమోదం పొందింది అని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ సదరు ప్రకటనలో తెలిపింది. అప్పట్లో దేశీయంగా స్వర్ణ వినియోగానికి కొరత ఉంది. ఒక కేజీ బంగా రం దాదాపు రూ.2 లక్షలు పలికింది.



పిటిహెచ్, ఎస్‌టి హెచ్ లాంటి ప్రయివె ట్ కం పెనీలను స్వర్ణ దిగు మతికి అనుమ తించ డం వలన భారీ లబ్ధి పొందే అవకాశం సదరు కంపెనీలకు దక్కింది. అలాంటి కంపెనీలు ఇప్పటికీ బంగారంపై అత్యధిక ప్రీమియం పొందుతున్నా యి అని ప్రభుత్వం పేర్కొంది. ఈ సందర్భంగా కాగ్ నివేదికను ప్ర స్తావించింది. 2014 జూన్ నుంచి నవంబర్ మధ్యకాలంలో 13 ట్రేడింగ్ కంపెనీలు 282.77 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకున్నాయి. దానర్థం పైన పేర్కొన్న కాలవ్యవధిలో కేజీ బంగారం ధర రూ.2 లక్షలు చొప్పున దిగుమతి చేసుకున్న బంగారాన్ని దేశవాళీ మార్కెట్‌కు సరఫరా చేయడం ద్వారా సదరు కంపెనీలు దాదాపు రూ.4,500 కోట్ల మేరకు లబ్ధి పొందాయని పేర్కొంది. ట్రేడింగ్ కంపెనీలకు భారీగా లబ్ధి చేకూర్చడానికి దారి తీసిన పరిస్థితులను ప్రభుత్వం కచ్చితంగా పరిశీలిస్తుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ప్రకటన తెలిపింది. ప్రభుత్వ సంధికాలంలో పథకం తీసుకువచ్చిన వారిపై చర్యలు తప్పవని పేర్కొంది.



ఆస్తుల జాబితా ఇస్తే... వేలం వేస్తాం

• గృహ కొనుగోలుదారులకు చెల్లిస్తాం • యూనిటెక్ కంపెనీకి సుప్రీం కోర్టు అదేశం • ఆఫిడవిట్ దాఖలుకు 26 దాకా గడువు • జెఎం ఫైనాన్షియల్‌కు రూ.25 కోట్లు జరిమానా



న్యూఢిల్లీ: దేశ,విదేశాల్లోని వివాదరహిత ఆస్తుల జాబితా ఇవ్వాలని రియ ల్ ఎస్టేట్ కంపెనీ యునిటెక్ లిమిటెడ్, జైలు పాలైన కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సం జయ్ చంద్రను సుప్రీం కోర్టు సోమ వారం ఆదేశించింది. గృహ కొనుగోలుదారుల బకాయిలు తీర్చడానికి ఆస్తులు వేలం వేయడం జరుగుతుందని స్పష్టం చేసింది. చీ ఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఎ.ఎం. ఖన్‌విలకర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం యునిటెక్ లిమిటెడ్‌కు హెచ్‌డిఎఫ్‌సి అడ్వాన్స్ చేసిన కొన్ని రుణా లను తీసుకున్న జె.ఎం.ఫైనాన్షియల్ అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ (జెఎంఎఫ్‌ఎఆర్-సిఎల్)కు రూ.25 కోట్ల జరిమానా సైతం విధించింది. రెండు కంపెనీలూ కలిసి గృహ కొనుగోలుదారులకు జెఎంఎ ఫ్ఎఆర్-సిఎల్ నగదు తిరిగి చెల్లిస్తుందనే భావనను కలిగించాయని ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతం యావత్ విచారణ పక్కదారి పడుతున్నదని వ్యాఖ్యానించింది. ఇది ప్రధాన కేసును అనవ సరంగా పక్కదారి పట్టించిందని భావిస్తున్నామని జరిమానా విధించిన సంద ర్భంగా ధర్మాసనం పేర్కొంది. అసలైన గృహ కొనుగోలుదారులు ఇక్కడే ఉన్నారు. వారు మోసపోయారు అని వ్యాఖ్యానించింది. గృహ కొనుగోలుదారుల బకాయిలు తీర్చడానికి కంపెనీకి చెందిన వివాదరహిత ఆస్తులన్నింటిని వేలం వేయాలని ఆదేశిస్తాం అని ధర్మాసనం తెలిపింది.యునిటెక్ లిమిటెడ్‌కు చెందిన సమర్థ మంతమైన అధికారి భారతదేశంలో, విదేశాల్లో కంపెనీ, దాని అనుబంధ కంపెనీల వివాదరహిత ఆస్తుల జాబితాను ప్రస్తావిస్తూ ఒక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ఆదేశించింది. అఫిడవిట్ అవాస్తవమైన పక్షంలో భారతీయ శిక్షాస్మృతి(సిఆర్‌పిసి)లో సెక్షన్ 340 కింద చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించింది. కంపెనీ ఎండీ జైలులో ఉన్నారంటూ ఆయన తరపు సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ విన్న వించుకోగా, మీరు నగదు చెల్లించి బెయిల్ పొందండి అని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. వివాదరహిత ఆస్తులను నిగ్గుతేల్చే పనిలో చార్టెర్డ్ అకౌంటెంట్లు ఉన్నందున వాటి పూర్తి వివరాలు దాఖలు చేయడానికి సమయం కావాలని న్యాయవాది అభ్యర్థించారు. ధర్మాసనం ఈ నెల 26 దాకా సమయం ఇచ్చింది. జె ఎంఎ ఫ్ఎఆర్-సి ఎల్ కు జరిమా నా రద్దు చేసిన పక్షంలో కంపెనీ ఆ మొత్తం తో ప్రా జెక్టులను పూర్తి చేసి ఫ్లా ట్లను గృహ కొనుగోలు దారులకు అంద జేస్తుంటదనే అభ్యర్థన ధర్మా సనం ముందుకువచ్చిం ది. అయితే దానిపై ధ ర్మా సనం స్పందిం చలేదు.



డూప్లికేట్లకు క్యాష్ బ్యాక్!

• ఆన్‌లైన్ కొనుగోళ్లపై ప్రత్యేక మెకానిజం • వినియోగదారులకు అండగా సర్కారు • ఈ-కామర్స్ కంపెనీలతో మంతనాలు



న్యూఢిల్లీ: బ్రాండెడ్ ఐటెమ్స్ కోసం ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇస్తే వాటికి బదులుగా డూప్లికేట్ వస్తువుల ను పొందుతున్న బాధి తులు కోకొల్లలు. న్యాయం పొం దడానికి సరైన వే దిక లభించక బాధితులు ది క్కుతోచని స్థితిలో ఉం టున్నారు. ఈ నేపథ్యం లో ఆన్‌లైన్ ద్వారా డూప్లికేట్ వస్తువులను పొం దుతు న్న వినియోగదా రులకు పరిహా ర్థం ఒక యం త్రాం గాన్ని నెలకొ ల్పాలనే ఆలోచ నలో ప్రభుత్వం ఉంది. క్యాష్ - బ్యాక్ అనే పేరుతో పిలిచేందుకు అవకా శం ఉన్న అలాంటి ఒక సిస్టమ్ ఇంకా ఆలోచనల్లోనే ఉందని సంబంధిత అధికా రి ఒకరు తెలిపారు. దీనికి సంబంధించిన చర్చ లు ఇ-కామర్స్ కంపెనీలు, పారి శ్రామిక విధానం మరి యు ప్రోత్సాహక డిపార్ట్ మెంట్(డిఐపిపి), విని యోగ దారు వ్యవహారాల మం త్రిత్వ శాఖ మధ్య నడుస్తున్నా యి. యంత్రాం గం ముఖ్యో ద్దేశ్యం దేశీయ మార్కెట్‌లో డూప్లికేట్ ఉ త్పత్తుల విక్రయాన్ని అరి కట్టడం. ఆ క్ర మంలో ఇదే విషయమై మే ము అనేక మందితో సంప్ర దింపు లు జరపాల్సిన అవసరం ఉందని అధి కారి వెల్ల డిం చా రు. ప్రభుత్వ పరిగణన లో ఉన్న సదరు యంత్రాం గం స్వాభావికంగా స్వ తం త్రంగా వ్య వహ రించనుం ది. డూ ప్లికేట్ వస్తువుపై ఫిర్యాదు చేసే సౌలభ్యం, సదరు ఉ త్పత్తి డూప్లికేట్‌దా కాదా అని నిర్ధా రించేలా యం త్రాం గం రూప కల్పనపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి.

వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రకారం డూ ప్లికేట్ ఉత్పత్తులు గణనీయంగా పెరిగిపో తున్నాయి. అవి ఒక ప్రాపంచిక ప్రభావంతో విస్తృతమైన విధానంగా అవతరించాయి. వీటి వలన బ్రాండ్ విలువ పడిపోతుంది. తయారీదారుల పేరు ప్రతిష్ఠలు దెబ్బ తింటాయి. యజమానుల మేథోసంపత్తికి(ఐపి) పెను విఘాతంగా మారుతుంది. సామాజిక విపరిణా మాలకు దారి తీస్తుంది. ఫలితంగా పన్నులు, రెవె న్యూల నష్టంతో భారీ ఎత్తున ఆర్థిక నష్టాలకు కార ణమవుతుంది. అది ఇతర అక్రమ కార్యకలాపాలకు నిధుల మళ్ళింపునకు దారి తీస్తుంది. వినియో గదారుల ఆరోగ్యం, భద్రతకు ముప్పు వాటిల్లుతుంది.



టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

• మౌలిక సదుపాయాల కల్పన తప్పనిసరి • వంద శాతం హాల్ టిక్కెట్లు జారీ చేయాలి • రవాణా సదుపాయాలపై దృష్టి పెట్టాలి • ఫీజుల పేరుతో ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదు • అధికారులతో మంత్రి గంటా శ్రీనివాసరావు వీడియో కాన్ఫరెన్స్



అమరావతి, ఆంధ్రప్రభ: 15 నుంచి నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సోమవారం విజయవాడ క్యాంప్ కార్యాలయం నుంచి ఆయన సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బల్లపైనే కూర్చొని పరీక్ష రాయాల్సిందేనని అధికారులకు స్పష్టంచేశారు. ఎవరైనా ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడా మౌళిక సదుపాయాల కొరత రానీయొద్దని అన్నారు.ఫర్నీచర్ లేకుంటే అద్దెకు తీసుకోవాలని ఇప్పటికే అధికారులను ఆదేశించామని మంత్రి చెప్పారు. ప్రతి జిల్లా కేంద్రంలోను రవాణా సదుపాయాలపై దృష్టి సారించాలని డీఈవోలను ఆదేశించారు. విద్యార్థులకు వందశాతం హాల్‌టిక్కెట్లు జారీ చేయాల్సిందేనని అన్నారు. ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని ప్రైవేట్ యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు.ఫీజుల పేరిట హాల్ టిక్కెట్లు నిలిపేస్తే ఉపేక్షించేది లేదని మంత్రి స్పష్టంచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 2835 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, 6,17,484 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని మంత్రి పేర్కొన్నారు. హాల్‌టిక్కెట్ చూపిస్తే పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. సమస్యాత్మక సెంటర్లలో సీసీటీవీలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అరగంట ముందు విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల గుర్తింపునకు లొకేషన్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. విద్యార్థుల నుంచి ఫిర్యాదులు, సలహాలు, ఇతర సమాచారం కోసం ఫిర్యాదుల సెల్‌ను ఏర్పాటు చేయాలని కూడా అధికారులను ఆదేశించారు. ప్రతి హెడ్ క్వార్టర్‌లో కంట్రోల్ రూంతోపాటు ల్యాండ్ ఫోన్, ఫ్యాక్స్,టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసేలా సత్వరమే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇన్విజిలేటర్లకు సంబంధించి బయోమెట్రిక్ విధానాన్ని కూడా అమలు చేస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రికి బోర్డు ఉన్నతాధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాల కోసం 0866-2974450, 2974550 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ జిల్లాల డీఈవోలు, ఆర్జేడీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అమరావతి ఏసీ బస్సుల ప్రారంభం



అమరావతి, ఆంధ్రప్రభ: ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా ఏపీఎస్ఆర్టీసీ ఇప్పుడిప్పుడే నష్టాల నుంచి బయటపడుతోందని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రభుత్వం అత్యంత భారీ వ్యయంతో వోల్వ కంపెనీ నుంచి కొనుగోలు చేసిన అత్యాధునిక అమరావతి ఏసీ బస్సులను సోమవారం మంత్రి విజయవాడ బస్ భవన్‌లో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకించి, పూజలు నిర్వహించి, మొదట విడతగా వచ్చిన 9 అమరావతి ఏసీ బస్సులను ప్రారంభించారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేసిన కృషి వల్ల ఏపీఎస్ఆర్టీసీ లాభాల బాటపడుతుందన్నారు.సంస్థను కాపాడేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు బడ్జెట్‌లో భారీగా నిధుల కేటాయింపు కూడా చేశారని అన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2018 సంవత్సరంలో ఆర్టీసీ యాజమాన్యం అత్యాధునిక వసతులున్న 19 అమరావతి ఏసీ బస్సులను కొనాలని నిర్ణయించి,ఆమేరకు కొనుగోలుకు చర్యలు కూడా తీసుకున్నదన్నారు. ఒక్కో బస్సుకు రూ. 1,15,50,000 కోట్లు వెచ్చించి, అమరావతి ఏసీ బస్సులను కొనుగోలు చేశామన్నారు. ఈ కొత్త బస్సుల్లో ఆధునిక వసతులున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి పల్లె వెలుగు బస్సులను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.200 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాయితీల బకాయిల కోసం రూ. 290 కోట్లు కేటాయించామన్నారు. కార్మికుల కోసం త్వరలోనే వేతన సవరణ కూడా చేయడం జరుగుతుందని, ఇందుకు సంబంధించి ఇప్పటికే చర్చలు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఇక చిన్న చిన్న సమస్యలు పరిష్కారానికి కూడా అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వం గత కొంతకాలంగా తీసుకున్న చర్యల వల్ల సంస్థలో ఆక్యుపెన్సీని 67 నుంచి 70 శాతానికి పెంచుకోవడం ద్వారా రూ.350 కోట్ల మేర నష్టాలను తగ్గించుకోగలిగామని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి బస్సులోనికి వెళ్లి, లోపల ఏర్పాటు చేసిన ఆధునిక వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, సంస్థ ఎండీ డాక్టర్ మాలకొండయ్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు వెంకటేశ్వరరావు, జయరావు, రామకృష్ణ ఉన్నతాధికారి అన్సారీ, పీఆర్‌వో మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అన్సారీకి పదోన్నతి

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో బాధ్యతాయుతమైన చీఫ్ పర్సనల్ మేనేజర్‌గా, సంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్న డాక్టర్ ఎస్ఏ అన్సారీకి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. పదోన్నతిపై ఆయన విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయ నగరం జోన్ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఎ.రామకృష్ణ విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బదిలీకావడంతో ఏర్పడిన ఖాళీలో అన్సారీ నియమితులయ్యారు. 1986లో ఆఫీసర్ అండర్ ట్రైనీగా సంస్థలో చేరిన అన్సారీ డిపో మేనేజర్‌గా, రీజినల్ మేనేజర్‌గా అనేక కీలకమైన పదవులు నిర్వహించారు. ప్రస్తుతం సంస్థ ప్రధాన కార్యాలయంలో కొనసాగుతున్నారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నుంచి మానవ వనరుల నిర్వహణ అంశంలో పి హెచ్‌డీ చేసి డాక్టరేట్ పొందారు. సంస్థ లక్ష్యాలను , మార్కెటింగ్ పథకాలను సిబ్బందికి,ప్రజా బాహుళ్యానికి తెలియజేస్తూ ఆయన రూపొందించిన లఘు చిత్రాలు సంస్థకు చక్కని పేరు తెచ్చి పెట్టాయి.

విశాఖలో జూడాల భారీ ర్యాలీ

• సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగిస్తాం • ఆసుపత్రుల్లో రోగుల అవస్థలు



విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో: న్యాయపరమైన తమ డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని జూడాల సంఘం విశాఖ అధ్యక్షులు కోదండరామ్ తెలిపారు. గత ఐదు రోజులుగా జూనియర్ డాక్టర్లు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించడంతో పాటు అత్యవసర వైద్య సేవలు మినహా మిగిలిన అన్ని సేవలను నిలుపుదల చేశారు. సోమవారం సరస్వతీ పార్కు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు వేలాది మంది జూనియర్ డాక్టర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా అధ్యక్షులు కోదండరామ్ మాట్లాడుతూ గత సెప్టెంబర్ నుంచి పెండింగ్ ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలని, స్టైఫండ్, గౌరవ వేతనాలను 15 శాతం వరకు పెంచాలని కోరారు. జూనియర్ డాక్టర్ల సమ్మెతో విశాఖలోని అనేక ఆసుపత్రుల్లో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. కేజీహెచ్, ఘోషాసుపత్రిలో అత్యవసర సేవలు మాత్రమే కొనసాగుతున్నాయి.

ఇతర వైద్య సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. దీంతో కొంత మంది రోగులు ప్రయివేటు ఆసుపత్రులకు తరలివెళ్లిపోతున్నారు. తక్షణమే జూడాల సమ్మెను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది.

అమ్మవారి సేవలో టీడీపీ సీనియర్ నేతలు



సీఎం రమేష్, కనకమేడల రవీంద్రకుమార్లకు అమ్మవారి చిత్ర పటాలను అందిస్తున్న సిబ్బంది

అమరావతి, ఆంధ్రప్రభ: బెజవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను సోమవారం పలువురు ప్రముఖులు సేవించారు. రాజ్యసభ టిక్కెట్లు దక్కించుకున్న తెలుగుదేశం నాయకులు సీఎం రమేష్, హైకోర్టు సీనియర్ న్యాయవాది కనకమేడల రవీంద్రకుమార్ కుటుంబ సభ్యులతో వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ చైర్మన్ యలమంచిలి గౌరంగబాబు, సభ్యులు జి.పద్మశేఖర్, వి.శంకర్‌బాబు, ఏఈవో అచ్యుత రామయ్య ,ప్రధాన అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వారికి వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల్ని చల్లగా చూడాలని అమ్మ వారిని వేడుకున్నానని చెప్పారు. రాష్ట్ర సమస్యలు తొలగిపోవాలని కూడా వేడుకున్నట్లు వివరించారు. కాగా గుంటూరుకు చెందిన సిహెచ్. శ్రీనాథ్ అమ్మవారికి రూ. 1,25,000 విలువైన బంగారు గొలుసును బహూకరించారు.

ఏప్రిల్ 18న అప్పన్న చందనోత్సవం

• సాధారణ భక్తులకు పెద్దపీట వేయడమే లక్ష్యం
• పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశాలు



విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజల ఆరాధ్య దైవం, భక్తకోటి ఇలవేల్పు అయిన సింహాచలం శ్రీ వరాహాలక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం (నిజరూప దర్శనం) ఏప్రిల్ 18న నిర్వహించనున్నారు. ప్రతీ ఏటా సాంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ ఉత్సవాన్ని ఈ ఏడాది కూడా వైశాఖ శుద్ధ తదియ నాడు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఆలయ వర్గాలు భారీ ఏర్పాట్లు ప్రారంభించాయి. సాధారణ భక్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం భావిస్తుంది. ఇందుకోసం అవసరమైన క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో పాటు పటిష్టమైన బందోబస్తు, పార్కింగ్ సదుపాయాలు కల్పించడంతో పాటు భక్తుల కోసం ఉచితంగా బస్సులను ఏర్పాటు చేయనున్నారు. కొండపైకి వెళ్లేందుకు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించనున్నారు. భక్తులకు నీడ కల్పించేందుకు చలువ పందిళ్లు, త్రాగునీరు, ప్రసాదాలు పంపిణీ వంటి అన్ని ఏర్పాట్లు ఇప్పటి నుంచి చేయాలని అధికారులను అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలోనే జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సోమవారం సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆలయ ఇవో కె.రామచంద్రమోహన్, జీవీఎంసీ అదనపు కమిషనర్ జివిఎస్ఎస్ మూర్తి, జాయింట్ పోలీస్ కమిషనర్-2 టి.రవికుమార్ మూర్తి, ఏసీపీలు రవిబాబు, ప్రభాకరరావు తదితరులంతా పాల్గొన్నారు.

భాషా శాస్త్రాల్లో ప్రవేశాల వివరాలు సమర్పించండి

• ఏయూ, ఎస్‌వీయూ రిజిస్ట్రార్లకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంస్కృతం, తదితర భాషలు ప్రాధాన్యత కోల్పోయి కనమరుగయ్యే స్థితికి చేరుకున్నాయని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ), శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయాల్లో (ఎస్ వీయూ) ఉర్దూ, అరబిక్, పర్షియన్, సంస్కృతం, తెలుగు, ఆంగ్లం తదితర భాషా శాస్త్రాల్లో 2015-16 విద్యా సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ప్రవేశాలు పొందిన విద్యార్థుల వివరాలు సమర్పించాలని ఎస్ వీయూ, ఏయూ రిజిస్ట్రార్లను హైకోర్టు ఆదేశించింది. అలాగే డిపార్టుమెంట్ వారీగా మంజూరైన అధ్యాపక పోస్టుల వివరాలు, ఒక డిపార్టుమెంట్ నుంచి ఇంకో డిపార్టుమెంట్‌కు బదలాయించిన అధ్యాపక పోస్టుల వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆ రిజిస్ట్రార్లను హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

ఆంధ్ర వర్సిటీ, శ్రీవెంకటేశ్వర వర్సిటీల్లో ఉర్దూ, అరబిక్, పర్షియన్, భాషా శాస్త్రాలకు సంబంధించిన అధ్యాపకుల్ని,హిందీ, న్యాయశాస్త్రాలను బోధించేందుకు బదిలీ చేస్తున్నారంటూ సయ్యద్ రహ్మతుల్లా, షేక్ ఖాదర్ హుస్సేన్ లు హైకోర్టులో వేర్వేరుగా ప్రజాహిత వ్యాజ్యాలను దాఖలు చేశారు. పాఠ్య ప్రణాళిక నుంచి పర్షియన్, అరబిక్ ఉర్దూ కోర్సులను తొలగించడాన్నిచట్ట విరుద్ధంగా ప్రకటించాలని వారు అభ్యర్థించారు.

ఈ సందర్భంగా ఆ వర్సిటీల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ..ఏయూ పరిధిలో 2014 నుంచి ఉర్దూలో ఒక్క అడ్మిషన్ తీసుకోలేదన్నారు. ఎస్ వీయూ వ్యవహారంలో ఉరద్‌రీలో ప్రతి సంవత్సరం 5 నుంచి 8 మంది మాత్రమే ప్రవేశం పొందుతున్నారని తెలిపారు. దీంతో అదనంగా ఉన్న అధ్యాపకుల పోస్టులను ఇతర విభాగాలకు బదలీ చేస్తున్నామన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ...విద్యార్థులు చేరకపోతే ఆ విభాగం అధ్యాపకుల్ని మరో డిపార్టుమెంట్‌కు బదలీ చేస్తే తప్పేమిటని పిటిషనర్లను నిలదీసింది. తల్లిదండ్రులే భాషా శాస్త్రాల్లో పిల్లలకు ప్రవేశాలు కల్పించకుండా అడ్డుకుంటున్నారని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ దశలో పిటిషనర్ల తరపు న్యాయవాది అడ్మిషన్ల సంఖ్యపై సందేహం వ్యక్తం చేసారు.

పూర్తి వివరాల్ని కోర్టు ముందుంచేలా ఆయా వర్సిటీల రిజిస్ట్రార్లను ఆదేశించాలని అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన ధర్మాసనం 2015-16 విద్యాసంవత్సరం నుంచి వివిధ భాషా శాస్త్రాల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థుల సంఖ్య, తదితర వివరాల్ని కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

రోగి మలద్వారం నుంచి 100 చేపముళ్లను తీసిన డాక్టర్!

న్యూఢిల్లీ: మాంసాహార ప్రియులు చేప ముక్కలు కనిపిస్తే లొట్టలేయకుండా వుండరు. అలాగనీ, ఆబగా లాగించాలని చూస్తే ఆస్పత్రిపాలు కావాల్సి వస్తుందని చైనాలోని ఒక చేపల ప్రియుడు నిరూపించాడు. చైనాలోని సిచువాన్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి హోటల్‌కు వెళ్ళి ఉడకబెట్టిన రెండు చేపముక్కలను, ముళ్ళుతీసి పారేయకుండా అలాగే లాగించేశాడు. తీరా ఇంటికి వెళ్ళిన కొన్ని గంటల తరువాత మలవిసర్జన సమస్య తలెత్తడమే కాకుండా అతగాడి మలద్వారం ఉబ్బిపోయింది. అతని కుటుంబసభ్యులు వెంటనే వెస్ట్‌చైనా హాస్పిటల్‌కు హుటాహుటిన తరలించారు. డాక్టర్లు సిటీ స్కాన్ తీసి చూడగా అతని మలద్వారం సుమారు 100కుపైగా చేపముళ్ళతో తీవ్ర రక్తస్రావమై వుంది. నలుగురు డాక్టర్ల బృందం రెండు గంటల పాటు శ్రమించి మలద్వారం నుంచి 100 చేపముళ్ళను వెలికితీశారు.

దేశానికే తలమానికంగా ఏయూ

• 28 ఎయిర్ ఫోర్స్ ట్రేడ్స్‌లో కొత్తకోర్సులు • ఏటా 500 మంది విద్యార్థులు • రూ.3 నుంచి 4 కోట్లు ఆదాయం

విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: రక్షణ రంగంలో అనేక నూతన కోర్సులు ప్రవేశపెట్టి ఎంతో మంది సైనికుల ఉన్నత విద్యాభ్యాసానికి ఆంధ్రా యూనివర్సిటి దోహదపడుతుంది. ఈ నేపథ్యంలోనే దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాలకు చెందిన సైనికులు ఏయూ విద్యార్థులుగా మారుతున్నారు. ఇప్పటికే ఏయూలో రక్షణ రంగానికి సంబంధించి కొన్ని కోర్సులను నిర్వహిస్తున్నారు. తాజాగా మరిన్ని కోర్సులు పెట్టేందుకు ఆంధ్రాయూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు పూర్తి స్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఐఎన్ఎస్ కళింగ, ఐఎన్ఎస్ తూనీర్ (ముంబై)కు చెందిన పలువురు సైనికులకు ఎంటెక్ ఇనిస్ట్రుమెంటేషన్, పిజి డిప్లమాఇన్ మిసైల్ మెయింటినెన్స్ కోర్సులు నిర్వహించాలని భావిస్తున్నారు. ఇక ఎయిర్‌ఫోర్స్‌కు సంబంధించి 28 ట్రేడ్స్‌లో కొత్త కోర్సులను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే వీరందరికి వారు పనిచేసిన ప్రాంతంలోనే సంబంధిత నావికాదళ ఉన్నతాధికారులు ఆయా కోర్సులకు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ ముగియగానే ఆంధ్రవిశ్వవిద్యాలయం నిర్వహించే రాతపరీక్షకు హాజరై ఉత్తీర్ణులుకావాల్సి ఉంటుంది. తదుపరి పాసైన వారికి ఏయూ నుంచి ఆయా సందర్భాల్లో సర్టిఫికేట్లు (ధృవీకరణ పత్రాలు) అందజేస్తారు. ప్రతీ ఏడాది 500 మంది సైనికులకు ఆయా కోర్సుల్లో ప్రవేశం కల్పించడానికి ఏయూ ఏర్పాట్లు చేస్తుంది. తద్వారా ఏయూకు కూడా సుమారు రూ.3 నుంచి 4 కోట్లు ఆదాయం లభించే అవకాశం ఉంది. తాజాగా మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ ఇక్కడ ఏయూకు వచ్చి ఆయా కోర్సులు ఏర్పాటుకు సంబంధించి వీసీ నాగేశ్వరరావుతో ఒప్పందం చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు సోమవారం రాత్రి ఆంధ్రప్రభతో మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని కోర్సులు నిర్వహిస్తున్నామని, తాజాగా మరికొన్ని ఈ ఏడాది నుంచి ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏయిర్ ఫోర్స్‌లో 28 ట్రేడ్స్‌లో కొత్త కోర్సులుప్రవేశపెడుతున్నామని,



ఇంకా ఎంటెక్ ఇనిస్ట్రుమెంటేషన్, పిజి డిప్లమాఇన్ మిసైల్ మెయింటినెన్స్ కోర్సులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. మెరైన్ ఇంజనీరింగ్ కోర్సు కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. దేశ వ్యాప్తంగా రక్షణ రంగానికి చెందిన అనేక మంది ఏయూలో విద్యాభ్యాసం సాగించేందుకు ఆసక్తి చూపిస్తున్నారని , అందుకు తగ్గట్లుగానే తాము కూడా వారికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వీసీ తెలియజేశారు.

2జీ కేసులో కేంద్రానికి మొట్టికాయలు

• దర్యాప్తు ముగింపునకు 6 నెలలు గడువు: సుప్రీం కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: 2జీ కుంభకోణానికి సంబంధించిన అన్ని కేసుల్లోనూ వేగం పెంచాలని కేంద్రానికి మొట్టికాయ వేసింది. దర్యాప్తును ఆరు నెలల్లోగా పూర్తిచేసి ముగించాలని సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లను సుప్రీంకోర్టు సోమవారంనాడు ఆదేశించింది. 2జీ స్పెక్ట్రం, ఈ కేసుతో ముడిపడిన ఎయిర్‌సెల్ మాక్సిస్ సహా అన్ని కేసుల్లో విచారణపై స్థాయీ నివేదికను రెండు వారాల్లోగా తమకు సమర్పించాలని జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ నవీన్ సిన్హాలతో కూడిన బెంచ్ కేంద్రాన్ని ఆదేశించింది. కేసు సుదీర్ఘ విచారణపై బెంచ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. 2జీ దాదాపు ఏడేళ్లపాటు ఈ కేసును విచారించిన సీబీఐ ప్రత్యేక కోర్టు 2017 డిసెంబర్ 21న డీఎంకే నేతలు ఎ.రాజా, కనిమొళి, మరో 15 మంది నిందితులను నిర్దోషులుగా విడుదల చేసింది. కాగా, 2జీ కుంభకోణానికి సంబంధించిన కేసుల్లో 2014లో నియమించిన ఆనంద్ గ్రోవర్ స్థానంలో అడిషనల్ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 17న నియమించింది.

అనంత్‌నాగ్‌లో ఎన్‌కౌంటర్

ముగ్గురు మిలిటెంట్లు హతం

శ్రీనగర్ : అనంత్‌నాగ్‌లో సోమవారం జరిగిన మిలిటెంట్లు, భద్రతా దళాల మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు మిలిటెంట్లు హతం అయ్యారని ఆర్మీ అధికారి తెలిపారు. ఉగ్రవాదులు ఉన్నట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు సైనికులు అనంత్‌నాగ్ జిల్లాలోని హకరా ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. సైనికులను చూసిన వెంటనే ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. అనంతరం జరిపిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు.

మృతుల్లో ఇద్దరు మిలిటెంట్ల పేర్లు, ప్రాంతం గుర్తించారు. ఒకరు శ్రీనగర్‌కు చెందిన ఫాజిల్ కాగా, అనంత్‌నాగ్ జిల్లా కోకర్‌నాగ్‌కు చెందిన సయ్యద్ ఓవైసీగా నిర్ధారించారు. మూడో ఉగ్రవాది ఎవరు ఇంకా తెలియరాలేదని ఆర్మీ అధికారులు వివరించారు. ఘటన స్థలం నుంచి మారణ ఆయుధాలు, ఏకే 47 తుపాకులు, పిస్టల్స్, హ్యాండ్ గ్రైనేడ్‌తో పాటు పలు వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. ఓ మిలిటెంట్ ఇటీవల సౌరా పట్టణంలోని పోలీస్ గార్డుపై జరిపిన దాడిలో హస్తం ఉంది. ఈ దాడిలో ఓ కానిస్టేబుల్ వీరమరణం పొందాడు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కళాశాలలు, యూనివర్సిటీలు, పాఠశాలలను మూసివేయించారు. కాశ్మీర్ యూనివర్సిటీలోని పరీక్షను కూడా వాయిదా వేసినట్టు ఆర్మీ అధికారి వివరించారు. ఈ పరీక్షకు సంబంధించిన తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని యూనివర్సిటీ అధికారులు తెలిపారు.

తెలంగాణ అసెంబ్లీలో ఆగ్రహావేశాలు

• చైర్మన్‌పై హెడ్‌ఫోన్ విసిరిన కోమటిరెడ్డి • స్వామిగౌడ్ కంటికి గాయం



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలి రోజు ఆసాధారణ సంఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ సభ్యులు విసిరిన హెడ్ ఫోన్ తగిలి ఏకంగా శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌కు గాయాలయ్యాయి. కాంగ్రెస్ సభ్యుల నిరసనలు..., నినాదాల హోరు..... గవర్నర్ ప్రసంగ పాఠాన్ని చింపి గవర్నర్‌పై విసరడం...,బీజేపీ సభ్యుల వాకౌట్, గవర్నర్ ప్రసంగానికి మద్దతుగా టీఆర్ఎస్,ఎంఐఎం సభ్యుల చప్పట్ల మధ్య రాష్ట్ర శాసనసభ, మండలి బడ్జెట్ సమావేశాలు మొదలయ్యాయి. సోమవారం ఉదయం 10 గంటలకు శాసనసభ, శాసన మండలి సంయుక్త సభలను ఉద్దేశించి గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ ప్రసంగం ప్రారంభించిన తర్వాత ముందు వరుస కుర్చీల వద్ద నిలబడిన కాంగ్రెస్ సభ్యులు ఒక్కసారిగా వెల్‌లోకి దూసుకు వచ్చేందుకు ప్రయత్నించారు. గవర్నర్ ప్రసంగిస్తున్నంత కాంగ్రెస్ సభ్యులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ నే ఉన్నారు. రైతులకు మద్దతు ధర, రైతుల ఆత్మహత్యలపై గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించలేదని నినాదాలతో సభను హోరెత్తించారు. మహిళా సభ్యులు డాక్టర్ జే గీతా రెడ్డి , డీకే అరుణ, పద్మావతి, ఆకుల లలిత సైతం వెల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా మహిళా మార్షల్స్ అడ్డుకున్నారు. వారు కూడా ప్రసంగం ప్రతులను చింపి గవర్నర్‌పైకి విసిరారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి అయితే, ఏకంగా బెంచ్ పైకి ఎక్కి మరీ కాగితాలు విసిరారు. కాంగ్రెస్ సభ్యుల నిరసనలు, అరుపుల మధ్య వెల్‌లోకి దూసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సందర్భంగా కాంగ్రెస్ సభ్యులు హెడ్‌మైక్‌లను విరిచి గవర్నర్‌పైకి విసిరారు. ఈ మైక్ నేరుగా స్వామిగౌడ్ కుడి కంటికి తగిలింది. సభ కొనసాగుతున్నందున ఆయన గాయంతోనే సభలో ఓపికగా కూర్చున్నారు. గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత కాంగ్రెస్ సభ్యులు బయటకు వెళ్లారు. సభ మంగళవారానికి వాయిదా పడిన తర్వాత కాంగ్రెస్ సభ్యులు హెడ్ మైక్ విసరడంతో తనకు గాయమైన విషయం సభా వ్యవహారాల మంత్రి టీ హరీష్‌రావు దృష్టికి స్వామిగౌడ్ తెచ్చారు. స్వామిగౌడ్‌కు గాయమైన విషయం తెలియటంతో ఒక్క సారిగా కలకలం రేగింది. కాంగ్రెస్ సీనియర్ సభ్యుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వామిగౌడ్‌పై హెడ్‌ఫోన్ విసిరినట్లు గుర్తించారు. గవర్నర్ ప్రసంగం మధ్యలోనే బీజేపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.



కోమటిరెడ్డిపై వేటు...

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమ వారం శాసనసభలో చోటు చేసుకున్న పరిణామాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ అగ్గిమీద గుగ్గిలమవుతున్నట్టు తెలుస్తోంది. గవర్నర్ ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెడ్‌ఫోన్‌ను విసిరిన ఘటనను ఆయన సీరియస్‌గా తీసుకున్నట్టు సమాచారం. ఈ ఉదంతాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న సర్కార్ కోమటిరెడ్డితో పాటు ఆయనకు సహకరించిన ఆ పార్టీ ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, సంపత్‌లపై కూడా వేటు వేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

'ప్రతిపక్షం హుందాగా ఉండాలి'

ప్రజా సమస్యలు, సామాజిక అంశాలపై చర్చించి పరిష్కరించుకునే రాజ్యాంగ వేదికైన అసెంబ్లీని ఇష్టారాజ్యంగా వాడుకోవడం ప్రతిపక్షాలకు ఏమాత్రం తగదని శాసన మండలి చైర్మన్ డాక్టర్ స్వామిగౌడ్ అన్నారు. సోమ వారం సభలో తనపై దాడి జరిగిన అనంతరం కలిసిన కొంతమంది మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు.

పార్లమెంటులో కొనసాగుతున్న ప్రతిష్టంభన

- ఆరో రోజు పార్లమెంటు సమావేశాలు వాయిదా
- గందరగోళం మధ్య ఆర్థిక నేరగాళ్ల బిల్లును ప్రవేశపెట్టిన ప్రభుత్వం
- బ్యాంకు కుంభకోణాలపై చర్చ ఏ నిబంధన కింద అన్న అంశంపై పీటముడి
- మెట్టు దిగని అధికార, విపక్షాలు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : విపక్షాలు,మిత్రపక్షాల ఆందోళనలతో వరుసగా ఆరోరోజు పార్లమెంటు సమావేశాలు తుడిచిపెట్టుకు పోయాయి. వివిధ అంశాలపై జాతీయ, ప్రాంతీయ పార్టీల ఎంపీలు నినాదాలతో హోరెత్తించడంతో పార్లమెంట్ ఉభయ సభలు దద్దరిల్లాయి. సోమవారం లోక్‌సభ కార్యకలాపాలు ప్రారంభం కాగానే విపక్ష కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్, అన్నాడిఎంకె, టిఆర్ఎస్ టిడిపి ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ నీరవ్ మోడీ కుంభకోణంపై చర్చించాలని వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపాయి. రిజర్వేషన్ల కోటా పెంచాలని టీఆర్ఎస్, ఏపీ విభజన చట్టం హామీలు అమలు చేయాలని టీడీపీ, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని వైఎస్సార్సిపి, కావేరి నదీ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నాడిఎంకె ఎంపీలు స్పీకర్ పోడియంను చుట్టుముట్టారు. సభ కార్యకలాపాలు సాగేందుకు సహకరించాలని స్పీకర్ సుమిత్రా మహాజన్ పదే పదే విజ్ఞప్తి చేశారు. అయినా సభ్యులు పట్టించుకోకపోవడంతో సభను తొలుత మధ్యాహ్నం 12గంటలకు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత ఆర్థికశాఖ సహాయమంత్రి శివప్రతాప్ శుక్లా పారిపోయిన ఆర్థిక నేరగాళ్ల బిల్లును గందరగోళం మధ్యే ప్రవేశ పెట్టారు. అయితే దీనిపై బీజేడీ ఎంపీ భర్తృ హరి హెమతాబ్ దీనిని వ్యతిరేకించారు. నేరం రుజువుకాకముందే ఆస్తులను జప్తు చేయడమంటే రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని అన్నారు. అయితే ఈ అభ్యంతరాలన్నీ చర్చ సందర్భంగా లేవనెత్తాలని మంత్రి శుక్లా సూచించారు. అనంతరం స్పీకర్ సుమిత్రా మహాజన్ లోక్‌సభను మంగళవారానికి వాయిదా వేశారు. ఇటు రాజ్యసభలోనూ విపక్షాలు ఆందోళన హోరెత్తించాయి. సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్, అన్నాడిఎంకె, టిఆర్ ఎస్ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన తెలిపారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. నీరవ్ మోడీ కుంభకోణంపై చర్చ జరపాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. మరోవైపు, సభను సజావుగా నడిపించేందుకు సహకరించాలని రాజ్యసభ ఛైర్మన్ పదే పదే వెంకయ్య నాయుడు సభ్యులకు విజ్ఞప్తి చేశారు. సభ్యులు తమ స్థానాలకు వెళ్లాలని, ప్లకార్డులు ప్రదర్శించవద్దని విజ్ఞప్తి చేశారు. అయినా సభ్యులు తమ నిరసన కొనసాగించడంతో సభను పదేపదే వాయిదా వేయాల్సి వచ్చింది. దాంతో ఉభయ సభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి.

ఫైనాన్స్ బిల్లుపై ఉత్కంఠ

మార్చి 31లోగా ఫైనాన్స్ బిల్లును ఆమోదించాల్సి ఉంది. అయితే సభ కార్యక్రమాలు ఒక్క నిమిషం కూడా జరిగే పరిస్థితి లేకపోవడంతో ఫైనాన్స్ బిల్లుపై చర్చ జరిగే అవకాశం కనిపించడం లేదు. గందరగోళం మధ్యే బిల్లును ఆమోదించే పరిస్థితి వస్తుందని రాజకీయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. బ్యాంకు కుంభకోణాలపై వాయిదా తీర్మానం కింద చర్చ జరపాలని కాంగ్రెస్ సహా విపక్షాలు పట్టుబడుతుండగా, 193 నిబంధన కిందే చర్చకు అనుమతించినందున దానిపైనే చర్చ జరగాలంటున్నారు. దాంతో అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్టంభన నెలకొని పార్లమెంటు సమావేశాలు జరగడం లేదు.

పార్లమెంట్‌ను సాగనివ్వం

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యక్షమయ్యారు. సంగీతం ద్వారానైనా మోడీకి జ్ఞానోదయం కావాలని కోరుకుంటున్నానని ఆయన చెప్పుకొచ్చారు. మోడీ, ప్రత్యేక విభజన మీద సన్నాయి వాయిస్తూ పాటలు పాడి అందరినీ ఆకట్టుకున్నారు. విభజన హామీలపై కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చే వరకూ తమ పోరాటం ఆగదని మరోమారు టీడీపీ ఎంపీలు తేల్చిచెప్పారు. త్వరలోనే తమ పోరాటం ప్రజా పోరాటంగా మారుతుందని నొక్కి చెప్పారు. తమ రాజీనామాలపై స్టేట్‌మెంట్ ఇచ్చే అవకాశం కల్పించాలని స్పీకర్‌ను కోరినట్టు మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజు తెలిపారు. తాము నిరసన తెలుపుతున్న అంశాలపై స్పష్టత వచ్చే వరకూ ఈ వారం కూడా పార్లమెంట్‌ను సాగనిచ్చే ప్రసక్తే లేదని ఎంపీ గల్లా జయదేవ్ అన్నారు. స్వప్రయోజనాలు చూసుకోకుండా స్వరాష్ట్ర బాగు కోసం పార్టీలు, రాజకీయాలకు అతీతంగా నాయకులు తమతో చేయి కలపాలని ఎంపీ కొనకళ్ల నారాయణ పిలుపునిచ్చారు.

ఈ వారం కూడా సభలను జరగనివ్వం : గల్లా జయదేవ్, టీడీపీ ఎంపీ

గత పార్లమెంట్ సమావేశాల కంటే ఈసారి ఎక్కువ పార్టీలు వివిధ అంశాలపై పోరాటానికి దిగాయి. బీజేపీ ప్రభుత్వం ఎవరి మాటా వినట్లేదని మేమే కాదు వారందరూ అంటున్నారు. గత వారం మొత్తం పార్లమెంట్ సరిగా నడవలేదు. ఈ వారం కూడా అలాగే చేయాలని భావిస్తున్నాము. తామెందుకు రాజీనామా చేయాల్సి వచ్చిందో మా మంత్రులందరూ స్టేట్‌మెంట్స్ ఇస్తున్నారు. ఇంత మంది నిరసన తెలుపుతున్నప్పుడు ప్రభుత్వం స్పందించాలి.



స్వప్రయోజనాలు కంటే స్వరాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం : కొనకళ్ల నారాయణ

విభజన బిల్లులో చెప్పిన అంశాలన్నీ చట్టపరంగా అమలయ్యే వరకూ మా పోరాటం ఆగదు. ఏపీ ప్రజలు, ఉద్యోగ, కార్మిక, ప్రజా సంఘాలు మాకు అభినందనలు తెలుపుతున్నాయి. మీ వెనుక మేమున్నామని మద్దతు ప్రకటిస్తున్నాయి. పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అందరూ ముందుకు వచ్చి ఆందోళనలో పాల్గొనాలి. మాతో చేయి కలపాలి. రాష్ట్రం బాగుంటే మనమంతా బాగుంటాం. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ పోరాటాన్ని కొనసాగిద్దాం.

సస్పెండ్ చేసినా వెనుకడుగు వేయొద్దు

- పోరాటాన్ని మరింత ఉధృతం చేయండి
- రోజుకొక రీతిలో వ్యవహరిస్తున్న కేంద్రం
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బండారం బయటపెట్టండి
- ఎంపీల టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రయోజనాలు, హక్కుల అంశంలో రాజీపడే ప్రసక్తే లేదని వీటి సాధన కోసం చేస్తున్న పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పార్లమెంట్ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల మనోభావాలకనుగుణంగా పోరాటం కొనసాగించాలని సభ నుంచి సస్పెండ్ చేసినా వెనుకడుగు వేయొద్దని సూచించారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని తన నివాసం నుంచి పార్లమెంట్ సభ్యులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలోని అంశాలు, ఆనాడు పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలు నెరవేర్చే విధంగా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర సమస్యల పరిష్కారమే మన ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఉభయసభల్లో ప్రస్తావించాలని కేంద్ర మాజీ మంత్రులు అశోక్‌గజపతిరాజు, సుజనాచౌదరిలకు ఆయన సూచించారు. రాజీనామాలపై ప్రకటన చేస్తున్న సమయంలోనే రాష్ట్రానికి జరిగిన అన్యాయం గురించి నాలుగేళ్లైనా పునర్వ్యవస్థీకరణ చట్టం అమలు కాలేదన్న అంశం ప్రధానంగా ప్రస్తావించాలని చెప్పారు. అదే విధంగా ఆనాడు రాజ్యసభలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ నెరవేరలేదన్న విషయాన్ని కూడా బహిర్గతం చేయాలన్నారు. నిన్నటి దాకా స్పెషల్ అసిస్టెన్స్ మేషర్ అన్న కేంద్రం ఇప్పుడు స్పెషల్ పర్పస్ వెహికల్ అంటూ అంటుందని రోజుకొక రీతిన వ్యవహరిస్తున్న కేంద్రం తీరును ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా వివరించాలన్నారు. నిధుల మంజూరుకు సులభ మార్గాలు ఉంటే ఇతర మార్గాలు ఎందుకు అంటూ కేంద్రంపై ముఖ్యమంత్రి చంద్రబాబు విరుచుకుపడ్డారు. బడ్జెట్ సమావేశాల తొలి రోజు నుంచే పార్లమెంటును స్తంభింపజేస్తున్న ఫలితం కానరాకపోవడంతో కేంద్రం నుంచి వైదొలిగామన్నారు. మంత్రి పదవులకు సైతం రాజీనామా చేసి ఆందోళనలను మరింత ఉధృతంగా చేసినా కేంద్రం తగిన రీతిలో స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం దిగి వచ్చే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేయడం మినహా మరే ఇతర ప్రత్యామ్నాయం ఎంపీలకు చంద్రబాబు సూచించారు.

వైకాపా వ్యవహారం బయటపెట్టండి..

ప్రత్యేక హోదా పేరుతో వైఎస్సార్ కాంగ్రెస్ ఆడుతున్న కుటిల నాటకాన్ని బయటపెట్టి ఆ పార్టీ నేతల ముసుగులను తొలిగేలా వ్యవహరించాలని ఎంపీలకు చంద్రబాబు మార్గదర్శకం చేశారు. ప్రజలకు జగన్ డొంక తిరుగుడు వ్యవహారాన్ని అవగతమయ్యేలా చైతన్యం తీసుకురావాలని సూచించారు. ప్రత్యేక హోదా ఇస్తారన్న నమ్మకం ప్రధానిమోడీపై ఉందని, వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి ఒక జాతీయ మీడియాలో మాట్లాడిన అంశాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అంత విశ్వాసం నరేంద్రమోడీపై ఉన్నప్పుడు ఇంకా అవిశ్వాసం పెట్టాల్సిన అవసరం ఏముందంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ అంశంపై జగన్ ఒక స్పష్టత ఇవ్వాలన్నారు. ఒకవైపు కేంద్రంపై నమ్మకం ఉందంటూ మరోవైపు అవిశ్వాసం అంటూ డొంకతిరుగుడు ప్రమాణాలు పాటిస్తున్నారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు వైకాపా నేతలపై మండిపడ్డారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి మాట్లాడుతూ ఇప్పటికే రాజ్యసభలో నోటీసు ఇచ్చానని తనకు ఒకటి, రెండు రోజుల్లో సభలో ప్రకటన చేసే అవకాశం వస్తుందని అధినేతకు వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తన రాజీనామాకు గల కారణాలతోపాటు రాష్ట్రానికి జరిగిన అన్యాయం గురించి సభకు వివరిస్తానని చెప్పారు. దీనిపై స్పందించిన చంద్రబాబు ఎవరు ప్రసంగించినా ప్రజల మనోభావాలు ప్రతిబింబించేలా ఉండాలని సూచించారు. గడిచిన రెండు రోజులుగా తిరుపతి, చిత్తూరు ప్రాంతాలలో డప్పు ప్రచారం ద్వారా రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించానని చిత్తూరు ఎంపీ శివప్రసాద్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సభలో, బయట కేంద్రంపై ఒత్తిడి పెంచడమే కాకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత టిడిపి ఎంపీలు, నేతలపై ఉందని అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ పార్లమెంటరీ పార్టీ పక్షనేత తోట నర్సింహం, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యులు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ షిప్‌యార్డ్‌పైనా అదే మౌనం!

- లేదు, కాదు, కుదరదని మూడు ముక్కల్లో రక్షణ మంత్రి జవాబు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : విశాఖపట్నంలోని హిందూస్థాన్ షిప్‌యార్డ్‌కు పునరుజ్జీవనం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చురుగ్గా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. షిప్ యార్డుకు సంబంధించి రాజ్యసభలో సోమవారం వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నలకు రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ లేదు, కాదు, కుదరదు అంటూ మూడే ముక్కల్లో ఇచ్చిన జవాబే ఇందుకు నిదర్శనం. దేశంలో నౌకానిర్మాణ రంగంలో ప్రసిద్ధి చెందిన షిప్ యార్డ్‌ల్లో విశాఖపట్నం ఒకటి. తూర్పు తీరంగా ఉన్న అతి పెద్ద షిప్‌యార్డ్ కూడా ఇదే. నౌకా నిర్మాణ రంగంలో విశేష ప్రతిభ కలిగిన 77 ఏళ్ల హిందూస్తాన్ షిప్‌యార్డ్ ఒకప్పుడు దేశంలోని ప్రభుత్వ సంస్థలకే తలమానికం. అలాంటి సంస్థ పలు కారణాల వల్ల నష్టాల ఊబిలో కూరుకుపోయి ఈమధ్య క్రమంగా లాభాల బాట పడుతోంది. హిందూస్తాన్ షిప్‌యార్డ్ యాజమాన్యం రక్షణ శాఖకు కొన్నేళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపినా అవి ఇంతవరకూ కార్యాచరణకు నోచుకోలేదు. ఇటీవల దేశ రక్షణను పటిష్ట పరిచే చర్యలలో భాగంగా నౌకాదళ అవసరాల కోసం 20 వేల కోట్ల రూపాయల వ్యయంతో మరిన్ని అధునాతన యుద్ధ నౌకలు, పహారా నౌకల నిర్మాణాన్ని చేపట్టే ప్రక్రియకు రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ప్రైవేట్ రంగంలోని నౌకా నిర్మాణ సంస్థలైన రిలయన్స్ డిఫెన్స్, ఎల్ అండ్ టీ ఈ ఆర్డర్లను దక్కించుకున్నప్పటికీ అందులో హిందూస్తాన్ షిప్‌యార్డ్‌కు కూడా ప్రభుత్వం కొంతమేర భాగస్వామ్యం కల్పించింది. దానికి అనుగుణంగా మూలధన పునవ్యవస్థీకరణ ప్రతిపాదనపై కూడా రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోద ముద్ర వేసి ఉంటే షిప్ యార్డ్ భవితవ్యం ఉజ్వలంగా ఉండేది. అలాగే దక్షిణ కొరియాకు చెందిన హుందై షిప్ బిల్డర్స్‌తో హిందూస్తాన్ షిప్ యార్డ్ సంయుక్తంగా నౌకా నిర్మాణం చేపట్టాలన్న ప్రతిపాదన కూడా ఇంత వరకూ కార్యరూపం దాల్చలేదు. ఈ వివరాలు కోరుతూ రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు రక్షణ శాఖ మంత్రి, సవివరణ ఇవ్వడానికి బదులు అవును, కాదు, లేదు అంటూ ముక్తసరి సమాధానాలతో సరిపెట్టడంపై ఎంపీ విజయ సాయిరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. హిందూస్తాన్ షిప్‌యార్డ్ భవితవ్యంపై కేంద్ర ప్రభుత్వం, రక్షణ మంత్రిత్వ శాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో సమగ్ర వివరాలను వెల్లడించాలని కోరుతూ ఆయన నేరుగా నిర్మలా సీతారామన్‌కు లేఖ రాయాలని నిర్ణయించుకున్నారు.

కడదాకా కాంగ్రెస్‌లోనే వుంటా


మాజీ మంత్రి కాసుకృష్ణారెడ్డి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రాణం పోయే వరకూ లెజెండ్ వంటి కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని ఆ పార్టీ మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లోనే పుట్టి పెరిగానని, ఆ పార్టీలోనే తుదిశ్వాస విడుస్తానని చెప్పుకొచ్చారు. ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలను నెరవేర్చాలని పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి టీడీపీ, వైఎస్సార్సీపీతో పోటీగా ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ధర్నాలు, ఆందోళనలు చేస్తూనే ఉంది. గురువారం ఆ పార్టీ నేతలను పోలీసులు అరెస్ట్ చేసారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ఆంధ్ర ప్రజలను మోసం చేస్తున్న టీడీపీ, బీజేపీ పార్టీల గుర్తింపును రద్దు చేయాలంటూ శుక్రవారం కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు కూడా చేశారు. ఈ కార్యక్రమాలన్నిటిలో ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, సుబ్బిరామిరెడ్డి, మాజీ ఎంపీ జేడీ శీలం, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు తదితర నేతలు పాల్గొన్నారు. అధికార పక్షానికి ధీటుగా తమ గళం వినిపించారు. అయితే ఈ బృందంలో ఎక్కడా మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి కనిపించకపోవడంతో రకరకాల ఊహాగానాలు తెర మీదికి వచ్చాయి. వాటిపై కాసు కృష్ణారెడ్డి స్పందించారు. ధర్నా, ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనడానికి పది రోజుల కిందటే తాను ఢిల్లీ వచ్చానని ఆంధ్రప్రభకు ప్రత్యేకంగా వివరించారు. అయితే ఆరోగ్యం బాగా లేకపోవడం వల్ల ఎయిమ్స్‌లో చేరానని ఆయన అన్నారు. వైద్యులు అన్ని రకాల వైద్య పరీక్షలు, చికిత్స చేశారని, ప్రస్తుతం తాను ఆరోగ్యంగానే ఉన్నానని చెప్పారు. డిఫెన్స్ కాలనీలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న తనను కేవీపీ రామచంద్రరావు, రఘువీరారెడ్డి వంటి నేతలు పరామర్శించారని తెలిపారు. పూర్తిగా కోలుకున్నాక పార్టీ చేపట్టే కార్యక్రమాలన్నిటిలో పాల్గొంటానని కాసు కృష్ణారెడ్డి ఆంధ్రప్రభకు వివరించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అధ్యక్షతన ఈనెల 16వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఢిల్లీలో జరగబోయే ప్లీనరీ సమావేశాల్లోనూ తాను చురుగ్గా పాల్గొనబోతున్నానని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పార్టీని వీడే ప్రసక్తే లేదన్నారు. ఏ వార్తలు, ఊహాగానాలు వచ్చినా నమ్మవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీతో తమ కుటుంబానికి ఉన్న అనుబంధానికి ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. 109 ఏళ్లుగా తమ కుటుంబం కాంగ్రెస్‌తోనే ఉందని ఆయన తెలిపారు. పండిట్ నెహ్రూ కుటుంబంతో వందేళ్ల అనుబంధం ఉందని ఆయన అప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు. ఇందిరా గాంధీని కింగ్‌మేకర్‌ను చేయడంలో, ఆమెను ప్రధాన మంత్రిని చేయడంలో దివగంత ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి పాత్ర కీలకమని అప్పటి రాజకీయాలను ఆంధ్రప్రభతో పంచుకున్నారు. తమ కుటుంబం నుంచి అనేక మంది కాంగ్రెస్ తరపున క్రియాశీలక పదవులను చేపట్టారని, మూడు తరాలు ఆ పార్టీకి సేవలు చేశాయని కాసు కృష్ణారెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్‌తో తమ కుటుంబానికి సుదీర్ఘ రాజకీయ అనుబంధం ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

వెనక్కి తగ్గని వైకాపా

- టీడీపీతో పోటాపోటీగా ధర్నా



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ప్రత్యేక హోదా మీద చేపట్టిన ఆందోళన విషయంలో రెండో వారమూ వైఎస్సార్సీపీ వెనక్కి తగ్గలేదు. అధికార పక్షం టీడీపీ ఎంపీలతో పోటాపోటీగా ఆ పార్టీ ఎంపీలు పార్లమెంట్‌లోని ఒకటో నంబర్ గేట్ వద్ద నిరసనకు దిగారు. అవిశ్వాస తీర్మానం విషయంలో తమతో టీడీపీ ఎంపీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. మద్దతు కూడగడతానని ఇచ్చిన హామీని పవన్ కళ్యాణ్ నిలబెట్టుకుంటారని ఆశిస్తున్నామని ఎంపీ విజయ సాయిరెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ఏపీ ప్రజల హక్కులు, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు గతంలో చెప్పినట్టుగానే ఏప్రిల్ 6న రాజీనామాలు చేయడానికి తమ పార్టీ ఎంపీలదంరూ సిద్ధంగా ఉన్నామని ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి మరోమారు స్పష్టం చేశారు.

పోరాటాలతో దేన్నైనా సాధించుకోగలం : ఎంపీ విజయసాయిరెడ్డి

అవిశ్వాస తీర్మానం విషయంలో మాకు వివిధ రాజకీయ పార్టీలు మద్దతు తెలుపుతున్నాయి. టీడీపీ కూడా మద్దతు తెలుపుతుందని ఆశిస్తున్నాము. అవిశ్వాస తీర్మానానికి మద్దతు కూడగడతానని ఇచ్చిన హామీని పవన్ కళ్యాణ్ నెరవేరుస్తారని విశ్వాసముంది. తెలంగాణా రాష్ట్రం ఒక్క రోజులో వచ్చింది కాదు. పోరాటమనేది ప్రజాస్వామ్యంలో ఒక భాగం. పోరాటం చేసి దేన్నైనా సాధించుకోగలం. ప్రత్యేక హోదా వచ్చేంత వరకూ పోరాటాన్ని కొనసాగిస్తాం.

ఏప్రిల్ 6న మేమంతా రాజీనామాలు చేయడం ఖాయం:ఎంపీ మేకపాటి

అవిశ్వాస తీర్మానం పెట్టమని చంద్రబాబును సపోర్ట్ చేసిన వారే కోరారు. మా నాయకులూ సరేనన్నారు. దానికీ 50 మంది మద్దతు కావాలి. 184 కింద ఓటింగ్ ఉంటే స్పీకర్ ఒప్పుకోరు. ఒకటి మాత్రం ఖాయం. ఏప్రిల్ 6వ తేదీన మా లోక్‌సభ నాయకులందరూ రాజీనామాలు చేయడం ఖాయం. అది మా చేతుల్లో ఉంది. ప్రజలకు అక్కడివరకూ హామీ ఇవ్వగలం. అంతకుమించి మేం పెద్ద హామీలు ఇచ్చే పరిస్థితుల్లో లేము.

ఢిల్లీలో వైఎస్సార్సిపి ఆవిర్భావ వేడుకలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం న్యూఢిల్లీలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్సిపి ఎంపీలు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. పార్టీ ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, వరప్రసాద్, మిథున్ రెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, జగన్ పోరాటపటిమ కలిగిన నేత అని అభివర్ణించారు. ఇచ్చిన మాటలకు కట్టుబడి విలువలు, విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచారన్నారు. పార్టీకి బంగారు భవిష్యత్ ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఇబ్బందులు పెట్టినా, నమ్మిన సిద్ధాంత కోసం ముందుకు సాగుతున్నారని చెప్పారు. చంద్రబాబును నమ్మి ప్రజలు అధికారం ఇస్తే విభజన హామీల కోసం పోరాడడం లేదన్నారు. ఏపికి చంద్రబాబుతీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు. వైఎస్సార్ లాగే జగన్ మాటకు కట్టుబడి ఉండే నాయకుడని ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. జగన్ పట్టుదలతోకార్యాచరణతో పార్టీని ముందుకు తీసుకెళుతున్నారని ఎంపీ వరప్రసాద్ అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో 2019లో జగన్ సీఎం అవుతారని చెప్పారు.


రైల్వేజోన్ లేనట్టే!

(మొదటిపేజీ తరువాయి)

హోంశాఖ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి నేతృత్వంలో విభజన సమస్యలపై రెండు తెలుగు రాష్ట్రాల ఉన్నతాధికారులతో కీలక సమావేశం జరిగింది. ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో ఉన్న హోంశాఖ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో విభజన చట్టంలోని 13వ షెడ్యూల్ అంశాలపై చర్చ జరిగింది. నిజానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కారణంగా పలు మార్లు వాయిదా పడుతూ చివరకు సోమవారం ప్రధాన కార్యదర్శి లేకుండానే జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్‌తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారులు ఆదిత్యనాథ్ దాస్, ఏపీ భవన్ అధికారులు హాజరవగా, తెలంగాణ ప్రభుత్వం తరపున ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అశోక్ కుమార్, అదనపు రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి హాజరయ్యారు. ఇప్పటికీ అపరిష్కృతంగా ఉన్న షెడ్యూల్ 9, 10 సంస్థల ఆస్తుల విభజనపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆస్తుల పంపకానికి సంబంధించి గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును విభజన చట్టంలోని అన్ని సంస్థలకు వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం డిమాండ్ చేసింది. షెడ్యూల్ 9, 10లో సంస్థల ఆస్తుల పంపకాలు లేదా విభజనను జనాభా ప్రాతిపదికన 58:42 నిష్పత్తిలో పంచాలని సుప్రీంకోర్టు తీర్పు చెబుతోంది. ఈ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల విభజనకు సంబంధించి షీలా బెడే కమిటీని ఏర్పాటు చేయగా, ఈ కమిటీ ఇప్పటికే 49 సంస్థల్లో ఉద్యోగుల విభజనను పూర్తి చేసింది. మిగతా సంస్థల్లోని ఉద్యోగుల విభజన కోసం ఈ కమిటీ పదవీకాలాన్ని పొడిగిస్తూ ఈ మధ్యనే కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. షెడ్యూల్ 9, 10 సంస్థల విభజనతో పాటు షెడ్యూల్ 13లో పేర్కొన్న అంశాలకు తోడు చట్టంలోనే పొందుపరిచిన గిరిజన విశ్వవిద్యాలయం, సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు గురించి కూడా ఆంధ్రప్రదేశ్ అధికారులు సమావేశంలో ప్రస్తావించారు. ఈ రెండు సంస్థలకు సంబంధించి స్థలం ఎంపిక పూర్తయిందని, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడమే మిగిలిందని ఏపీ అధికారులు కేంద్రానికి తెలిపారు. అయితే ఈ రెండు సంస్థల ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేసిందని, కేబినెట్ నోట్ కూడా సిద్ధమైందని హోంశాఖ అధికారులు తెలిపారు. తదుపరి సమావేశంలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో జరుగుతుందని సమావేశం అనంతరం ఏపీ చీఫ్ సెక్రటరీ దినేశ్ కుమార్ మీడియాకు తెలిపారు. ఈ సమావేశంలోనే ప్రత్యేక రైల్వే జోన్ గురించి కూడా ఏపీ అధికారులు ప్రస్తావించారు. అయితే ఇది తమ పరిధిలో లేని విషయమని, దానిపై చర్చించాల్సిన అవసరం లేదని హోంశాఖ అధికారులు వెల్లడించారు. పైగా రైల్వే జోన్ గురించి ఏర్పాటు చేసిన పలు కమిటీలు, సర్వేలు ప్రతికూలంగా నివేదికలిచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ, వాటి ప్రకారం ప్రత్యేక జోన్ ఏర్పాటు సాధ్యపడకపోవచ్చునని వారు వ్యాఖ్యానించారు. అయితే దీనిపై రాజకీయ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, తమ స్థాయిలో జరిగే నిర్ణయం కాదని కూడా వారన్నట్టు సమాచారం. హోంశాఖ అధికారులు తమ వ్యక్తిగత స్థాయిలో చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు కలకలం రేపుతున్నాయి. ప్రత్యేక హోదా అంశంపై కేంద్ర ఆర్థిక మంత్రే స్వయంగా సాధ్యం కాదని కుండబద్ధలు కొట్టినట్టు చెప్పగా, ఇప్పుడు హోంశాఖ అధికారుల వ్యాఖ్యలు కలకలం రేపాయి. ప్రత్యేక జోన్ విషయంలోనూ కేంద్రం హోదా తరహాలోనే వ్యవహరిస్తుందా అన్న సందేహాలు వెలువడుతున్నాయి. జోన్ సాధ్యాసాధ్యాలపై రైల్వే శాఖ నిర్వహించిన అధ్యయనాలు ప్రతికూలంగా రావడంతో వాటినే సాకుగా చూపుతూ జోన్ విషయంలోనూ మొండిచేయి చూపుతారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా ప్రత్యేక రైల్వే జోన్ ఇచ్చి తీరాల్సిందేనని విభజన చట్టంలో ఎక్కడా పేర్కొనకపోవడం గమనార్హం. కేవలం సాధ్యాసాధ్యాలు పరిశీలించాల్సిందిగా మాత్రమే విభజన చట్టం పేర్కొంటోంది. దీనిపై ఎప్పుడు ప్రశ్నించినా పొరుగున్న ఒడిశా రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలను కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉందని, ఏకాభిప్రాయం సాధించిన వెంటనే నిర్ణయం తీసుకుంటామని కేంద్ర పెద్దలు ప్రకటించారు. నిర్ణయం తీసుకుంటామని చెప్పారు తప్ప కచ్చితంగా ఇచ్చి తీరుతామని ఎప్పుడూ ప్రకటన చేయలేదు. ఇవన్నీ చూస్తుంటే హోదాకు పట్టిన గతే ప్రత్యేక జోన్‌కు పడుతుందేమోనన్న ఆందోళన ప్రతి ఒక్కరిలోనూ కలుగుతోంది. అయితే అధికారుల స్థాయిలో చేసిన వ్యాఖ్యలకు అంతగా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని, రాజకీయ నిర్ణయం తీసుకుంటే ఇవేవీ పరిగణలోకి రావని బీజేపీ నేతలు కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ఏదెలా ఉన్నా, జోన్ విషయంలో ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రకటన ఇస్తే తప్ప జనంలో నెలకొన్న గందరగోళానికి, సందేహాలకు తెరపడే అవకాశం కనిపించడం లేదు.

వంకాయల ఇకలేరు

- క్యారెక్టర్ ఆర్టిస్టుగా ప్రఖ్యాతి



విశాఖపట్నం, ప్రభ న్యూస్: ప్రఖ్యాత సీనియర్ సినీ కళాకారులు వంకాయల సత్యనారాయణ మూర్తి సోమవారం దేహవిముక్తి పొందారు. ఆయన స్వస్థలం విశాఖపట్నం చావలవారి వీధి. సుమారు 250 సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా, సహ నటునిగా వాసికెక్కిన ఆయన ఖాతాలో సీతామాలక్ష్మి, సూత్రధారులు, అత్తవారిల్లు, శ్రీనివాస కళ్యాణం, విజేత, తదితర సినిమాల్లో మెప్పించారు. 1940వ సంవత్సరంలో జన్మించిన ఆయన నటునిగా సుమారు 184 సినిమాల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన వయస్సు 78 ఏళ్లు. శ్వాస సంబంధిత వ్యాధితో గత కొంత కాలంగా బాధపడుతున్న ఆయన సోమవారం తుది శ్వాస వీడడంతో కుటుంబీకులనూ, ఆయన అభిమానులూ, శ్రేయోభిలాషుల్లో విషాదం అలుముకుంది. గత నాలుగు రోజులుగా ఆయన అస్వస్థతకు గురై ఉన్నప్పటికీ ఏవిధంగానూ ఇబ్బంది పెట్టని ఆయన వైద్యం తీసుకుంటూనే సోమవారం తుది శ్వాస విడిచినట్లుగా కుటుంబీకులు వెల్లడించారు. విశాఖ కళారంగ పురోభివృద్ధిలో కీలక భూమిక పోషించిన వంకాయల సత్యనారాయణ కళా రంగ ప్రోత్సాహకులు దివంగత అమ్మరావుజీ, సినీ నటులు, రచయిత, కాశీవిశ్వనాథ్ వంటి పలువురితో మమేకమై సన్నిహితంగా మెలిగేవారిన ఆయన సన్నిహితులు పేర్కొన్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు మనుమలు, ముగ్గురు మనుమరాళ్లు ఒక మునిమనుమడూ ఉన్నారు. విశాఖ వాస్తవ్యులు అయిన వంకాయల సత్యనారాయణ మూర్తి సినిమా అవకాశం పొందడంతో విశాఖ నుంచి 1976లో తరలి వెళ్లి మద్రాసులో అనేక ఏళ్ల పాటు ఉన్నారు. అనేక మంది సినిమా కళాకారులు మద్రాసు తరువాత హైదరాబాద్‌లో స్థిరపడినప్పటికీ సినీ సన్నిహితులు కాశీ విశ్వనాథ్‌తో పాటూ వంకాయల సత్యనారాయణ మూర్తి కూడా విశాఖలోనే 2001వ సంవత్సరంలో తిరిగి వచ్చి స్థిరపడ్డారు. నీడలేని ఆడది వంటి సినిమాల్లో ప్రత్యేకంగా కనపించిన వంకాయల సత్యనారాయణ సినీ నట జీవితం అనంతరం పలు సీరియళ్లలోనూ నటించి ఇంటింటికీ టెలివిజన్ ప్రేక్షకులకూ చేరువయ్యారు. నటరంగానికి చెందిన ఎస్.కె. మిశ్రో, మీగడ రామలింగస్వామి, ఎంవీ రాజశేఖర్, కొణతాల రాజు, మెలోడి క్రియేటర్స్ సత్యనారాయణ సీహెచ్‌వీ, ఏసీటీవో నాగేశ్వరరావు, రామవరపు ఉదయ్‌కుమార్ (సంగీతం), లియో 9 వీఎఫెక్స్ స్టూడియో అధినేత అడ్డూరి సునీల్ చరణ్, నటుడు ప్రసన్నకుమార్ త దితరులు వంకాయల సత్యనారాయణ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

హౌసింగ్ ప్రాజెక్టుల వేగం పెంచండి!

- సీఆర్‌డీఏ కమిషనర్ తనిఖీలు : పనుల తీరుపై ఆగ్రహం



అమరావతి ఆంధ్రప్రభ : అమరావతి రాజధాని ప్రభుత్వ నగరంలో చేపట్టిన హౌసింగ్ ప్రాజెక్టు పనుల తీరుపై ఏపీసీఆర్డీఏ కమిషనర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్ ప్రాజెక్టు పనులను కమిషనర్ శ్రీధర్ అధికారులతో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. గంటలపాటు సాగిన ఈ తనిఖీల్లో ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణ పనుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు ప్యాకేజీల సైట్లలో అవసరమైన మేరకు తక్షణమే సిబ్బందిని నియమించుకోవాలని కాంట్రాక్ట్ సంస్థలను ఆదేశించారు. బార్‌బెండర్స్, సెంట్రింగ్ కార్మికులు కార్పెంటర్లను రెట్టింపు చేయాలని, సిబ్బందిని పెంచాలని ఆదేశించారు. అంతేగాక మెటీరియల్ సరఫరా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమిస్తామని కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులకు చెప్పిన కమిషనర్ మెటీరియల్ వ్యవహారాలతో పాటు మ్యాన్‌పవర్ సమీకరణ వంటి అంశాలను సంబంధిత అధికారి పర్యవేక్షిస్తారని తెలిపారు. తొలుత కమిషనర్ బృందం కొండమరాజు పాలెం వద్ద నిర్మిస్తున్న ఏపిసిఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయం పనులను పరిశీలించారు. పైల్స్ పనులు నలభై శాతం పూర్తయ్యాయని కాంట్రాక్ట్ సంస్థ ప్రతనిధులు కమిషనర్‌కు వివరించారు. నెలాఖరులోగా పైల్స్ పనులు, రాఫ్ట్ ఫౌండేషన్ పనులు పూర్తి చేయాలని కమిషనర్ శ్రీధర్ ఆదేశించారు. రాయపూడి దగ్గర ప్యాకేజీ వన్‌లో ఎన్సిసి చేపట్టిన ఆలిండియా సర్వీస్ అధికారుల నివాసాల పనులను పరిశీలించారు. ఈ నెలాఖరులోగా అన్ని టవర్ల రాఫ్ట్ ఫౌండేషన్ పూర్తిచేయాలని, మూడు టవర్ల స్టిల్ట్ శ్లాబ్ వేయాలని కమిషనర్ ఆదేశించారు. ఎమ్మెల్యేల నివాసాల 12 టవర్ల పనులను పరిశీలించిన కమిషనర్ ఏప్రిల్ 15 లోగా పైల్స్ ఫౌండేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. నేలపాడు దగ్గర ప్యాకేజీ 3లో గాపూర్జీ పల్లోంజి సంస్థ చేపట్టిన గజిటెడ్ అధికారులు, క్లాస్ 4 నివాసాల పనులను కమిషనర్ పరిశీలించిన సందర్భంలో పనుల పురోగతి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం 21 టవర్లకు గాను ఆరు టవర్ల పైల్స్ పూర్తయ్యాయని మూడు టవర్లకు ప్లెయిన్ కాంక్రీట్ పూర్తయిందని, ఒక టవర్‌కు రాఫ్ట్ శ్లాబ్ పురోగతిలో ఉందని కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు కమిషనర్‌కు వివరించారు. గజిటెడ్ అధికారుల టైప్ వన్, టైప్ టూ నివాసాల పైల్స్ ఫౌండేషన్ పురోగతి, రాఫ్ట్ శ్లాబ్ పనుల తీరుపై కూడా కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం నాడు ఏపిసిఆర్డీఏ కార్యాలయంలో సంబంధిత కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశిస్తూ వారం లోగా పనుల్లో వేగం పెంచని పక్షంలో నిబంధనల మేరకు చర్యలు చేపడ్తామని హెచ్చరించారు.

నేలపాడు వద్ద ప్యాకేజీ2లో ఎల్ అండ్ టి చేపట్టిన ఎన్జీఓల నివాసాలు, ఎల్ అండ్ టి సైట్ వద్ద ఆరు ఎల్పీఎస్ జోన్లకు సంబంధించి డిజైన్ల అనుమతి, పనుల పురోగతిపై కమిషనర్ ప్రత్యేకంగా సమీక్ష చేశారు. వర్షాకాలం లోగా ఆయా జోన్లలో మెజారిటీ రోడ్లకు రాతిపొడితో గ్రాన్యులర్ సబ్‌బేస్ లేయర్ వేసేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. కమిషనర్ శ్రీధర్ తనిఖీల కార్యక్రమంలో సిఇలు జక్రయ్య, ఆంజనేయులు, శ్రీనివాసులు, ఎస్ఇలు ధనుంజయ, ప్రభాకరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతి చేతుల మీదగా సుధారాణికి ఉగాది పురస్కారం



తిరుపతి హెల్త్, ప్రభ న్యూస్ : ప్రతిఏటా ఉగాది సందర్భంగా సమాజసేవకు అంకితమై విశిష్ట ప్రతిభ కనబరుస్తున్న ప్రముఖులకు వివిధ రంగాల్లో రాణిస్తున్న వ్యక్తులను ప్రోత్సహించేందుకు అందించే ఉగాది పురస్కారానికి తిరుపతికి చెందిన ప్రముఖ నేత్రవైద్యురాలు డాక్టర్ సుధారాణి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఈ పురస్కారాన్ని ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు చేతులమీదుగా ఆమె అందుకున్నారు.

ఉగాది పురస్కారం మరింత స్ఫూర్తినిచ్చింది: సుధారాణి

భారత ఉపరాష్ట్రపతి చేతులమీదుగా తాను అందుకున్న ఈ ఉగాది పురస్కారం తనకెంతో స్ఫూర్తినిచ్చిందని, దేశ రాజధాని ఢిల్లీలో ఇలాంటి పురస్కారం అందుకోవడం తన జీవితంలో మరచిపోలేని సంఘటన అని పురస్కార గ్రహీత డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి అన్నారు. దీంతో తాను నూతనోత్సాహంతో మరిన్ని సేవలందించేందుకు శక్తినిచ్చిందని, ఇదే ఉత్సాహంతో సరికొత్త తరహా సేవలు చేయడానికి శ్రీకారం చుడతానని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శైలజాకిరణ్, ఉదయ్ శంకర్, జగపతి బాబు, రమ్యకృష్ణ శ్రీలేఖలు పాల్గొన్నారు.

క్రీడాప్రభ

ఛేదించారు

- లంకపై భారత్ విజయం
- రాణించిన పాండే, కార్తీక్
- ఠాకూర్‌కు 4 వికెట్లు

ట్రై సిరీస్‌లో భారత్ తన రెండో విజయాన్ని నమోదు చేసింది. ఆతిథ్య జట్టుపై 6 వికెట్ల తేడాతో విజయం సాధించి ఫైనల్ అవకాశాలు మెరుగుపరుచుకుంది. లంక నిర్దేశించిన 153 పరుగుల లక్ష్యాన్ని మరో తొమ్మిది బంతులుండగానే ఛేదించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. మనీశ్ పాండే(42), దినేశ్ కార్తీక్(39)లు అజేయ భాగస్వామ్యంతో భారత్‌కు విజయాన్ని అందించారు.



కుశాల్ మెండిస్ వికెట్ తీసిన ఆనందంలో చాహల్

కొలంబో: 153 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. రోహిత్(11) మరోసారి విఫలమవ్వగా, ఫామ్‌లో వున్న శిఖర్ ధావన్ (8) కూడా తక్కువ స్కోరుకే వెనుదిరిగాడు. తర్వాత లోకేశ్ రాహుల్(18), సురేశ్ రైనా(27)లు కాసేపు క్రీజులో నిలబడడంతో పాటూ 40 పరుగుల కీలక భాగస్వామ్యం అందించారు. పిమ్మట ఇద్దరూ ఔటైనా చివర్లో మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్‌లు జట్టును విజయతీరాలకు చేర్చారు.

వర్షం కారణంగా మ్యాచ్ ప్రారంభానికి ఆలస్యమైంది. టాస్ గెలిచి రోహిత్ శర్మ ఫీల్డింగ్ ఎంచుకోగానే వర్షం మళ్లీ మొదలయింది. అయితే ఈసారి వచ్చింది ఉరుముల, మెరుపుల వర్షం కాదు. పరుగుల వర్షం.

బ్యాటింగ్ కు దిగీ, దిగగానే బౌలర్ల మీద ఎదురుదాడికి దిగడంతో తొలి రెండు ఓవర్లలోనే 24 పరుగులు వచ్చాయి. సిరీస్ ఆద్యంతం పరుగులు సమర్పించుకుంటూ వచ్చిన ఉనద్కత్ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ తొలి ఓవర్‌లోనే 15 పరుగులు ఇచ్చుకున్నాడు. అయితే వరుస ఓవర్లలో గుణతిలక(17), పెరీరా(3) వికెట్లు కోల్పోవడంతో లంక జోరుకు భారత్ కళ్లెం వేసినట్టే కనిపించినా.. ఇన్ ఫామ్ బ్యాట్స్‌మన్ కుశాల్ మెండిస్ (55), ఉపుల్ తరంగ(22)తో కలిసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మెండిస్ విధ్వంసంతో శ్రీలంక 11 ఓవర్‌లో తరంగ వికెట్ కోల్పోయే సరికి 96 పరుగులు చేసి భారీ స్కోరు చేసేలా కనిపించింది.

అయితే ద్వితీయార్థభాగంలో లంకను భారత బౌలర్లు కట్టడిచేయడంలో సఫలం కాగలిగారు. చండిమాల్ స్థానంలో కెప్టెన్సీ పగ్గాలు చేపట్టిన తిసార పెరీరాను ఠాకూర్ బోల్తా కొట్టిస్తే.. నిలకడకు పేరైన జీవన్ మెండిస్ వికెట్లకు వాషింగ్టన్ సుందర్ గిరాటేశాడు. ఆ వెంటనే చాహల్ వేసిన 15వ ఓవర్‌లో అప్పటిదాకా యాంకర్ రోల్ పోషించిన కుశాల్ మెండిస్.. రోహిత్ శర్మకు క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో లంక భారీ స్కోరు ఆశలకు గండి పడింది. పేసర్లు ఆఖరి ఓవర్లలో పరుగులు నియంత్రించడంతో 9 వికెట్ల నష్టానికి లంక 152 పరుగులకు పరిమితమైంది. ఇదే క్రమంలో శార్దుల్ ఠాకూర్ కెరీర్‌లో అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. నాలుగు ఓవర్లలో 27 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. ఈ క్రమంలో అతను హ్యాట్రిక్‌ను కూడా కోల్పోయాడు. 19వ ఓవర్ లో నాలుగు, ఐదు బంతుల్లో వికెట్లు తీసిన ఠాకూర్, చివరి బంతికి వికెట్ తీయడంలో సక్సెస్ కాలేకపోయాడు. ఇక వాషింగ్టన్ సుందర్ 4 ఓవర్లకు 2 వికెట్లతో

స్కోరు వివరాలు

శ్రీలంక: ధనుష్క గుణతిలక (సి) రైనా (బి) శార్దుల్ ఠాకూర్ 17, కుశాల్ మెండిస్ (సి) రోహిత్ (బి) చాహల్ 55, కుశాల్ పెరీరా (బి) వాషింగ్టన్ సుందర్ 3, ఉపుల్ తరంగ (బి) విజయ్ శంకర్ 22, తిసార పెరీరా (సి) చాహల్ (బి) ఠాకూర్ 15, జీవన్ మెండిస్ (బి) వాషింగ్టన్ సుందర్ 1, దసున్ శనక (సి) కార్తీక్ (బి) ఠాకూర్ 19, దనంజయ (సి) రాహుల్ (బి) ఉనద్కత్ 5, సురంగ లక్మల్ 5(నాటౌట్), చమీరా(సి) ఉనద్కత్ (బి) ఠాకూర్ 0, నువాన్ ప్రదీప్ 0(నాటౌట్), ఎక్స్‌ట్రాలు 10, మొత్తం: (19 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి) 152

బౌలింగ్ : ఉనద్కత్ 3-0-33-1, వాషింగ్టన్ సుందర్ 4-0-21-2, ఠాకూర్ 4-0-34-4, యజువేంద్ర చాహల్ 4-0-34-1, విజయ్ శంకర్ 3-0-30-1, సురేశ్ రైనా 1-0-6-0

భారత్: రోహిత్ శర్మ (సి) కుశాల్ మెండిస్ (బి) దనంజయ 11, శిఖర్ ధావన్ (సి) తిసార పెరీరా (బి) దనంజయ 8, లోకేశ్ రాహుల్ (హిట్ వికెట్/బి) జీవన్ మెండిస్ 18, సురేశ్ రైనా (సి) తిసార పెరీరా (బి) నువాన్ ప్రదీప్ 27, మనీశ్ పాండే మనీశ్ పాండే 42(నాటౌట్), దినేశ్ కార్తీక్ 8(నాటౌట్), ఎక్స్‌ట్రాలు 8, మొత్తం: (17.3 ఓవర్లలో 4 వికెట్లకు) 153 **బౌలింగ్:** సురంగ లక్మల్ 2-0-19-0, దనంజయ 4-0-19-2, చమీరా 3-0-19-2, నువాన్ ప్రదీప్ 2.3-0-30-1, జీవన్ మెండిస్ 4-0-34-1, తిసార పెరీరా 2-0-17-0



యూకీ సంచలనం


12వ ర్యాంకు ఆటగాడిపై విజయం

ఇండియన్ వెల్స్: ఇండియన్ నెంబర్ వన్ టెన్నిస్ క్రీడాకారుడు యూకి భాంబ్రి మరో సంచలనం సృష్టించాడు. కెరీర్‌లో ఇప్పటికే పలు మధుర విజయాలు సాధించిన భాంబ్రి ఈసారి 12వ ర్యాంకు ఆటగాడు ల్యూకాస్ పౌలీ మీద గెలిచి తన ఎంత ప్రమాదకర ఆటగాడో మరోసారి ప్రపంచానికి చాటిచెప్పాడు. కెరీర్‌లో తొలిసారి ఇండియన్ వెల్స్‌కు అర్హత సాధించిన ఈ పాతికేళ్ల కుర్రాడు రెండో రౌండ్‌లో ఫ్రెంచ్ ఆటగాడు పౌలీపై 6-4, 6-4 తేడాతో విజయం సాధించాడు. ఈ విజయంతో భాంబ్రి 47,170 అమెరికన్ డాలర్లతో పాటూ 45 ర్యాంకింగ్ పాయింట్లను కూడా పొందనున్నాడు. ఇక మూడో రౌండ్‌లో అమెరికన్ పొడగరి, ఏస్‌ల వీరుడు, 21 ర్యాంకు ఆటగాడు సామ్ క్వెరీతో తలపడనున్నాడు. జకోవిచ్, ఫెడరర్ లాంటి పెద్ద పెద్ద స్టార్లకే వణుకు పుట్టించే సామ్ క్వెరీ మీద విజయం సాధిస్తే మాత్రం భాంబ్రి కెరీర్ మరో మెట్టు పైకెక్కినట్టే. ఈ మధ్యే ప్రకటించిన డేవిస్ కప్ జట్టులో భాంబ్రికి చోటు దక్కిన విషయం తెలిసిందే.

ఇదేమీ కొత్తకాదు

భాంబ్రికి సంచలన విజయాలు కొత్తేం కాదు. 2017 సిటీ ఓపెన్‌లో మరో ఫ్రెంచి స్టార్ గైల్ మోన్‌ఫిల్స్ మట్టి కరిపించి ప్రపంచ టెన్నిస్‌లో తన పేరు వినిపించేలా చేశాడు. 2014 చెన్నై ఓపెన్‌లో అప్పటి 16వ ర్యాంకు ఆటగాడు, క్లే కోర్టు స్పెషలిస్ట్ ఫాబియో ఫోగ్నిని పై టెక్నికల్‌గా గెలిచినా.. నిజానికి ఫాబియో గాయం కారణంగా మ్యాచ్ మధ్యలో తప్పుకోవడంతో విజయానికి పెద్ద విలువ దక్కలేదు. తర్వాత ఇప్పుడు మరోసారి విజయం సాధించి అమెరికా ఖండంలో తన సత్తా చాటాడు.

జకోవిచ్ ఇంటికి



మాజీ నెంబర్ వన్ ఆటగాడు నొవాక్ జకోవిచ్ పునరాగమనం నిరాశాజనకంగా మొదలైంది. మోచేయి గాయానికి సర్జరీ తర్వాత తిరిగి కోర్టులో అడుగుపెట్టిన జోకర్ తొలి మ్యాచ్‌లోనే ఓటమి చవిచూశాడు. జపాన్ ఆటగాడు టారో డేనియల్ చేతిలో 6-7(3), 6-4, 1-6 తేడాతో పరాజయం పాలయ్యాడు. తొలి సెట్‌లో 5-2తో ఆధిక్యంలో నిలిచిన డానియల్ సర్వ్ బ్రేక్ చేసి సెట్ కైవసం చేసుకునే అవకాశాన్ని కోల్పోయిన సెర్బియన్ స్టార్.. ఆ తర్వాత సర్వీస్ గేమ్‌తో పాటూ, టై బ్రేక్‌లో సెట్‌నూ కోల్పోయాడు. తిరిగి రెండు సెట్‌లో పుంజుకున్నా.. మూడో సెట్ తన స్థాయికి తగ్గ ప్రదర్శనలేక మ్యాచ్ కోల్పోయాడు.

అంపైర్ పార్ట్‌నర్‌గా పేటీఎం

- ఐపీఎల్ స్పాన్సర్ షిప్

న్యూఢిల్లీ: ఇంతవరకూ భారత క్రికెట్‌కు అధికారిక స్పాన్సరర్‌గా వ్యవహరించిన పేటీఎం ఇకనుంచీ బీసీసీఐతో తన భాగస్వామ్యాన్ని మరింత విస్తరించనుంది. రానున్న ఐదేండ్లకు గానూ ఐపీఎల్ అంపైర్ పార్ట్‌నర్‌గా పేటీఎం వ్యవహరించనుంది. పేటీఎం చైర్మన్ రాజీవ్ శుక్లా ఇదే విషయమై స్పందిస్తూ "మా బ్రాండ్ విలువ పెరగడంలో క్రికెట్ పాత్ర ఎంతైనా వుంది. ఇప్పుడు మరో ఐదేండ్ల పాటూ ఐపీఎల్‌లో భాగస్వామ్య మౌతున్నందుకు సంతోషిస్తున్నాం" అన్నారు.

లార్డ్స్ టెస్టుకు స్టోక్స్ దూరం



లండన్: ప్రముఖ ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ ఆగస్టులో భారత్‌తో జరుగనున్న లార్డ్స్ టెస్టుకు దూరం కానున్నాడు. గతంలో ఒక వ్యక్తిని గాయపరిచిన కేసులో విచారణ ఆగస్టు 6వ తేదీకి వాయిదా వేయడంతో.. ఐదారు రోజుల పాటూ జరిగే విచారణకోసం 9 నుంచి మొదలయ్యే లార్డ్స్ టెస్టుకు స్టోక్స్ మిస్సవ్వక తప్పని పరిస్థితి. ఈ విషయమై వీడియో లైవ్‌లో స్టోక్స్‌తో మాట్లాడిన జడ్జి.. తర్వాత విచారణ సమయంలో తప్పక హాజరవ్వాలని ఆదేశించడం జరిగింది.

మళ్లీ చెలరేగిన రబాడా

- రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు
- ఆసీస్‌పై సఫారీల విజయం
- 1-1తో సిరీస్ సమం



పోర్ట్‌ఎలిజెబెత్ : ఆస్ట్రేలియాతో ఆడుతున్న రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆసీస్ నిర్దేశించిన 101 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని 4 వికెట్లు కోల్పోయి దక్షిణాఫ్రికా ఛేదించింది. ఈ విజయంతో నాలుగు టెస్టుల సిరీస్‌ను 1-1తో ఆ జట్టు సమం చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో ఓవర్‌నైట్ స్కోరు 5 వికెట్ల నష్టానికి 180 పరుగులతో నాలుగో రోజు ఆట మొదలు పెట్టిన పర్యాటక ఆసీస్ జట్టు 239 పరుగులకు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్‌లో కంగారూల నడ్డివిరిచిన రబాడా(6/54) మరోసారి అలాంటి ప్రదర్శనే చేశాడు. రబాడా ధాటికి ఓవర్ నైట్ బ్యాట్స్‌మెన్ ఉస్మాన్ ఖ్వాజా(75) పరుగులేమీ చేయకుండానే నిష్క్రమించాడు. కాసేపటికే మరో ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ మిచెల్ మార్ష్(39) కూడా రబాడా బంతికి బలయ్యాడు.. తర్వాత ప్రమాదకారి స్టార్క్(0) తో పాటూ నాథన్ లయాన్(5) ల వికెట్లు తీసి... అవతల ఎండ్‌లో టిమ్ పెయిన్(28) కు భాగస్వామ్యాలు నిర్మించే అవకాశం లేకుండా చేశాడు రబాడా. తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లను కలుపుకుని మొత్తం 11 వికెట్లు తీసిన రబాడాకే ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. మొత్తంగా ఒక టెస్టులో 10 వికెట్లు తీయడం రబాడాకు ఇది నాలుగోసారి కావడం విశేషం. దక్షిణాఫ్రికా తరపున అత్యధికంగా స్టెయిన్ 5 సార్లు 10 వికెట్లు నేలకూల్చాడు. అయితే స్టెయిన్ 86 టెస్టుల్లో ఆ ఘనత వహిస్తే.. రబాడా ఇప్పటివరకూ ఆడింది 28 టెస్టులు మాత్రమే. ఇక రెండో ఇన్నింగ్స్‌లో డివిలియర్స్ సెంచరీ మ్యాచ్‌ను మలుపు తిప్పిన సంగతి తెలిసిందే. దీంతో సఫారీల తరపున ఆస్ట్రేలియాపై అత్యధిక సెంచరీలు(6) చేసిన ఆటగాడిగా ఏబీ చరిత్రకెక్కాడు. హషీమ్ ఆమ్లా, గ్రేమ్ పొల్లాక్, జాక్వస్ కల్లిస్, బార్లోలు 5 సెంచరీలతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా 243, 239

సౌతాఫ్రికా 382, 102/4



కోహ్లీకి తిరుగులేదు

- 2025లోగా 100 సెంచరీలు చేస్తాడు
- క్రీడా జ్యోతిష్కుడు నరేంద్ర బుండె

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ 2018లో తన కెరియర్ పరంగా ఉన్నత స్థానంలో నిలిచి, ప్రచార కర్తగా భారీగా ఆదాయాన్ని కూడగట్టుకుంటాడని క్రికెట్ జ్యోతిష్కుడు నరేంద్ర బుండె అంటున్నాడు. జ్యోతిష్యమే కదా అని తేలికగా తీసిపారేయాలేము. ఎందుకంటే గతంలో ఈయన మహేంద్రసింగ్ ధోనీ కెరియర్‌పై చెప్పిన భవిష్యం నిజమైంది. ధోనీ 36 ఏళ్లకు పైబడి క్రీడల్లో కొనసాగుతాడని 2019 ఇంగ్లండ్‌లో జరిగే ప్రపంచకప్‌లో ఆడతాడని చెప్పాడు. నాగపూర్‌కు చెందిన బుండె తాజాగా తన దృష్టిని కోహ్లీ వైపు మరల్చాడు. కోహ్లీ ఆధ్వర్యంలోని భారత జట్టు టీ20 ప్రపంచ కప్‌ను, వన్డే ప్రపంచ కప్‌ను గెలుస్తుందన్నాడు. సచిన్ అంతర్జాతీయ మ్యాచుల్లో నెలకొల్పిన 100 సెంచరీల రికార్డును కోహ్లీ 2025లోగా అధిగమిస్తాడని జోస్యం చెప్పాడు. 'నేను చెప్పినవన్నీ నిజమవుతాయి. 2025లోగా కోహ్లీ టీ20, వన్డే ప్రపంచకప్‌లు గెలిచి సచిన్ సెంచరీల రికార్డును బద్దలు కొడతాడు' అని బుండె అన్నాడు. 2018లో కోహ్లీ ప్రముఖ సంస్థతో ప్రచారకర్తగా భారీ ఒప్పందాన్ని కుదుర్చుకుంటాడన్నారు. ఈ ఒప్పందాన్ని సచిన్ మార్క్ మస్కారెన్‌హాస్ వరల్డ్ టెల్‌తో కుదుర్చుకున్న ఒప్పందంతో పోల్చితే కోహ్లీ ఒప్పందం విలువ ఎక్కువగా ఉంటుందన్నాడు. 90వ దశకంలో టెండూల్కర్ మంచి ఊపుమీద ఉన్నాడు. మస్కారెన్‌హాస్ సచిన్ దశను మార్చేసింది. సచిన్‌కు సెలబ్రెటీ హోదాను కట్టబెట్టింది. ఆ విధంగా ఈ క్రికెట్ దిగ్గజం మల్టీ మిలియనీర్‌గా మారిపోయాడు. గతంలో సచిన్ టెన్నిస్ ఎల్బో గాయంనుంచి కోలుకొని తిరిగి ఆటలో పుంజుకుంటాడని, అతనికి భారత రత్న పురస్కారం, సౌరబ్ గంగూలీ విశ్రాంతి తర్వాత తిరిగి జట్టులోకి రావడం, 2011లో ప్రపంచ కప్ విజయం, విదేశాల్లో కోహ్లీ జట్టు విజయం సాధిస్తుందని బుండె చెప్పిన జ్యోస్యాలు నిజమయ్యాయి. 'భారత్ ఇటీవల దక్షిణాఫ్రికాలో పర్యటించింది. వేసవిలో ఇంగ్లండ్‌లో అనంతరం ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ప్రస్తుతం, కోహ్లీ అధిష్ఠాన గ్రహం శుక్రుడు బలంగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో అతడు విదేశాల్లో బాగా రాణిస్తున్నాడు. నాకు విశ్వాసముంది. ఆస్ట్రేలియాలో భారత్ బాగా రాణిస్తుంది' అని అన్నాడు. 2006 నుంచి బుండె క్రికెటర్ల భవిష్యత్తును చెపుతున్నాడు. భారత క్రికెటర్లు గంగూలీ, మురళీ కార్తిక్, ఎస్. శ్రీశాంత్, జహీర్ ఖాన్, గౌతం గంభీర్, సురేష్ రైనాలు తమ భవిష్యత్తుకు సంబంధించి బుండె నుంచి సలహాలు పొందారు. ఐపీఎల్‌లో కింగ్స్-11 పంజాబ్ యజమానిగా ఉన్న బాలీవుడ్ నటి ప్రీతి జింటా కూడా ఒకప్పుడు బుండెను సంప్రదించిన వారిలో ఉంది.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

ఈ రోజుల్లో వాట్సాప్ అంటే తెలియని వారుండరేమో!.. ప్రతి కొత్త స్మార్ట్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయి ఉంటుంది వాట్సాప్. లేదంటే కొన్న వెంటనే ముందుగా ఫోన్‌లోకి గృహప్రవేశం చేసేది వాట్సాప్. కాబట్టి దాని గురించిన పరిచయం అనవసరం. ఇప్పుడు ప్రపంచంలో అత్యంత ప్రాచుర్యం పొందిన తక్షణ సందేశ సేవలందించే యాప్... వాట్సాప్ అనడం అతిశయోక్తి కాదు. జనవరి 2009లో మొదట విడుదలైన వాట్సాప్‌కు .. ఇప్పుడు 150 కోట్లకు పైగా యూజర్లున్నారు. వాట్సాప్‌కి పదుల సంఖ్యలో పోటీ మరియు ప్రత్యామ్నాయాలు ఉన్నప్పటికీ... ప్రస్తుతానికి అత్యంత ప్రజాదరణ పొందింది మాత్రం వాట్సాప్ అని చెప్పక తప్పదు. ఇలాంటి ఎదుగుతున్న, అతి ఉత్తమమైన, ఆకట్టుకొనే, ఆకర్షణీయమైన యాప్‌లపై.. టెక్ దిగ్గజాలైన గూగుల్ , ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్ , యాహూలు ఓ కన్నేసి ఉంచుతాయి. ఒకసారి ప్రజాదరణ పొందినా, లేక తమల కంపెనీల మనుగడకు వాటివలన ముప్పు కనిపించినా, తమ ఖజానాకు లాభదాయకమని తెలిసినా.. వెంటనే చెక్కు బుక్‌తో వెళ్లి పోటీ పడి మరీ కొనేస్తాయి. అలా వాట్సాప్‌ను 19 బిలియన్ డాలర్లు ఇచ్చి 2014లో ఫేస్‌బుక్ సొంతం చేసుకుంది. 150 కోట్ల క్రియాశీల యూజర్లు ప్రతిరోజూ దాదాపు 6000 కోట్ల మెసేజ్‌లను దీని ద్వారా పంపుతున్నారు. అనునిత్యం నవీకరణల కోసం పాటుపడే వాట్సాప్ యాజమాన్యం కొత్తగా చాలా ఫీచర్లను అందివ్వబోతున్నారు. అవేంటో చూద్దాం!



టెక్ టైమ్

వావ్!... వాట్సాప్ ఫీచర్లు!!



➤ అయ్యో కాలేజి స్నేహితులతో పంచుకోవాల్సిన జోక్, మెసేజ్ పొరపాటున ఫ్యామిలీ గ్రూప్‌లో పెట్టి చూసుకోలేదా? గర్ల్ ఫ్రెండ్‌కి పంపాల్సిన సందేశం పొరపాటున సోదరికో, బాస్‌కో పంపించారా? అయితే ఇపుడు 7 నిమిషాల్లో ఆ మెసేజ్‌ను వెనక్కి తీసుకోవచ్చు. అంటే డిలీట్ చేయవచ్చు. కానీ త్వరలోనే మెసేజ్ డిలీట్ ఆప్షన్ వ్యవధి ఒక గంట 8 నిమిషాలకు పొడిగించే అవకాశాలున్నాయి. ఈ ఆప్షన్‌కి కొన్ని పరిమితులున్నాయి. పెట్టిన మెసేజ్ నిర్ణీత వ్యవధిలో మీరు డిలీట్ చేసేలోగా ఎవరైనా చూడొచ్చు. స్క్రీన్ షాట్ తీసుకోవచ్చు, ఫార్వర్డ్ చేయొచ్చు. అయితే డిలీట్ ఫర్ ఎవెరీబడీ లేదా అందరి కోసం తొలగించు" నొక్కండి. ''ఈ సందేశం తొలగించబడినది" అని మాత్రం వస్తుంది. దీన్ని బట్టి అందరికి తెలుస్తుంది మెసేజ్ తొలగించినట్టు. కానీ పెద్ద ప్రమాదం ముందు ఇది ఒక లెక్క కాదు కదా.

➤ కొత్తగా గ్రూప్ వాయిస్ కాల్స్, కాన్ఫరెన్స్ కాల్స్‌తో పాటు వాట్సాప్ డెస్క్‌టాప్ ఎడిషన్‌లో/వెబ్‌సైట్ ఎడిషన్‌లో లాగిన్ పేజీలో కూడా ఎన్నో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఐ పాడ్ లో వాట్సాప్ లేకపోవడం దాని యూజర్లందరిని నిరుత్సాహ పరిచింది. దీంతో ఐ పాడ్ కోసం సరికొత్త వాట్సాప్ వెర్షన్ కార్యరూపం దాలుస్తోంది. ఇది సాధ్యమయినంత త్వరలో అందుబాటులోకి రానుంది.

➤ వాట్సాప్ కొత్తగా అభివృద్ధి చేసిన మరో ముఖ్యమైన ఫీచర్ విషయానికి వస్తే... యూట్యూబ్ వీడియో లింక్‌ను ఎవరైనా పంపితే నేరుగా వాట్సాప్ స్క్రీన్‌లోనే దానిని ఓపెన్ చేసుకొని వీడియోను తిలకించడానికి అవకాశముంటుంది. ప్రస్తుతం మనం వాట్సాప్‌లో వచ్చిన యూట్యూబ్ లింక్‌పై క్లిక్ చేస్తే వాట్సాప్ బయటికు తీసుకెళుతుంది. ఈ కొత్త ఫీచర్‌తో యూజర్‌కు ఆ ఇబ్బంది తప్పింది. ఇక వాట్సాప్ కొత్త ఫీచర్లు ఆండ్రాయిడ్, ఐ ఓ ఎస్, విండోస్ మరియు వాట్సాప్ డెస్క్‌టాప్‌లాంటి విభిన్న ఆపరేటింగ్ సిస్టం కోసం వేరువేరు అప్‌డేట్లు వేర్వేరు సమయాల్లో విడుదల చేస్తుంది. ఒక కొత్త ఫీచర్ ఒకసారి ఐఓఎస్‌లో ముందుగా వస్తే మరొకటి ఆండ్రాయిడ్‌లో ముందు వస్తుంది.

➤. వాట్సాప్ గ్రూప్ వివరణ....ఒక యూజర్ సగటున 10 నుంచి 15 గ్రూపుల్లో పాల్గొంటారు. అది ఎల్ కేజీ క్లాస్‌మేట్స్ నుంచి పీజీ క్లాస్‌మేట్స్ వరకు... బంధువులకు వేర్వేరుగా, పాత ఆఫీస్ కొలీగ్స్ నుంచి ప్రస్తుత కంపెనీ కొలీగ్స్, అపార్ట్ మెంట్ వాళ్ళకి ఇలా ఎన్నో గ్రూపులుంటున్నాయి. ఇప్పుడు కొత్తగా గ్రూవు వివరణ.. అనగా ఫ్యామిలీ, ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్, ప్రొఫెషనల్, ఫైనాన్షియల్ లాంటి గ్రూప్‌ల యొక్క ఉద్దేశ్యం తెలియజేయడానికి ప్రవేశపెడుతున్నారు.

➤ వాట్సాప్ గ్రూప్ పేరు ప్రస్తుతానికి 20 కేరక్టర్స్ కన్నా అనుమతించదు. ఒకే రోజు గ్రూప్‌లో ముగ్గురు జన్మదినాలున్నపుడు అందరి పేర్లు పెట్టి హేపీ బర్త్ డే అని హెడ్డింగ్ మార్చడం కష్టం. ఇప్పుడు స్క్రోలింగ్‌తో పాటు 30 క్యారెక్టర్స్ వరకు పెంచొచ్చు.

➤ వాట్సాప్‌లో అప్పుడప్పుడు మన ప్రమేయం లేకుండా కీ పాడ్ నొక్కుకొని వాయిస్ రికార్డ్ కావడమే కాకుండా..వేరే గ్రూపుల్లోకి పొరపాటున పోస్ట్ అవుతుంటుంది. దీనివల్ల మిగతా గ్రూప్ మెంబర్లకు ఇబ్బంది కలుగుతుంది.దీనిని నివారించేందుకు వాట్సాప్ వాయిస్ రికార్డింగ్ లాక్ ఫీచర్ ఉపయోగపడుతుంది. అవసరమైనపుడు మాత్రమే ఫోన్లో మైక్రోఫోన్ లాక్‌ని ఓపెన్ చేసి, వాయిస్ రికార్డింగ్ చేసి మెసేజ్ పంపొచ్చు.

➤ మనం వాయిస్ మెసేజ్ రికార్డు చేసిన వెంటనే పంపివేయబడుతుంది. లేదా ఒక డమ్మీ గ్రూప్ లో ముందు పెట్టి, దానిని విని నచ్చితే అసలు గ్రూప్‌లో పెట్టొచ్చు. కొత్త ఫీచర్‌లో రికార్డు చేసిన వాయిస్ మెసేజ్ ముందుగా మనం విని సంతృప్తికరంగా ఉంటేనే పంపొచ్చు.

➤ వ్వాట్సాప్ గ్రూప్‌లో ఒకరికన్నా ఎక్కువ అడ్మిన్లు ఉండడం సహజం. కానీ ఒక అడ్మిన్ ఇతర అడ్మిన్‌లను లేదా మరొక అడ్మిన్‌ను కొన్ని కారణాల వలన తొలగించాలంటే ముందుగా గ్రూవు నుంచి తొలగించి మళ్లీ గ్రూపులో సాధారణ సభ్యునిగా యాడ్ చేయాలి. గ్రూప్‌ను స్థాపించిన వ్యక్తిని కూడా ఇతర అడ్మిన్ తొలగించడానికి ఆస్కారముంది. కొత్త ఫీచర్లో ఒక అడ్మిన్ మరో అడ్మిన్‌ను లేదా ఇతర అడ్మిన్‌లను గ్రూప్ నుంచి బయటకు పంపకుండా అడ్మిన్ నుంచి సాధారణ సభ్యులుగా చేయచ్చు.

మరొక ముఖ్య విషయం ఏ అడ్మిన్ అయినా గ్రూప్‌ను ప్రారంభించిన వ్యవస్థాపకులను అడ్మిన్ నుంచి తొలగించలేరు.

➤ అనునిత్యం నవీకరణల కోసం పాటు పడే వాట్సాప్ యాజమాన్యం కొత్తగా మరో ఫీచర్ అందివ్వనుంది. మన ఫోన్లో హెూమ్ స్క్రీన్‌లో ఉండే వాట్సాప్ ఐకాన్‌ని మరింత ఆకర్షణీయంగా మలచుకోవచ్చు. వాట్సాప్ చిహ్నం లేదా ఐకాన్ ఆకారాన్ని వృత్తాకారం, చతురస్రాకారం...లాంటి ఆకారాలకి మార్చడానికి అనుమతిస్తుంది.



➤ వ్యాపారస్తుల కోసం ఈ మధ్య కొత్తగా మొదలు పెట్టిన వాట్సాప్ బిజినెస్.. కొద్ది రోజుల్లోనే ప్రాచుర్యం పొంది, అందరి మన్ననలు చూరగొంది. ఒక ఒరలో రెండు కత్తులు ఇమడనట్లే ఒక ఫోన్లో రెండు వాట్సాప్ అక్కౌంట్లు సాధ్యం కాదు. డ్యూయల్ సిమ్ ఉన్నా సరే ఇది సాధ్యపడదు. కానీ ఒక ఫోన్లో ఒక మామూలు వాట్సాప్ అకౌంట్ మరొక వాట్సాప్ బిజినెస్ అకౌంట్ ఓపెన్ చేసుకోవచ్చు. రెండు మామూలు వాట్సాప్ అకౌంట్స్ లేదా రెండు వాట్సాప్ బిజినెస్ అకౌంట్స్ కుదరదు. వ్యాపారస్తుల కొరకు వారి బిజినెస్ అవసరాలు లక్ష్యంగా పెట్టుకొని ప్రవేశపెట్టిన వాట్సాప్ బిజినెస్‌లో ఒక ఫోన్ నంబర్ ఉపయోగించి అకౌంట్ సృష్టించవచ్చు. కానీ ఒకే ఫోన్ నంబర్ ఉపయోగించి వాట్సాప్ బిజినెస్ మరియు మామూలు వాట్సాప్ వాడలేరు. ఒక ఫోన్లో ఒక వాట్సాప్ బిజినెస్ ఒక సాధారణ వాట్సాప్ నమోదు చేసుకోవచ్చును. కానీ రెండింటికి వేరువేరు ఫోన్ నెంబర్లు ఉండాలి!



- సునీల్ ధవళ
మాజీ వైస్ ప్రెసిడెంట్
నేషనల్ జియోగ్రాఫిక్ అండ్ ఫ్యాక్స్

రెడ్‌మీ-5 స్మార్ట్‌ఫోన్ వచ్చేస్తోంది

సరికొత్త ఫీచర్లతో జియోమి రెడ్ మీ-5 స్మార్ట్ ఫోన్ ఈనెల 14న భారతీయ మార్కెట్లోకి వచ్చేస్తోంది. చైనీస్ కంపెనీ ఇప ్పటికే తన సోషల్ మీడియా ఛానెల్ ద్వారా రెడ్ మి-5 పనితీరును పరిశీలిస్తోంది. ప్రత్యేక ఫీచర్లతో కస్టమర్లను ఆకట్టుకునేలా రానున్న రెడ్ మి-5 స్మార్ట్ ఫోన్ ఫీచర్ల విషయానికి వస్తే...



రెడ్ మీ-5 స్మార్ట్‌ఫోన్ ఫీచర్లు..

- ✶ 5.7అంగుళాల హెచ్‌డీ ప్లస్ ఫుల్ వ్యూ డిస్‌ప్లే
- ✶ 12 మెగా పిక్సెల్ బ్యాక్ కెమెరా
- ✶ 5 మెగా పిక్సెల్ సెల్ఫీ కెమెరా విత్ ఫ్లాష్
- ✶ 3300 ఎంఏహెచ్ బ్యాటరీ
- ✶ 1440 x 720 పిక్సెల్ స్క్రీన్ రిజల్యూషన్
- ✶ 2/3 జీబీ ర్యాం, 16/32 జీబీ స్టోరేజ్
- ✶ ఫింగర్ ప్రింట్ సెన్సార్ ..తదితర ప్రత్యేకమైన ఫీచర్లతో రెడ్ మీ-5 రాబోతోంది. దీని ధర 6,999 రూపాయలు ఉండవచ్చని అంచనా.

చందమామకో సెల్‌ఫోన్!



భూమి మీద కోట్లాది మంది అల్లుళ్లు స్మార్ట్ ఫోన్ వాడుతుంటే.. పైన ఉండే మామకు కడుపు మండడంలో ఆశ్చర్యం ఏముంది, కాని అడిగితే పెద్దరికం పోతుంది కదా? అందుకే మంటను కడుపులో దాచుకుని,.మనకు మాత్రం చల్లని వెన్నెల అందిస్తున్నాడు మన ముద్దుల చందమామ. మరి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో రాకెట్లా దూసుకెళ్తున్న అల్లుళ్లు మామ మనసులో మాట తెలుసుకోలేరా చెప్పండి. అందుకే ఆయన కోర్కెను తీర్చనున్నారు. వచ్చే సంవత్సరం చంద్రునికి ఓ మొబైల్ ఫోన్ అందించనున్నారు.

వొడాఫోన్ జర్మనీ, నెట్వర్క్ పరికరాల తయారీ సంస్థ నోకియా, కార్ల తయారి సంస్థ ఆడి సంయుక్తంగా ఈ మూన్ మిషన్ కోసం పనిచేస్తున్నాయి. నాసా హ్యోమగాములు చంద్రమండలం మీద నడిచిన 50 సంవత్సరాల తర్వాత..అక్కడ సెల్ ఫోన్ నెట్‌వర్క్ ను ఏర్పాటు చేయనున్నారు. చంద్రుని ఉపరితలం నుంచి భూమిమీదికి పనిచేసే విధంగా 4జీ నెట్వర్క్ రెడీ అయింది. పరీక్షలు జరుగుతున్నాయి. ఏదేమైనా వచ్చే ఏడాది నుంచి చందమామ కూడా సెల్ ఫోన్‌లో భూమిమీద ఉన్న అల్లుళ్లతో మాట్లాడనున్నారు! ఆల్ ది బెస్ట్ చందమామా!

ఎల్జీ నుంచి రెండు కొత్త ఫోన్లు

ఎల్ జీ కంపెనీ రెండు కొత్త స్మార్ట్ ఫోన్లను మార్కెట్లోకి విడుదల చేయనుంది. కే8(2018), కే 10(2018) పేరుతో ఈనెల 26న బార్సిలోనాలో జం ్గగనున్న మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ -2018 ప్రదర్శనలో ఈ నూతన ఫోన్లను విడుదల చేయనుంది. అయితే ఈ ఫోన్లు యూరోప్, ఆసియా, లాటిన్ అమెరికా, మిడిల్ ఈస్ట్ దేశాల మార్కెట్లలో అందుబాటులోకి వస్తాయి. ధర ఎంత అనేది మాత్రం కంపెనీ ప్రక టించలేదు.



ఎల్ జీ కే8(2018) స్మార్ట్ ఫోన్ ఫీచర్లు

- ◆ 5 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే
- ◆ 8 మెగా పిక్సెల్ బ్యాక్ కెమెరా
- ◆ 5 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా
- ◆ 2500 ఎంఏహెచ్ బ్యాటరీ
- ◆ ఫింగర్ ప్రింట్ సెన్సార్
- ◆ బ్లూటూత్ 4.2
- ◆ 4జీ వీవోఎల్‌టీఈ, డ్యూయల్ సిమ్
- ◆ 1280 x 720 పిక్సెల్ స్క్రీన్ రిజల్యూషన్
- ◆ అండ్రాయిడ్ 7.1.2 నూగట్ ఆపరేటింగ్ సిస్టమ్
- ◆ 2 జీబీ ర్యాం, 16 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ (32టీబీ ఎక్స్‌పాండబుల్ స్టోరేజీ)
- ◆ 2500 ఎంఏహెచ్ బ్యాటరీ

ఎల్ జీ కే8(2018) స్మార్ట్ ఫోన్ ఫీచర్లు

- ◆ 5.3 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే
- ◆ 8 మెగా పిక్సెల్ బ్యాక్ కెమెరా
- ◆ 5 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరా
- ◆ 2500 ఎంఏహెచ్ బ్యాటరీ
- ◆ ఫింగర్ ప్రింట్ సెన్సార్,
- ◆ బ్లూటూత్ 4.2 4జీ వీవోఎల్‌టీఈ, డ్యూయల్ సిమ్
- ◆ 1280 x 720 పిక్సెల్ స్క్రీన్ రిజల్యూషన్
- ◆ అండ్రాయిడ్ 7.1.2 నూగట్ ఆపరేటింగ్ సిస్టమ్
- ◆ 2/3 జీబీ ర్యాం, 16/32 జీబీ ఇంటర్నల్ స్టోరేజీ (2టీబీ ఎక్స్‌పాండబుల్ స్టోరేజీ)
- ◆ 3000 ఎంఏహెచ్ బ్యాటరీ





అర్జునుడితో పాటు పాండవులందరూ తమ స్థితిని గుర్తెరిగి వ్యవహరించిన వారే. రాజ్యం ఉన్నా లేకపోయినా, అడవుల్లో ఉన్నా, భిక్షమెత్తుకోవాల్సి వచ్చినా మానవులుగా విధి రాతకు అనుగుణంగా మసలుకోవాలనుకున్నారే గాని మేము అరివీర భయంకరులం, దేవతాంశతో పుట్టిన వారం అని ఏనాడూ అహంకరించలేదు.

ఉన్న స్థితిని మరచిపోకూడదు

ఎప్పుడూ మనం ఉన్న స్థితిని మరచిపోకూడదు. మహాత్ములు అలానే వ్యవహరిస్తారు. శ్రీరాముడు అలానే వ్యవహరించాడు. ఒక సందర్భంలో దేవతలంతా వచ్చి 'నీవు శ్రీమన్నారాయణుడివి. ఇది రామావతారం అన్నా ఆయన **ఆత్మానం మానుషం మన్యే...** అంటూ అదంతా నాకు తెలియదు నేను దశరథ కుమారుడిని మాత్రమే అన్నాడు. అర్జునుడితో పాటు పాండవులందరూ అలా వ్యవహరించిన వారే. రాజ్యం ఉన్నా లేకపోయినా, అడవుల్లో ఉన్నా, భిక్షమెత్తుకోవాల్సి వచ్చినా మానవులుగా విధి రాతకు అనుగుణంగా మసలుకోవాలనుకున్నారే గాని మేము అరివీర భయంకరులం, దేవతాంశతో పుట్టినవారం అని ఏనాడూ అహంకరించలేదు. ఒకసారి అర్జునుడు ఇంద్రునితో కలిసి స్వర్గానికి వెళ్ళాడు. అక్కడవారు అర్జునుని ఎంతో ఆదరంతో చూచారు. ఆయన అస్త్ర శస్త్రా పాటవాన్ని కొనియాడారు. ఇంద్రుడు ఆర్జునుని సేవకు ఊర్వశిని నియోగించాడు. ఊర్వశి అత్యుత్సాహం ప్రదర్శించింది. అత్యుత్సాహం ప్రమాద హేతువు. పూర్వం సగరుడు అశ్వమేధ యాగం చేస్తూండగా దానికి విఘ్నం కలిగించాలనే ఉద్దేశంతో ఇంద్రుడు ఆ యాగాశ్వాన్ని మాయం చేశాడు. అయితే దానిని వెతుక్కుంటూ తన వద్దకు రావచ్చుని దానిని తీసికెళ్ళి మహాతపస్వి అయిన కపిల మహాముని ఆశ్రమం వద్ద కట్టి వేశాడు. దానిని వెతుక్కుంటూ వచ్చిన సగర కుమారులు 60 వేల మంది ఆ యాగాశ్వాన్ని కపిల ముని ఆశ్రమం వద్ద చూశారు. ముందూ, వెనుకా ఆలోచించకుండా వెంటనే అతనే తమ అశ్వాన్ని అపహరించాడని అత్యుత్సాహంతో అతనిని శిక్షించదలచి అరుస్తూ ముందుకు దూకారు. ఈ కలకలానికి కపిలునికి తపోభంగమయింది. తనపైకి క్రోధావేశాలతో వస్తున్న వారిని చూశాడు. ఒక్క హుంకారంతో వారినందరినీ భస్మం చేశాడు. తర్వాత చాలా కాలానికి వారికందరికీ ఉత్తమ గతులు లభించేందుకు భగీరథుడు శివుని, గంగా దేవిని ప్రసన్నం చేసుకుని భాగీరథీ జలాలను ఆ భస్మ రాశులపైగా ప్రవహించేట్లు చేశాడు. తద్వారా వారికందరికీ పుణ్యగతులు లభించేలా చేశాడు. అదంతా వేరే కథ. అత్యుత్సాహం అంతపని చేయిస్తుందనేందుకు ఇది ఉదాహరణ. ఇక్కడ ఊర్వశి అర్జునుడు ఎలాంటివాడో తెలుసుకోలేదు. అతను

మహాభారతంలో చిన్న కథలు

అందమైనవాడు. తను అద్భుత సౌందర్యవతి. సర్వాలంకార భూషితయై అర్జునుని దగ్గరకు వెళ్ళింది. అర్జునుడు ఆమెను చూసి 'అమ్మా! నా కోసం వచ్చినందుకు ఇవిగో నా నమస్సులు స్వీకరించండి' అన్నాడు. దానికి ఆమె 'ఓ మనోహరా! నీ గురించి నాకు చాలా తెలును. నీ కోసం పనిగట్టుకు వచ్చాను. నీకు సేవ చేయమని ఇంద్రుడు నన్ను పంపాడు. నీవేమిటి అమ్మా అని పిలుస్తున్నావు' అని ఆగ్రహంతో అడిగింది. దానికి అర్జునుడు 'అమ్మా! మీరేమో దివ్యులు, స్వర్గనివాసులు. నేను నరలోకంలో ఉండేవాడిని. కేవలం అతిథిగా వచ్చాను' అని బదులిచ్చాడు. దానితో ఊర్వశి మండి పడింది. 'నేను వలచి వస్తే నీవు నపుంసకుడిలా వ్యవహరిస్తున్నావు కనుక, నపుంసకుడివైపో' అని శపించింది. దానిని అజ్ఞాతవాస సమయంలో ఉపయోగించుకోమని ఇంద్రుడు సలహా ఇచ్చాడు. అసలు ఇంద్రుడు అర్జునుని సేవించమని ఊర్వశిని పంపడంలో అంతరార్థం ఇలా జరుగుతుందని అజ్ఞాతవాసంలో అర్జునునికి అది ఉపయోగిస్తుందనే అయి ఉంటుందని అది దైవేచ్ఛేనని కొందరు వ్యాఖ్యాతల అభిప్రాయం. ఇంద్రుడు అర్జునునికి సాయం చేయడం ఉన్నదే. కర్ణుడు అర్జునుని చేతిలో హతమయ్యేందుకు వీలుగా అతని కవచ కుండలాలు అడిగి తీసుకున్నాడు. ఇదీ అటువంటిదేనని వారి అభిప్రాయం. పురాణ ఇతిహాస వాఙ్మయంలో చాలా శాపాలు వరాలుగా, దైవేచ్ఛ ననుసరించే జరిగాయనే విషయం తెలిసిందే. అజ్ఞాతవాసంలో అర్జునుని రూపం మారాలి. పాండవులలో మిగతా నలుగురూ ఏదో రూపాలతో గడపగలవారే. ఒక్క అర్జునుణ్ణే మారువేషంలో ఉన్నా ఎక్కువ మంది పసిగట్టే అవకాశం ఉంది. అందుచేత అర్జునునికి ఆ రూపం వచ్చేలా చేశాడు. అర్జునుడు స్వర్గానికి వెళ్ళినా తన స్థితిని మరువలేదు. తాను మానవుడిననే విషయం అక్కడా గుర్తు చేశాడు. దేవత లను ఏ విధంగా చూడాలో, ఏ విధంగా వారిని గౌరవించాలో అక్కడా అదే పాటించాడు. తాను ఇంద్ర కుమారుణ్ణని అహంకరించలేదు. శాపం వచ్చినా అన్నిటికీ కృష్ణుడే ఉన్నాడని అనుకున్నాడు. ఈశ్వరార్పణగా కష్టాన్ని స్వీకరిస్తే అది మంచేచేస్తుంది అన్న నీతి కూడా దీనిలో ఉంది.

- అశ్విని

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

దేశాంతరగతులు



శ్రీరమణాశ్రమం
12-7-47

చాలాకాలం నుంచీ భక్తుడుగా ఉంటూ వున్న బెంగాలు దేశస్థుడగు అరవిందబోసుకు ఒకే కొడుకు, ఒకే కూతురు ఉండేవారు. చెట్టల్లే పెరిగిన కొడుకు 18 ఏండ్లయినా నిండకుండా గతించాడు. అది కారణంగా అతను ఖిన్నుడై ఆ ఖిన్నత పోగొట్టుకునే నిమిత్తం భగవాన్నప్పుడప్పుడు ఏదైనా ప్రశ్నిస్తూ ఉండేవాడు. ఈరోజున కూడా ఏదో ప్రశ్నించాడు. అందులోనూ ఆ విచారం వ్యక్తమౌతూనే ఉన్నది. భగవాన్ యథాప్రకారం నిన్ను నీవు తెలుసుకొమ్మనే బోధ చేశారు. అతనికింకా తృప్తి కాలేదు. భగవాన్ ''విచారసాగరంలో ఒక కథ ఉన్నది. చెప్తాను వినం''డని ఇట్లు సెలవిచ్చారు.

''రాముడు, కృష్ణుడు అనే యువకులిద్దరు విద్యాభ్యాసమొనరించి విశేషధనం ఆర్జిస్తామని వారి వారి తల్లిదండ్రులకు చెప్పి, విదేశమునకు వెళ్లారు. కొన్నాళ్లకు ఒకడకస్మాత్తుగా మరణించాడు. ఒకడు విద్యాభ్యాసమొనరించి విశేష ధనార్జనాపరుడై సుఖంగా ఉన్నాడు. ఆ వెనుక కొన్నాళ్లకు ఒక వర్తకుడక్కడ నుండి బయలుదేరి వీరి తల్లిదండ్రులున్న దేశానికి వెడుతుంటే, జీవించియున్నవాడు, తన తండ్రికి తాను ఐశ్వర్యవంతుడై సుఖంగా ఉన్నాననీ, తనతో వచ్చినవాడు గతించాడనీ చెప్పి పంపాడు. ఆ వర్తకుడట్లు చెప్పక, బ్రతికున్నవాని తల్లిదండ్రులతో మీవాడు గతించాడనీ, గతించినవాని తల్లిదండ్రులతో మీవాడు విశేషంగా ధనం సంపాదించి, సుఖంగా ఉన్నాడనీ చెప్పాడు. గతించివాని తల్లిదండ్రులు అబ్బాయి వస్తాడని సంతోషిస్తున్నారు. ఉన్నవాని తల్లిదండ్రులు పోయినాడని దుఃఖిస్తున్నారు. వాస్తవానికి వారి కొడుకును వారూ చూడలేదు. వీరి కొడుకును వీరూ చూడలేదు. ఎక్కడో ఉన్నాడనీ, పోయినాడనీ హర్షశోకాలను అనుభవించారు. అంతే, ఆ దేశం వెళ్లి చూస్తే గదా యథార్థం తెలియటానికి. మనమూ అంతే. మనస్సు చెప్పే అవకతవక మాటలు నమ్మి ఉన్న వస్తువు లేనిదిగా, లేని వస్తువు ఉన్నదిగా తలచి భ్రమిస్తాం. మనస్సు మాటలు నమ్మక హృదయంలో ప్రవేశించి ఉన్న కుమారుని చూస్తే బయటి బిడ్డలతో పనిలేదు''.

ఒక సంవత్సరం క్రిందట బొంబాయి రాష్ట్రంలోని రాణి ఒకామె వచ్చింది. ఉత్తమ ఇల్లాలు. బిడ్డల తల్లి. ఆమె భర్త విదేశాలలో వుంటూ ఉన్నాడు. ఎంతో ధైర్యవతి కానీ, ఆ లోటు మనస్సులో ఉండదా? భగవాన్ దర్శనం వల్లా, వారి బోధవల్లా శాంతి లభించగలదని వచ్చిందనుకున్నారంతాను. దానికి తార్కాణంగా ఏం జరిగిందనుకున్నావు! మురుగనార్ భగవానుని గురించి అరవంలో పాటలూ, పద్యాలూ చాలా వ్రాశారని విని, మంచివి కొన్ని చదివించి, ఇంగ్లీషులో తర్జుమా చేయించమని స్నేహితురాలి ద్వారా శ్రీవారితో మనవి చేసింది.

భగవాన్ ''నాకేం తెలుస్తుంది. మురుగనారునే అడుగుట మంచిది'' అని ముందు ఛలోక్తిగా అన్నారేగాని, మధ్యాహ్నం రెండున్నరకు నేను వెళ్లేసరికి పుస్తకంలో పుటలు తిప్పుతూ గుర్తులు పెట్టి, సుందరేశయ్యరుకు చూపుతున్నారు. ఆ కరుణకు ఆశ్చర్యపడుతూ కూర్చున్నాను. భగవాన్ నా వైపు చూచి, 'ఆ రాణి మురుగనార్ పాటల్లో మంచివి ఏరి ఇంగ్లీషులో చెప్పించమని కోరింది. వారు వ్రాసిన 'సన్నిధిముర్రై' అనే ఈ పుస్తకంలో భృంగసందేశమనే ఒక భాగం ఉన్నది. ఆ భాగంలో ముఖ్యమైనవి గుర్తులు పెట్టాను. నాయికా నాయకభావం. మనస్సు నాయిక, రమణుడు నాయకుడు. తుమ్మెద (నిశ్చలాత్మక బుద్ధి) చెలికత్తె, గుర్తుపెట్టిన ఈ పాటల సారాంశమేమంటే, నాయిక తన చెలితో 'నా రమణుడు ఎటో మాయమైనాడు. వెతుక్కొని రావే'' అంటే, తుమ్మెద నాయికతో ఇట్లా అంటుందట. 'ఓ అమ్మా, నీ రమణుడు నీలోనే ఉంటే నన్నెక్కడ వెతకమంటావు. ఎపుడైనా వేడిగా ఆహారం యిస్తే అయ్యో, నా రమణుడు, నా నాథుడు హృదయంలో ఉన్నాడే, ఈ వేడికి కాగిపోడా? అనేదానవే. ఇప్పుడు నన్నెక్కడో వెతకమంటావేమి? నీ నాథుడు నీలోనే ఉంటే నేనెక్కడ వెదికేదీ? ఈ భ్రాంతి వదలి నీలో ఉన్న నీ నాథుని కలుసుకొని శాంతించు' అని తుమ్మెద చెప్పిందట. ఇదీ ఆ పాటల సారాంశం ఇవైతే మంచిదని గుర్తులు పెట్టాను. పాపం, భర్త ఎక్కడో ఉన్నాడు. మనస్సుకు కించ. ఆమె చిత్తవృత్తిననుసరించి చెప్పవలసి ఉన్నది. అందుకని అనుగుణ్యంగా ఉంటవని చూచా'' న్నారు.

ఇంతలో రాణి వచ్చింది. లోకమ్మ చేత పాటలు పాడించి, రామచంద్రయ్యరు చేత ఇంగ్లీషులో అర్థం చెప్పించారు. ఆమెకు తృప్తి కలిగింది. దూరమందున్న భర్తకై దుఃఖించక మనస్సును అంతర్ముఖం చేస్తే, ఆత్మేశ్వరుడు సదా సన్నిహితుడై ఉంటాడని భగవాన్ ఈ పాటల నెపంతో బోధించారని అంతా అనుకున్నాము.

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

వీటికి శేషం ఉండకూడదు

శత్రు శేషం ఉండకూడదనే మాట కథల్లో వింటుంటాం. శత్రు శేషం ఉండకూడదని రాజులు తమ శత్రువులను ఒక్కరినీ మిగలకుండా చంపేసారని కథల్లో ఉంటుంటుంది. అయితే శత్రు శేషం ఉండకూడదనేది ఒక సుభాషితంలోని భాగం మాత్రమే. ఏమాత్రం శేషం లేకుండా పూర్తి చేయవలసినవి ఇంకా ఉన్నాయి. ఆ పూర్తి సుభాషితం ఇది.


అగ్ని శేషం రుణః శేషం శత్రు శేషం తథైవచ
పునః పునః ప్రవర్ధేత్ తస్మాత్ శేషం నకారయేత్

దీని అర్థం నిప్పు, రుణం, శత్రువును మిగల్చకూడదని. అలా వదిలేస్తే అవి పెరిగే అవకాశం ఉంది కనుక వాటిని నిశ్శేషం చేయాలని దీని అర్థం.

ఈ సుభాషితంలోని అంశాలు నిజ జీవితంలో తారసపడేవే. చాలా మందికి అనుభవంలోకి వచ్చేవే. అగ్నిని పూర్తిగా ఆర్పక నిర్లక్ష్యం చేస్తే అది ఇంటిని కాల్చివేస్తుంది. చాలా అగ్ని ప్రమాదాలకు కాల్చి పడేసిన సిగరెట్లు, సరిగా ఆర్పకుండా వదిలేసిన పొయ్యిలు కారణమైన సందర్భాలు ఉన్నాయి. నిజానికి నిప్పు ఎంతో మేలు చేస్తుంది. అది మనకు జీవనాధారం. ఉదయం లేచినది మొదలు ఆహారం వండడానికి ఇంకా ఎన్నో పనులకు నిప్పు ఎంతో అవసరం. సనాతన ధర్మంలో అగ్నితో చేసే హోమాలు, యాగాలు ఎంతో ప్రముఖమైనవిగా పేర్కొన్నారు. అగ్నికి ఏకంగా దేవుడే ఉన్నాడు. అయితే ఆ నిప్పును నిర్లక్ష్యం చేస్తే మాత్రం అది కాల్చివేస్తుంది.

అలాగే రుణ శేషం ఉండకూడదనేది ఆ సుభాషితంలోని మరో హితవు. రుణం తీసుకోవడం ఈ రోజుల్లో సర్వ సాధారణం. బ్యాంకులు ఇస్తుంటాయి. డబ్బు అవసరాలు అందరికీ ఉంటాయి. గతంలో వడ్డీ వ్యాపారులుండేవారు. వారు ప్రజలకు రుణం ఇచ్చి హెచ్చు వడ్డీలు వసూలు చేసి కట్టకపోతే ఆస్తులను స్వాధీనం చేసుకోవడం వంటివి చేసేవారు. తీసుకున్న రుణాన్ని తీర్చకపోతే అసలుపై వడ్డీ పెరిగిపోతూంటుంది. కొంత కొంతగా తీర్చి వదిలేస్తే అది పెరిగిపోతూంటుంది. ఈ రోజుల్లోనూ వడ్డీ పెరిగే రుణాలు ఉన్నాయి. అలా కాకుండా ఉండేందుకు రుణ శేషం ఉంచుకోకూడదనేది ఈ సుభాషితం చెబుతోంది.


ఇక శత్రు శేషం విషయానికి వస్తే అడవుల్లోకి పారిపోయిన రాజులు తరువాత బలపడి సైన్యాన్ని సమకూర్చుకుని తమ రాజ్యాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నారన్న కథలు వింటుంటాం. అటువంటి వాస్తవ సంఘటనలు కూడా ఉన్నాయి.



జీవితానుభవాన్ని, నిజజీవితంలోని సంఘటనల్ని కాచి వడపోసి ఈ సుభాషితాల్ని రూపొందించినట్లు కనిపిస్తుంది. ఇక ఇది కాక ఏ పనైనా పూర్తిగా చేయడం చాలా మంచిది. ఏ పనైనా మొదలుపెట్టినపుడు ఆర్భాటంగా, ఆసక్తిగా దానిని చేపట్టి ఆ తర్వాత దానిని వదలివేయడం ఒక్కోసారి జరుగుతూంటుంది. మొదట ఉన్న ఆసక్తి, ఉత్సాహం ఆ తర్వాత ఉండకపోవచ్చు. ఏ పనినైనా వీలయినంతవరకూ మిగల్చకుండా చేస్తే అది పూర్తయిపోతుంది. రేపటి పని ఈ రోజే చేయి అనేది మరో రకమైన నీతి వాక్యం. దాని నుంచి పుట్టినదే ఆలస్యం అమృతం విషం. ఆలస్యం చేస్తే అమృతం కూడా విషమైపోతుందని దీని అర్థం. అందుచేత శేషం వదలకూడదు. ఆలస్యం చేయకూడదు.

ఇలా ఎన్నో సుభాషితాలు, నీతి వాక్యాలు,నీతి కథలు, విధి, నిషేధాలు మన వాఙ్మయంలో ఉన్నాయి. తర తరాలుగా భారతీయులని జాగృత పరుస్తూ, మార్గదర్శనం చేస్తూ అవి నేటికీ నిత్యసత్యాలుగా కొనసాగుతున్నాయి.

భగవద్గీత



పరమోత్కృష్టం అవ్యక్త ప్రకృతి

అధ్యాయం 8
శ్లోకం 20

పరస్తస్మాత్తు భావోన్యో
వ్యక్తో వ్యక్తాత్ సనాతనః।
యః స సర్వేషు భూతేషు
నశ్యత్సు న వినశ్యతి ॥

తాత్పర్యం

వ్యక్తావ్యక్తమయ్యే ఈ భౌతిక ప్రకృతి కన్న పరమైనది, శాశ్వతమైనది అగు అవ్యక్త ప్రకృతి వేరొక్కటి ఉంది. అది పరమోత్కృష్టము, నాశరహితము అయియున్నది. ఈ జగము నందు గల సమస్తం నశించినా అది మాత్రం యథాతథంగా నిలిచి ఉంటుంది.

భాష్యం

శ్రీకృష్ణుని ఉన్నతమైన ఆధ్యాత్మిక శక్తి దివ్యమైనది, శాశ్వతమైనది. ఇది భౌతిక శక్తి యొక్క మార్పుచేర్పులకు అతీతమైనది. భౌతికశక్తి బ్రహ్మ యొక్క రాత్రి సమయములో నశింపజేయబడి, పగలు సమయంలో తిరిగి సృష్టించబడుతుంది. అయితే ఆధ్యాత్మిక శక్తి దానికి విరుద్ధముగా దివ్యమైన శాశ్వతమైన లక్షణాన్ని కలిగి ఉంటుంది. భగవంతుని ఉన్నత, నిమ్న శక్తులను గురించి గడచిన అధ్యాయంలో మనం చర్చించుకున్నాము.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

దినఫలాలు

మేష రాశి: ఆర్థిక లావాదేవీలు అనుకూలం. దూరప్రయాణాలు, విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచికార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ప్రభుత్వ వ్యవహారాల్లో వ్యతిరేకత ఉంటుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయ వృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు లాభిస్తాయి.

కర్కాటక రాశి: విదేశీ లావాదేవీలు కలసి వస్తాయి. శుభవార్తలు వింటారు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. శత్రుభీతి పోతుంది. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆదాయమార్గాలు అనుకూలం.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: ఆధ్యాత్మిక కార్యాలు, కార్యక్రమాలు లాభిస్తాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతర మవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

వృశ్చిక రాశి: స్థిరాస్తి కొనుగోళ్లు అనుకూలం. ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. ప్రయాణాలు, ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలి. అసహన పరిస్థితులు వ్యాపార పరంగా ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: విదేశీ సంభాషణలు ఉపకరిస్తాయి.. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పని సరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభ రాశి: నూతన వాహన కొనుగోళ్లు వంటివి ఆనందాన్ని కలిగిస్తాయి. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆకస్మిక వ్యయం లేకపోలేదు. ఆరోగ్య విషయంలో ప్రతికూలత ఉంటుంది. ప్రత్యర్థుల ద్వారా చిరు సమస్యలు ఉంటాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి: రుణ ప్రయత్నాలు, వాహనకొనుగోళ్ళు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య రీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



ఈ నెల 16 ప్రపంచ నిద్రా దినోత్సవం

నిద్రలేమిని జయించండి

ప్రపంచంలో అందరికన్నా అదృష్టవంతుడు ఎవరంటే ఎక్కడున్నా గాఢంగా నిద్రపోయేవాడు. ఆధునిక యుగంలో నిద్రకూడా బంగారమయ్యింది. నిద్రలేమితో బాధపడే వారి సంఖ్య ప్రపంచంలో రోజురోజుకి పెరుగుతోంది.
సరైన నిద్రవల్ల శరీరంలోని జీవక్రియలు సక్రమంగా సాగటంతోపాటు శరీరం కూడా విశ్రాంతి పొందుతుంది.
మంచి నిద్ర మెదడుకు చురుకుదనాన్ని ఇచ్చి అభివృద్ధికి తోడ్పడుతుందని శాస్త్రవేత్తలు, వైద్యులు గుర్తించారు.
నిద్రలేమి వల్ల అనేక శారీరక, మానసిక రుగ్మతలు పెరుగుతాయి. సరయిన సమయానికి నిద్రపోక నానా యాతన పడేవారు ఎందరో ఉన్నారు. సమయానికి తినాలి. సరయిన సమయానికి నిద్రపోవాలి. తిన్న తర్వాత కనీసం ఒక గంటపాటు నడిస్తే మంచిది. తిన్న వెంటనే నిద్రపోతే అసౌకర్యంగా ఉండి నిద్రపట్టదు.

గురక మంచిది కాదు

ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం ఆరు నుంచి ఎనిమిది గంటలు నిద్రపోవాలి. స్థూలకాయం ఉన్నవారు గురకపెడతారు. పడుకున్నప్పుడు పొట్టభాగం పైకి రావడం వల్ల ఒత్తిడి పెరిగి గట్టిగా ఊపిరి తీసుకోవాల్సి రావడం వల్ల శబ్దం వస్తుంది. ఒక్కోసారి ఊపిరి అందక నిద్రలో లేచి కూర్చుంటారు. దీనివల్ల నిద్రక ు భంగం కలుగుతుంది. నిద్ర సరిగ్గా లేక పగలంతా మత్తుగా ఉండి ఎక్కడ కూర్చుంటే అక్కడ నిద్రపోతారు. ఒక్కోసారి వాహనం నడుపుతున్నప్పుడు క ూడా నిద్ర వస్తుంది. ఇలా నిద్రలో జోగేవారికి స్లీప్ ఆప్నియా అనే జబ్బు వచ్చినట్టు వైద్యులు పేర్కొంటున్నారు. ఈ వ్యాధి సోకిన వారు పగలంతా నీరసంగా ఉంటారు. గుండె జబ్బులు కూడ వస్తుంటాయి. వీరు సీసమ్ మిషన్ ఉపయోగిస్తే హాయిగా ఊపిరి తీసుకుంటారు. ఈ మిషన్ వాడడం వల్ల రాత్రిప ూట బాగా
నిద్రపోతారు. ఇది కూడా ఉపయోగపడకపోతే 'ఊలో పలోటా పోర్నొగ్రఫీ' సర్జరీ చేయాల్సి ఉయుంది.
ప్రతి ఒక్కరూ ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి. నిద్రలేమిని ఇన్‌సోమ్నియా అంటారు. ఇది మంచిది కాదు. ప్రతి రోజూ వ్యాయామం చేయాలి. రాత్రిపూట లైట్ ఫుడ్ తీసుకోవాలి. తిండికి నిద్రకు మధ్య వ్యవధి కనీసం రెండు గంటలు తీసుకోవాలి. డిన్నర్ తర్వాత కొద్దిసేపు వాకింగ్ చేయడం మంచిది. గురకను నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు. వైద్యుల సలహా ప్రకారం చికిత్స పొందాలి.
గురక ఉన్న స్థూలకాయులు నిర్లక్ష్యం చేయకుండా బరువు తగ్గాలి. మంచి ఆహార అలవాట్లు ఉండాలి. మంచి డైట్‌తో పాటు పాలిసోమియాగ్రఫీ అనే పరీక్ష చేయించుకోవాలి. ఈ టెస్ట్ 7 గంటలపాటు జరుగుతుంది. ఎన్నిసార్లు నిద్ర లేస్తున్నారు అనేది తెలుస్తుంది. ఈ పరీక్ష ఒకప్పుడు హైదరాబాద్‌లో మాత్రమే ఉండేది. ఇప్పుడు అన్ని ముఖ్య కేంద్రాల్లో ఉంది. గురక ఉన్నవారు ఇఎన్‌టి స్పెషలిస్ట్, పల్మొనాలజిస్ట్‌లను కలిసి వైద్యం పొందాలి.
నిద్ర మనశ్శాంతిని కలుగజేస్తుంది. నిద్రలేకుండా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తగ్గిపోతాయి. ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు దారితీస్తుంది. ఇంతటి ప్రాధాన్యమున్న నిద్రకు ఈ కాలంలో పెద్దగా ప్రాధాన్యమివ్వడం లేదు. యాంత్రిక జీవనంలో క్షణ క్షణం ఒత్తిడితో గడుపుతున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత నిద్రపోవడం, తిరిగి వేకువజామునే లేచి దైనందిన జీవితం ప్రారంభించడం ఎక్కువమందిలో పరిపాటైంది. నిద్ర ప్రాధాన్యాన్ని గుర్తించిన ప్రపంచ ఆరోగ్య

సంస్థ ప్రతి ఏడాది మార్చి మూడో శుక్రవారాన్ని అంతర్జాతీయ నిద్ర దినోత్సవంగా ప్రకటించింది. ప్రతి సంవత్సరం ఒక్కో నినాదాన్ని విడుదల చేస్తోంది. మానవుడికి నీరు, ఆహారం, ప్రాణవాయువు ఎంత అవసరమో నిద్ర అంతే అవసరం. సగటున మానవుడు ఆరు నుంచి ఎనిమిది గంటల నిద్ర పోవాలి. కానీ ఇంతకు తగ్గినా, పెరిగినా



కొన్ని వ్యాధులకు దారితీస్తుంది. నిద్రలేమితనాన్ని ఇన్‌సోమ్నియా, అతి నిద్రను హైపర్ సోమియాగా వైద్య భాషలో పిలుస్తుంటారు. ఈ రెండు ప్రమాదకర వ్యాధులే. నిద్రలేమి కారణంగా 35 శాతం ఊబకాయం, 54 శాతం డయాబెటీస్, 80శాతం గుండెపోటు, 90శాతం మానసిక వేదన, 98శాతం ఎక్యూట్ కరొనరి సింద్రోమ్, 102శాతం పక్షవాతానికి దారితీయవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు.

నిద్రలేమితో ప్రమాదాలు

నిద్రలేమి కారణంగా ఏడాదికి ప్రపంచవ్యాప్తంగా 71వేల రహదారి ప్రమాదాలు జరుగుతున్నట్టు వెల్లడైంది. అలాగే 1550 మంది ఈ ప్రమాదాల్లో మృతి చెందినట్లు సర్వేల ద్వారా లెక్కలు తేల్చారు.

నిద్రలేమి నిర్ధారణ

నిద్రపట్టడం కష్టంగా వుండటం, రాత్రివేళల్లో ఉలిక్కిపడి లేవడం, మానసిక ఆందోళన, వేకువజామునే లేవటం, నిద్ర నుంచి లేచిన తర్వాత తీవ్ర బడలిక నిద్రలేమి ప్రాథమిక లక్షణాలుగా గుర్తించాలి. అలాగే తీవ్రమైన తలనొప్పి అలసట చికాకు నిద్రలేమిగా గుర్తించాలి.

చికిత్స

నిద్రలేమి సమస్య నుంచి ఉపశమనం పొందేందుకు వైద్యనిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు. ప్రధానమైనవి ఇలా ఉన్నాయి.
- ప్రతి రోజు ఒక నిర్దిష్ట సమయానికి నిద్రపోవటం, తిరిగిలేవటం అలవాటు చేసుకోవాలి.
- పగలు నిద్రపోయే అలవాటుంటే అది 45 నిమిషాలకు మించకూడదు.
- నిద్రపోయే ముందు మద్యపానం, ధూమపానం చేయకూడదు.
- టీ, టిఫిన్, సోడా, చాక్‌లెట్స్ తీపి పదార్థాలు నిద్రకు ముందు తీసుకోకూడదు.
-నిత్యం వ్యాయామం చేయడం అత్యవసరం.
- రాత్రి పదిగంటలకు నిద్రకు ఉపక్రమించి ఉదయం ఐదు గంటలకు లేవడం మంచి ఆరోగ్యానికి దారితీస్తుంది.
- నిద్రపోయే గదిని మంచిగా తమకు నచ్చిన విధంగా అలంకరించుకోవడం అవసరం.
- గది, వెలుతురు ఉష్ణోగ్రత అనుకూలంగా ఉండాలి.
- నిద్రకు భంగం కలిగించే వాటిని శబ్దం , వెలుతురుకు దూరంగా ఉండాలి.
- విశ్రాంతి గదిని నిద్రకు మాత్రమే ఉపయోగించాలి. అంతేకాని ఆఫీసు పనులకు, టీవీ, వీడియోగేములు, ఇంటర్నెట్ ఛాటింగ్‌లకు వినియోగించకూడదు. ఇవి నిద్రా భంగానికి దారితీస్తాయి.




డాక్టర్ నళిని
కన్సల్టెంట్ పల్మొనాలజిస్ట్
కాంటినెంటల్ హాస్పిటల్స్

కులాసా

ఇన్‌హేలేషన్ థెరపీతో ఆస్థమాపై విజయం

35 సంవత్సరాల గృహిణి తన ఐదేళ్ల కుమార్తె చేత మాత్రలు మింగించడం, జీవితాంతం ముందు జాగ్రత్తలు తీసుకునే పరిస్థితి. అయితే ఇన్‌హేలేషన్ థెరపీని ఎంచుకున్న తర్వాత ఆమె ఆరోగ్య పరిస్థితి కుదుటపడింది. నోటి ద్వారా తీసుకునే మాత్రలు, సిరప్‌లకు బదులుగా
డబ్ల్యూహెచ్‌ఓ ప్రకారం భారతదేశం సుమారు 20 మిలియన్‌ల ఆస్తమా రోగులకు కేంద్రంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా ఆస్థమా ప్రాబల్యం పెరుగుతోందని నిపుణులు చెబుతున్నారు.
మనుష్యుల వాయునాళాల్ని ఆస్థమా సంకోచించేలా చేయదు. సిద్ధాంతపరంగా ఊపిరితిత్తుల్లో వాయు మార్గాలు వాపు కారణంగా ఆస్థమా కలుగుతుంది. వాయుమార్గాల్లో నరాల చివర్ల సంవేదనశీలతపై ప్రభావం చూపుతుంది. దీనివల్ల చికాకు కలుగుతుంది.
ఆస్థమా ఉన్న వ్యక్తి వాయు మార్గాల గోడల చుట్టూ ఉన్న కండరాలు బిగుతుగా మారి, వాయుమార్గాల్ని సంకోచించేలా చేస్తాయి. ఇది వాపుకు జిగట వంటి శ్లేష్మం ఉత్పత్తి కావటానికి దారితీస్తుంది. వాయుమార్గాలు సన్నగా ఇబ్బందికి గురయ్యేలా చేసి ఆస్థమా లక్షణాలకు దారితీస్తుంది.



సూర్య చెస్ట్‌క్లీనిక్ చెస్ట్ ఫిజిషియన్ డాక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం ''ఆస్థమా అత్యధికంగా బాల్యంలోనే ఏర్పడినా కూడా అన్ని వయస్సుల వారికి కలుగుతుంది. చాతీ బిగింపు, దీర్ఘకాలిక దగ్గులతో పాటు ఊపిరి అందని పరిస్థితి, పిల్లికూతలు తరచుగా కలిగినప్పుడు ఆస్థమాని సూచిస్తుంది. ఆస్థమా నయం కాని వ్యాధి కానీ మందులు, ఆస్థమా ప్రేరేపకాల్ని నివారించటం ద్వారా సులభంగా నిర్వహించవచ్చు. తద్వారా రోగులకు వ్యాధిపై నియంత్రణ కలుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా పిల్లలపై ప్రభావం చూపిస్తున్న సాధారణ వ్యాధుల్లో ఆస్థమా ఒకటి. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ప్రకారం, యునైటెడ్ స్టేట్స్‌లో 18 ఏళ్లకంటే తక్కువ వయస్సు గల వ్యక్తులు ఆసుపత్రుల్లో చేరడానికి మూడో అతిపెద్ద కారణంగా నిలిచింది. చాలామంది రోగుల్లో ఆస్థమా ప్రభావవంతంగా నియంత్రించబడటం లేదని నిపుణులు గమనించారు. ఇది రోజు లక్షణాలుగా కనిపిస్తోంది. రోజువారి కార్యకలాపాల్ని పరిమితం చేస్తోంది. క్రమబద్ధంగా నోటి ద్వారా మందులు తీసుకున్నా కూడా వ్యాధి అధ్వాన్నంగా మారుతోంది. ఇటీవలి కాలంలో తక్కువ దుష్ప్రభావాలు, వేగవంతమైన చర్యల వల్ల నోటి ద్వారా తీసుకునే మందులకంటే ఇన్‌హేల్డ్ కార్టికోస్టిరాయిడ్స్ అందరూ ప్రాధాన్యతనిస్తున్న చికిత్సా విధానంగా మారింది'' అని అన్నారు.




మహిళల్లో ప్రొటీన్ కొరత

చాలా మంది మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రొటీన్ లోపాల వల్ల తమ ఆరోగ్యాన్ని చేజేతులారా పాడు చేసుకుంటున్నారు. పురుషులతో పోలిస్తే స్త్రీలు 13శాతం తక్కువగా ప్రొటీన్లు తీసుకుంటున్నారు. ఈశాన్య రాష్ట్రా ల్లో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది.
''ప్రొటీన్ అనేది సూక్ష్మ పోషకాల్లో వస్తుంది. కణాల నిర్మాణంలో ఇది ఎంతో దోహదపడుతుంది. 20 అమినో యాసిడ్‌లతో ప్రొటీన్ ఉత్పత్తి అవుతుంది. వీటిలో 9 మాత్రం తప్పనిసరి. అదనంగా ఉన్న ప్రొటీన్లను శరీరం ఏ మాత్రం తన వద్ద ఉంచుకోదు అని ముంబాయికి చెందిన ప్రముఖ డైటీషియన్ జిగ్నేష్ సేథి అంటున్నారు.
ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చి ప్రకారం ఆరోగ్యకర జీవనశైలి వల్ల మహిళలు తమ శరీర బరువును బట్టీ ప్రొటీన్లు తీసుకోవాలి.అంటే కిలోకి ఒక గ్రాము ప్రొటీన్ అవసరమవుతుంది. గర్భిణీగా, బాలింతగా ఉన్న సమయంలో మరింత ఎక్కువగా ప్రొటీన్ తీసుకోవాలి. వివిధ కార్యకలాపాలు నిర్వహించడానికి ప్రొటీన్ ఆవశ్యకత ఎంతైనా ఉంది. మహిళల్లో వ్యాధినిరోధక శక్తి పెరగడానికి ప్రొటీన్ అత్యంత అవసరం. ఎముకలు పటిష్టంగా ఉండటానికి ఇది చాలా అవసరం.

వెన్ను నొప్పికి ఆయుర్వేదంతో పరిష్కారం

ఈ మధ్య చాలామందిని వేధిస్తున్న సమస్య మెడ,నడుము నొప్పి. ఒకప్పుడు వృద్ధుల్లో మాత్రమే కనిపించే సర్వైకల్ స్పాండిలోసిస్, సయాటికా సమస్యలు ఇప్పుడు వయస్సుతో సంబంధం లేకుండా అందరిలోనూ కనిపిస్తోంది. యుక్తవయసులో వున్నవారు ఈ సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీనికి ముఖ్యకారణం ఆధునిక జీవనశైలి మార్పులు, మెడ, నడుము నొప్పి అని నిర్లక్ష్యం చేస్తూ పెయిన్ కిల్లర్ టాబ్లెట్స్, బెడ్‌రెస్ట్ ఫిజియో థెరపీ లాంటి చికిత్సలు తీసుకుంటూ తాత్కాలిక ఉపశమనాన్ని పొందుతూ కాలాన్ని గడిపేస్తున్నారు. ఇలా కాకుండా వ్యాధి తొలిదశలోనే ఆయుర్వేద చికిత్స తీసుకున్నట్లయితే సమస్యను పూర్తిగా నివారించవచ్చును.



ప్రధాన లక్షణాలు

వెన్నునొప్పి సమస్యలు ఉన్నవారికి కొన్ని ప్రధాన లక్షణాలుంటాయి. అవి అన్ని సందర్భాల్లోనూ, అందరిలోనూ ఒకేలా కనిపించకపోవచ్చు. నొప్పి ముందుగా నడుము నుంచి ప్రారంభమై పిరుదులలోకి అక్కడి నుండి తొడల్లోకి అక్కడ నుండి పిక్కలలోకి ప్రవహిస్తూ ఉంటుంది. ఇది సయాటికా నొప్పిలో ప్రధాన లక్షణం. కరెంట్ షాక్ కొట్టినట్లు ఝుల్లుమనడం, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వెన్నులో నొప్పి రావడం, ఎక్కువసేపు కూర్చోలేకపోవడం, అరికాలల్లో మంటలు, సూదులతో గుచ్చినట్లుండడం, తిమ్మిర్లు వుండడం, కాళ్లు స్పర్శ తగ్గడం దీని ప్రధాన లక్షణం.

కారణాలు


ఎక్కువ సమయం ఒకే భంగిమలో కూర్చోవడం, నిలబడడం, బరువు లేపడం, ఎక్కువగా ద్విచక్ర వాహనాలు డ్రైవింగ్ చేయడం, స్థూలకాయం, ఎముకలలో కాల్షియం తగ్గడం మూలాన, వెన్నుపూసల మధ్య ఉన్న కార్టిలేజ్‌లో వచ్చే మార్పులు, వెన్నుపూసల మధ్య డిస్క్‌లు పక్కకు జారడం , వెన్నుపాము నొక్కుకుపోవడం, సయాటికా నొప్పికి అతి ప్రధాన లక్షణం. అలాగే వయస్సు పెరిగే కొద్ది డిస్క్‌లు దెబ్బతినడం జరుగుతుంది. నడుము భాగంలో వుండే వెన్నుపూసలను ''లంబర్ వర్టిబ్రే'' అంటారు. వీటి మధ్యలో మృదులాస్తితో తయారైన డిస్క్‌లు ఉంటాయి. ఇవి వెన్నుపూసలను తేలికగా కదలడానికి, వంగడానికి, నిలబడడానికి సహాయపడతాయి.

వ్యాధి నిర్ధార

ఎక్స్‌రే, ఎంఆర్ఐ, సీటీస్కాన్ రిపోర్ట్‌లో మెడభాగంలోని సి3-సి4, సి4-సి5, సి5-సి6,సి6-సి7 తో బాటు నడుము భాగంలో ఎల్2-ఎల్3, ఎల్3-ఎల్4, ఎల్4-ఎల్-5, ఎల్5-ఎస్1 మొదలగు డిస్క్‌లు దెబ్బతినడం కనిపిస్తుంది.

చికిత్సా విధానం

మెడ నొప్పి, నడుము నొప్పి సమస్యలకు ఆయుర్వేద శాస్త్రంలో సమగ్రమైన చికిత్సా పద్ధతులున్నాయి. ఇందులో రోగ తీవ్రతను బట్టి, రోగి యొక్క బలాన్ని బట్టి వైద్య విధానం ఆధారపడి ఉంటుంది.
ఆయుర్వేద దృష్టిలో ఈ సమస్యలు కఫం, పిత్త, వాతం పెరగడం వల్ల వచ్చేవి. ఆయుర్వేద పంచకర్మ చికిత్సల ద్వారా ప్రకోపించిన దోషాలను సమస్థితిలోకి తెచ్చి శరీర శుద్ధిని, అగ్ని బలాన్ని పెంపొందించవచ్చును.
విరేచన కర్మ, అనువసన వస్తి, కాషాయ వస్తి, నస్య కర్మ, కటి వస్తి, గ్రీవ వస్తి, యెలకిడి, పొడికిడి, పిండ స్వేదం, నాడీ స్వేదం మొదలగు ఆయుర్వేద చికిత్సల ద్వారా ఎటువంటి పెయిన్ కిల్లర్స్ వాడకుండా పిజియోథెరపీ, ఆపరేషన్ అవసరం లేకుండా వెన్ను నొప్పి సమస్యలను పూర్తిగా నివారించవచ్చును.



డాక్టర్ జి. క్రాంతికుమార్
కేరళ ఆయుర్వేద పంచకర్మ సెంటర్
హైదరాబాద్
9494675168

లేబుల్ లేని మందులు వాడొద్దు



ఎలాంటి లేబుల్ లేకుండానే మందుల విక్రయాలు ఉపందుకున్నాయని అటువంటి మందులు వినియోగించడం వల్ల కంటిచూపు కోల్పోయే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రోగుల రక్షణకు సంబంధించి మార్గదర్శక సూత్రాలను తప్పనిసరి అనివారంటున్నారు. దేశవ్యాప్తంగా రెటినల్ వ్యాధులు ముదిరిపోవడానికి ప్రధాన కారణం లేబుల్‌లేని మందుల వల్లేనని వారు తెలిపారు.
పేషెంట్ సేఫ్టీ అండ్ యాక్సెస్ ఇనిషియేటివ్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకులు బీజోన్ మిశ్రా మాట్లాడుతూ ఇటీవల ప్రధానమంత్రి ఔషధి పార్క్ యోజన ప్రకటించిన తర్వాత నాణ్యమైన మందులను తీసుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. నాణ్యమైన యాజమాన్య వ్యవస్థ కోసం ఫార్మాస్యుటికల్ కంపెనీలు, మెడికల్ ప్రాక్టీషనర్స్ బాధ్యతవహించాలన్నారు. రోగి భద్రతను దృష్టిలో పెట్టుకుని న్యాయపోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

ఇన్ఫెక్షన్

దేశవ్యాప్తంగా రెటీనా వ్యాధులు పెరగడానికి ప్రధాన కారణం లేబుల్ లేని మందులు వినియోగించడమే. దీనివల్ల ఇన్‌ఫెక్షన్ సోకి రెటీనా దెబ్బతింటుంది.

మహేష్ స్టార్‌డమ్ సత్తా



స్టార్ హీరో సత్తా సినిమా రూపకల్పనలోని అన్ని దశల్లో తెలుస్తుంటుంది. సినిమా ప్రారంభోత్సవానికి ముందే జరిగే వ్యాపారం మొదలు....థియేటర్ రిలీజ్, ఆడియో, శాటిలైట్ హక్కులు, విదేశీ, అనువాద హక్కులు అంటూ సినిమాకు అన్ని విధాలా క్రేజ్ తీసుకొస్తుంటుంది. సూపర్ స్టార్ మహేష్ బాబు స్టార్‌డమ్ అతని కొత్త సినిమా భరత్ అను నేనుతో మరోసారి స్పష్టమవుతోంది. విజన్ ఆఫ్ భరత్ పేరుతో తాజాగా విడుదలైన టీజర్...ఇంటర్నెట్‌లో సంచలనమవుతోంది. టీజర్ విడుదలైన కేవలం 19 గంటల్లో 10 మిలియన్ వ్యూస్ అందుకుంది. రోజు గడవక ముందే అంటే కోటి మంది భరత్ అనే నేను టీజర్‌ను వీక్షించారు. ప్రస్తుతం అది కోటిన్నర వ్యూస్‌కు చేరింది. ఇదంతా మహేష్ స్టార్ డమ్‌కు నిదర్శనం, సినిమాపై ప్రేక్షకులకు ఆసక్తికి దర్పణం. దర్శకుడు కొరటాల శివ రూపొందిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం పాటల చిత్రీకరణ జరుపుకుంటోంది. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన సెట్ లో మహేష్, నాయిక కైరా అద్వానీ యుగళ గీతం పాడుకుంటున్నారు. ఏప్రిల్ మొదటి వారం కల్లా మొత్తం రూపకల్పన కార్యక్రమాలు ముగుస్తాయి. ఏప్రిల్ 20న భరత్ అనే నేను అత్యధిక థియేటర్‌లలో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సన్నాహాలు చేసుకుంటోంది.



మహేష్‌బాబు

మెగాస్టార్ ముఖ్యఅతిథిగా రంగస్థలం వేడుక



రామ్‌చరణ్, సమంత నాయకానాయికలుగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న రంగస్థలం చిత్రం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. ఈ నెలాఖరులో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకను ఈ నెల 18న విశాఖపట్టణంలోని ఆర్కే బీచ్‌లో నిర్వహించనున్నారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా మెగాస్టార్ చిరంజీవి హాజరు కానున్నారు. అలాగే పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు విచ్చేయనున్నారు. వేడుకలో సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ నేతృత్వంలో సంగీత కార్యక్రమంతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటుచేశారు.

విద్యార్థులకు బాగా కనెక్ట్ అయ్యే కిరాక్ పార్టీ

- అనిల్ సుంకర



వినోదం, సందేశం కలగలిసిన చక్కటి కథాంశంతో కిరాక్ పార్టీ చిత్రం రూపుదిద్దుకుందని ఆ చిత్ర నిర్మాతలలో ఒకరైన అనిల్ సుంకర తెలిపారు. నిఖిల్, సంయుక్తహెగ్డే, సిమ్రాన్‌పరీంజా హీరోహీరోయిన్లుగా శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 16న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో అనిల్ సుంకర కొద్దిసేపు పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ వివరాలేమిటో ఆయన మాటల్లో...కన్నడంలో విజయవంతమైన కిరాక్ పార్టీ చిత్రానికి ఇది రీమేక్. అక్కడ ఘన విజయం సాధించడంతో సహజంగానే తెలుగు హక్కుల కోసం గట్టి పోటీ ఎదురైంది. అంత పోటీలో ఈ హక్కులను మేము సొంతం చేసుకున్నాం. ఇంజనీరింగ్ క్యాంపస్ విద్యార్థుల లైఫ్ స్టైల్‌ను ప్రతిబింబించేవిధంగా...సహజత్వానికి చాలా దగ్గరగా ఈ చిత్రం ఉంటుంది. అధికశాతం విద్యార్థులు తమను తాము ఐడింటిఫై చేసుకునేవిధంగా ఈ చిత్రంలోని సన్నివేశాలుంటాయి. ఇంటర్వెల్ ఎపిసోడ్ ఓ హైలైట్. సినిమా పూర్తి వినోదంతో సాగుతూనే చివరి ఇరవై అయిదు నిమిషాలు భావోద్వేగంతో ఉంటూ ప్రేక్షకుల కంట కన్నీళ్లు కూడా పెట్టిస్తుంది. కన్నడ మాతృక మెయిన్ సోల్‌కు ఇబ్బంది లేకుండా మన నేటివిటీకి అనుగుణంగా స్క్రిప్ట్‌లో కొన్ని మార్పులు చేశాం. కన్నడ సినిమా రెండు గంటల నలభై అయిదు నిమిషాల నిడివి ఉంటే...తెలుగు సినిమా రెండు గంటల ఇరవై అయిదు నిమిషాల నిడివి మాత్రం ఉంటుంది. కన్నడంలో చిన్న పాటలతో కలుపుకుని తొమ్మిది పాటలుంటే తెలుగులో రెండు పాటలను తగ్గించాం. కన్నడంలో కంటే తెలుగులో సినిమా మరింత బాగా వచ్చిందని మేమెంతో సంతోషంగా ఉన్నాం. మా నమ్మకాన్ని ప్రేక్షకులు తప్పకుండా నిజం చేస్తారని అనుకుంటున్నాను. నిఖిల్ తన పాత్రలో ఎంతగానో మెప్పిస్తారు. తెలుగు స్క్రిప్ట్ బాగా రావడంలో చందు మొండేటి, సుధీర్‌వర్మలదే క్రెడిట్. దర్శకుడు శరణ్ కొప్పిశెట్టి చిత్రాన్ని మలచిన విధానం ప్రశంసనీయం. అతనికి మంచి భవిష్యత్తు ఉంటుంది అని అన్నారు.

ఇక తమ ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ తదుపరి చిత్రాల గురించి అనిల్ సుంకర వివరిస్తూ...రాజ్‌తరుణ్ కథానాయకుడిగా తాము నిర్మించిన రాజుగాడు చిత్రం టీజర్‌ను ఉగాదికి, సినిమాను వేసవి సందర్భంగా విడుదల చేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే అల్లరి నరేష్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ఇక సురేష్ ప్రొడక్షన్స్, 14 రీల్స్ పతాకాలపై వెంకటేష్, దర్శకుడు తేజ కలయికలో రూపొందే నూతన చిత్రం షూటింగ్ ఈ నెల 26న మొదలు కానుందని ఆయన వెల్లడించారు. ఇందులో శ్రియ కథానాయికగా నటించనున్నట్లు, నారా రోహిత్ ఓ కీలక పాత్ర పోషిస్తారని ఆయన చెప్పారు. అలాగే 14 రీల్స్‌లో మహేష్‌బాబుతో లోగడ దూకుడు, నేనొక్కడినే (1) చిత్రాలను తీశామని, నేనొక్కడినే చిత్రం నిర్మాతలుగా మాకు సంతృప్తిని కలిగించకపోయినా డిస్ట్రిబ్యూటర్లకు ఎలాంటి నష్టాలను కలిగించలేదు అని వివరించారు. మళ్లీ 14 రీల్స్ బేనర్‌లో మహేష్‌బాబు కథానాయకుడిగా ఇంకో సినిమాను చేస్తామని, కాస్త ఆలస్యమైనా సూపర్‌డూపర్ హిట్ చిత్రాన్ని చేయాలన్నదే తమ సంకల్పమని అనిల్ సుంకర తెలిపారు. ఇక తన దర్శకత్వంలో గతంలో వచ్చిన యాక్షన్ 3డి చిత్రం అనుకున్నంతగా ఆడలేదని, ఈ తడవ మంచి స్క్రిప్ట్‌ను సిద్ధం చేసుకుని మరీ దర్శకత్వం వహించబోతున్నానని ఆయన చెప్పారు. తనకు దర్శకత్వం పట్ల మంచి అభిరుచి ఉన్నప్పటికీ ఒక సినిమాకు నిర్మాతగా మాత్రమే వ్యవహరిస్తున్నప్పుడు దర్శకత్వంలో వేలుపెట్టే అలవాటు తనకు లేదంటూ ముగించారు.

ఒక చిత్రంతో రెండు అరంగేట్రాలు

అన్ని కళలు తెలిసిన వాడిని సకల కళా వల్లభుడంటారు. ఇలా నాయికకు కళలన్నీ తెలిస్తే వల్లభి అవుతుంది. ఆదా శర్మ ఇలాంటి వల్లభినే. ఆదా శర్మ ప్రతిభ తెలుసుకుంటే ఆశ్చర్యం కలగక మానదు. ఆమె సంప్రదాయ నృత్యాలు నేర్చుకుంది, ఆధునిక నృత్యాలు సరేసరి, కర్నాటక సంగీతం నేర్చుకుంది, పాటలు బాగా పాడుతుంది. ఏకసంథాగ్రాహి, చదివిన సంభాషణలు పేజీలైనా గుక్కతిప్పుకోకుండా చెప్పేస్తుంది. తమిళనాట ప్రాచీన యుద్ధ విద్యలు నేర్చుకుంది, కర్రసాము లాంటివి ఆమెకు బాగా తెలిసిన విద్యలే. ఆమెకు మానసిక మేధస్సు, శారీరక దృఢత్వం రెండూ కలిసొచ్చిన అంశాలు. అయితే కలిసిరానిదల్లా అదృష్టమే. 1920 చిత్రంతో బాలీవుడ్‌లో, హార్ట్ ఎటాక్ చిత్రంతో తెలుగులో అడుగుపెట్టింది ఆదా. ఆ తర్వాత క్షణం లాంటి హిట్ దక్కినా...ఆమె పట్ల ఆసక్తి పెరగలేదు. ఫలితంగా బాలీవుడ్ వెళ్లింది ఆదా. అక్కడ కమాండో చిత్రంలో నటించి....పోరాటాలతో ఆకట్టుకుంది. ప్రస్తుతం ఆమె తమిళంలో ప్రభుదేవా సరసన చార్లీ చాప్లిన్ 2 చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రంలో ఆటతో పాటు పాటలు కూడా పాడుతుందట. ఈ సినిమా ఆదా శర్మకు నటిగా తెరంగేట్రంతో పాటు గాయనిగానూ అరంగేట్రం అవుతోంది. కర్నాటక సంగీతం నేర్చుకున్న ఈ సుందరి మాతృభాష కూడా తమిళమే కాబట్టి మధురంగా పాటలు పాడగలదని చిత్ర సంగీత దర్శకుడు, దర్శకుడు నమ్మారట. ఆమెను బతిమాలి మరీ పాడిస్తున్నారట.



ఆదా శర్మ

నటుడు వంకాయల మృతి



వంకాయల సత్యనారాయణ

సీనియర్ నటుడు వంకాయల సత్యనారాయణ (78) మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సోమవారం ఉదయం వైజాగ్‌లో తుదిశ్వాస విడిచారు. వైజాగ్‌కు చెందిన వంకాయల 28 డిసెంబర్, 1940లో జన్మించారు. నాటకరంగం నుండి సినిమారంగానికి వచ్చారు. క్యారెక్టర్ నటునిగా స్థిరపడ్డారు. దాదాపు 180 చిత్రాలతో పాటుగా పలు టీవీ సీరియల్స్‌లో నటించారు. నీడలేని ఆడది ఆయన తొలి చిత్రం. ఆ తర్వాత సీతామాలక్ష్మి, సూత్రధారులు, ఊరికిచ్చినమాట, విజేత, శ్రీనివాస కల్యాణం, దొంగకోళ్లు వంటి అనేక చిత్రాల్లో నటించారు. కొతకాలంగా సినిమారంగానికి దూరంగా ఉన్నారు. శంకర్‌దాదా జిందాబాద్ ఆయన నటించిన చివరిచిత్రం. వకాయల మృతికి పలువురు సినీ ప్రముఖులు నివాళులు అర్పించారు.

కామెడీలో కొత్త ప్రయత్నం



సాక్షి చౌదరి , రాజేంద్రప్రసాద్

కామెడీ సినిమాలలో కొత్తరకమైన ప్రయత్నం ఊ.పె.క ు.హ. (ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావుడి) చిత్రమని కథానాయక ుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆయనతో పాటు సాక్షిచౌదరి ప్రధాన పాత్రల్లో నిధి ప్రసాద్ దర్శకత్వంలో జె.బి.క్రియేషన్స్ పతాకంపై భాగ్యలక్ష్మి నిర్మించిన ఈ చిత్రం ఆడియో వేడుక సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. అతిథిగా విచ్చేసిన పి.కిరణ్ బిగ్ సీడీని ఆవిష్కరించగా, ఆడియో సీడీలను రాజేంద్రప్రసాద్ విడుదలచేసి, తొలి సీడీని సాక్షిచౌదరికి అందించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లడుతూ, దాదాపు 80 మంది ఆర్టిస్టులతో ఈ రోజుల్లో సినిమా చేయడమంటే మాటలు కాదు. దానికి ఎంతో అభిరుచి, ఓపిక కావాలి. అవన్నీ దర్శక, నిర్మాతల్లో ఉండటం వల్లే ఇలాంటి చిత్రం రూపుదాల్చింది. అర్బన్ కామెడీతో ఈ చిత్రం ప్రేక్షకులను ఎంతగానో అలరింపజేస్తుంది. గతంలో నేను చేసిన కొన్ని చిన్న సినిమాలు పెద్ద సినిమాల కంటే ఎక్కువ వసూళ్లను సాధించాయి. సంగీత దర్శకుడు అనూప్ క ూడా పెద్ద సినిమాలతో పాటు చిన్న సినిమాలను కూడా చేస్తుండాలి. ఒకప్పుడు దిలీప్ (ఎ.ఆర్.రెహమాన్), నేను మంచి స్నేహితులం. నేను పది సినిమాలు చేసేటప్పుడు అతను రాజ్‌కోటి దగ్గర పనిచేస్తుండేవాడు. నేటికీ మా స్నేహం అలానే కొనసాగుతూనే ఉంది. అలాగే దర్శకుడు నిధి ప్రసాద్, అనూప్ క ూడా మంచి స్నేహితులు. ఆ స్నేహ ధర్మాన్ని గుర్తుచేసుకుంటూ అనూప్ ఈ సినిమాను చేయడం అభినందనీయం. ఈ సినిమాకు అతను ఇచ్చిన సంగీతం ఓ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది అని అన్నారు.

దర్శకుడు నిధి ప్రసాద్ మాట్లాడుతూ, ఈ చిత్రంలోని ప్రతీ పాత్రకు ప్రాధాన్యం ఉంటుంది. ఎక్కువమంది ఆర్టిస్టులతో షూటింగ్ చేయడం కష్టం. అయినా ఎగ్జిక్యూటివ్ నిర్మాత నాగరాజు సహకారంతో షూటింగ్ అంతా సజావుగా సాగిపోయింది. సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ పెద్ద సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ నాకోసం ఈ సినిమాను చేశాడు. అనుకున్న సమయానికి పాటలను ఇవ్వలేడేమో అనుకున్నాను. కానీ ప్రతీరోజు టైమ్ ఎక్కువగా కేటాయించుకుని, ఈ సినిమా పూర్తయ్యేందుకు తన సంపూర్ణ సహకారాన్ని అందించారు అని చెప్పారు. సంగీత దర్శకుడు అనూప్ మాట్లాడుతూ, తాను కీబోర్డు ప్లేయర్‌గా ఉన్నప్పట్నుంచి నిధి ప్రసాద్‌తో తనకు మంచి స్నేహం ఉందని, ఓ మంచి హాస్య ప్రధాన చిత్రానికి సంగీతాన్ని అందించడం ఆనందదాయకమని అన్నారు. కథానాయిక సాక్షిచౌదరి మాట్లాడుతూ, వినోదాత్మక చిత్రాలకు ప్రేక్షకులు ఎప్పుడూ పట్టం కడుతూనే ఉన్నారని, ఓ మంచి టీమ్‌తో ఈ చిత్రం చేశానని అన్నారు. ఈ వేడుకలో నటులు రిషి, ఖయ్యూం, నిర్మాత భాగ్యలక్ష్మి, జె.బి.క్రియేషన్స్ అధినేత విక్రమ్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్యాంగుల మధ్య వెపన్



అవినాష్

మంగళ, క్రిమినల్స్ వంటి చిత్రాలను నిర్మించిన మంత్ర ఎంటర్‌టైన్‌మెంట్స్ తాజాగా వెపన్ పేరుతో మరో యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని తెరకెక్కిస్తోంది. అవినాష్, ప్రదీప్‌రావత్, రాజారాయ్, రాజు, మధుబాబు ప్రధాన పాత్రధారులు. ఆర్.ఎస్.సురేష్ దర్శకత్వంలో శర్మ చుక్కా నిర్మిస్తున్న ఈ చిత్రం చివరి షెడ్యూల్ ఈ నెల 20 నుంచి మొదలుకానుంది. ఈ సందర్భంగా నిర్మాత శర్మ చుక్కా మాట్లాడుతూ, ఇప్పటివరకు జరిగిన షెడ్యూల్స్‌తో 90 శాతం చిత్రీకరణ పూర్తయింది.

రామచంద్రాపురం, పసలపూడి పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. రెండు గ్యాంగ్‌ల మధ్య జరిగే వార్ నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుంది. కథకు తగ్గట్టుగా టైటిల్‌ను పెట్టాం. దర్శకుడు ప్రతీ ఫ్రేమును ఎంతోబాగా మలుస్తున్నారు. గతంలో మేము నిర్మించిన చిత్రాలు మా బేనర్‌కు ఎంతో గుర్తింపును తెచ్చిపెట్టాయి. మిగిలివున్న షూటిం గ్, నిర్మాణానంతర పనులను పూర్తిచేసి, వేసవిలో ఈ సినిమాను విడుదల చేయనున్నాం అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: అనిల్ పి., ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సబ్బారపు ప్రకాష్.

వ్యాంకిష్ మీడియా కొత్త చిత్రం

వ్యాంకిష్ మీడియా పతాకంపై ఆయుష్, వర్ణిక జంటగా నూతన చిత్రం ప్రారంభమైంది. రవికుమార్ పొన్నగంటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. షేక్ గౌస్ నిర్మిస్తున్న ఈ చిత్ర షూటింగ్ గుంటూరులో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి స్థానిక శాసన సభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ క్లాప్ నివ్వగా, అర్బన్ ఎస్పీ వైటి నాయుడు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నిర్మాత షేక్ గౌస్ మాట్లాడుతూ...మంచి ప్రేమ కథతో ఈ సినిమా ఉంటుంది. సింగిల్ షెడ్యూల్‌లో చిత్రాన్ని పూర్తి చేస్తాం. పాటలను కళకత్తా, వైజాగ్, బ్యాంకాక్‌లో రూపొందిస్తాం. సాధ్యమైనంత త్వరగా సినిమా చిత్రీకరణ జరిపి..మే తొలివారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. అన్నారు. ఈ చిత్రానికి సంగీతం - అమ్మపండు, సినిమాటోగ్రఫీ - దుర్గ ప్రసాద్



కాలేజీలో ఆనందం



ప్రతి క్షణాన్ని ఆనందంగా గడపాలని ప్రతి ఒక్కరి మనసులో ఉంటుంది. ముఖ్యంగా కాలేజ్ క్యాంపస్‌లో సరదాగా గడిపే క్షణాలు మాత్రం ప్రతి ఒక్కరికి మరిచిపోలేని గుర్తుగా మిగులుతాయి. భవిష్యత్తుపై బంగారుకలలు కంటూనే కాలేజ్ డేస్‌ని ఆస్వాదిస్తూ ఆనందిస్తుంటారు. ఆ ఆనందాన్ని మరోసారి తెరమీద చూపించడానికి సుఖీభవ మూవీస్ అధినేత ఎత్తరి గురురాజ్ సన్నాహాలు చేస్తున్నారు. మలయాళంలో హిట్ అయిన ఆనందం అనే చిత్రాన్ని అదే పేరుతో తెలుగులో అనువదిస్తున్నారు. గణేష్ రాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నూతన తారాగణం నటించారు.

ప్రేమమ్ ఫేమ్ నివిన్ పాల్ అతిథి పాత్రని పోషించారు. ఆనందం చిత్రానికి వీరా వెంకటేశ్వరరావు (పెదబాబు), విఆర్‌బి. రాజు, రవివర్మ చిలువూరి సహ నిర్మాతలు. సీనియర్ నిర్మాత ఆర్. సీతారామరాజు సమర్పకులు. ఆనందం అనువాద పనులు పూర్తయ్యాయి. ఈ నెల 17న పాటలను, సినిమాను ఇదే నెల 23న విడుదల చేస్తున్నాం. సచిన్ వారియర్ స్వరరచన చేశారు. వనమాలి సాహిత్యం అందించారు. హ్యాపీడేస్ తరహాలో మా పాటలు కూడా మంచి విజయం సాధిస్తాయి. ఇది మలయాళ సినిమా లాగా అనిపించదు. కాలేజీ అనుభవాలు ఎక్కడైనా ఒకే విధంగా ఉంటాయి. ఒక ఇండస్ట్రియల్ టూర్ నాలుగు రోజులు జరిగితే అక్కడ మూడు ప్రేమజంటల కథే మా సినిమా అని అన్నారు.